ఈనాడు



విజయవాడ 21-8-2025 గురువారం సిటీ సంపుటి 52 . సంచిక 12
THE LARGEST CIRCULATED TELUGU DAILY
రూ. 6-50 పేజీలు 16
www.eenadu.net
Vijayawada, Visakhapatnam, Hyderabad, Tirupati, Ananthapuramu, Karimnagar, Rajamahendravaram, Suryapet, Guntur, Nellore, Srikakulam, Kurnool, Tadepalligudem, Warangal, Kadapa, Nizamabad, Khammam, Ongole, Mahaboobnagar, Chennai, Bengaluru



‘ఉద్వాసన’పై ఉద్రిక్తత


లోక్‌సభలో మాట్లాడుతున్న కేసీ వేణుగోపాల్

నేరాభియోగాలున్న నేతల తొలగింపునకు లోక్‌సభలో బిల్లులు • ఆ ప్రతిపాదనలు రాజ్యాంగ విరుద్ధమన్న విపక్షం

ప్రభుత్వాలను అస్థిర పరుస్తాయని ఆందోళన • సమగ్ర పరిశీలనకు 31 మందితో జేపీసీ

బిల్లు ప్రతులు చించి విసిరిన ఎంపీలు.. రంగంలోకి మార్షల్స్ • వెనక సీట్లోకి వెళ్లి కూర్చొన్న హోంమంత్రి అమిత్ షా

దిల్లీ

తీవ్ర నేరాభియోగాలపై అరెస్టై వరసగా 30 రోజులపాటు నిర్బంధంలో ఉన్నట్లయితే రాష్ట్ర మంత్రులు, ముఖ్యమంత్రులు, కేంద్ర మంత్రులు.. చివరకు ప్రధానమంత్రినైనా 31వ రోజే పదవి నుంచి తప్పించడానికి ఉద్దేశించిన అత్యంత కీలకమైన బిల్లులు బుధవారం లోక్‌సభలో ఉద్రిక్తతకు కారణమయ్యాయి. ఈ నిబంధనలు ప్రజాస్వామ్యానికి, రాజ్యాంగానికి విరుద్ధమని, రాజకీయ దురుద్దేశాలతో పలువురిని గద్దె దించడానికి ఇవి దోహదపడతాయని విపక్షం తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. ఒక దశలో మార్షల్స్‌ను కేంద్ర హోంమంత్రి అమిత్‌షా చుట్టూ, స్పీకర్ పోడియం సమీపాన మోహరించారు. ముందువరసలో ఆసీనులైన అమిత్‌షా వద్దకు విపక్షాలు దూసుకువస్తుండటంతో కొంతసేపు ఆయన వెనక వరసకు వెళ్లి కూర్చోవాల్సి వచ్చింది! చివరకు ఈ బిల్లుల్ని సమగ్ర అధ్యయనం నిమిత్తం ‘సంయుక్త పార్లమెంటరీ సంఘం’ (జేపీసీ) పరిశీలనకు పంపించాలని మూజువాణి ఓటుతో లోక్‌సభ నిర్ణయించింది. దీనిలో 21 మంది లోక్‌సభ సభ్యులు, 10 మంది రాజ్యసభ సభ్యులు ఉంటారు. పార్లమెంటు శీతాకాల సమావేశాల తొలివారం చివరి రోజున జేపీసీ తన నివేదిక సమర్పించాల్సి ఉంటుంది.

రక్షణలు గాలిలో కలిసిపోతాయి

అమిత్‌షా 3 వేర్వేరు బిల్లుల్ని ప్రవేశపెట్టగానే విపక్షాలు భగ్గుమన్నాయి. రాజ్యాంగానికి, సమాఖ్యవాదానికి వ్యతిరేకంగా ఉన్నాయని అసదుద్దీన్ ఒవైసీ (ఎంఐఎం), కేసీ వేణుగోపాల్, మనీశ్ తివారీ (కాంగ్రెస్) తదితరులు ఆరోపించారు. ప్రభుత్వాలను అస్థిరపరచడమే వీటి ఉద్దేశమని చెప్పారు. న్యాయవ్యవస్థకు, పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ఇది విరుద్ధమని, రాజ్యాంగబద్ధమైన రక్షణల్ని గాలిలో కలిపేలా రాజకీయ దుర్వినియోగానికి ఆస్కారం ఉంటుందని ఆందోళన వెలిబుచ్చారు. వీటిని హడావుడిగా తీసుకొచ్చామనే విమర్శలను అమిత్ షా తోసిపుచ్చారు.

మైకు లాక్కోబోయిన తృణమూల్ సభ్యుడు

బిల్లులను ప్రవేశపెట్టిన సందర్భంగా లోక్‌సభలో అధికార, విపక్షాల మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది. కొంతమంది ప్రతిపక్ష సభ్యులు బిల్లు ప్రతులను చించి హోంమంత్రి మీద విసిరారు. వెల్‌లోకి దూసుకువెళ్లి నినాదాలు చేశారు. అమిత్‌షా ముందున్న మైకును లాక్కొనేందుకు తృణమూల్ సభ్యుడు కల్యాణ్‌బెనర్జీ (మిగతా 3లో)

ఏపీ.. ఆవిష్కరణల చిరునామా

- అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చరిత్రాత్మకం
- ప్రారంభోత్సవంలో సీఎం చంద్రబాబు వెల్లడి
- 24 గంటల్లోనే 1.67 లక్షల రిజిస్ట్రేషన్లు
- ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌ల నమోదులో గిన్నిస్ రికార్డు


హబ్‌లో ఏర్పాటు చేసిన ఆవిష్కరణలను పరిశీలిస్తున్న సీఎం చంద్రబాబు, టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్

ఈనాడు - అమరావతి

రాష్ట్రం ఆవిష్కరణలకు కేంద్రంగా మారబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు, స్టార్టప్‌లకు ఊతమిచ్చేలా అమరావతిలో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభించడం చరిత్రాత్మకమన్నారు. ఆయన ఆలోచనలు సజీవంగా ఉంచాలన్న ఆలోచనతో ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. సమాజానికి తిరిగి ఇద్దామనే విధానాన్ని రతన్ టాటా అవలంబించారని.. టాటా ట్రస్టు ద్వారా అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తు చేశారు. ఆయన నిరాడంబరత, నిజాయతీ, దేశానికి చేసిన సేవ అందరికీ ఆదర్శమని కొనియాడారు. మంగళగిరిలోని మయూరి టెక్ పార్కులో ఏర్పాటు చేసిన రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌తో కలిసి సీఎం బుధవారం ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ‘అమరావతితోపాటు విజయవాడ, విశాఖ, తిరుపతి, అనంతపురం, రాజమహేంద్రవరాల్లో ఇన్నోవేషన్ హబ్‌లు.. వినూత్న ఆలోచనల్ని ప్రోత్సహించేలా పనిచేస్తాయి. వీటిని యువత వినియోగించుకోవాలి. సాంకేతికత వల్ల ఉపాధి కోల్పోతారన్నది అపోహ మాత్రమే. ప్రపంచానికి సేవలందించేలా రాష్ట్ర పారిశ్రామికవేత్తలను (మిగతా 13లో)

చంద్రబాబు ఇన్నోవేషన్ హబ్ గురించి కలగనడమే కాదు.. దాన్ని సాకారం చేశారు. దీన్ని విజయవంతం చేయగలిగే సామర్థ్యం ఆయనకు ఉంది.
– చంద్రశేఖరన్

హబ్‌లో దిగ్గజ పారిశ్రామిక సంస్థలకు భాగస్వామ్యం 13లో
చంద్రబాబుకు ‘రోబో’ స్వాగతం

రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు


ఉపరాష్ట్రపతి పదవికి సీపీ రాధాకృష్ణన్ తరఫున నామినేషన్ పత్రాలు సమర్పిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో రాజీవ్ రాజన్ సింగ్, రాజ్‌నాథ్ సింగ్, జేపీ నడ్డా, అమిత్ షా, గడ్కరీ, తంబిదురై, రామ్‌దాస్ అఠావలే, ప్రఫుల్ పటేల్ 3లో

రాజ్యాంగానికి కట్టుబడిన వ్యక్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి: రాహుల్


పాత పార్లమెంటు భవనంలోని సెంట్రల్ హాల్‌లో నిర్వహించిన సమావేశంలో ఇండియా కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందిస్తున్న మల్లికార్జున ఖర్గే. చిత్రంలో తిరుచ్చి శివ, రాంగోపాల్‌యాదవ్, శరద్ పవార్, రాహుల్‌గాంధీ, సోనియాగాంధీ తదితరులు 10లో

దిల్లీ ముఖ్యమంత్రిపై దాడి
ఫిర్యాదుదారు ముసుగులో వచ్చి చెంపదెబ్బ 3లో
‘జన్ సున్వాయ్’ కార్యక్రమంలో ఘటన
రేఖా గుప్తా తల, చేతులకు గాయాలు!
పోలీసుల అదుపులో నిందితుడు

గవర్నర్ల ఇష్టారాజ్యం చెల్లదు
ప్రజాప్రభుత్వాలు రాజ్‌భవన్‌ల దయాదాక్షిణ్యాలపై ఆధారపడాలా?
రెండోసారి వచ్చిన బిల్లును రాష్ట్రపతికి పంపే వీలు లేదు 3లో
సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు

ప్రాణాలు తీసిన ఈత సరదా
నీటి కుంటలో మునిగి ఆరుగురు విద్యార్థుల మృతి 14లో

తక్షణమే పీఆర్‌సీ వేయండి
ఉద్యోగ సంఘాల నేతల డిమాండ్ 15లో
సీఎంకు నివేదిక ఇస్తానన్న సీఎస్



ఈడీబీ కార్యాలయం మయూరి టెక్‌పార్కులోకి మార్పు

ఈనాడు, అమరావతి: మంగళగిరి ఏపీఐఐసీ భవనం 8వ అంతస్తులో ఉన్న రాష్ట్ర ఆర్థికాభివృద్ధి సంస్థ (ఏపీఈడీబీ) కార్యాలయాన్ని మయూరి టెక్ పార్కులోని 5వ అంతస్తులోకి మార్చేందుకు అనుమతిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. ఆ సంస్థకు 18,632 చదరపు అడుగులు కేటాయించింది. చదరపు అడుగుకు జీఎస్టీతో కలిపి రూ.30 చొప్పున అద్దెగా నిర్దేశించింది.

మద్యం కుంభకోణానికి వాసుదేవరెడ్డి, సత్యప్రసాద్‌లు
తల లాంటి వారు

- తల లేకుంటే శరీరం కుప్పకూలిపోతుంది
- ట్రంకుపెట్టెల కొద్దీ సాక్ష్యాలున్నప్పుడు నిందితులను అప్రూవర్లుగా మార్చాల్సిన పనేంటి?
- దర్యాప్తు సంస్థ, పిటిషనర్ల మధ్య అవగాహన జరిగినట్లు స్పష్టమవుతోంది
- ఏసీబీ కోర్టు వ్యాఖ్యలు
- ముందస్తు బెయిల్ పిటిషన్ల కొట్టివేత

ఈనాడు, అమరావతి: మద్యం కుంభకోణం కేసులో ఏపీ బెవరేజెస్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఏపీబీసీఎల్) పూర్వ ఎండీ దొంతిరెడ్డి వాసుదేవరెడ్డి (ఏ2), ఎక్సైజ్ శాఖ మాజీ ప్రత్యేకాధికారి దొడ్డా వెంకట సత్యప్రసాద్ (ఏ3)లది కీలక పాత్ర అని, వారు కేంద్ర బిందువుగానే కుంభకోణం జరిగిందని విజయవాడ ఏసీబీ కోర్టు పేర్కొంది. మొత్తం కుంభకోణం శరీరం అయితే.. వారు తలలాంటి వారిని తెలిపింది. తల తీసేస్తే శరీరం కుప్ప కూలుతుందని వ్యాఖ్యానించింది. హత్య కేసుల్లో సాక్ష్యాలు దొరకనప్పుడు నేర నిరూపణ కోసం నిందితులను అప్రూవర్‌గా మార్చవచ్చని.. ఇలాంటి ఆర్థిక నేరాల్లో నిజాన్ని నిగ్గు తేల్చేందుకు పెద్ద సంఖ్యలో ఆధారాలు లభించినప్పుడు కేసులో ప్రధాన నిందితులను ప్రాసిక్యూషన్ అప్రూవర్లుగా మారుస్తుందని ఊహించలేమని పేర్కొంది. నిందితులిద్దరూ దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్లను కొట్టేసింది. ఈ మేరకు విజయవాడ ఏసీబీ కోర్టు న్యాయాధికారి పి.భాస్కరరావు ఈ నెల 18న ఇచ్చిన తీర్పు తాజాగా అందుబాటులోకి వచ్చింది.

అప్రూవర్‌గా మారతారనే హామీతో ఈ పిటిషన్‌ను తేల్చలేం

'సీఆర్‌పీసీ సెక్షన్ 306(4)(బీ) ప్రకారం అప్రూవర్‌కు ముందస్తు బెయిల్ మంజూరు చేయకూడదు. అప్రూవర్‌కు క్షమాభిక్ష ప్రసాదించినా.. కేసు విచారణ ముగిసే వరకు బెయిల్ ఇవ్వడానికి వీల్లేదు. అతను ఇచ్చే సాక్ష్యం ప్రభావితం కాకుండా ఉంచేందుకే ఈ సెక్షన్ను తీసుకొచ్చారు. కేసులోని వివరాల ఆధారంగా నిందితుల బెయిల్ పిటిషన్లను తేల్చాలి తప్ప.. అప్రూవర్‌గా మారతామనే హామీ ఆధారంగా నిర్ణయం తీసుకోవడానికి వీల్లేదు.

ఈ కేసులో ప్రాసిక్యూషన్ ఇప్పటికే కీలక నిందితులైన కెసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, కృష్ణమోహన్‌రెడ్డి, బాలాజీ గోవిందప్పలపై అభియోగపత్రాలు దాఖలు చేసింది. దర్యాప్తు సంస్థ ట్రంకుపెట్టెల కొద్దీ సాక్ష్యాలను సేకరించింది. అలాంటప్పుడు పిటిషనర్లను అప్రూవర్‌గా తీసుకోవాల్సిన అవసరం లేదు. ఇది వారికి ముందస్తు బెయిల్ పొందేందుకు అవకాశమివ్వడమే తప్ప మరొకటి కాదు. పిటిషనర్లు సీఆర్‌పీసీ సెక్షన్ 306 ప్రకారం క్షమాభిక్ష కోసం పిటిషన్లు వేశారు. అభ్యంతరాలు లేవనెత్తుతూ వాటిని కోర్టు తిప్పిపంపింది. లోపాలను సరిదిద్దుకొని ఆ పిటిషన్లను మళ్లీ దాఖలు చేయలేదు. ఈ వ్యవహారమంతా చూస్తుంటే అప్రూవర్‌గా మారేందుకు పిటిషనర్లు సదుద్దేశంతో లేరని, ముందస్తు బెయిలిస్తే తప్ప తాము అప్రూవర్‌గా మారబోమనేలా కోర్టుతో బేరమాడుతున్నట్లు కనిపిస్తోంది. దర్యాప్తు సంస్థ, పిటిషనర్ల మధ్య అవగాహన జరిగినట్లు స్పష్టమవుతోంది. ఇలాంటి విధానం సీఆర్‌పీసీ సెక్షన్ 306(4)(బీ)ని ఉల్లంఘించడమే. రూ.3,500 కోట్ల ముడుపులు చేతులు మారిన ఇలాంటి తీవ్రమైన కేసులో పిటిషనర్లకు ముందస్తు బెయిలివ్వలేం. వ్యాజ్యాలను కొట్టేస్తున్నాం' అని న్యాయాధికారి పేర్కొన్నారు.

ప్రకృతి విపత్తులను పసిగట్టేందుకు టెస్ట్‌బెడ్!

- విశాఖలో ఏర్పాటుకు ప్రతిపాదన
- పరిశోధనలు పెరిగేలా ప్రణాళికలు

ఈనాడు, విశాఖపట్నం: వాతావరణ అంచనాల్లో కచ్చితత్వాన్ని పెంచడంపై కేంద్ర ప్రభుత్వం దృష్టిసారించింది. ఈ మేరకు 'మిషన్ మౌసం'లో భాగంగా పుణెలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ట్రాపికల్ మెటియరాలజీ (ఐఐటీఎం) ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో టెస్ట్‌బెడ్‌లు ఏర్పాటుచేయాలని నిర్ణయించారు. తీరప్రాంతంలో పరిస్థితిని అధ్యయనం చేయడానికి విశాఖలో కోస్టల్ అట్మాస్ఫియరిక్ రీసెర్చి టెస్ట్‌బెడ్ (ఏఆర్‌టీ)ను అందుబాటులోకి తేనున్నారు. మధ్యప్రదేశ్‌లోని సీహోర్ జిల్లాలో 100 ఎకరాల్లో రూ.125 కోట్ల వ్యయంతో ఏర్పాటుచేసిన 'టెస్ట్‌బెడ్'ను గతేడాది మార్చిలో ప్రారంభించారు. దీంతోపాటు దిల్లీ, చెన్నై, ముంబయిలలో అర్బన్ టెస్ట్‌బెడ్‌లను ఏర్పాటుచేస్తారు.

అత్యాధునిక పరికరాలు

దేశంలోనే తొలిసారిగా వాతావరణ అంచనాల కోసం విశాఖలో 30 అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి తేనున్నారు. వాటితో గాలితుంపరలు (ఏరోసోల్స్), మేఘాలు, గాలులు, రేడియేషన్ తదితరాలను పర్యవేక్షిస్తారు. భవిష్యత్తు పరిశోధనలకు అనుగుణంగా ఈ సమాచారాన్ని విద్యార్థులు, పరిశోధకులకు అందుబాటులో ఉంచుతారు.

మొబైల్ రాడార్‌తో అధ్యయనం

అమెరికాలోని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫియరిక్ అడ్మినిస్ట్రేషన్ (నోవా) ఆధ్వర్యంలో టోర్నడోలు, హరికేన్లు ఇతర ప్రకృతి విపత్తులను అధ్యయనం చేయడానికి మొబైల్ రాడార్లను ఉపయోగిస్తున్నారు. ఇందులో ట్రక్ వెనుకవైపు డాప్లర్ రాడార్‌ను ఏర్పాటుచేస్తారు. దీంతో విపత్తు పెరుగుతున్న సమయంలో వాతావరణపరిస్థితులను వేగంగా పర్యవేక్షించొచ్చు. ఈ తరహా రాడార్‌ను విశాఖలో అందుబాటులోకి తేనున్నారు. ఈ వాహనాన్ని విశాఖతోపాటు తూర్పు తీరంలో తిప్పుతూ పరిస్థితిని అంచనావేస్తారు.



విశాఖలో ఏర్పాటు చేయనున్న మొబైల్ రాడార్ నమూనా

కచ్చితత్వం పెరిగేందుకే..



ఏటా కుండపోత వర్షాలు, వరదలు, వడగాడ్పులు తదితర ప్రకృతి వైపరీత్యాల కారణంగా భారీగా నష్టం సంభవిస్తోంది. ప్రపంచంలో శక్తిమంతమైన ఆర్థిక వ్యవస్థగా ఎదగాలంటే ఈ నష్టాన్ని తగ్గించుకోవాలి. అందుకే ప్రభుత్వం, ఇతర సంస్థలు దీనిపై దృష్టి సారించాయి. మరోవైపు వివిధ రంగాలకు వేర్వేరుగా వాతావరణ అంచనాలు రూపొందించాలని డిమాండ్లు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో వాతావరణ అంచనాల్లో కచ్చితత్వం పెరిగేలా అధ్యయనాలు జరగాలి. వాతావరణ ప్రక్రియలపై విద్య, శాస్త్రీయ పరిశోధనలను బలోపేతం చేసేందుకు విశాఖలో టెస్ట్‌బెడ్ ఏర్పాటు చేయాలని నిర్ణయించాం.

– డా.సూర్యచంద్రరావు, డైరెక్టర్, ఐఐటీఎం

1,42,765 మంది రైతులకు 'అన్నదాతా సుఖీభవ'

ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కారణంగా నిలిపివేసిన ప్రాంతాల్లో పంపిణీ

ఈనాడు, అమరావతి: అన్నదాతా సుఖీభవ కింద రాష్ట్ర వ్యాప్తంగా 1,42,765 మంది రైతుల ఖాతాల్లో రూ.71.38 కోట్ల పెట్టుబడి సాయాన్ని వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు బుధవారం జమ చేశారు. వీరందరికీ ఇప్పటికే పీఎం కిసాన్ సొమ్ము రూ.2వేల చొప్పున జమ అయింది. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు కారణంగా పంపిణీ నిలిపేసిన ప్రాంతాల్లోని రైతులతోపాటు.. ఈకేవైసీ, భారత జాతీయ చెల్లింపుల సంస్థ (ఎన్‌పీసీఐ)లో వివరాలు సరిచేసుకున్న వారికి కలిపి రూ.5వేల చొప్పున తాజాగా విడుదల చేశారు. రాష్ట్రంలో 1,21,422 మంది రైతులకు గతంలో ఎన్‌పీసీఐ మ్యాపింగ్ కాలేదు. ఇందులో 38,658 మంది తమ వివరాలను, ఖాతాలను అనుసంధానించుకోవడంతో ఖాతాల్లో నగదు జమ చేశారు.

ఆ పింఛనుదార్లకు జారీ చేసిన నోటీసుల నిలిపివేత

ఈనాడు, అమరావతి: ఆరోగ్య, దివ్యాంగుల కేటగిరీ పింఛన్ల తనిఖీలో అనర్హులుగా గుర్తించిన మానసిక వైకల్యం ఉన్న 18 ఏళ్లలోపు వారికి జారీ చేసిన నోటీసులను గ్రామీణ పేదరిక నిర్మూలన సొసైటీ అధికారులు నిలిపేశారు. కేంద్ర చట్టం ప్రకారం 18 ఏళ్లలోపు చిన్నారులకు మానసిక వైకల్యానికి శాశ్వత సదరం ధ్రువీకరణ పత్రాలు జారీ చేయకూడదు. కానీ వీరికి పింఛను అర్హత వైకల్యం 40 శాతం కంటే ఎక్కువగా ఉన్నా తాత్కాలిక వైకల్యంగా పేర్కొంటూ నోటీసులు జారీ చేశారు. అధికారులు ఇలాంటివారి లెక్కలు తీసి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన సర్కారు వారికి జారీ చేసిన నోటీసులను నిలిపేయాలంది. వీరి పింఛను పంపిణీపై 2 రోజుల్లో నిర్ణయం తీసుకోనుంది.

గ్రహం అనుగ్రహం


21-8-2025 గురువారం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం; దక్షిణాయనం; వర్ష రుతువు, శ్రావణ మాసం, బహుళపక్షం
త్రయోదశి: మ. 12-54 తదుపరి చతుర్దశి
పుష్యమి: రా. 1-19 తదుపరి ఆశ్లేష
వర్జ్యం: ఉ. 9-38 నుంచి 11-12 వరకు
అమృత ఘడియలు: రా. 7-02 నుంచి 8-36 వరకు
దుర్ముహూర్తం: ఉ. 9-57 నుంచి 10-48 వరకు తిరిగి మ. 2-59 నుంచి 3-49 వరకు
రాహుకాలం: మ. 1-30 నుంచి 3-00 వరకు
సూర్యోదయం: ఉ.5.47; సూర్యాస్తమయం: సా.6.20
మాసశివరాత్రి

వాతావరణం

ప్రాంతం	గరిష్ఠ	కనిష్ఠ
నెల్లూరు	35.3	25.3
తిరుపతి	35.2	24.3
ఒంగోలు	34.1	25.6
విజయవాడ	33.4	25.0
నరసాపురం	33.0	27.4
గుంటూరు	33.0	27.0
రాజమహేంద్రవరం	33.0	25.0
కడప	33.0	25.0
శ్రీకాకుళం	32.0	27.0
విశాఖపట్నం	32.0	26.2
విజయనగరం	32.0	25.0
అనంతపురం	31.4	24.2
కర్నూలు	31.4	23.7
తాడేపల్లిగూడెం	28.9	27.1
హైదరాబాద్	28.2	22.0

ఇదీ సంగతి!



ఎందుకంత టెన్షన్ పడతారు.. నేనున్నానుగా..!

‘ఉద్వాసన’పై ఉద్రిక్తత



లోక్‌సభలో అమిత్ షా మాట్లాడుతుండగా ఆయనపైకి ప్రతిపక్ష సభ్యులు విసిరిన కాగితాలు



లోక్‌సభలో ఆందోళన చేస్తున్న విపక్ష సభ్యులు

(మొదటి పేజీ తరువాయి)

ప్రయత్నించారు. గుజరాత్ హోంమంత్రిగా ఉన్న సమయంలో అమిత్ షా అరెస్టయిన అంశాన్ని కాంగ్రెస్ సభ్యుడు కె.సి.వేణుగోపాల్ లేవనెత్తారు. దీన్ని అమిత్ షా ఖండిస్తూ.. అరెస్టుకు ముందే నైతిక కారణాలతో తాను రాజీనామా చేశానని, కోర్టు నిర్దోషిగా ప్రకటించాకే ప్రభుత్వంలో చేరానని చెప్పారు. ప్రజా ప్రతినిధులు తీవ్రమైన నేరారోపణలు ఎదుర్కొంటూ నిస్సిగ్గుగా రాజ్యాంగ పదవుల్లో కొనసాగడం తగదన్నారు. జేపీసీలో విపక్ష సభ్యులూ ఉంటారని, వారు అభిప్రాయాలను అక్కడ చెప్పవచ్చని తెలిపారు. కేంద్రపాలిత ప్రాంతాల (సవరణ) బిల్లు, రాజ్యాంగానికి 130వ సవరణ చేసే బిల్లు, జమ్మూ-కశ్మీర్ పునర్వ్యవస్థీకరణ (సవరణ) బిల్లు.. ఈ మూడింటిని ఆయన సభలో ప్రవేశపెట్టారు.

షా చుట్టూ రక్షణ వలయం

బిల్లులపై నిరసనలు తీవ్రస్థాయికి చేరినప్పుడు ఒకదశలో అధికార-విపక్షాల మధ్య పెనుగులాట వాతావరణం చోటుచేసుకుంది. కేంద్ర మంత్రులు రవ్‌నీత్ సింగ్ బిట్టూ, కిరణ్ రిజిజు, కొందరు భాజపా సభ్యులు అమిత్‌షాకు రక్షణగా నిలిచారు. సభ్యులు ముమ్ముందుకు రాకుండా అడ్డుకునేందుకు హోంమంత్రి చుట్టూ ముగ్గురు మార్షల్స్ రక్షణ వలయంగా ఏర్పడ్డారు. ఒకదశలో అధికారపక్షం స్థానాల వెనుక ‘పార్లమెంటరీ భద్రత సేవల’కు చెందిన 12 మంది మోహరించారు. వెల్‌వద్దకు కూడా మార్షల్స్ వెళ్లి కొంతసేపు ఉన్నారు. సభ ఒకసారి వాయిదాపడి తిరిగి సమావేశమయ్యాక అమిత్‌షా ముందువరసలోని తన స్థానంలో కాకుండా వెనకవైపు కూర్చొని బిల్లులు ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష నిరసనల నడుమ సభ వాయిదా పడింది. ఆ తర్వాత కూడా విపక్ష సభ్యులు పెద్దపెట్టున నినాదాలు కొనసాగించారు. గువాహటిలో ఐఐఎం ఏర్పాటుకు ఉద్దేశించిన బిల్లుకు రాజ్యసభ కూడా ఆమోదం తెలిపింది. ఈ బిల్లును ప్రవేశపెట్టాక విపక్షం వాకౌట్ చేసింది.

కొత్త బిల్లు అప్రజాస్వామికమన్న ప్రియాంక

నేరారోపణలున్న వారిపై ప్రతిపాదిత నిబంధనలు కిరాతకంగా, అప్రజాస్వామికంగా ఉన్నాయని ఎంపీ ప్రియాంకాగాంధీ పార్లమెంటు వెలుపల విలేకరులతో అన్నారు. శిక్ష పడకుండానే ఎవరినైనా పదవుల నుంచి తొలగించేందుకు ప్రభుత్వానికి వీలుంటుందని ఆందోళన వ్యక్తంచేశారు. సభ వాయిదాపడ్డాక ‘ఎక్స్’ ద్వారా అమిత్‌షా స్పందిస్తూ- మాజీ ప్రధాని ఇందిరాగాంధీకి భిన్నంగా స్వయానా మోదీ తనను తాను చట్ట పరిధిలోకి తెచ్చుకుంటుంటే విపక్షాలు మాత్రం ఆ పరిధికి వెలుపలే ఉంటామంటున్నాయని ఎద్దేవా చేశారు. జైలు నుంచైనా ప్రభుత్వాలను నడిపిస్తాం గానీ పదవిని వదిలేది లేదంటున్నాయని విమర్శించారు. అవినీతికి అండగా ఉంటామన్నట్లుగా విపక్షాల తీరు ఉందని కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ అన్నారు.

మధ్య యుగంలోకి వెళ్తున్నాం: రాహుల్

రాజు తన ఇష్టానుసారం ఎవరినైనా తొలగించే తరహా మధ్యయుగంలోకి మళ్లీ వెళ్తున్నామని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఒక కార్యక్రమంలో విమర్శించారు. పార్లమెంటు నిష్పాక్షికతనే ప్రభుత్వం తుడిచేస్తోందని రాజ్యసభ విపక్షనేత మల్లికార్జున ఖర్గే ధ్వజమెత్తారు. ప్రజాస్వామ్యాన్ని శాశ్వతంగా సమాధి చేసి, ‘ఒక వ్యక్తి.. ఒక పార్టీ.. ఒక ప్రభుత్వం’ అన్నట్లుగా వ్యవస్థను మార్చబోతున్నారని తృణమూల్ అగ్రనేత మమతా బెనర్జీ ఆరోపించారు. ఇతర విపక్షాలూ ప్రభుత్వాన్ని వేర్వేరు వేదికలపై తూర్పారబట్టాయి.

గవర్నర్ల ఇష్టారాజ్యం చెల్లదు

- సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు



దిల్లీ: రాష్ట్ర శాసనసభ రెండోసారి ఆమోదించి పంపిన బిల్లును గవర్నర్ రాష్ట్రపతి పరిశీలనకు పంపే వీలులేదని సుప్రీంకోర్టు బుధవారం పేర్కొంది. బిల్లులకు సమ్మతి తెలిపే విషయంలో గవర్నర్లకు ఉన్న అధికారాలేమిటని కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. “గవర్నర్ శాసనసభ పునఃపరిశీలనకు బిల్లును తిప్పి పంపాలని ఎంచుకుంటే ఇక ఆ బిల్లును నిలిపి ఉంచడానికి, రాష్ట్రపతి పరిశీలనకు పంపడానికి వీలు లేదు” అని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్. గవాయ్, జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ విక్రంనాథ్, జస్టిస్ పి.ఎస్. నరసింహ, జస్టిస్ ఎ.ఎస్. చందూర్కర్‌లతో కూడిన రాజ్యాంగ ధర్మాసనం తెలిపింది. రాష్ట్రాల బిల్లులకు ఆమోదం తెలపడంపై గవర్నర్లకు, తనకు గడువు నిర్దేశిస్తూ సర్వోన్నత న్యాయస్థానం ఇచ్చిన తీర్పుపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము సుప్రీంకోర్టు అభిప్రాయం కోరిన అంశంపై రెండో రోజైన బుధవారమూ రాజ్యాంగ ధర్మాసనం విచారణ జరిపింది. గవర్నర్ ఏదైనా బిల్లును శాసనసభకు తిప్పి పంపకుండా ఏ కారణమూ చెప్పకుండా తన వద్దే నిలిపి ఉంచుకుంటే అప్పుడు ప్రజలెన్నుకున్న ప్రభుత్వాలు గవర్నర్ల ఇష్టారాజ్యానికి అణిగి ఉండాల్సి వస్తుంది అని న్యాయమూర్తులు వ్యాఖ్యానించారు. గవర్నర్ తన ఆమోదాన్ని నిరవధికంగా నిలిపి ఉంచితే మెజారిటీ ప్రజల ఆకాంక్షల ప్రకారం ఏర్పడ్డ ప్రజా ప్రభుత్వాలు ఎన్నికలతో సంబంధం లేకుండా నియమితుడైన గవర్నర్ దయాదాక్షిణ్యాలకు దాసోహమవుతాయని రాజ్యాంగ ధర్మాసనం పేర్కొంది. బిల్లులపై ఏ విచక్షణాధికారాలూ వినియోగించలేనప్పుడు గవర్నర్ వ్యవస్థ పోస్ట్‌మేన్ వ్యవస్థగా మిగిలిపోతుందని కేంద్రం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదనలు వినిపించారు. రాజ్యాంగ సభలో గవర్నరు నియామకం, ఆయన నిర్వహించాల్సిన పాత్రలపై విస్తృత చర్చ జరిగిందని అన్నారు.

ఎస్సీ వర్గీకరణను ఆమోదించిన కర్ణాటక సర్కారు

అసెంబ్లీలో ప్రకటించిన సీఎం సిద్ధరామయ్య

ఈనాడు, బెంగళూరు: కర్ణాటక ప్రభుత్వం ఎస్సీ వర్గీకరణను అమలు చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు మంగళవారం విధానసభ సమావేశాల్లో కర్ణాటక సీఎం సిద్ధరామయ్య ఓ ప్రకటన చేశారు. ఏడాది క్రితం జస్టిస్ హెచ్.ఎన్.నాగమోహన్‌దాస్ నేతృత్వంలో ఏర్పాటైన ఏకసభ్య సమితి రూపొందించిన నివేదికను ఇప్పటికే స్వీకరించిన సర్కారు మంగళవారం రాత్రి మంత్రి వర్గ సమావేశాల్లో చర్చించి పలు సవరణలతో ఆమోదించింది. బుధవారం సిద్ధరామయ్య ఈ వర్గీకరణ నివేదికను సభలో ప్రవేశపెట్టారు. 101 ఉపజాతులున్న ఎస్సీలకు రాష్ట్రంలో 17 శాతం రిజర్వేషన్ అమలవుతోంది. వీటిని లెఫ్ట్, రైట్, స్పృశ్య కేటగిరీలుగా వర్గీకరించారు. లెఫ్ట్ 6, రైట్ కేటగిరీలకు 6 శాతం, స్పృశ్య కేటగిరీకి 5 శాతం రిజర్వేషన్‌ను కల్పించారు. ఈ వర్గీకరణ ఆధారంగానే రానున్న నియామకాలన్నీ చేపట్టనున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు.

రెండు అకాడమీలకు ఛైర్మన్ల నియామకం

ఈనాడు, అమరావతి: జానపద కళలు, సృజనాత్మక అకాడమీ ఛైర్మన్‌గా వంపూరు గంగులయ్య (పాడేరు), సైన్స్ అండ్ టెక్నాలజీ అకాడమీ ఛైర్మన్‌గా రవి మందలపు (రాజమహేంద్రవరం నగరం)లను ప్రభుత్వం నియమించింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

దిల్లీ ముఖ్యమంత్రిపై దాడి

- పోలీసుల అదుపులో నిందితుడు



దిల్లీ ముఖ్యమంత్రిపై దాడికి పాల్పడిన నిందితుడు రాజేశ్‌భాయ్

దిల్లీ: దేశ రాజధాని దిల్లీలో ముఖ్యమంత్రి రేఖా గుప్తాపై దాడి జరిగింది. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు ప్రతివారం నిర్వహిస్తున్న ‘జన్ సున్వాయ్’ కార్యక్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. ఫిర్యాదుదారు ముసుగులో వచ్చిన దుండగుడు...పత్రాలను అందిస్తూ.. సీఎంపై ఒక్కసారిగా దాడికి తెగబడ్డాడు. ఈ అనూహ్య ఘటనలో ఆమె తల, భుజం, చేతులకు గాయాలైనట్లు సమాచారం. వెంటనే అప్రమత్తమైన పోలీసులు దుండగుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడిని గుజరాత్‌లోని రాజ్‌కోట్‌కు చెందిన ఆటో డ్రైవర్ సకారియా రాజేశ్‌భాయ్ ఖీమ్జీభాయ్(41)గా గుర్తించారు. పక్కా ప్రణాళికతోనే అతడు దాడి చేశాడని, ఇది ఆషామాషీ వ్యవహారం కాదని, దీని వల్ల సీఎం ప్రాణాలకే ప్రమాదమని పోలీసులు తెలిపారు. నిందితుడిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి విచారిస్తున్నారు. బుధవారం ఉదయం సివిల్ లైన్స్‌లోని ముఖ్యమంత్రి క్యాంపు కార్యాలయంలో ఎప్పటిలాగే రేఖా గుప్తా ‘జన్ సున్వాయ్” కార్యక్రమాన్ని నిర్వహించారు. జైల్లో ఉన్న తన బంధువుల్లో ఒకరిని విడుదల చేయాలని కోరుతూ పత్రాలను తీసుకుని నిందితుడు అక్కడికి వచ్చాడు. సీఎం గుప్తా తన వద్దకు రాగానే అతడు ఆ పత్రాలను ఆమె చేతికి అందించాడు. వెంటనే పెద్దగా కేకలు వేస్తూ.. చెంపదెబ్బ కొట్టాడు. ఆమెను వెనక్కు తోసేయడానికి ప్రయత్నించాడు. ఆమె జుట్టును గట్టిగా పట్టుకున్నాడు. తక్షణమే భద్రతా సిబ్బంది జోక్యం చేసుకుని అతడిని అదుపులోకి తీసుకుంది. ఈ ఘటన ఉదయం 8.15 గంటల సమయంలో జరిగింది.

పక్కా ప్రణాళికతో దాడి

నిందితుడు రాజేశ్ పక్కా ప్రణాళికతోనే సీఎంపై దాడికి చేశాడని పోలీసులు తెలిపారు. దాడికి ఒక రోజు ముందు మంగళవారం ఉదయం 11.30 గంటల సమయంలో అతడు షాలీమార్ బాగ్‌లోని ముఖ్యమంత్రి నివాసం ఎదుట కనిపించాడు. ముఖ్యమంత్రి అక్కడ లేకపోవడంతో సిబ్బంది నిందితుడికి జన్ సున్వాయ్ కార్యక్రమం గురించి తెలిపి.. సివిల్ లైన్స్ చిరునామాను అందించారు. దీంతో మరుసటి రోజు అతడు కార్యక్రమానికి వచ్చాడు. అతడి ఫోనులో జన్ సున్వాయ్ కార్యక్రమానికి సంబంధించిన రెండు వీడియోలు ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమం ఎలా జరుగుతుందన్న పూర్తి సమాచారాన్ని అతడు సేకరించాడని, సీఎం భద్రత ప్రక్రియను అర్థం చేసుకుని ప్రణాళికలు వేసుకున్నాడని వివరించారు. బుధవారం సీఎంను కలిసే అవకాశం రాగానే దాడి చేసినట్లు తెలిపారు. అయితే తన కుమారుడు ఏ రాజకీయ పార్టీకి చెందిన వాడు కాదని నిందితుడి తల్లి భానూబెన్ సకారియా మీడియాకు తెలిపారు. అతడికి మతిస్థిమితం సరిగ్గాలేదని, వీధి శునకాలపై సుప్రీం కోర్టు ఆదేశాలు ఇచ్చినప్పటినుంచి కనిపించిన వారందరిని కొడుతుండేవాడని, తనపై కూడా దాడి చేశాడని అన్నారు. సుప్రీం ఆదేశాలకు వ్యతిరేకంగా నిరసనల్లో పాల్గొనడానికి తన కుమారుడు దిల్లీకి వెళ్లాడని ఆమె తెలిపారు. కుమారుడికి శునకాలు, ఆవులు, పక్షులు అంటే ఇష్టమని అతడు జంతు ప్రేమికుడని అన్నారు. తమ బంధువులు జైలులో ఉన్నారంటూ నిందితుడు రాజేశ్ తీసుకువచ్చిన పత్రాలు నకిలీవని, అటువంటి వారు ఎవరూ లేరని పోలీసులు తెలిపారు. అతడిపై గతంలో రెండు కత్తిదాడి కేసులు, మూడు మద్యం కేసులు నమోదయ్యాయని చెప్పారు.


దాడిని ఖండించిన ఆప్

ముఖ్యమంత్రిపై దాడిని మాజీ ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నేత ఆతిశీ, ఆప్ జాతీయ కన్వీనర్ అరవింద్ కేజ్రీవాల్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్యంలో హింసకు చోటు లేదని, నిందితులపై దిల్లీ పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటారని ఆశిస్తున్నామని చెప్పారు.

పిరికి చర్యలు నా సంకల్పాన్ని విచ్ఛిన్నం చేయలేవు: రేఖ



తనపై జరిగిన దాడిపై రేఖా గుప్తా స్పందించారు. “ఇది నాపై జరిగిన దాడి మాత్రమే కాదు. దిల్లీకి సేవ చేయాలని, ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలనే నా సంకల్పంపై జరిగిన పిరికి ప్రయత్నం. దాడి జరిగినప్పుడు నేను షాక్‌కు గురయ్యా. కానీ ఇప్పుడు బాగానే ఉన్నా. ఇటువంటి దాడులు నా సంకల్పాన్ని ఎన్నటికీ విచ్ఛిన్నం చేయలేవు. ఇప్పుడు నేను గతంలోకంటే ఎక్కువ శక్తి, అంకితభావంతో మీ మధ్య పనిచేస్తాను. జన్ సున్వాయ్ కొనసాగుతుంది. మీ నమ్మకం, మద్దతే నాకు కొండంత బలం” అని ‘ఎక్స్’ వేదికగా రాసుకొచ్చారు.







ఉపరాష్ట్రపతి పదవికి నామినేషన్ అనంతరం సీపీ రాధాకృష్ణన్‌ను అభినందిస్తున్న ప్రధాని మోదీ. చిత్రంలో కేంద్రమంత్రులు రాజీవ్ రాజన్‌సింగ్, రాజ్‌నాథ్‌సింగ్, నడ్డా, కిరణ్ రిజిజు, మనోహర్‌లాల్ ఖట్టర్, అనుప్రియా పటేల్, అర్జున్‌రామ్ మేఘ్‌వాల్, తెదేపా పార్లమెంటరీ నేత లావు శ్రీకృష్ణదేవరాయలు తదితరులు

ఉపరాష్ట్రపతి పదవికి రాధాకృష్ణన్ నామినేషన్ దాఖలు

కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని మోదీ, కేంద్ర మంత్రులు, ఎన్డీయే భాగస్వామ్య పక్ష నేతలు

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి అభ్యర్థిగా సీపీ రాధాకృష్ణన్ బుధవారం ఉదయం నామినేషన్ దాఖలు చేశారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ చేతుల మీదుగా ఆయన తన నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి అయిన రాజ్యసభ సెక్రెటరీ పీసీ మోదీకి సమర్పించారు. రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్, భాజపా అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్ షా, రహదారి, రవాణాశాఖ మంత్రి నితిన్ గడ్కరీ, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, ఎన్డీయే భాగస్వామ్యపక్షాలైన తెదేపా నుంచి కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, జేడీయూ నుంచి రాజీవ్ రంజన్‌సింగ్, జేడీఎస్ నుంచి హెచ్‌డీ కుమారస్వామి, లోక్‌జనశక్తి (రాంవిలాస్ పాసవాన్)నుంచి చిరాగ్ పాసవాన్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొని సీపీ రాధాకృష్ణన్ తరఫున మొత్తం నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. అంతకుముందు ఉపరాష్ట్రపతి అభ్యర్థి పార్లమెంటు ప్రాంగణంలోని ప్రేరణా స్థల్‌లో మహాత్మాగాంధీతోపాటు, ఛత్రపతి శివాజీ, మహాత్మా జ్యోతిబాఫూలే, రాణి లక్ష్మీబాయి, బి.ఆర్.అంబేడ్కర్, భగవాన్ బిర్సా ముండాల విగ్రహాలకు నివాళులర్పించి పుష్పాంజలి ఘటించారు. ఎంపీలు సంతకాలు చేసిన నామినేషన్ పత్రాల తొలిసెట్‌ను పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు ప్రధాని మోదీకి అందించగా ఆయన వాటిని తీసుకుని సీపీ రాధాకృష్ణన్‌కు శుభాకాంక్షలు తెలిపిన అనంతరం రిటర్నింగ్ అధికారికి సమర్పించారు. ఆయన వాటిని పరిశీలించి పత్రాలను అందుకున్నట్లు రశీదును ప్రధానికి అందించారు. ఈ కార్యక్రమంలో తెదేపా పార్లమెంటరీ పార్టీ నాయకుడు లావు శ్రీకృష్ణదేవరాయలు కూడా పాల్గొన్నారు.

వైకాపా హయాంలో నియమితులైన పీపీలు, ఏపీపీల తొలగింపు

ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

ఈనాడు, అమరావతి: వైకాపా హయాంలో దిగువ కోర్టుల్లో మూడేళ్ల కాలపరిమితితో పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ), అదనపు పీపీలు(ఏపీపీ)గా పనిచేసేందుకు నియమితులైన పలువురిని బాధ్యతల నుంచి తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ బుధవారం ఈ మేరకు వేర్వేరుగా ఉత్తర్వులు జారీ చేశారు.

ఏపీహెచ్‌సీఈఏ కార్యవర్గ ఎన్నికలకు తాజాగా నోటిఫికేషన్ ఇవ్వండి

ఎన్నికల అధికారికి ఆర్‌జీ సూచన

ఈనాడు, అమరావతి: ఏపీ హైకోర్టు ఉద్యోగుల సంఘం(ఏపీహెచ్‌సీఈఏ) కార్యవర్గ ఎన్నికల నిర్వహణకు తక్షణమే తాజాగా నోటిఫికేషన్ ఇవ్వాలని రిజిస్ట్రార్ జనరల్(ఆర్‌జీ) వైవీఎస్‌బీజీ పార్థసారథి ఎన్నికల అధికారికి సూచించారు. ఎన్నికల నిర్వహణకు ఈ నెల 13న ఇచ్చిన నోటిఫికేషన్‌ను విస్మరించాలని ఎన్నికల అధికారికి తెలిపారు.


మరోవైపు తాను ఎన్నికల అధికారిగా కొనసాగలేనని, బాధ్యతల నుంచి తక్షణమే రిలీవ్ చేయాలని ఎన్నికల అధికారి ఎం.సూర్యానంద రెడ్డి ఆర్‌జీని కోరారు. ఈ వివరాలను బుధవారం జారీ చేసిన మెమోరాండంలో ఆర్‌జీ పేర్కొన్నారు. అధ్యక్ష పదవికి మినహా మిగిలిన కార్యవర్గం మొత్తం ఏకగ్రీవమైనట్లు ఎన్నికల అధికారి ఈ నెల 18న నోటీసు జారీచేసిన విషయం తెలిసిందే.



నేరస్థులకు

రాజకీయాల్లో స్థానం లేదు

ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్



ఈనాడు, అమరావతి: నేరస్థులకు రాజకీయాల్లో స్థానం లేదని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడే బాధ్యత తను చేపట్టేవారు నేరప్రవర్తనలకు దూరంగా ఉండేలా చేసే 2025 రాజ్యాంగ (130వ సవరణ) బిల్లును స్వాగతిస్తున్నానని బుధవారం ‘ఎక్స్’లో పోస్టు చేశారు. గతంలో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటూ జైలు నుంచి పాలన సాగించిన ఉదాహరణలు చూశామని, ఈ సవరణతో అలాంటివాటికి ఇక అవకాశం ఉండదని అన్నారు.

పులివెందులలో ఢీ అంటే ఢీ అందాం

- మీ కష్టంతో వైకాపా అరాచకాన్ని, రౌడీయిజాన్ని ఓడించారు
- నేతలు, కార్యకర్తలకు చంద్రబాబు అభినందనలు

ఈనాడు, అమరావతి: పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీ ఉప ఎన్నికల్లో తెదేపా గెలుపు చరిత్రాత్మకమని, ఇక నుంచి మనం కూడా ‘ఢీ అంటే ఢీ’ అందామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. ఈ ఉప ఎన్నికల్లో గెలుపు రాబోయే ఎన్నో విజయాలకు తొలి అడుగని పేర్కొన్నారు. ఉండవల్లి నివాసంలో బుధవారం రాత్రి పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీటీసీలు, స్థానిక నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. జడ్పీటీసీ సభ్యులుగా గెలిచిన లతారెడ్డి, ముద్దుకృష్ణారెడ్డిలకు చంద్రబాబు శుభాకాంక్షలు తెలిపారు. ‘పులివెందులలో తెదేపా గెలుపు ప్రజాస్వామ్యం సాధించిన విజయం. ప్రజల నమ్మకాన్ని నిలబెడుతూ సమర్థ పాలన అందిస్తే ఇలాంటి ఫలితాలే వస్తాయి. కష్టపడాలి. సమష్టిగా పనిచేయాలి. పులివెందుల కార్యకర్తలకు అండగా ఉంటాను. అక్కడ ఇక అరాచకానికి తావులేదు. మీ కష్టంతో వైకాపా అరాచకం, రౌడీయిజం ఓడిపోయాయి’ అని చంద్రబాబు కార్యకర్తలకు కితాబిచ్చారు. కార్యకర్తకు సమస్య వస్తే అర్ధరాత్రీ అపరాత్రీ అనే తేడా లేకుండా నేతలు స్పందించాలని సూచించారు. సమావేశంలో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి, సవిత, బీసీ జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు ఆదినారాయణరెడ్డి, పుత్తా చైతన్యరెడ్డి, పుట్టా సుధాకర్‌యాదవ్, నేతలు బీటెక్ రవి, భూపేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఈనాడు

చంపుడు పందేలపై ఉక్కుపాదం

దేశీయంగా ఆన్‌లైన్ క్రీడలు, బెట్టింగ్‌లకు బానిసలవుతున్న వారి సంఖ్య విపరీతంగా పెరుగుతోంది. ఈ విషయాన్ని నిర్ధారిస్తూ ఇటీవలి అధికారిక సమాచారం ఓ చేదు వాస్తవాన్ని వెల్లడించింది. దాని ప్రకారం, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి నాలుగు నెలల్లో భారతీయులు ఒక్క యూపీఐ ద్వారానే దాదాపు రూ.41 వేల కోట్లను డిజిటల్ గేమ్‌లకు ధారపోశారు. క్రెడిట్, డెబిట్ కార్డుల ద్వారా చేసిన చెల్లింపులనూ పరిగణనలోకి తీసుకుంటే- ఇంకెంత సొమ్ము ఆన్‌లైన్ ఆటలకు హారతి కర్పూరమైందో ఎవరికీ తెలియదు. ఇక కాస్త లాభాల ఆశ చూపించి ముగ్గులోకి లాగి సర్వస్వం దోచేసే బెట్టింగ్‌లది మరో కథ! చాలా రాష్ట్రాల్లో నిషేధం ఉన్నప్పటికీ ఆ జాడ్యం చాపకింద నీరులా విస్తరిస్తూనే ఉంది. ఇండియాలో అనైతిక జూద విపణి విలువ రూ.8.50 లక్షల కోట్లు ఉంటుందని అంచనా. ఆన్‌లైన్ క్రీడలు, జూదాలకు అలవాటు పడిన వాళ్లలో ఎంతోమంది అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. దాన్నుంచి బయటపడే దారి దొరక్క ఎందరో ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఆన్‌లైన్ గేమ్‌ల నియంత్రణ, బెట్టింగ్ కార్యకలాపాల నిరోధానికి ఉద్దేశించిన బిల్లును కేంద్రం నిన్న పార్లమెంటు ముందుకు తెచ్చింది. పచ్చని కుటుంబాలను సర్వనాశనం చేస్తున్న బెట్టింగ్ రక్కసిని తుదముట్టించి తీరాల్సిందే!

ఒళ్లు అలవకుండా డబ్బులు సంపాదించవచ్చన్న అత్యాశే మనిషిని ఆన్‌లైన్ జూదం వైపు నడిపిస్తోంది. దాన్ని వాటంగా మార్చుకుంటున్న బెట్టింగ్ యాప్‌లు- ముఖ్యంగా యువతపై మాయవలలు విసురుతున్నాయి. ప్రస్తుతం ఫిన్‌టెక్ సంస్థలు కోరిందే తడవుగా తేలిగ్గా అప్పులిస్తున్నాయి. ఆ సొమ్ములతో ఆన్‌లైన్‌లో పందేలు కాస్తున్న వారెందరో చివరికి పూర్తిగా మునిగిపోతున్నారు. అలాంటి వారిలో కొంతమంది బలవన్మరణాలకు ఒడిగడుతుంటే- బెట్టింగ్‌లపై మోజుతో మరికొందరు దొంగలుగా మారుతున్నారు. సొంతవారిపైనే దాడులకు దిగుతున్నారు. ఇక డిజిటల్ గేమ్‌లకు దాసోహమంటున్న నవతరాన్ని తీవ్ర మానసిక సమస్యలు చుట్టుముడుతున్నాయి. నిత్యం తెరలకు అతుక్కుపోతున్న వారిలో శారీరక రుగ్మతలూ అధికమవుతున్నాయి. ఆన్‌లైన్ జూదక్రీడల ద్వారా పోగుపడుతున్న సొమ్ములో సింహభాగం ఉగ్రవాదులు, సంఘ వ్యతిరేక శక్తుల చేతుల్లోకి చేరుతోంది. దేశ భద్రతకు అదో పెద్ద ప్రమాదంగా పరిణమిస్తుండటం మరీ కలవరపరుస్తోంది!

మాయదారి జూద యాప్‌ల మూలంగా తెలంగాణలోనే రెండేళ్ల వ్యవధిలో ముప్పై మందికి పైగా చేజేతులా ప్రాణాలు తీసుకున్నారు. వివిధ పరిశీలనల మేరకు పద్దెనిమిదేళ్ల నుంచి 25 ఏళ్లలోపు యువతే ఎక్కువగా బెట్టింగ్ వేదికల కబంధ హస్తాల్లో చిక్కుకుంటున్నారు. ఇలాంటి వారి నుంచి హైదరాబాద్‌లోని బలవన్మరణాల నివారణ హెల్ప్‌లైన్లకు వచ్చే ఫోన్‌కాల్స్ గడిచిన ఆర్నెల్లలో అరవైశాతం మేర పెరిగాయి. పందేలు కాసి ఉన్నదంతా కోల్పోతున్న వారి సంఖ్య ఏటా ఐపీఎల్ సమయంలో మరీ ఎక్కువవుతోంది. కుటుంబాలకు అండగా ఉంటూ వృత్తి ఉపాధుల్లో రాణించాల్సిన యువతరం ఇలా వ్యసనాల పాలబడితే- ప్రగతి బాటలో జాతి ప్రస్థానం కుంటుపడుతుంది. సామాజిక కల్లోలానికి కారణమవుతూ దేశాభివృద్ధిని దిగమింగుతున్న బెట్టింగ్ భూతాన్ని భూస్థాపితం చేసేందుకు కఠినచర్యలు తప్పనిసరి! సంబంధిత యాప్‌ల నిర్వాహకులతో పాటు కాసుల కక్కుర్తితో వాటికి ప్రచారం కల్పిస్తున్న వారూ శిక్షార్హులే. క్రీడాకారులు, సినీతారలు, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఎవరూ జూదక్రీడలకు ప్రచారకర్తలు కాకుండా యంత్రాంగం ఎప్పటికప్పుడు ఒక కన్నేసి ఉంచాలి. జీవితాలను తలకిందులు చేసే బెట్టింగ్‌ల జోలికి పోరాదని అందరినీ అప్రమత్తం చేసే అవగాహనా కార్యక్రమాలనూ విస్తృతంగా నిర్వహించాలి!

ప్రపంచంలో అత్యంత పదునైన ఆయుధం స్త్రీ గొంతుక. దాన్ని మూయించాలని చూడవద్దు. సామాజిక వివక్ష నుంచి బయటపడాలంటే మహిళలు ధైర్యంగా ముందుకొచ్చి మాట్లాడటం అలవరచుకోవాలి.


– ఇస్మత్ చుగ్తాయ్, రచయిత్రి



సత్య మార్గం

మూసిన గుప్పిట చూస్తే అందరికీ ఒకలాంటి ఆసక్తి, లోపల ఏముందోనని! ఏదో ఒకటి ఉండాలన్న ఆశ చాలా మందిది. అలాంటివారికి ఏమీలేదని చెబితే ఒక పట్టాన నమ్మరు. తెరచి ఖాళీ చెయ్యి చూపించినా ఏదో మోసం చేశావనేవాళ్లే ఎక్కువ. ఏ కొద్ది మందో కనిపిస్తున్న దాన్ని నమ్ముతారు. తార్కికంగా ఆలోచిస్తారు. ఆ చేతిలో ఏమున్నా లేకపోయినా తమకు ఒరిగేదేమీ లేదన్న వాస్తవాన్ని గ్రహిస్తారు. తాము ఇబ్బంది పడకుండా, ఇతరులను ఇబ్బంది పెట్టకుండా తమ పని తాము చూసుకుంటారు. సమస్యంతా మిగిలిన వాళ్లతోనే. వీరికి సత్యం చెప్పి నమ్మించడం కన్నా అసత్యంతో మభ్యపుచ్చడం తేలిక. ఆ బలహీనతను తమ స్వార్థానికి వాడుకునేవారిని ఎందరినో మనం చూస్తుంటాం.

ఒక మర్రిచెట్టు దగ్గర జనాలు గుమిగూడి ఉండటం చూశాడు బ్రహ్మయ్య. వారంతా ఆ చెట్టు తొర్రలో చెయ్యి పెట్టడానికి ఒకరితో ఒకరు పోటీ పడుతున్నారు. తొర్రలో



చెయ్యి పెడితే ఏదో అద్భుతమైన అనుభూతి కలుగుతుందని, మహత్తర శక్తులు వస్తాయని అందరూ చెప్పుకొంటున్నారు. చెట్టు తొర్రలో చెయ్యి పెట్టగానే వారి ముఖాలు ఒక్క క్షణం 'అబ్బా..' అన్నట్లుగా ముడుచుకుంటున్నాయి. చెయ్యి తీసి ఇవతలకు రాగానే జనాలు వారిని చుట్టిముట్టి ఎలా ఉందీ అనడుగుతున్నారు. దానికి వారంతా 'ఎంత బాగుందో... అద్భుతం' అంటూ ముఖానికి నవ్వు పులుముకుని చెబుతున్నారు.

అదేంటో తానూ తెలుసుకోవాలనుకుంటాడు బ్రహ్మయ్య. చాలాసేపు నిలబడి మొత్తానికి చెట్టు దగ్గరికి చేరాడు. తొర్రలో చెయ్యి పెట్టి 'అబ్బా' అని అరిచాడు. జనం అదేమీ పట్టించుకోకుండా అతణ్ని చుట్టుముట్టి ఎలా ఉందని అడిగారు. బ్రహ్మయ్య నొప్పి పెడుతున్న తన

అంతర్యామి

చేతిని వారికి చూపిస్తూ, 'అద్భుతం లేదు, గిద్భుతం లేదు! గండు చీమలు కుట్టాయి...' అని వాస్తవం చెప్పాడు. అది విని గండు చీమలతో కుట్టించుకోవడానికా ఇంత తోసుకుని వెళ్తున్నది... అని నవ్వుకుని కొందరు తమ సమయం వృథా కాకుండా కాపాడినందుకు బ్రహ్మయ్యకు ధన్యవాదాలు చెప్పి వెళ్లిపోయారు. మరి కొందరు అతణ్ని కోపంగా చూస్తూ... 'నువ్వు స్వార్థపరుడివి, కుళ్లుబోతువి... ఆ అద్భుత అనుభవం మేం పొందకూడదని అబద్ధం చెబుతున్నావు' అని ఆక్షేపించారు. నేటి సమాజధోరణికి అద్దం పడుతుందీ కథ.

ఇతరులను మభ్యపెట్టాలనుకోవడం, నేను మోసపోయాను కాబట్టి వాళ్లకీ అదే జరగాలనుకోవడం వివేకవంతుల లక్షణం కాదు. నిజం నిష్ఠూరంగానే ఉండవచ్చు, అంత మాత్రాన దాన్ని దాచనవసరం లేదు. కాకపోతే చెప్పి ఒప్పించడానికి చాలా ధైర్యం కావాలి. 'నిజములాడువాని నిందించు జగమెల్ల' అని వేమన అన్నట్లుగానే వాస్తవాలను అంత త్వరగా అంగీకరించదు లోకం. అయినా సరే, ఉత్తములు సత్య మార్గాన్నే ఎంచుకుంటారు. అందుకు ఫలితంగా మొదట కష్టాలూ అవమానాలూ ఎదురైనా చివరికి విజయం వారిదే.

– డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాసరావు

ఉన్నత విద్యలో కొత్త అధ్యాయం

అంతర్జాతీయంగా పేరుప్రతిష్ఠలు కలిగిన విదేశీ వర్సిటీలు మన దేశంలోకి అడుగుపెడుతున్నాయి. అమెరికా, బ్రిటన్, ఆస్ట్రేలియా, ఇటలీ తదితరాలకు చెందిన ఉన్నత విద్యాసంస్థలు ఇక్కడ ప్రాంగణాలు నెలకొల్పడానికి ఆసక్తి చూపిస్తున్నాయి. భారత ఉన్నత విద్యారంగంపై వాటి ప్రభావం ఎలా ఉండబోతోంది? ఈ క్రమంలో ఎలాంటి సవాళ్లు ఎదురుకావచ్చు?

నిరుడు 7.6లక్షల మంది భారతీయులు విద్యకోసం విదేశాలకు వెళ్లినట్లు కేంద్రం మొన్న సోమవారం లోక్‌సభకు సమాచారమిచ్చింది. 2023లో ఇలా 8.9లక్షల మంది పరదేశాల బాట పట్టడం గమనార్హం. భారతీయ విద్యార్థులు విదేశీ చదువులపై పెడుతున్న ఖర్చు ఏటా ఆరువేల కోట్ల డాలర్ల వరకు ఉంటోంది. ఇది విదేశీ మారక ద్రవ్యరాశిలో జరిగే వ్యయం కాబట్టి దేశాభివృద్ధికి కావాల్సిన నిధులకు ఆ మేరకు కోతపడుతోంది. స్వదేశంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థల్లో పరిమిత సంఖ్యలోనే సీట్లు ఉండటంతో మన విద్యార్థులు విదేశాలను ఆశ్రయించాల్సి వస్తోంది. అదీకాక మన విద్యాలయాల్లో మేలైన ఆర్‌అండ్‌డీ వసతులూ కొరతే. సాంకేతిక పరిజ్ఞానం రోజురోజుకీ అభివృద్ధి చెందుతున్న ఈ రోజుల్లో అంతర్జాతీయ గుర్తింపు కలిగిన డిగ్రీలకు విపరీతమైన గిరాకీ ఉంది. అవి విదేశీ విద్యాలయాల్లో లభిస్తాయని మన విద్యార్థులు అమెరికా, బ్రిటన్, జర్మనీ వంటి దేశాలకు వెళ్తున్నారు.



మరోవైపు, భారత్‌లో ఉన్నత విద్యలో చేరుతున్న విద్యార్థుల సంఖ్య 28శాతమే. అంతర్జాతీయ ప్రమాణాలతో పోలిస్తే ఇది చాలా చాలా తక్కువ. దీన్ని 2035కల్లా 50 శాతానికి పెంచాలని, మన విద్యార్థులకు అంతర్జాతీయ స్థాయిలో తులతూగే ఉన్నత విద్యను అందించాలని 2020 ఎన్‌ఈపీ లక్షించింది. దీనికి అనుగుణంగానే విదేశీ వర్సిటీలకు భారత్ స్వాగతం పలుకుతోంది.

రేపటి చదువులకు తారకమంత్రం

భారత గడ్డపైనే మేలైన విద్యను అందించినప్పుడు ప్రతిభావంతులు స్వదేశంలోనే ఉండి సేవలు అందిస్తారు. విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక భారం తగ్గుతుంది. విద్యా ప్రమాణాలు మెరుగుపడి భారత్‌లో పరిశోధన, అభివృద్ధి ఊపందుకుంటాయి. విదేశీ వర్సిటీలు క్యాంపస్‌లు ప్రారంభించడం వల్ల అంతర్జాతీయ బోధన, ఉత్తమ నిర్వహణ పద్ధతులు భారత్‌లో అందుబాటులోకి వస్తాయి. ఉన్నత విద్యా సంస్థలు నెలకొల్పడంలో విదేశీ సహకారం మన ప్రభుత్వంపై ఆర్థిక భారాన్ని తగ్గించి, విద్యార్థులకు మేలైన విద్యను అందిస్తుంది కూడా. భారత్‌లో యువజనాభా అత్యధికంగా ఉన్నందున విదేశీ విద్యా సంస్థల విస్తరణకు ఇక్కడ అవకాశాలు ఎక్కువ. కృత్రిమ మేధ, క్వాంటమ్ కంప్యూటింగ్, బయోటెక్నాలజీ, హరిత ఇంధనాలు, డిజిటల్ సాంకేతికతల్లో ముందంజ వేస్తున్న భారతీయ కంపెనీలు విదేశీ వర్సిటీలతో సహకార ఒప్పందాలు కుదుర్చుకోవడం ఖాయం. డేటా సైన్స్, రోబోటిక్స్, బయోటెక్నాలజీ, ఫైనాన్స్, కళలు, డిజైనింగ్‌లో విదేశీ వర్సిటీలు ఉన్నత కోర్సులు అందిస్తాయనడంలో సందేహం లేదు. ఈ కోర్సుల్లో సగభాగాన్ని భారత్‌లో, మిగతా సగాన్ని విదేశాల్లో పూర్తిచేసే వెసులుబాటును కల్పిస్తాయి. రెండు లేదా అంతకు ఎక్కువ సైన్స్, ఆర్ట్స్ విభాగాలకు చెందిన అంశాలతో సమ్మిళిత బోధనా విధానాన్ని అందిస్తాయి. ప్రాజెక్టు ఆధారిత కోర్సులు, పరిశ్రమలతో భాగస్వామ్యం భారతీయ విద్యాసంస్థల్లో చాలా అరుదు. విదేశీ వర్సిటీలు మాత్రం వీటికే పెద్దపీట వేస్తాయి. బట్టీ చదువులకు స్వస్తి, సృజనాత్మకతకు, సమస్యా పరిష్కార శక్తికే ప్రాధాన్యం- రేపటి చదువులకు తారకమంత్రం అవుతాయి.

అత్యుత్తమ సంస్థలకే...

ప్రపంచంలో 500 మేటి విశ్వవిద్యాలయాల జాబితాలోని వర్సిటీలకు మాత్రమే భారత్‌లో ప్రవేశం కల్పించాలని యూజీసీ నిర్దేశిస్తోంది. వీటి బోధనా సిబ్బందిలో కనీసం 60శాతం మంది ప్రఖ్యాత అంతర్జాతీయ విశ్వవిద్యాలయాల్లో పీహెచ్‌డీ చేసి ఉండాలని నియమం పెట్టింది. భారత్‌లో బోధనా కార్యకలాపాలు ప్రారంభించిన విదేశీ వర్సిటీలు తమ క్యాంపస్ బడ్జెట్‌లో పది శాతాన్ని స్థానిక పరిశోధనా కార్యకలాపాలకు కేటాయించాలి. తగిన స్తోమత లేని అర్హులైన విద్యార్థులకు 15శాతం సీట్లు కేటాయించి ఉపకార వేతనాలు ఇవ్వాల్సి ఉంటుంది. లబ్ధప్రతిష్ఠులైన విజిటింగ్ ప్రొఫెసర్లు, భారతీయ ప్రొఫెసర్లు, ఎంతోకాలం క్రితమే విదేశాలకు వలసవెళ్లి స్థిరపడిన భారతీయ మేధావులు, పారిశ్రామిక నిపుణుల సేవలను విద్యాబోధనకు ఉపయోగించుకోవాలని యూజీసీ నిబంధన విధించింది. పరీక్షల నిర్వహణ, గ్రేడింగ్ పద్ధతి భారతీయ క్యాంపస్ నిబంధనలకు అనుగుణంగా, అంతర్జాతీయ గుర్తింపు వర్తించేలా ఉంటాయి. పరదేశాలకు వెళ్తున్న విద్యార్థుల్లో కనీసం సగం మంది స్వదేశంలోని విదేశీ వర్సిటీల్లో చేరినా, భారత్‌కు ఏటా మూడువేల కోట్ల డాలర్ల దాకా ఆదా అవుతాయి.

అసమానతలను ఇంకా పెంచకుండా...

విదేశీ వర్సిటీలు భారత్‌లో ఏర్పాటు చేసే క్యాంపస్‌లు బోధన, బోధనేతర సిబ్బందికి కాకుండా వెలుపలివారికి పరిశోధనా ఎన్నో ఉపాధి అవకాశాలు కల్పిస్తాయి. స్థానికంగా వృత్తివ్యాపారాల విస్తరణకి తోడ్పడతాయి. అయితే, ఈ క్యాంపస్‌ల కోసం ప్రపంచశ్రేణి అధ్యాపకులను రప్పించడం, వారు ఇక్కడే ఉండేలా చూడటం అంత తేలిక కాదు. భారతీయ సాంస్కృతిక, సామాజిక, రాజకీయ పరిస్థితుల్లో అంతర్జాతీయ ప్రమాణాలను అలానే కొనసాగించడం ఒక సవాలే. అలాగే భారతీయ పరిశ్రమలతో, పరిశోధనా సంస్థలతో అర్థవంతమైన సహకారాన్ని నెరపడమూ సులభం కాదు. నాణ్యమైన విద్యాబోధన, పరిశోధనల పట్ల దీర్ఘకాలిక నిబద్ధత చూపించకుండా కేవలం 'బ్రాండ్' ప్రచారం కోసమే వచ్చే సంస్థల పట్ల జాగరూకతతో వ్యవహరించాలి. భారత ఉన్నత విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యలన్నీ విదేశీ వర్సిటీల రాకతో తీరిపోవు. కానీ, వ్యవస్థాగత మార్పులకు అవి ఉత్ప్రేరకాలు కాగలవు. అత్యుత్తమ విదేశీ విద్యాసంస్థలు కచ్చితంగా ఉత్తమ బోధనా ప్రమాణాలను, పరిశోధనా సామర్థ్యాలను అందిస్తాయి. అదే సమయంలో ఈ వసతులు అన్ని వర్గాల విద్యార్థులకు అందుబాటులో ఉండేలా జాగ్రత్త తీసుకోవాలి. ప్రతిభావంతులైన పేద, దిగువ మధ్యతరగతి విద్యార్థులకు తప్పనిసరిగా ఉపకార వేతనాలిచ్చి ప్రోత్సహించాలి. లేకపోతే విదేశీ వర్సిటీల రాకతో స్థితిమంతులకే లాభం చేకూరి, విద్యారంగంలోని అసమానతలు ఇంకా ఎక్కువ అవుతాయి.



నాగళ్ల శివప్రసాద్
విశ్రాంత ఆచార్యులు, ఐఐటీ-మద్రాసు



ప్రయత్నం.. విఫలం.. విజయం!

చిన్నప్పుడు సైకిల్ తొక్కడం నేర్చుకుంటూ ఎన్నిసార్లు కిందపడి దెబ్బలు తగిలించుకున్నా తొక్కడం వచ్చే వరకు వదిలేవాళ్లం కాదు. వంట నేర్చుకునేటప్పుడు ఉడికీ ఉడకకపోవడాలు, మాడటాలు.. మామూలే. అరుదుగా తప్పితే ఏ పని అయినా తొలి ప్రయత్నంలోనే పర్ఫెక్ట్‌గా చేయడం ఎవరికీ సాధ్యం కాదు. ఓపిగ్గా ప్రయత్నించిన కొద్దీ పొరపాట్లు తగ్గి ఆశించిన ఫలితం వస్తుంది. దీన్నే ట్రయల్ అండ్ ఎర్రర్ థియరీ అంటారు.

అమెరికాకు చెందిన మనస్తత్వ శాస్త్రవేత్త ఎడ్వర్డ్ ఎల్.థారన్‌డైక్ పిల్లులతో ప్రయోగాలు చేసి ట్రయల్ అండ్ ఎర్రర్ సిద్ధాంతాన్ని ప్రతిపాదించారు. ఆయన ఆకలితో ఉన్న ఒక పిల్లిని బోనులాంటి పజిల్ బాక్స్‌లో ఉంచారు. బాక్సుకు బయట కొద్ది దూరంలో పిల్లికి కనిపించేలా ఆహారాన్ని పెట్టారు. పజిల్‌పెట్టె తలుపు తెరుచుకోవాలంటే లోపల ఉన్న ఒక మీటను నొక్కాలి. ఆహారాన్ని అందుకోవాలని పిల్లి అనేక విధాలుగా ప్రయత్నించింది. అటూఇటూ తిరుగుతూ, తన పంజాతో ఊచలను కొట్టడం, పళ్లతో కొరకడం వంటి ప్రయత్నాలెన్నో చేసింది. ఆ క్రమంలో అనుకోకుండా తలుపు తెరచుకునే మీటను నొక్కింది. తలుపు తెరచుకోవడంతో వెంటనే బయటికి వచ్చి ఆహారం తినేసింది. థారన్‌డైక్ మరోసారి అదే పిల్లిని పజిల్ పెట్టెలో ఉంచగా.. ఈసారి అంత కష్టపడకుండా కొద్ది ప్రయత్నాల్లోనే సరైన మీట నొక్కగలిగింది. ఇలా.. ప్రయత్నాల సంఖ్య పెరిగే కొద్దీ పొరపాట్ల సంఖ్య తగ్గి, బోనులో పెట్టిన వెంటనే మీట నొక్కాలనే విషయాన్ని గ్రహించింది. ప్రాక్టీస్ ద్వారా ఒక పనిలో కచ్చితత్వం సాధించవచ్చని థారన్‌డైక్ తన యత్న-దోష సిద్ధాంతం ద్వారా వివరించారు.

ఈ సిద్ధాంతం గురించి తెలియకపోయినా అచ్చంగా దాన్నే ఆచరణలో పెట్టి క్రీ.పూ. నాలుగో శతాబ్దంలోనే విజయం సాధించారు గ్రీకు రాజనీతిజ్ఞుడు డెమోస్తనీస్. ప్రజలను చైతన్య పరిచేందుకు మంచి ఉపన్యాసకుడు కావాలన్నది ఆయన లక్ష్యం. కానీ డెమోస్తనీస్‌కు నత్తి ఉండేది. సభల్లో మాట్లాడాలంటే భయం, గొంతు కూడా బాగుండేది కాదు. ఎలాగైనా సరే ఈ ఇబ్బందులన్నిటినీ అధిగమించాలి అనుకున్నారాయన. మొదట వైద్యుల సూచనలతో నోట్లో గులకరాయి పెట్టుకుని కష్టమైన పదాలను బిగ్గరగా, స్పష్టంగా పలకడం సాధన చేశారు. సముద్రం ఒడ్డున ఒంటరిగా నిలబడి పెద్ద గొంతుకతో ఉపన్యసించేవారు. వీటికితోడు రోజుకు 15 గంటల పాటు గొప్ప పుస్తకాలు చదివి అపార జ్ఞానం సంపాదించారు. మాట్లాడేటప్పుడు సరైన హావభావాలు, బాడీ లాంగ్వేజ్ ఉండాలని నిలువుటద్దం ముందు నిలబడి ప్రసంగించడం ప్రాక్టీస్ చేశారు. ఆ విధంగా కొద్దికాలానికే డెమోస్తనీస్ తనకున్న బలహీనతలన్నిటినీ అధిగమించి గొప్ప వక్తగా ప్రఖ్యాతిగాంచారు.


ఉన్నతమైన లక్ష్యాలు పెట్టుకోవడంతో పనైపోదు, వాటిని సాధించాలంటే ప్రయత్నం అవసరం. అది ఎన్నిసార్లు విఫలమైనా నిరుత్సాహపడకుండా లోపాలను దిద్దుకుంటూ మళ్లీ మళ్లీ ప్రయత్నించడం ఇంకా అవసరం. అదే విజేతల అసలు రహస్యం.

– డి.జోగారావు

పవన శక్తిలో...

రాబోయే అయిదేళ్లలో పునరుత్పాదక మార్గాల్లో విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 500 గిగావాట్లకు చేర్చాలని కేంద్రం లక్షించింది. ఇందులో 340 గిగావాట్లు సౌర, పవన వనరుల ద్వారా రాబట్టాలని భావించింది. ఈ ఏడాది జూన్ నాటికి దేశీయంగా స్థాపిత పవన విద్యుత్తు సామర్థ్యం 51.67 గిగావాట్లు మాత్రమే. 2030 నాటికి దీన్ని 140 గిగావాట్లకు తీసుకెళ్లేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయి. గడిచిన మూడేళ్లు, ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి మూడు నెలల్లో ఎంత పవన శక్తి సామర్థ్యాన్ని ఇండియా కొత్తగా సాధించిందంటే...

(మెగావాట్లలో)



2022–23	2275
2023–24	3253
2024–25	4151
2025–26	1637

(ఆధారం: లోక్‌సభలో కేంద్రం వెల్లడించిన వివరాలు)

మనోవర్తికి ఎవరు అర్హులు?

ఇటీవలి కాలంలో మన దేశంలో విడాకుల కేసులు పెరిగిపోతున్నాయి. 'మనోవర్తి' అంశమూ తరచూ చర్చకు వస్తోంది. ఇటీవల ఒక మహిళ తనకు ఒక విలాసవంతమైన కారు, పన్నెండు కోట్ల రూపాయల నగదు, ముంబయిలో ఫ్లాట్ వంటివన్నీ తన మాజీ భర్త నుంచి భరణంగా ఇప్పించాలంటూ సుప్రీంకోర్టును ఆశ్రయించడం ఆసక్తి రేపింది. మరి, భర్త కూడా భార్య నుంచి మనోవర్తి కోరవచ్చా? ఈ విషయంలో కోర్టు తీర్పులేం చెబుతున్నాయి?

సాధారణంగా, మనోవర్తి అంటే కేవలం విడాకుల సందర్భంలో భార్యలకు భర్తలు చేసే చెల్లింపులే అని చాలామంది భావిస్తారు. కానీ, భరణం ఇప్పించాలంటూ భర్త కూడా న్యాయస్థానాన్ని కోరవచ్చు. హిందూ వివాహ చట్టం-1955లోని సెక్షన్ 25 ప్రకారం, విడాకులు మంజూరు చేసే సమయంలో తమ పోషణ నిమిత్తం మనోవర్తి కావాలంటూ భార్య లేదా భర్త న్యాయస్థానాన్ని అభ్యర్థించవచ్చు. తమ జీవనశైలికి తగినట్లుగా ఆదాయం, ఆస్తుల ఆధారంగా భార్యకు కానీ భర్తకు కానీ మనోవర్తి చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించవచ్చు. ఈ చెల్లింపులు ఏకమొత్తంగా, నెలవారీగా, ఇతరత్రా కాలవ్యవధి ప్రకారమైనా చెల్లించాలంటూ న్యాయస్థానం నిర్దేశించవచ్చు. ఏయే సందర్భాల్లో, ఎవరికి మనోవర్తి చెల్లించాలనే విషయంలో విచక్షణాధికారం న్యాయస్థానాలదే.

భర్తకు కూడా భరణం

అభివృద్ధి చెందిన పశ్చిమ దేశాల్లో మనోవర్తి కల్పించాలని అడిగే హక్కు కేవలం భార్యలకు మాత్రమే ఉంది. మన దేశంలో భర్తలకు సైతం భరణం చెల్లించాలంటూ న్యాయస్థానాలు ఆదేశించిన సందర్భాలు ఎన్నో ఉన్నాయి. రాణి సేఠీ వెర్సెస్ సునీల్ సేఠీ అనే కేసులో, భర్త సునీల్‌కు ప్రతి నెలా ఇరవై వేల రూపాయల మనోవర్తి చెల్లించాలని న్యాయస్థానం ఆదేశించింది. ఆ తీర్పుపై రాణి దిల్లీ ఉన్నత న్యాయస్థానంలో అప్పీలు చేశారు. తన మాజీ భర్త తనను తాను పోషించుకునే పరిస్థితుల్లోనే ఉన్నారని, కిందికోర్టు ఆదేశాలు న్యాయసమ్మతంగా లేవని వాదించారు. అయితే, భార్య రాణి లాభసాటి వ్యాపారాన్ని నిర్వహిస్తున్నారని, భర్తకు వేరే ఆదాయ మార్గాలు, ఆస్తులు లేవని రుజువు కావడంతో కింది కోర్టు ఆదేశాలను సమర్థిస్తూ, భార్య అప్పీలును న్యాయస్థానం కొట్టివేసింది. అదేవిధంగా, లలిత్ మోహన్ వెర్సెస్ తృప్తాదేవి కేసులో, భర్తకు ప్రతినెలా భరణం చెల్లించాలని, అతను మరణించేదాకా లేదా మరో పెళ్లి చేసుకునేదాకా ఇవ్వాల్సిందేనని జమ్మూకశ్మీర్ హైకోర్టు ఆదేశించింది.

కొన్ని కేసుల్లో భర్తలకు భరణం ఇవ్వడానికి న్యాయస్థానాలు నిరాకరించాయి. కంచన్





వెర్సెస్ కమలేంద్ర కేసులో, భర్త మంచి ఆరోగ్యంతో, ఇతరత్రా అవకరాలూ లేనందువల్ల తనను తాను పోషించుకోగలరంటూ మనోవర్తి కోసం అతను పెట్టుకున్న అభ్యర్థనను బాంబే హైకోర్టు తిరస్కరించింది. యశ్‌పాల్ సింగ్ ఠాకూర్ వెర్సెస్ అంజన కేసులో కూడా బాంబే హైకోర్టు భర్తకు భరణం ఇవ్వడానికి ఒప్పుకోలేదు. రజనీష్ వెర్సెస్ నేహా కేసులో, శారీరకంగా ఆరోగ్యంగా ఉన్న పురుషుడు... భార్యను, పిల్లలను పోషించలేనని చెప్పడానికి వీల్లేదని సర్వోన్నత న్యాయస్థానం తేల్చి చెప్పింది. చతుర్భుజ్ వెర్సెస్ సీతాబాయి కేసులో భార్యకు తగినంత ఆదాయం లేనప్పుడు భర్తను భరణం చెల్లించాల్సిందిగా ఆదేశించవచ్చని సుప్రీంకోర్టు పేర్కొంది. శైలజ వెర్సెస్ ఖోబ్బన్ కేసులో భార్యకు సంపాదించే అర్హతలు ఉన్నంత మాత్రాన మనోవర్తి చెల్లించనక్కర్లేదని భర్త చెప్పకూడదని, భార్యకు మనోవర్తి చెల్లించాలని సుప్రీంకోర్టు ఆదేశించింది.

అవగాహన అవసరం


కొన్ని సందర్భాల్లో భార్యకు సైతం మనోవర్తి నిరాకరించిన ఉదంతాలు ఉన్నాయి. రూపాలీ గుప్తా వెర్సెస్ రజత్ గుప్తా కేసులో, భార్య పదేళ్లుగా చార్టర్డ్ అకౌంటెంట్‌గా ప్రాక్టీస్ చేస్తూ అధిక ఆదాయం కలిగి ఉన్నారు. దాంతో భార్యకు మనోవర్తి ఇవ్వడానికి దిల్లీ హైకోర్టు నిరాకరించింది. మమతా జైస్వాల్ వెర్సెస్ రాజేశ్ జైస్వాల్ కేసులోనూ భార్యకు మనోవర్తి ఇవ్వడానికి సుప్రీంకోర్టు అంగీకరించలేదు. చట్టం సోమరులకు సహాయపడదని, మహిళలైనా సరే, కనీసం తమను తాము పోషించుకునే ప్రయత్నం చేయాలని సూచించింది. మంచి విద్యార్హతలు, ఉద్యోగానుభవం ఉందనే కారణంగా భార్య దరఖాస్తును కొట్టివేసింది. పిల్లలు భార్య సంరక్షణలో ఉంటే, వారిని పోషించడానికి అవసరమైన డబ్బులు ఇచ్చే బాధ్యత భర్తదే అని న్యాయస్థానాలు పేర్కొన్నాయి. మరో వివాహం చేసుకున్నప్పుడు మాత్రం మనోవర్తి అవసరం లేదు. హిందూ వివాహ చట్టం ప్రకారమే కాకుండా, హిందూ దత్తత, భరణం చట్టం-1955, సెక్షన్ 144, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత-2023, ప్రత్యేక వివాహ చట్టం-1954, గృహహింస చట్టం-2005 ప్రకారం కూడా భరణం కోరవచ్చు. ఈ చట్టాల కింద కేవలం భార్యలు మాత్రమే భరణం చెల్లించాలని న్యాయస్థానాలను అభ్యర్థించే అవకాశం ఉంది. మనోవర్తికి సంబంధించి ప్రచారంలో ఉన్న అంశాల్లో నిజానిజాలేంటో తెలుసుకోవాలంటే న్యాయస్థానాల కీలక తీర్పుల మీద అవగాహన ఉండాల్సిందే.


– హరీశ్ కొలిచాల, న్యాయ నిపుణులు

హాయ్! బుజ్జీ


ఏది ఎక్కువైనా ముప్పే!

బొమ్మలు: శ్రీనివాస్ కథ: హరి









స్త్రీ శక్తికి... ఆర్థిక దన్ను!

★ చిరుద్యోగులు, విద్యార్థినులకు గట్టిమేలు
★ భారీగా పెరిగిన మహిళా ప్రయాణికులు

ఈనాడు, అమరావతి



✦ 'బందరులో ఎన్‌సీసీ క్యాంటీన్లో విధులు నిర్వహిస్తున్నా. రోజూ ఉదయం అవనిగడ్డ నుంచి బందరుకు బస్సులో వస్తా. రానుపోను రూ.110 ఖర్చు. స్త్రీశక్తి పథకంతో ఉచితంగా విధులకు వెళ్లి వస్తున్నా. నెలకు రూ.3 వేల వరకు భారం తగ్గనుంది. కుటుంబ పోషణకు ఎంతగానో ఉపకరిస్తోందని' **రాజేశ్వరి** తెలిపారు.

✦ 'మేం మంగళగిరి నుంచి విజయవాడ బస్సులో కళాశాలకు వస్తాం. క్యూలో నిల్చుని పాస్‌లు తీసుకునే వాళ్లం. పాస్‌కు ఒక్కొక్కరికీ రూ.400 చొప్పున రూ.1200 ఖర్చయ్యేది. ప్రస్తుతం ఉచితంగా ప్రయాణిస్తున్నా. కళాశాల జరిగే 10 నెలలకు మిగిలే రూ.12 వేలతో పోటీ పరీక్షల శిక్షణ, స్టడీ మెటీరియల్స్ కొనుగోలుకు వినియోగిస్తామని' విద్యార్థినులు లక్ష్మీ, నిషా, అనూష తెలిపారు.

కూటమి సర్కారు శ్రీకారం చుట్టిన స్త్రీ శక్తి పథకం మహిళలకు ఆర్థిక దన్నుగా నిలుస్తోంది. విద్య, ఉద్యోగ, వ్యాపార ఇతర అవసరాల నిమిత్తం నిత్యం బస్సులో తిరిగే మహిళలకు ప్రయాణ ఖర్చుల భారం నుంచి భారీ ఊరట దొరికింది. మొదటి రోజు నుంచి మహిళా ప్రయాణికుల సంఖ్య పెరుగుతుండడంతో ఆర్టీసీ ఆదాయం భారీగా పెరుగుతోంది.



తేదీ	మహిళా ప్రయాణికులు - ఎన్టీఆర్	మహిళా ప్రయాణికులు - కృష్ణా	ఆక్యుపెన్సీ శాతం
ఆగస్టు-15	5,111	3,313	65
ఆగస్టు-16	75,557	42,674	72
ఆగస్టు-17	1,00,456	65,339	81
ఆగస్టు-18	1,32,115	77,331	79
ఆగస్టు-19	1,33,394	73,839	82
మొత్తం	4,46,633	2,62,496	75.8

స్త్రీ శక్తి పథకానికి ముందు ఉమ్మడి జిల్లాలో ఆక్యుపెన్సీలో 60 శాతం పైగా పురుషులు ఉండేవారు. ఆగస్టు 15 నుంచి మహిళల సగటు ఆక్యుపెన్సీ 75.8 శాతానికి చేరింది. ఆగస్టు 19 వరకు 7,09,129 మంది మహిళలు ఉచితంగా ప్రయాణించారు. కృష్ణాలో రోజు వారీ ఆర్టీసీ ఆదాయం రూ.48 లక్షల నుంచి రూ.60 లక్షలకు చేరగా, ఎన్టీఆర్‌లో రూ.కోటి నుంచి రూ.1.25 కోట్లకు పెరిగింది. ఉమ్మడి జిల్లాలో ఆర్టీసీ ఆదాయం రూ.1.85 కోట్లకు పెరిగింది. ప్రస్తుతం ఉదయం 7-10 గంటలు, సాయంత్రం 4 - రాత్రి 8 గంటలు రద్దీ ఎక్కువగా ఉంటోంది. అదనపు ట్రిప్పుల ద్వారా సమస్య అధిగమించేందుకు ఆర్టీసీ ప్రయత్నిస్తోంది.

ఆదాయం బాటలో..



విజయవాడలో బుధవారం సినీనటి **నభానటేష్** సందడి చేశారు. గవర్నర్‌పేటలో ఓ షోరూం ప్రారంభోత్సవానికి వచ్చిన ఆమె సంగీతం వింటూ మైమరిచిపోయారు. - గవర్నర్‌పేట

ఇన్నోవేషన్ హబ్‌తో స్టార్టప్‌లకు సరికొత్త ఊపు

రామవరప్పాడు, న్యూస్‌టుడే: సరికొత్త ఆవిష్కరణలు పరిశ్రమల స్థాపనకు దోహదపడతాయని, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌తో స్టార్టప్‌లకు సరికొత్త ఊపు వస్తుందని, యువత సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ అన్నారు. మంగళగిరి మయూరి టెక్ పార్క్‌లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించిన ముఖ్యమంత్రి చంద్రబాబు.. వర్చువల్‌గా ఎనికేపాడులోని ఆర్‌టీఐహెచ్ స్పోక్‌ను బుధవారం ప్రారంభించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఏఐ వంటి ఆధునిక సాంకేతికత, కొత్త ఆవిష్కరణలకు రాష్ట్రాన్ని వేదికగా చేసేందుకు అమరావతిలో ఈ హబ్‌ను సీఎం ప్రారంభించారన్నారు. దీనికి అనుసంధానంగా విజయవాడతో పాటు మొత్తం ఐదు ప్రాంతాల్లో స్పోక్స్‌లను ప్రారంభించినట్లు చెప్పారు. వీటి ద్వారా పరిశ్రమల స్థాపనకు ముందుకొచ్చే వారికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్ మాట్లాడుతూ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు ముఖ్యమంత్రి కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జేసీ ఇలక్కియా, మేఘా ఇంజినీరింగ్ కంపెనీ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ వంశీ ఆదిత్య, విట్ అమరావతి డైరెక్టర్ జి.సోమశేఖర్, ఎస్ఆర్ఎం యూనివర్సిటీ హ్యాచ్ ల్యాబ్ రీసెర్చ్ సెంటర్ సీఈవో కె.రాజశేఖర్, మోహన్ స్పింటెక్స్ సీఎఫ్‌వో కె.లలిత ప్రసాద్, పాల్గొన్నారు.



హబ్‌లో పనిచేస్తున్న ఉద్యోగినులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ, చిత్రంలో లంకా దినకర్, జేసీ ఇలక్కియా తదితరులు



అన్నిగేట్ల ద్వారా విడుదలవుతున్న నీరు

కృష్ణమ్మ ఉధృతి!

ఈనాడు, అమరావతి- ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే: కృష్ణమ్మ ఉధృతి కొనసాగుతుండగా.. మొదటి ప్రమాద హెచ్చరిక అలాగే ఉంది. కృష్ణా డెల్టా పరిధిలోని జిల్లాల్లో వర్షాలు తగ్గడంతో సాగునీటి అవసరాలు పెరిగాయి. ప్రకాశం బ్యారేజీ నుంచి బుధవారం నీటి విడుదలను పెంచారు. కృష్ణా డెల్టాలోని కాలువలకు మొత్తం 10,641 క్యూసెక్కులు విడుదల చేశారు. ఎదురు కాలువకు నీటి విడుదలను పునరుద్ధరించారు. తూర్పు ప్రధాన కాలువకు (కేఈ) 7,135, కృష్ణా పశ్చిమ కాలువకు (కేడబ్ల్యూ) 3,506 క్యూసెక్కులు వదిలారు. మంగళవారం కృష్ణమ్మ ఉధృతి మేరకు రెండో ప్రమాద హెచ్చరిక స్థాయికి చేరుతుందని భావించినా ఆ స్థాయికి చేరకపోవడంతో జిల్లావాసులు ఊపిరి పోసుకున్నారు.

ప్రవాహం.. క్యూసెక్కుల్లో

సమయం	రాక	పోక
ఉదయం-6	4,85,831	4,81,194
ఉదయం-9	4,68,030	4,62,560
మధ్యాహ్నం-12	4,51,318	4,43,808
మధ్యాహ్నం-3	4,51,472	4,43,808
సాయంత్రం-6	4,67,041	4,56,400
రాత్రి-8	4,67,041	4,56,400
రాత్రి-11 గంటలు	4,73,707	4,62,560

తిరువూరులో 14.6 మి.మీ. వర్షం

ఎన్టీఆర్ కలెక్టరేట్ : జిల్లాలోని పలు మండలాల్లో వర్షాలు కురిశాయి. బుధవారం ఉదయం నమోదైన వివరాలు ఇలా ఉన్నాయి. తిరువూరు 14.6 మి.మీ., గంపలగూడెం 4.6, జి.కొండూరు 4.2, రెడ్డిగూడెం, ఇబ్రహీంపట్నం 3.8, నందిగామ, విస్సన్నపేట 2.6, చందర్లపాడు 2.2, వీరులపాడు 1.8, జగ్గయ్యపేట 1.4, కంచికచర్ల 1.2, పెనుగంచిప్రోలు 1, విజయవాడ గ్రామీణ 2.4, పటమట, అజిత్‌సింగ్‌నగర్ 2.6, గాంధీనగర్, భవానీపురం ప్రాంతాల్లో 2.4 మిల్లీ మీటర్ల మేర వాన పడింది.

దసరా ఉత్సవాలతో.. ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచాలి



మాట్లాడుతున్న దేవాదాయ శాఖ మంత్రి రామనారాయణరెడ్డి

ఇంద్రకీలాద్రి, న్యూస్‌టుడే: దసరా ఉత్సవాలను ప్రభుత్వ ప్రతిష్ఠ పెంచే విధంగా నిర్వహించాలని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తెలిపారు. శ్రీదుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానం ఇంద్రకీలాద్రిపై సెప్టెంబరు 22 నుంచి అక్టోబరు 2 వరకు నిర్వహించనున్న దసరా ఉత్సవాల సమన్వయ సమావేశం పాతబస్తీ బ్రాహ్మణ వీధిలో బుధవారం నిర్వహించారు. దసరా ఉత్సవాల్లో కుంకుమ పూజలు, చండీహోమం నిర్వహించాలా వద్దా అనే అంశంపై సమావేశంలో చర్చ జరిగింది. భక్తుల మనోభావాలను గౌరవించి దసరా ఉత్సవాల్లో 11 రోజుల్లో పరిమిత సంఖ్యలో ఆర్జిత సేవల టిక్కెట్లు విక్రయించి ఉభయదాతలను అనుమతించాలని మంత్రి రామనారాయణరెడ్డి నిర్ణయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మూల నక్షత్రం, విజయదశమి రోజున భక్తులకు ఉచిత ప్రసాదం అందిస్తామన్నారు. ప్రకాశం బ్యారేజీ, దేవస్థానం ప్రాంగణం విద్యుత్తు దీపాల వెలుగుతో పండగ శోభను తెలియజేయాలన్నారు. కృష్ణవేణీ నదీ హారతులను కూడా నిర్వహించేందుకు సిద్ధం చేయాలన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి మాట్లాడుతూ.. గత ఏడాది ఉత్సవాలకు సంబంధించిన బడ్జెట్‌పై అధికారులు నిర్ణయం తీసుకోలేకపోయారన్నారు. ఇప్పుడు తప్పనిసరిగా ఉత్సవాల బడ్జెట్‌పై ముందస్తుగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. కలెక్టర్, సీపీ, మున్సిపల్ కమిషనర్, దేవాదాయ శాఖ కమిషనర్ సమన్వయంతో పని చేయాలన్నారు. హోల్డింగ్ ఏరియా, క్యూలైన్లలో భక్తులను పంపే విధానంలో మార్పులు తేవాలన్నారు. దేవస్థానం ఉద్యోగులు, వాలంటీర్లకు డ్రెస్ కోడ్ తప్పనిసరిగా అమలు చేయాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, సీపీ రాజశేఖరబాబు, దేవాదాయ శాఖ కమిషనర్ రామచంద్రమోహన్, మున్సిపల్ కమిషనర్ ధ్యానచంద్ర, ఈవో శీనానాయక్ పాల్గొన్నారు.

ప్రణవి లోగిలికి.. ప్రగతి తోరణం!

ఈనాడు, అమరావతి

"ఇంద్రకీలాద్రిపై దశాబ్దాలుగా నెలకొన్న అనేక సమస్యలకు శాశ్వత పరిష్కారం దిశగా అభివృద్ధి పనులు సాగుతున్నాయి. దశాబ్దం తర్వాత అన్నదాన భవనం అందుబాటులోకి రాబోతోంది. ప్రసాదాలపోటు భవన నిర్మాణం జోరుగా సాగుతోంది. ఇరుకైన మహామండంలోని అన్నదానం చేసే చోటకు భక్తులు రావడమే ప్రస్తుతం కష్టమవుతోంది. నమూనాల పేరుతో రెండుసార్లు గత ప్రభుత్వంలో నాటి ముఖ్యమంత్రి జగన్ స్వయంగా వచ్చి మరీ ఆరంభోత్సవాలు చేసి రూ.లక్షలు వృథా చేశారు. కనీసం ఓ పునాది కూడా తవ్వింది లేదు. తాజాగా అభివృద్ధి పనులు చకచకా జరుగుతున్నాయి."

శరవేగంగా భవన సముదాయాల నిర్మాణం



ప్రసాదాల పోటు భవనం..

★ **అన్నదాన భవనం:** రూ.12 కోట్లతో చేపడుతున్నారు. 70 శాతం పనులు జరిగాయి. 2025 అక్టోబరులోగా పూర్తి చేయాలనేది లక్ష్యం. 1,200 మందికి భోజన వసతి, వంటశాల, స్టోర్ ఉంటాయి. ★ **ప్రసాదం పోటు:** రూ.27 కోట్లతో ఆరు అంతస్తుల భవనం. 2025 జులై నాటికి పూర్తిచేయాలనేది లక్ష్యం. ఇప్పటికే 70 శాతం పనులు పూర్తయ్యాయి. వంటశాల, ప్యాకింగ్ కేంద్రాలు, కౌంటర్లు ఉంటాయి. ★ **రాతి కట్టడాలు:** నూతనంగా రాతి యాగశాలను రూ.5 కోట్లతో నిర్మిస్తున్నారు. నవగ్రహ రాతి మండపం రూ.76.33 లక్షలతో నిర్మించి జూన్‌లో పునఃప్రతిష్ఠించారు. ★ **సౌకర్యాల కల్పన:** దుర్గాఘాట్ వద్ద మూత్రశాలలు, మరుగుదొడ్లు, క్లోక్‌రూమ్, చెప్పుల స్టాండు, దుస్తులు మార్చుకునే గదుల నిర్మాణం ఆరంభించారు.

సేవలు మెరుగయ్యేలా..

భక్తులకు మెరుగైన సేవలు అందించేలా అనేక నిర్ణయాలు తీసుకుంటున్నారు. క్యూలైన్లకు ఆటంకం కలిగించే.. ప్రముఖుల దర్శనాలు మధ్యాహ్నం తర్వాతేనని నెలకిందట ఆదేశాలు జారీ చేశారు. ★ సిఫార్సులపై దర్శనాలకు వచ్చే వారంతా కచ్చితంగా ప్రముఖుల లేఖలు తేవాలనే నిబంధన పెట్టారు. ★ దశాబ్దం నుంచి కనకదుర్గానగర్, మల్లికార్జునపేటలో ఆలయ స్థలాన్ని ఆక్రమించి.. ప్రైవేటుగా దుకాణాలు పెట్టి కొనసాగిస్తున్న దందాను అరికట్టారు. ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా వెనక్కి తగ్గకుండా దుకాణాలన్నీ రాత్రికి రాత్రి తొలగించారు. ఇప్పుడు ఆ స్థలమంతా విశాలమైన పార్కింగ్‌గా, ఆలయ షెడ్ల నిర్మాణానికి పనికొస్తోంది.



నిర్మాణంలో అన్నదాన భవనం

మరింత వేగవంతంగా..

- వి.కె.శీనానాయక్, ఆలయ ఈవో

అభివృద్ధి పనులు, భక్తులకు మెరుగైన సేవల విషయంలో రాజీ పడడం లేదు. ఈవోగా బాధ్యతలు చేపట్టి వంద రోజులు దాటింది. కూటమి ప్రభుత్వం వచ్చాక చేపట్టిన.. ప్రతి అభివృద్ధి పనినీ.. మరింత వేగంగా జరిగేలా చర్యలు తీసుకుంటున్నాం. నిర్దేశిత లక్ష్యం లోగా అన్నింటినీ పూర్తిచేస్తాం.

ఆటోనగర్.. ఆగమాయె!

★ ఇరువైపులా వాహనాలు, సామగ్రితో దారి మాయం
★ మధ్యలోని ఇరుకు సందే రాకపోకలకు గత్యంతరం

ఈనాడు, అమరావతి

పేరుకు ఆసియాలోనే అతిపెద్ద ఆటోనగర్. కానీ.. ఇక్కడ రహదారులను ఆక్రమించి అడ్డంగా వాహనాలు నిలిపినా.. ఎవరికీ పట్టదు. ఎటుచూసినా.. రహదారులపైనే కార్యకలాపాలు జరుగుతున్నాయి. దుకాణాల్లో చేయాల్సిన పనులు, ఉంచాల్సిన వస్తువులు, ఇనుప సామగ్రి, వాహనాల విడిభాగాలను తెచ్చి సగం దారిని ఆక్రమిస్తున్నారు. దీంతో అటూఇటూ ఆపేసిన వాహనాలు, ఇనుప పరికరాలను ఉంచగా. . మిగిలిన కొద్ది ప్రదేశంలో నుంచి వాహనాలు వెళ్లాల్సిన పరిస్థితి. ఎదురెదురుగా రెండు లారీలు వచ్చినా వెళ్లేంత విశాలంగా ఉండాల్సిన రోడ్లు.. రెండు కార్లు, ఆటోలు వచ్చినా వెళ్లలేనంత ఇరుకుగా మారాయి. ఇంత దారుణంగా ఉన్నా.. ఒక్క అధికారికీ పట్టదు.
విజయవాడ ఆటోనగర్‌లో చాలా ప్రాంతాల్లో అసలు రహదారులు దేనికి ఉన్నాయో.. ఇక్కడి యజమానులకు తెలుసా? లేదా? అనే సందేహం కలిగేలా. . రెండు వైపులా భారీగా వస్తువులు నింపేస్తున్నారు. ఇటువైపుగా చిన్న ఆటోలు రెండు వచ్చినా.. ట్రాఫిక్ జామ్ అవ్వాల్సిందే. ✪ ఆటోనగర్ గుంటతిప్ప కాలువ పక్కనున్న కట్టను సైతం ఇరువైపులా పాత వాహనాలతో నింపేశారు. మిగిలిన ఇరుకు దారిలో వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయ్. నెలలుగా ఇదే పరిస్థితి. ✪ ఆటోనగర్ 4వ క్రాస్ 3వ రోడ్డులో రెండు వరుసల దారి మొత్తం లారీలు పార్కింగ్ చేయగా మిగిలిన చిన్నదారిలోనే వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ✪ మహానాడు రోడ్డు నుంచి ఆటోనగర్ లోపలకు వచ్చే 100 అడుగుల మార్గంలో ఆరంభం నుంచి.. రెండు వరుసలుగా.. లారీలు, వాహనాలు దారి పొడవునా నిత్యం నిలిపే ఉంటాయి.



దారే కనిపించదిక్కడ...


ఆటోనగర్ 3వ క్రాస్ మూడో రోడ్డు కూడలిలో రహదారిని ఆక్రమించి యంత్ర పరికరాలను పెట్టేయడంతో వాహనాలు తిరిగే పరిస్థితీ లేదు.



ఇరువైపులా ఆక్రమణ...

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాలున్న ఎస్టేట్ రోడ్డు నంబరు 02లో ఇరువైపులా ఆక్రమించేయడంతో ఇలా మధ్యలో దారి ఇరుకు సందులా మారింది. వీటి మధ్యలో నుంచే రాకపోకలు సాగించాల్సిన దుస్థితి.

కౌమారం.. సుకుమారం!



పిల్లల సాధక బాధలు వినండి

విజయవాడ నేరవార్తలు, న్యూస్‌టుడే

★ వాంబేకాలనీలో ఓ బాలుడు (15) పదో తరగతి విద్యార్థి. ఇంట్లో ఉన్న అతని చెల్లి కిరాణా కొట్టుకువెళ్లింది. తిరిగి వచ్చేసరికి ఫ్యాన్‌కు ఉరేసుకున్నాడు. చుట్టుపక్కల వారి సాయంతో కిందకు దించారు. ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మృతి చెందాడు.
★ అజిత్‌సింగ్‌నగర్‌లో మరో బాలుడు (16) ఇంటర్ మొదటి సంవత్సర విద్యార్థి. ఇటీవల ఇంట్లో ఎవరూ లేని వేళ ఉరేసుకున్నాడు.

... **ఈ** ఘటనలను విశ్లేషించిన పోలీసులు విస్తుపోయారు. ఒకరు ప్రేమ వ్యవహారంతో.. మరొకరు తరగతిలో సెక్షన్ మార్చారని బలవన్మరణం పొందారు. 15, 16 ఏళ్ల వయసులోనే ఆత్మహత్య తలంపు రావడంపై నిపుణులు కలవరపడుతున్నారు. కుటుంబంలో అనుబంధాలు దూరమై.. ఒంటరితనం అనుభవించడమే కారణమని చెబుతున్నారు.. సైకాలజిస్టులు.

పిల్లల మానసిక ఎదుగుదల సున్నితంగా మారుతోంది. ప్రతీ విషయానికి తీవ్రంగా స్పందిస్తున్నారు. సామాజిక మాధ్యమాల ప్రభావం, తల్లిదండ్రులతో గడిపే సమయం లేక.. ఇలా మారిపోతున్నారనేది నిపుణుల మాట. ప్రస్తుత అవసరాల నేపథ్యంలో తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాలకు వెళ్లిపోతున్నారు. చాలా కుటుంబాల్లో ఒకరిద్దరు పిల్లలతో సరిపెట్టేస్తున్నారు. ఒక్కరే పిల్లలున్న కుటుంబాల్లో తోబుట్టువులు లేక ఒంటరితనం వారిని వేధిస్తోంది. ఉమ్మడి కుటుంబ వ్యవస్థ కన్పించని పరిస్థితి. ఎవరైనా పొగిడినా, తిట్టినా పంచుకునే వారు లేక తల్లడిల్లుతున్నారు. ఇదే తీవ్రమై ఆత్మహత్యలకు పురిగొల్పుతోంది.

ఆందోళన కలిగిస్తున్న బలవన్మరణాలు

పోటీతత్వం అలవరుచుకోలేక..

చదువులో టాప్ ర్యాంకు రావాలని తల్లిదండ్రుల ఒత్తిడి పిల్లలపై ఎక్కువ అవుతోంది. రూ.లక్షలు పోసి చదివిస్తున్నాం.. అత్తెసరు మార్కులేంటని? కటువుగా మాట్లాడేవారు లేకపోలేదు. కార్పొరేట్ కళాశాలల్లో ఉదయం నుంచి రాత్రి వరకు చదువే లక్ష్యంగా రుద్దుతున్నారు. మానసిక వికాసానికి ఎక్కువ ఉపకరించేది.. క్రీడలు. శారీరక శ్రమ కలిగించే ఆటలు ఆడకపోవడంతో వారిలో మానసిక ధైర్యం తగ్గిపోతోంది. గెలుపోటములు అలవడితే.. వారు రాటుదేలి పోటీతత్వం పెరుగుతుంది. అది లేకనే మానసిక ధైర్యం కొరవడి పరిస్థితి చేయిదాటుతోంది.

అనుబంధాలు పెంచుకోండి



కుటుంబ సభ్యుల మధ్య అనుబంధాలు పెంచుకోవాలి. కలిసి భోజనం చేయాలి. కలిసి మాట్లాడుకోవాలి. పిల్లలతో స్నేహితుడిలా ప్రవర్తించాలి. పాఠశాల, కళాశాలలోని విషయాలను అడిగి తెలుసుకోవాలి. బాగా చదవాలని ప్రోత్సహించాలి. ఇతరుల చదువుతో పోల్చి కించపరచడం చేయవద్దు. మార్కులు తక్కువ వస్తే కోపగించుకోవద్దు. మంచి మార్కులు తెచ్చుకునేలా ప్రోత్సహించండి. మంచి చెడులతో పాటు చదువుకు ఉన్న విలువను తెలియజేయాలి. ఉన్నత స్థాయిలో ఉన్న వ్యక్తులను ఉదాహరణగా చూపించి.. వారిని ఆదర్శంగా తీసుకోమని ప్రోత్సహించాలి. ఇలా చేస్తే సమస్యలు చాలా తగ్గిపోతాయి. **- డాక్టర్ గర్రె శంకరరావు, సైకాలజిస్ట్**

బధిరులకు ఉచితంగా చరవాణులు

ఆన్‌లైన్‌లో దరఖాస్తుల ఆహ్వానం

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : బధిరులకు (మూగ, చెవిటి) టచ్ ఫోన్లను ఉచితంగా ఇవ్వనున్నట్లు విభిన్న ప్రతిభావంతుల శాఖ ఏడీ వి.కామరాజు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. 18 సంవత్సరాల వయసు కలిగి, ఇంటర్మీడియట్ ఉత్తీర్ణత చెంది, సైగల భాష వచ్చిన వారు, 40 శాతం ఆపైన వైకల్యం గలవారు అర్హులు. వీరి కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షల లోపు ఉండాలి. ఆసక్తి గలవారు www.apdascac.ap.gov.in వెబ్‌సైట్‌లో ఆన్‌లైన్ ద్వారా మాత్రమే దరఖాస్తు చేయాలని ఆయన సూచించారు. సదరం ధ్రువీకరణ పత్రం, ఆధార్ కార్డు, 10వ తరగతి, ఇంటర్ ఉత్తీర్ణత పత్రాలు, సైగల భాష ధ్రువీకరణ, ఎస్సీ, ఎస్టీ, బీసీలు కుల ధ్రువీకరణ పత్రాలు పంపాలి. పాస్‌పోర్టు సైజ్ ఫొటో, ఆదాయ ధ్రువీకరణ పత్రం, తెల్ల రేషన్ కార్డు నకళ్లు పంపాలని పేర్కొన్నారు.

కష్టాల వేళ.. కాపాడితిరి!

రాయితీపై దాణా, పశుగ్రాసం విత్తనాలు

పాడి రైతులకు కూటమి సర్కారు దన్నుగా నిలుస్తోంది. వైకాపా పాలనలో వారికి రాయితీలు, ప్రోత్సాహకాల ఊసే లేదు. కూటమి అధికారం చేపట్టింది మొదలు... కొత్త పథకాలు పట్టాలెక్కించింది. పశుగ్రాసం విత్తనాల మొదలు దాణా వరకు రాయితీలు అందిస్తోంది. వ్యాధుల కట్టడికి టీకాలతో రక్షణ కల్పిస్తోంది. పాడిపోషణకు అవుతున్న పెట్టుబడి మేరకు.. అందాల్సిన సాయంపై సర్వే నిర్వహిస్తోంది. – **ఈనాడు, అమరావతి**



నాగాయలంకలో పశుగ్రాసం విత్తనాలు పంపిణీ

అంశం	ఎన్టీఆర్	కృష్ణా
పాడి రైతులు	52,000	1,00,000
గేదెలు, దున్నలు	2,62,000	2,83,711
ఆవులు, ఎద్దులు	22,500	36,126
గొర్రెలు	2,75,000	2,19,736
మేకలు	60,000	53,764

రాయితీల పండగ.. పశుగ్రాసం కొరత అధిగమించేందుకు అభివృద్ధి కార్యక్రమాన్ని చేపట్టారు. గడ్డి కొరత ఉన్న ప్రాంతాలను గుర్తించి 95 టన్నుల విత్తనాలు అవసరమని నిర్ధారించారు. దీనికి హైబ్రిడ్ జొన్న రకం (సీఎస్‌హెచ్24 ఎంఎఫ్) విత్తనాలను 75 శాతం రాయితీతో ఇస్తున్నారు. 5 కిలోల ప్యాకెట్ విలువ రూ.92 కాగా.. రూ.23కే అవసరమైన ఒక్కో రైతుకు నాలుగు ప్యాకెట్లు ఇస్తున్నారు. ఇప్పటికే 5 వేల మందికి అందించారు. దాణా సరఫరాలోనూ 50 శాతం రాయితీ అందిస్తున్నారు. 50 కిలోల బస్తా అసలు ధర రూ.1,110 కాగా రూ.555లకే అందిస్తున్నారు. ఇప్పటికే 1,050 టన్నులు పంపిణీ చేశారు. మరో 500 టన్నులు పంపిణీకి సిద్ధం చేస్తున్నారు. రాయితీలతోపాటు వర్షాకాలం కావడంతో పశువులకు చర్మవ్యాధులు రాకుండా టీకాలు చేస్తున్నారు. ఇప్పటి వరకు 50 వేల వరకు టీకాలు వేశారు.
అభ్యున్నతికి సర్వే... పాడి పోషణలో ఇబ్బందులు, పెట్టుబడి కష్టాలు, సాంకేతిక పరిజ్ఞాన వినియోగం తెలుసుకునేందుకు ప్రస్తుతం సర్వే జరుగుతోంది. ఉమ్మడి జిల్లాలో ఉన్న పాడిరైతుల్లో 1,04,251 మందిని సర్వే చేస్తున్నారు. ఇప్పటి వరకు 74 వేల మంది వివరాలు సేకరించారు. రైతులకు సాయం చేసే వేళ సర్వే నివేదికను ప్రామాణికంగా పరిగణిస్తారు. ప్రస్తుతం ఇస్తున్న ప్రోత్సాహకాలతో పాటు.. గడ్డి కోత, పాలు తీసే యంత్రాలు, పాడి నిర్వహణలో శిక్షణ ఇచ్చి పాడి రైతును ఆదుకోవాలని సమాలోచన చేస్తున్నారు.

ఐటీఐ మూడో విడత కౌన్సెలింగ్‌కు దరఖాస్తులు

కరెన్సీనగర్, న్యూస్‌టుడే: ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి ఎన్టీఆర్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఐటీఐ కళాశాలల్లో రెండో విడత కౌన్సెలింగ్ అనంతరం మిగిలిన సీట్లకు మూడో విడత ప్రవేశాలకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు విజయవాడ ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రిన్సిపల్, కన్వీనర్ ఎం.కనకారావు ఒక ప్రకటనలో కోరారు. పది/ 8వ తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులు ఈ నెల 26వ తేదీలోగా దరఖాస్తు చేసుకొని సంబంధిత పత్రాలతో 27వ తేదీ ఉదయం 12 గంటల్లోపు ఆయా ఐటీఐ కళాశాలల్లో ధ్రువీకరణ పత్రాల పరిశీలన చేయించుకోవాలి. మూడో విడత కౌన్సెలింగ్ 29న జరుగుతుంది. ఇతర వివరాలు, సందేహాలకు 0866-2475575, 90906-39639, 77804-29468 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చని తెలిపారు.

బాలిక హత్య కేసులో నిందితుడికి జీవితఖైదు

గుంటూరు లీగల్ న్యూస్‌టుడే: మహిళ మీద కోపంతో ఆమె కుమార్తెను హతమార్చిన కేసులో నిందితుడు నరిమిద్ది నాగరాజుకు జీవితఖైదు, రూ.1,100 జరిమానా విధిస్తూ గుంటూరు జిల్లా ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి ఆర్.శరత్‌బాబు బుధవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తెలిపిన వివరాలిలా...ఎన్టీఆర్ జిల్లా కొండపల్లికి చెందిన నాగరాజుకు భార్యతో విభేదాలొచ్చి 2010లో విడిపోయాడు. గంజాయి, ఇతర వ్యసనాలకు బానిసైన అతను 2012లో రజని అనే మహిళతో సన్నిహితంగా ఉంటూ.. అనుమానంతో ఆమెను హత్య చేసినట్టు పోలీసులు కేసు నమోదు చేశారు. దీన్ని కోర్టు కొట్టేయడంతో చిలకలూరిపేట వచ్చేసి స్పిన్నింగ్ మిల్లులో పనికి చేరాడు. 2017లో చేబ్రోలు సమీపంలోని స్పిన్నింగ్ మిల్లుకు మారి.. కొత్తరెడ్డిపాలేనికి చెందిన ఓ వివాహితకు సన్నిహితమయ్యాడు. ఆ బంధాన్ని కొనసాగించేందుకు ఆమె నిరాకరించడంతో కక్ష పెట్టుకుని గతేడాది జులై 15న పాఠశాలకు వెళ్తున్న ఆమె కుమార్తె (13)ను తన ఇంటికి తీసుకెళ్లి తల్లికి ఫోన్ చేయమని చెప్పాడు. నంబరు తనకు తెలియదని బాలిక చెప్పడంతో కోపంతో శీతల పానీయంలో మత్తు మాత్రలు కలిపి ఇచ్చి గొంతు నులిమి హతమార్చి పరారయ్యాడు. అప్పట్లో ఈ హత్య జిల్లాలో సంచలనం సృష్టించింది. తెనాలి డీఎస్పీ బి.జనార్దన రావు ప్రత్యేకాధికారిగా కేసు దర్యాప్తు చేశారు. నిందితుడిని అరెస్టు చేసి కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ మోబీనాబేగం కేసు ప్రాసిక్యూషన్ నిర్వహించారు.

ఆయిల్‌పామ్ గెలల ధరపై హర్షం


మంత్రి అచ్చెన్నాయుడిని సత్కరిస్తున్న వీరరాఘవరావు తదితరులు

ఎన్టీఆర్ కలెక్టరేట్, న్యూస్‌టుడే : ఆయిల్‌పామ్ గెలలకు సంబంధించి తెలంగాణలో అమలులో ఉన్న నూనె దిగుబడి శాతాన్నే, ఏపీలోని రైతులకు వర్తింప చేసేలా కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు, వ్యవసాయ శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడికి రైతులు కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని జలవనరుల శాఖ ఆవరణ లోని విడిది కార్యాలయంలో మంత్రి అచ్చెన్నాయుడిని బుధవారం కలిసి సత్కరించారు. ఏపీ ఆయిల్ పామ్ రైతుల సంఘం అధ్యక్షుడు బొబ్బా వీరరాఘవరావు మాట్లాడుతూ.. తమ సమస్యలను ఇటీవల సీఎం, మంత్రికి తెలియజేయగా స్పందించినట్టు పేర్కొన్నారు. తెలంగాణ నూనె దిగుబడి శాతాన్ని ప్రామాణికంగా తీసుకుని 2023-24, 2024-25 సంవత్సరాలకు రాష్ట్రంలోని రైతులకు ఆయిల్ పామ్ గెలల ధర నిర్ణయించి ఇవ్వనున్నట్టు చెప్పారు. ఏపీలోని ఆయిల్ ఫెడ్ ఫ్యాక్టరీ పాతబడి పోవడంతో దిగుబడి శాతం తక్కువ చూపుతోందని, దీని వల్ల రైతులు నష్టపోతున్నట్టు తెలిపారు. నూతన ఫ్యాక్టరీ నిర్మాణం జరిగే వరకు తెలంగాణ దిగుబడి శాతాన్నే ప్రామాణికంగా తీసుకుని, భవిష్యత్తులోనూ ధరను నిర్ణయించాలని మంత్రిని కోరగా.. ఆయన సానుకూలంగా స్పందించారని వివరించారు. త్వరలో సీఎంను కలిసి విన్నవిస్తామన్నారు. విజయ డెయిరీ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే గంటా మురళీ, కె.ఆర్.జి.కృష్ణ, కొల్లి శ్రీను, ఎం.ధనకోటేశ్వరరావు, వి.శ్రీనివాసరెడ్డి, వై.దాసు, హరిప్రసాద్, పి.రామబ్రహ్మం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరు


విద్యాసాగర్, రమణలను సత్కరిస్తున్న ఏపీ ఎన్జీవో ఉద్యోగులు

విజయవాడ(గాంధీనగర్), న్యూస్‌టుడే : ఉద్యోగుల సమస్యలపై రాజీలేని పోరు సాగిస్తామని ఏపీ ఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు ఎ.విద్యాసాగర్ పేర్కొన్నారు. పీఆర్సీ నియామకం, పెండింగ్ డీఏలు, ఉద్యోగుల ఆరోగ్య సేవలపై ప్రభుత్వం దృష్టి పెట్టాలని కోరారు. ఇటీవల అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వాల ఉద్యోగుల సంఘానికి ఉపాధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన సందర్భంగా బుధవారం ఆయన్ని గాంధీనగర్‌లోని ఏపీ ఎన్జీవో భవన్‌లో జిల్లా, నగర కార్యవర్గ సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విద్యాసాగర్ మాట్లాడుతూ.. ఉపాధ్యక్షుడిగా ఎన్నిక కావడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. జాతీయ స్థాయిలో ఏపీ ఎన్జీవోకు దక్కిన గౌరవం.. రాష్ట్రంలో ప్రతి ప్రభుత్వం ఉద్యోగికి దక్కిన గౌరవంగా భావిస్తున్నట్లు చెప్పారు. సీపీఎస్ రద్దు, పీఆర్సీతో పాటు పలు సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో.. స్టాఫ్ కౌన్సిల్ సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, పీఆర్సీ కమిటీ ఏర్పాటు, ఆరోగ్య సేవల్లో ఎదురవుతున్న ఇబ్బందులపై చర్యలు తీసుకోవాలని కోరతామన్నారు. ప్రతి అంశాన్ని సమావేశంలో చర్చించి సామరస్యపూర్వక పరిష్కారం సాధిస్తామని ధీమావ్యక్తం చేశారు. విద్యాసాగర్‌తో పాటు జాతీయ కార్యవర్గ సభ్యుడిగా ఎన్నికైన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.ఎ.రమణలను ఉద్యోగులు ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అసోసియేట్ అధ్యక్షుడు వి.వి.ప్రసాద్, కార్యదర్శి పి.రమేష్, కోశాధికారి బి.సతీష్‌కుమార్, బి.వి.రమణ, సి.వి.ఆర్.ప్రసాద్, నజీరుద్దీన్, సి.హెచ్.మధుసూదనరావు, ఖాసీం సాహెబ్, శ్రీనివాసరావు, సాంబశివరావు, రాజ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

మునేరులో కొనసాగుతున్న వరద ఉద్ధృతి


పెనుగంచిప్రోలు వద్ద నీటి ప్రవాహం

పెనుగంచిప్రోలు, న్యూస్‌టుడే: ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గడిచిన రెండు రోజులుగా మునేరులో వరద ఉద్ధృతి కొనసాగుతోంది. పోలంపల్లి డ్యాం వద్ద 7.7 అడుగుల నీటిమట్టం ఉండగా, 5 వేల క్యూసెక్కుల వరద స్థిరంగా పారుతోంది. నదిలో వరద ఉద్ధృతంగా ఉండడంతో వత్సవాయి, పెనుగంచిప్రోలు మండలాల పోలీస్, రెవెన్యూ అధికారులు లింగాల, పెనుగంచిప్రోలు వంతెనల వద్ద ప్రత్యేక బందోబస్తు చర్యలు చేపట్టారు. పరివాహక గ్రామాల్లో ప్రజలు నదిలో దిగవద్దని హెచ్చరికలు చేస్తున్నారు.

కబడ్డీని ప్రోత్సహించడమే ఛాంపియన్‌షిప్ ఉద్దేశం


క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

విజయవాడ (క్రీడలు), న్యూస్‌టుడే: కబడ్డీ లీగ్‌కు ఆడే క్రీడాకారులకు ఇదో మంచి వేదికని రాష్ట్ర యువజన క్రీడల శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. పటమట చెన్నుపాటి రామకోటయ్య నగరపాలక సంస్థ ఇండోర్ స్టేడియంలో జరుగుతున్న 'యువ ఆంధ్రా ఛాంపియన్‌షిప్-2025' కబడ్డీ లీగ్ పోటీలను బుధవారం ఆయన ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ.. కబడ్డీ వంటి స్వదేశీ ఆటను ప్రోత్సహించడం, యువతలో ప్రతిభను వెలికితీయడం ఛాంపియన్‌షిప్ ప్రధాన ఉద్దేశమని చెప్పారు. బుధవారం రెండో రౌండ్ లీగ్ పోటీలు ముగిసే సరికి పూల్ 'ఎ'లో విజయనగరం నింజాస్ 28 పాయింట్లతో, పూల్ 'బి'లో అమరావతి క్రషర్స్ 36 పాయింట్లతో ముందంజలో ఉన్నాయి. టాప్ రైడర్‌గా చెక్కా నాగబాబు, టాప్ డిఫెండర్‌గా కరమల దినేష్ ఎంపికయ్యారు. బుధవారం జరిగిన లీగ్ పోటీల్లో వైజాగ్ కమెండోస్ జట్టు.. అమరావతి క్రషర్స్ జట్టుపై, విజయనగరం నింజాస్ జట్టు.. కృష్ణా డిఫెండర్స్ జట్టుపై, తిరుపతి రైడర్స్ జట్టు.. భీమవరం గార్డియన్స్ జట్టుపై, వైజాగ్ కమెండోస్ జట్టు.. కర్నూలు నైట్స్ జట్టుపై, అమరావతి క్రషర్స్ జట్టు.. కాకినాడ క్రాకర్స్ జట్టుపై విజయం సాధించాయి. ఉత్తమ క్రీడాకారులకు మంత్రి రాంప్రసాద్‌రెడ్డి నగదు బహుమతులు అందజేశారు.

ఎంబీబీఎస్, బీడీఎస్ యాజమాన్య సీట్ల తాత్కాలిక జాబితా విడుదల

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం: ప్రస్తుత (2025-26) విద్యా సంవత్సరానికి రాష్ట్రంలోని వైద్య, దంత వైద్య కళాశాలల్లో ఎంబీబీఎస్, బీడీఎస్ యాజమాన్య కోటా సీట్లకు విజయవాడ డాక్టర్ ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల తాత్కాలిక ప్రావీణ్య జాబితాను బుధవారం రాత్రి విడుదల చేశారు. అభ్యర్థులకు అభ్యంతరాలు ఉంటే ఆన్‌లైన్‌లో తెలియజేయాలని రిజిస్ట్రార్ రాధికారెడ్డి తెలిపారు.

ధర వరలు

వంకాయలు-20/18, టమాటా-44, బెండ-20, పచ్చిమిర్చి-30, కాకర-20, బీర-35, క్యాబేజీ-22, క్యారెట్-36/46, దొండ-16, బంగాళదుంప-28, ఉల్లిపాయలు-25, గోరు చిక్కుడు-26, దోస-18, సొర-13/15, పొట్ల-20, అరటికాయ-8/7, చామదుంప-26, అల్లం-50/90, మునగ-5/4, ఆకు కూరలు (కట్ట)-3/8, కంద-40, బీట్ రూట్-30, కీరదోస-36, బీన్స్-78, క్యాప్సికమ్-70 (నిన్నటివి). నగరంలోని రైతు బజార్లలో ఈ ధరలు (రూ.ల్లో) వర్తిస్తాయి. - ఎన్టీఆర్ కలెక్టరేట్, విజయవాడ

లాభాల సేద్యం.. అవగాహనతో సాధ్యం

వినూత్న పద్ధతిలో డ్రాగన్ ఫ్రూట్ సాగు

రైతేరాజు

హనుమాన్‌జంక్షన్, న్యూస్‌టుడే





బాపులపాడు మండలం వేలేరుకు చెందిన పాలడుగు రమేష్ డ్రాగన్ ఫ్రూట్ సాగు చేసి ఆశించిన ఆదాయం పొందుతున్నారు. మొదట్లో ఒడిదొడుకులు ఎదురైనా తట్టుకున్నారు. వినూత్న సాగు పద్ధతులతో లాభాల బాట పట్టారు. [illegible] ... స్ఫూర్తితో ఏడేళ్ల కిందట సేద్యంపై దృష్టి సారించిన రమేష్.. డ్రాగన్ పండించాలని నిర్ణయించుకున్నారు. వివిధ రాష్ట్రాల్లో ఆ పంట సాగు చేస్తున్న రైతులను కలిసి అవగాహన పెంచుకున్నారు. ఒకేసారి పూర్తి స్థాయిలో దిగకుండా.. కొద్దిపాటి భూమిలో ప్రయోగాత్మకంగా సాగు ఆరంభించారు. మూడేళ్లు వివిధ ప్రయోగాలు చేసిన అనంతరం నమ్మకం వచ్చిన తరువాత ఐదెకరాల్లో వివిధ రకాల డ్రాగన్ మొక్కలు నాటారు.

తగిన జాగ్రత్తలు తీసుకొని..

ఇతరుల కంటే ప్రత్యేకంగా సాగు చేయాలనే తలంపుతో రమేష్ సాధారణ రకాలు కాకుండా.. పసుపు రంగులో ఉండే ఈక్వెడార్ పలురా, ఇజ్రాయిల్ ఎల్లో తదితర మొక్కలు నాటారు. వాటి వలన సాగులో ఇబ్బందులు, నష్టాలు ఎదురైనా. . తట్టుకుని రెండేళ్లలోనే పెట్టుబడి వెనక్కి తీసుకోగలిగారు. అందరికీ ఎకరాకు రూ.6 లక్షల పెట్టుబడి అయితే.. ఆయన రూ.9 లక్షల వరకు వెచ్చించడం గమనార్హం. ప్రకృతి సేద్య విధానాన్ని అనుసరించడం, మొక్కల్ని రెండంచెల్లో (డబుల్ స్టెయిర్) ఎక్కువ ఎత్తు పెరిగేలా చేశారు. ఫలితంగా గాలి, వెలుతురు ధారాళంగా తగిలేలా జాగ్రత్త తీసుకున్నారు. ఎకరాకు దాదాపు 17 టన్నుల వరకు దిగుబడి సాధిస్తున్నారు. సాధారణ దిగుబడి కంటే ఇది 7 టన్నులు ఎక్కువని ఆయన చెబుతున్నారు. 60 శాతం వరకు ఫలాలను సొంతంగా మార్కెట్ చేసుకుంటున్నారు. కొత్త సాగుదారులకు మొక్కలు సరఫరా చేస్తూ అదనపు ఆదాయం పొందుతున్నారు. పూర్తి అవగాహన, నిరంతర పర్యవేక్షణ ద్వారా మిగతా పంటల కంటే డ్రాగన్ లాభదాయకమని రమేష్ అంటున్నారు.

ప్రశ్న: క్యాలీఫ్లవర్ పంటకు నేలలు, మధ్యకాలిక రకాలు విత్తే కాలం, అంతర కృషి గురించి తెలపండి?

– పి.శ్రీనివాస్, రైతు, రుద్రవరం



సమాధానం: క్యాలీఫ్లవర్ పంటకు చల్లని వాతావరణం అవసరం. మధ్యకాలిక రకాలకు విత్తే కాలం ఆగస్టు, సెప్టెంబరు అనుకూలం. భూమిలో తేమను బట్టి వారానికి ఒక్కసారైనా నీరు కట్టాలి. నాట్లు వేసిన 15 రోజుల్లో మొక్కలు బాగా నాటుకుంటాయి. తరువాత కలుపు తీసి, మట్టి ఎగదోయాలి. మధ్య దీర్ఘకాలిక రకాలకు విత్తే దూరం 60×45 సెం.మీ. సరైన విధంగా సాగు చేస్తే హెక్టారుకు దాదాపు 20 టన్నుల దిగుబడి పొందవచ్చు.

– వి. మంజువాణి, ఉద్యాన శాస్త్రవేత్త, కృషి విజ్ఞాన కేంద్రం,

- ఘంటసాల, న్యూస్‌టుడే

ముంపు పంటలను కాపాడుకుందాం

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే


చిలుకూరులో నీట మునిగిన వరి

అన్నదాతలు సాగు చేసిన పంటలు అధిక వర్షాలకు ముంపునకు గురవుతున్నాయి. నీట మునిగిన పంటలను దక్కించుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వ్యవసాయాధికారి వివరించారు.

వరి: వరి నాట్లు వేసిన పొలం నుంచి నీటిని తొలగించి ఆరనివ్వాలి. ముంపునకు గురైన పొలాల్లో సల్ఫైడ్ దుష్ప్రభావం కనిపించినట్లయితే. .. పొలానికి తగినంత గాలి తగిలేలా చేసి నెర్రలు వచ్చే వరకు ఆరనివ్వాలి. 25 నుంచి 30 రోజుల నారును ఆగస్టు చివరి వరకు వర్షాలు తగ్గిన తర్వాత నాటుకోవచ్చు.

పత్తి: పత్తి శాఖీయ దశ నుంచి పూత, పిందె, కాయ ఏర్పడే దశలో ఉంది. వర్షాలకు పత్తికి తెగుళ్లు ఆశించే ప్రమాదం ఉంది. తొలుత మురుగు నీటిని తొలగించి వర్షాలు తగ్గిన తర్వాత 10 గ్రాముల యూరియా లీటరు నీటికి కలిపి వారం వ్యవధిలో రెండు నుంచి మూడు సార్లు పిచికారీ చేసుకోవాలి. వర్షాలు తగ్గాక ఎకరాకు 25 కిలోల యూరియా, 20 కిలోల మ్యూరేట్ పొటాష్ పత్తి మొక్కకు 7 నుంచి 10 సెం.మీ. దూరంలో పడేలా వేసుకోవాలి.

మొక్కజొన్న : మొక్కజొన్న కాయ దశ నుంచి కంకి గింజ వృద్ధి చెందే దశలో ఉంది. చేలో నీరు నిల్వ ఉండడం వల్ల నేలలో భాస్వరం లోపం తరచూ కనిపిస్తుంది. మొక్కలు ఊదా రంగులోకి మారుతాయి. 20 గ్రా. డీఏపీ లీటరు నీటికి కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

అపరాలు: మినుము, పెసరలో అధిక వర్షాలకు పొగాకు లద్దెపురుగు ఆశించి పంటలకు నష్టం కలుగజేస్తుంది. పొలంలో నిల్వ నీటిని తొలగించి పది కిలోల తవుడు, కిలో బెల్లం, లీటరు క్లోరిఫైరిఫాస్ కలిపి మొక్కలపై పిచికారీ చేయాలి.

పసుపులో దుంపకుళ్లు తెగులు.. నివారణ



ఘంటసాల, చల్లపల్లి, న్యూస్‌టుడే: పసుపులో దుంపకుళ్లు తెగులు.. నివారణ చర్యల గురించి ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డి.సుధారాణి, ఉద్యాన శాస్త్రవేత్త వి.మంజువాణి తెలిపారు.

★ **సోకడానికి కారణాలు:** విత్తనశుద్ధి చేయని కొమ్ములను వాడడం. మురుగు నీటి పారుదల సౌకర్యం లేకపోవడం, అధిక వర్షాల వలన మొక్కల చుట్టూ నీరు నిల్వ ఉండడం, సమగ్ర ఎరువుల యాజమాన్యం పాటించకపోవడం, పొటాష్, వేప పిండి ఎరువులను సక్రమంగా వాడకపోవడం.

★ **లక్షణాలు:** ముదురు ఆకులు ముందుగా వాడిపోయి గోధుమ రంగులోకి మారి చివరగా ఎండిపోతాయి. తరువాత మొక్క పైభాగాన ఉన్న లేత ఆకులకు వ్యాపిస్తుంది. కాండంపై మచ్చలు ఏర్పడి మెత్తగా మారుతుంది. కొమ్ములు, పిల్ల దుంపలు కుళ్లి మెత్తగా మారి దుర్వాసన వస్తాయి.

★ **యాజమాన్యం:** తెగులు నివారణకు సమగ్ర యాజమాన్య పద్ధతులు పాటించాలి. ఎత్తయిన మడులు, బిందు సేద్యం, సస్యరక్షణ చర్యల ద్వారా నియంత్రించవచ్చు. తెగులు సోకని ఆరోగ్యవంతమైన విత్తనాన్ని నాటడం. దుంపలకు విత్తనశుద్ధి చేయడం, బిందు సేద్యం ద్వారా నీటిని అందించడం వలన దుంపలు బాగా ఊరతాయి. తెగులు సోకే అవకాశం తగ్గుతుంది. సేంద్రియ ఎరువులు అధికంగా వాడడం ద్వారా నేల ఆరోగ్యం మెరుగు పడి తెగుళ్లను తట్టుకునే శక్తి పెరుగుతుంది.

వయసు 30..చోరీలు 20..

నిందితుడి అరెస్టు.. సొత్తు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ దామోదర్, పక్కన సీఐ పవన్ కిషోర్ తదితరులు

పటమట, న్యూస్‌టుడే: సుమారు 20 కేసుల్లో నిందితుడిని పోలీసులు బుధవారం అరెస్టు చేశారు. ఆ వివరాలను బుధవారం పటమట స్టేషన్‌లో ఏసీపీ దామోదర్, సీఐ పవన్ కిషోర్ మీడియాకు వెల్లడించారు. గుంటూరు అడవితక్కెళ్లపాడులోని స్వర్ణభారతి నగర్‌కు చెందిన ఉప్పల సురేష్(30) ఆటో డ్రైవర్. ప్రేమ వివాహం చేసుకున్నాడు. వారికి కుమార్తె ఉంది. చెడు వ్యసనాలకు అలవాటు పడ్డాడు. పెళ్లి అయినా అమ్మాయిలతో తిరుగుతాడు. అందుకు కావాల్సిన డబ్బు కోసం దొంగతనాలు చేయడం ప్రారంభించాడు. గత నెల 31న హైదరాబాద్‌లో ద్విచక్ర వాహనం చోరీ చేశాడు. దానిపై విజయవాడ వచ్చి ఈ నెల 1న అశోక్‌నగర్‌లోని ఓ ఇంట్లో చొరబడ్డాడు. బీరువాలోని 130 గ్రా. బంగారు ఆభరణాలు, 2.5 కిలోల వెండి వస్తువులు దొంగిలించాడు. అదే ద్విచక్రవాహనంపై హైదరాబాద్ వెళ్లాడు. అక్కడ వాహనాన్ని వదిలేసి తిరిగి అడవితక్కెళ్లపాడు వచ్చాడు. బాధితుడు బైసాని జనార్దన్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. బుధవారం నిందితుడిని అరెస్ట్ చేశారు. పటమట, గుంటూరులోని పట్టాభిపురం, పల్నాడు జిల్లా వినుకొండ పోలీస్ స్టేషన్ల పరిధుల్లో చోరీ చేసిన సుమారు రూ.15 లక్షల విలువ చేసే 270 గ్రా. బంగారం, 3 కిలోల వెండి స్వాధీనం చేసుకున్నారు. సురేష్‌పై తుని, అనకాపల్లి, వినుకొండ, నల్గొండ ప్రాంతాల్లోనూ దొంగతనం కేసులు ఉన్నాయి. నిందితుడిని పట్టుకున్న పోలీసులను ఏసీపీ అభినందించారు.

పని మనిషే దొంగ..

తాను పని చేస్తున్న ఇంటికి కన్నం వేసి దాదాపు రూ.13.8 లక్షల విలువైన బంగారు, వజ్రాభరణాలను అపహరించిన కిలేడీని మరో కేసులో అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. శ్రీనివాసనగర్‌లో నివసించే అడుసుమిల్లి శివలీల ఇంట్లో కనకదుర్గ గెజిటెడ్ ఆఫీసర్స్ కాలనీకి చెందిన తేజశ్రీ పని మనిషిగా పనిచేస్తోంది. ఈ నెల 6న బ్యాగులో ఉంచిన బంగారు ఆభరణాలు కనిపించలేదు. బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పటమట పోలీసులు తేజశ్రీ చోరీకి పాల్పడినట్లు గుర్తించి బుధవారం అరెస్ట్ చేశారు. ఆమె నుంచి బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు.

నకిలీ పట్టాల వ్యవహారం.. గాలికొదిలేశారు...!

● ఆధారాలున్నా పట్టించుకోక.. విచారణ పేరుతో జాప్యం

● అధికారుల తీరుపై.. హైకోర్టులో దాఖలైన పిటిషన్

ఈనాడు డిజిటల్ – మచిలీపట్నం

కృష్ణా జిల్లా మచిలీపట్నంలో ఎన్నికల ముందు వైకాపా నేత పేర్ని నాని, ఆయన కుమారుడు పేర్ని కిట్టు పంపిణీ చేసిన నకిలీ ఇళ్ల పట్టాల వ్యవహారం నిగ్గు తేల్చడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారు. ఆధారాలన్నీ ఉన్నా.. నకిలీ పట్టాల విషయంలో కేసు నమోదు చేయడం లేదనీ, బాధ్యులపై చర్యలు తీసుకోవడంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని.. మచిలీపట్నానికి చెందిన తెదేపా కార్యకర్త ఐ.దిలీప్‌కుమార్ తాజాగా హైకోర్టులో పిటిషన్ వేశారు. ఈ పిటిషన్ హైకోర్టులో బుధవారం విచారణకు వచ్చింది. దీనిపై మూడు వారాల్లోగా కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా యంత్రాంగాన్ని కోర్టు ఆదేశించింది.

మచిలీపట్నంలో పేర్ని నాని, అతని కుమారుడు, వైకాపా నాయకులు కలిసి నకిలీ పట్టాలను రహదారుల పక్కన పంపిణీ చేసిన సమయంలో ఉన్న అధికారులే చాలామంది ఇప్పటికీ కొనసాగుతున్నారు. గతంలో ఎన్నికల ముందు ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చిన సమయంలో.. ఆ పట్టాలకు ఇదే అధికారులు అప్పట్లో వత్తాసు పలికారు. కేవలం ఒక డిప్యూటీ తహసీల్దార్‌ను బదిలీ చేసి, వీఆర్వోను సస్పెండ్ చేసి చేతులు దులిపేసుకున్నారు. అప్పటి నుంచి ఇప్పటి వరకు ఈ వ్యవహారంలో ఎలాంటి చర్యలు లేవు. ఆ పట్టాలు నకిలీవేనని గుర్తించామనీ, కానీ.. దీనిపై పూర్తి స్థాయిలో ఇంకా విచారణ చేస్తున్నామని.. కలెక్టర్ నుంచి జేసీ సహా అధికారులంతా కొన్ని నెలలుగా చెబుతూ వస్తున్నారు. ఆ పట్టాలు నకిలీవి కావడంతో అప్పటి తహసీల్దార్ సునీల్‌బాబు, డిప్యూటీ తహసీల్దార్‌పై చర్యలు తీసుకోవాలని సీసీఎల్‌ఏకి రాశామని పేర్కొంటున్నారు. నకిలీ పట్టాల వ్యవహారంలో.. అన్ని ఆధారాలు ఉండడంతో క్రిమినల్ కేసులు నమోదు చేయాల్సి ఉన్నా పోలీసులకు కూడా ఇంత వరకూ ఫిర్యాదు చేయకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

బంకులో రూ.10 లక్షల గల్లంతు

కో-ఆపరేటివ్ సొసైటీ బంకు, స్టోర్స్ నిర్వహణపై ఆరోపణలు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: వీటీపీఎస్ ఆఫీసర్స్, కంజ్యూమర్స్ కో-ఆపరేటివ్ పెట్రోల్ బంకులో నిధుల గోల్‌మాల్ విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల మేరకు ఆ బంకులో విధులు నిర్వహిస్తున్న గోపాలకృష్ణ కొంత కాలంగా కనిపించడం లేదని అతని భార్య టి.రాజ్యలక్ష్మి ఈ నెల 12వ తేదీన పోలీసులకు ఫిర్యాదు చేశారు. అయితే అదే గోపాలకృష్ణ బంకుకు చెందిన రూ.10లక్షలు తీసుకొని బ్యాంకులో జమ చేయకుండా వెళ్లిపోయాడంటూ కో-ఆపరేటివ్ పాలకవర్గ సభ్యులు ఈనెల 16న పోలీసులకు ఫిర్యాదు చేశారు. బంకులో ఒక రోజు జరిగిన లావాదేవీల నగదును నిత్యం బ్యాంకులో ఒక ఉద్యోగి జమచేస్తారు. ఇలా జమ చేసే క్రమంలో ఈ నెల 7వ తేదీన గోపాలకృష్ణ రూ.10 లక్షలు తీసుకొని బ్యాంకుకు వెళ్లినా జమచేయలేదు. అయినా ఈ విషయం ఆ రోజు బయటకు రాలేదు. ఇదిలా ఉంటే జిల్లా రిజిస్ట్రార్ ఆధ్వర్యంలో స్టోర్స్, బంకుకు సంబంధించిన ఆడిట్ జరిపించాలని కో-ఆపరేటివ్ పాలక వర్గంలోని కొందరు డైరెక్టర్లు జిల్లా రిజిస్ట్రార్‌ను కోరారు. మరి కొన్ని రోజుల్లో ఈ ఆడిట్ ప్రారంభం కానుండగా ఇలా అదృశ్యం, నగదు గోల్‌మాల్ విషయాలపై పోలీసులకు ఫిర్యాదు చేయడం చర్చనీయాంశమైంది. ఇరుపక్షాల ఫిర్యాదుల మేరకు కేసులు నమోదు చేయనున్నట్లు సీఐ చంద్రశేఖర్ తెలిపారు. గతంలో అనేక మార్లు ఈ పెట్రోల్ బంకు, స్టోర్స్‌లో అవకతవకలు చోటుచేసుకున్నాయి. మళ్లీ ఏర్పటిన నూతన పాలకవర్గ సమావేశంలో అవకతవకలు చర్చకు రావడంతో రూ.10 లక్షల గల్లంతు విషయం వెలుగులోకి వచ్చింది.

బ్రాయిలర్ ధరలు (కిలో 1కి రూ.లలో)

నెక్‌కాబ్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర -114 రిటైల్ ధర 136 చికెన్ విత్ స్కిన్ - 197, చికెన్ స్కిన్‌లెస్ - 224.

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్: బ్రాయిలర్ ఫారం లిఫ్టింగ్ ధర - 117, 125, 136 చికెన్ విత్ స్కిన్ - 222 చికెన్ స్కిన్‌లెస్ - 232.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

ఈరోజు నెక్ విజయవాడ జోన్ సూచించే ప్లాస్టిక్ ట్రే ఫారం- గేటు గుడ్డు ధర 100 గుడ్లకు రూ. 525 (వాణిజ్యం & పరిశ్రమల సమాచారం కోసం) ★ నెక్ విజయవాడ. ఈరోజు ఫారం కోడి ధర కిలో రూ.99/-.

తల్లిని చంపిన తనయుడు

మద్యం తాగొద్దన్నందుకు రోకలి బండతో దాడి

మైలవరం, న్యూస్‌టుడే: కష్టపడి ఎంతో కొంత సంపాదించుకున్నాడు... మద్యానికి బానిసై అనారోగ్యం పాలయ్యాడు. కుమారుడిని అలా చూడలేక ఆ తల్లితో పాటు కుటుంబమంతా ఎలాగోలా తంటాలు పడి రూ.15 లక్షలు ఖర్చుపెట్టి ఆరోగ్యం కుదురుకునేలా చేశారు. కోలుకున్నాక నాలుగు నెలల పాటు మద్యానికి దూరంగా ఉన్న అతను ఇటీవల మళ్లీ మద్యం బాట పట్టాడు. మందు తాగొద్దని చేతిలో డబ్బు లాక్కున్న తల్లిని క్షణికావేశంలో హతమార్చాడు. కలకలం రేపిన ఘటన ఎన్టీఆర్ జిల్లా మైలవరం మండలంలోని పుల్లూరు శివారు బాడవలో బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై కె.సుధాకర్ తెలిపిన, సేకరించిన వివరాల ప్రకారం.. బాడవకు చెందిన గన్నెపూడి రవి కూరగాయల మార్కెట్‌లో పనిచేస్తుంటాడు..బుధవారం మద్యం తాగేందుకు ఇంట్లో డబ్బులు తీసుకెళ్తుండగా అసలే అనారోగ్యానికి గురయ్యావని అతని చేతిలోని డబ్బుల్ని తల్లి మహాలక్ష్మి (54) లాక్కుంది. దాంతో పక్కనే ఉన్న రోకలిబండ తీసుకుని ఆమె తలపై బలంగా కొట్టడంతో తీవ్ర గాయాలతో పడిపోయింది. బంధువులు చికిత్స నిమిత్తం మైలవరం తరలిస్తుండగానే మరణించినట్లు గుర్తించి, ఇంటికి తీసుకెళ్లారు. సమాచారం అందుకున్న ఎస్సై కె.సుధాకర్, సిబ్బందితో అక్కడికి వెళ్లి విచారించారు. సీఐ చంద్రశేఖర్ సంఘటనా స్థలాన్ని పరిశీలించిన అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతురాలి భర్త సత్యనారాయణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేస్తున్నట్లు తెలిపారు.

మాదకద్రవ్యాలు విక్రయిస్తున్న ఇద్దరి అరెస్ట్

రూ.7 లక్షల విలువైన డ్రగ్స్ పౌడర్ స్వాధీనం


నిందితుల వివరాలు వెల్లడిస్తున్న సీఐ శ్రీనివాస్‌రెడ్డి. చిత్రంలో ఎస్సైలు విజయ, వెంకట్‌రాములు

హైదరాబాద్, న్యూస్‌టుడే: మాదకద్రవ్యాలను విక్రయిస్తున్న ఇద్దరు పాత నేరస్థులను హైదరాబాద్‌లోని దోమలగూడ పోలీసులు, నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బృందం సభ్యులు అదుపులోకి తీసుకున్నారు. ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి వివరాల ప్రకారం... విజయవాడలోని ఆటోనగర్‌కు చెందిన రాఘవేంద్రరావు(27) డిప్లొమా పూర్తి చేశాడు. అనంతరం మెడికల్ షాపు నిర్వహించగా.. వ్యాపారంలో నష్టాలు రావడంతో దుకాణాన్ని మూసివేశాడు. నష్టాల నుంచి కోలుకోవడానికి గంజాయిని విక్రయించడం ప్రారంభించాడు. ఏపీలోని సీలేరు నుంచి తక్కువ ధరకు సరకు సేకరించి నూజివీడులో ఎక్కువ మొత్తానికి అమ్మడం ప్రారంభించాడు. ఆంధ్రప్రదేశ్‌లోని వివిధ ఠాణాల్లో అతడిపై 5 కేసులు ఉన్నాయి. మరోవైపు, బీటెక్ పూర్తిచేసిన బెంగళూరుకు చెందిన పాత నేరస్థుడు నిఖిల్(19) ఇన్‌స్టాగ్రామ్‌లో రాఘవేంద్రరావుకు పరిచయమయ్యాడు. నైజీరియన్ సరఫరాదారులతో సేకరించిన డ్రగ్స్ పౌడర్(ఎండీఎంఏ)ను ఇద్దరూ కలిసి హైదరాబాద్‌లో అధిక ధరకు విక్రయించసాగారు. విశ్వసనీయ సమాచారంతో బుధవారం ఇందిరాపార్కు వద్ద వీరిని అదుపులోకి తీసుకొని రూ.7 లక్షల విలువైన 12 గ్రాముల ఎండీఎంఏ పౌడర్‌ను, 300 గ్రాముల గంజాయిని, 3 చరవాణులతో పాటు రూ.1000 నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించామని వెల్లడించారు. నార్కోటిక్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై వెంకట్‌రాములు, ఎస్సై విజయ తదితరులు పాల్గొన్నారు.

తిరువూరు

• తిరువూరు • మైలవరం

నైపుణ్యాలకు పోటీలే గీటురాయి


విజేతలతో కరస్పాండెంట్ మల్లిగార్జునన్

మైలవరం, న్యూస్‌టుడే: పోటీల్లో ప్రదర్శించే ప్రతిభ ఆధారంగా నైపుణ్యాలను, విజ్ఞానాన్ని సంపాదించుకోవచ్చని స్థానిక సెయింట్ మేరీస్ పాఠశాల కరస్పాండెంట్ మల్లిగార్జునన్ పేర్కొన్నారు. 'ఈనాడు' ప్రతిభా పాటవ పోటీల్లో భాగంగా బుధవారం ఆ పాఠశాలలో 'చంద్రయాన్ నుంచి ఏఐ వరకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశ ప్రయాణం' అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పోటీల్లో పాల్గొన్న ఎస్కే సఫియా(9వ) పి.మీనాక్షి దేవి(10వ) హేమ నాగశ్రీ 8వ తరగతి విద్యార్థినులు మొదటి మూడు స్థానాలు సాధించారు. విజేతలకు కరస్పాండెంట్, ప్రిన్సిపల్ ఆర్.మధు, సిబ్బంది ఎం.చిరంజీవి పాల్గొని, బహుమతులు అందజేసి అభినందించారు.

ప్రతిభ చాటారు


విద్యార్థులతో కరస్పాండెంట్ వైవి నరసింహారావు తదితరులు

విస్సన్నపేట, న్యూస్‌టుడే : స్థానిక లిటిల్ స్టార్ స్కూల్లో ఈనాడు ఆధ్వర్యంలో బుధవారం ప్రతిభా పాటవ పోటీలు నిర్వహించారు. 'చంద్రయాన్ నుంచి ఏఐ వరకు శాస్త్ర సాంకేతిక రంగాల్లో భారతదేశ ప్రయాణం' అనే అంశంపై వ్యాస రచన పోటీలు ఏర్పాటు చేయగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పీవీఎన్ మణికంఠ(9వ), వి.నాగసాయి మల్లయ్య స్వామి(10వ) డి.ప్రభుకుమార్ 9వ తరగతి విద్యార్థులు మొదటి మూడు స్థానాలు సాధించారు. విజేతలకు కరస్పాండెంట్ వైవి.నరసింహారావు, ప్రిన్సిపల్ కె.సరోజకుమారి బహుమతులు అందజేశారు.

లోతట్టు ప్రాంతాల వారు పునరావాసాలకు వెళ్లాలి

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: కృష్ణా వరద నేపథ్యంలో లోతట్టు ప్రాంతాల వారు పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని తహసీల్దారు వెంకటేశ్వర్లు సూచించారు. ఫెర్రీ, సంగమ ఘాట్లు, పునరావాస కేంద్రాలను రెవెన్యూ సిబ్బంది, పోలీసులతో కలిసి బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఫెర్రీ వాసులతో మాట్లాడుతూ.. రెవెన్యూ సిబ్బంది అనుక్షణం అందుబాటులో ఉంటారని.. అధికారుల సూచనలను పాటించాలన్నారు. పునరావాస కేంద్రాల్లో అన్ని వసతులు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో సీఐ చంద్రశేఖర్, వీఆర్‌వోలు పాల్గొన్నారు.

సాగు తగ్గుతోంది..

మిరప పండించేందుకు వెనకడుగు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే

జిల్లాలో మెట్ట ప్రాంతమైన తిరువూరు నియోజకవర్గంలో మిరప సాగు ముమ్మరంగా సాగుతోంది. గతేడాది పండించిన పంటకు ధర ఆశాజనకంగా లేకపోవడం, విదేశాలకు మిరప ఎగుమతులు మందకొడిగా ఉండడం, ఇప్పటికే శీతల గిడ్డంగుల్లో గతేడాది పంట లక్షల టిక్కీలు నిల్వ ఉండడంతో ఈ ఏడాది సాగు విస్తీర్ణం తగ్గుతుందని ఉద్యానాధికారులు అంచనా వేస్తున్నారు. గతేడాది మిరప సాగు చేసిన రైతులు పెట్టుబడి మేరకు ధర లభించడంలేదన్న కారణంగా ఇప్పుడు పత్తి సాగు చేపట్టారు. ఎర్ర బంగారంగా పిలుచుకునే మిరపకు ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉంటాయన్న కొండంత ఆశతో సాగుదారులు ఉన్నారు.

ఇప్పటికీ శీతల గిడ్డంగుల్లోనే

జిల్లాలో మిరప సాధారణ విస్తీర్ణం 40వేల ఎకరాలకు ఉంది. అందులో మూడో వంతు విస్తీర్ణం తిరువూరు నియోజకవర్గంలో ఉంది.


గాదెవారిగూడెంలో మిరప మొక్కలు నాటుతున్న కూలీలు

జిల్లా మొత్తం విస్తీర్ణంలో ఐదో వంతు గంపలగూడెం మండలంలో సాగు చేస్తారు. గతంలో పోలిస్తే ఈ ఏడాది మిరప మొక్క ధర కూడా రైతులకు అనుకూలంగానే ఉంది. నర్సరీల్లో కొనుగోలు చేస్తే ఒక్కో మొక్క రూ.1 ఉంది.

నియోజకవర్గంలో మిరప సాగు (ఎకరాల్లో)

మండలం	సాధారణం	అంచనా	సాగైంది
గంపలగూడెం	8500	5700	3200
తిరువూరు	1650	1100	330
ఎ.కొండూరు	3200	1500	210
విస్సన్నపేట	250	100	30

రైతులు విత్తనాలు ఇచ్చి నర్సరీల్లో పెంచుకుంటే మొక్క 50పైసలకు లభిస్తోంది. ఎకరాకు 15 వేలకు పైగా మిరప మొక్కలు అవసరం ఉంటాయి. ఏటా దిగుబడియైన పంటను చైనా, బంగ్లాదేశ్ దేశాలకు ఎగుమతి చేస్తారు. గత ఖరీఫ్‌లో పండించిన పంట ఎగుమతులు లేక ఇప్పటికి గుంటూరు, ఖమ్మం, మధిర, నందిగామ తదితర ప్రాంతాల్లోని శీతల గిడ్డంగుల్లోనే నిల్వ ఉంది.

ఎగుమతులు నిలిచిపోవడంతో



మిరప ధర తగ్గడం, ఎగుమతులు నిలిచిపోవడంతో సాగుదారులు ప్రత్యామ్నాయంగా పత్తి, సుబాబుల్, జామాయిల్, ఆయిల్‌పామ్ పంటలు సాగుచేస్తున్నారు. గతేడాది పోలిస్తే ప్రస్తుత ఖరీఫ్‌లో నాలుగైదు వేల ఎకరాల్లో సాగు విస్తీర్ణం తగ్గే అవకాశం ఉంది. ప్రస్తుతం మిరప మొక్కలు నాటేందుకు వాతావరణం అనుకూలంగా ఉంది. ఎరువులు, పురుగు మందులు వాడకంలో రైతులు నియంత్రణ పాటించాలి. సమగ్ర సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులు పాటిస్తూ పెట్టుబడి వ్యయం తగ్గించుకుని, విపణి ధర ఆశించినట్లు ఉంటే మిరప సాగు లాభదాయకమే. **- ఎస్‌కే.సోహైల్‌అహ్మద్, గంపలగూడెం, తిరువూరు మండలాల ఉద్యానాధికారి**

సంక్షేమం..అభివృద్ధి దిశగా పాలన


చెవుటూరులో త్రిసభ్య కమిటీని సత్కరిస్తున్న ఎమ్మెల్యే కృష్ణప్రసాద్

జి.కొండూరు, న్యూస్‌టుడే: దెబ్బతిన్న ఆర్థిక వ్యవస్థను గాడిన పెడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చంద్రబాబు నాయకత్వంలో ప్రభుత్వం నడుస్తోందని మైలవరం ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ అన్నారు. చెవుటూరు సొసైటీ త్రిసభ్య కమిటీ బాధ్యతల స్వీకరణ మహోత్సవానికి బుధవారం ఆయన హాజరై మాట్లాడారు. రైతులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా సేవలు అందించాలని సూచించారు. సొసైటీ అధ్యక్షుడు ఈమని మురళీకృష్ణ, సభ్యులు ప్రత్తిపాటి యేసయ్య, కేలా వెంకట నారాయణను ఆయన సన్మానించి అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు ఉయ్యూరు వెంకటనరసింహారావు, వెంకటనారాయణ, ఆదాం తదితరులు పాల్గొన్నారు.

మేమున్నాం.. మీకు తోడుగా.. 10 AM to 1 PM

తిరువూరు: 98853 28820 మైలవరం: 80085 74705

? కొండపల్లి పొట్టి శ్రీరాములు మార్కెట్ బొడ్డు రాయి కూడలి వద్ద ఉంటున్న ఆవులు, కుక్కలు ప్రజలను ఇబ్బందులు పెడుతున్నాయి. **- కోటేశ్వరరావు, కొండపల్లి**

✔ ఆవుల యజమానులకు హెచ్చరిక చేశాం. వాటిని ప్రత్యేకంగా మేపుకోవాలని సూచించాం. రహదార్లపైకి ఆవులను వదిలేసిన వారిపై చర్యలు తీసుకుంటాం. **- శ్రీను, పారిశుధ్య మేస్త్రీ – న్యూస్‌టుడే, కొండపల్లి**

స్పందనకు వందనం

◆ వెల్లటూరు సచివాలయం, కృష్ణా వాటర్ ట్యాంకు సమీపంలో వీధి దీపాలు వెలగకపోవడంతో రాత్రుళ్లు అవస్థలు పడుతున్నామని స్థానికులు తెలిపిన సమస్యను ఈ నెల 3వ తేదీన 'మేమున్నాం మీకు తోడుగా' శీర్షికన ప్రచురించగా కార్యదర్శి మురళీ స్పందించారు. సిబ్బందిని పంపి వీధి దీపాలకు మరమ్మతులు చేయించారు. సమస్య పరిష్కారం కావడంతో గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు. **- న్యూస్‌టుడే, జి.కొండూరు**



◆ స్థానిక పంచాయతీలోని రాఘవాపురం గ్రామంలో డ్రెయినేజీల్లో గడ్డి, పూడిక పేరుకుపోయి మురుగు పారుదల సక్రమంగా జరగడంలేదని స్థానికులు మేమున్నాం..మీకు తోడుగాకు తెలిపిన సమస్యను పంచాయతీ కార్యదర్శి ఎస్.రామారావుకు దృష్టికి తీసుకెళ్లగా స్పందించారు. బుధవారం పంచాయతీ సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, రెడ్డిగూడెం**

◆ గొల్లపూడి రామరాజ్యనగర్ ప్రాంతంలో వీధి దీపాలు సరిగా వెలగడం లేదని పంచాయతీ అధికారులకు తెలుపగా సిబ్బందిని పంపి మరమ్మతులు చేయించారు. ◆ సాయిపురంకాలనీలో పారిశుద్ధ్య సమస్య ఎక్కువగా ఉందని సిబ్బంది రావడం లేదని పంచాయతీ అధికారులకు తెలుపగా సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **-న్యూస్‌టుడే, గొల్లపూడి** ◆ పట్టణంలోని పాత తిరువూరులో పిచ్చి మొక్కలు పెరిగి దారిపైకి వస్తున్నాయని స్థానికుడైన ఎ.బాల వీరాంజనేయులు ఫిర్యాదు చేయగా శానిటరీ అధికారి సంతోష్ స్పందించారు. సిబ్బందిని పంపి శుభ్రం చేయించారు. **- న్యూస్‌టుడే, తిరువూరు టౌన్**

హుండీ ఆదాయం రూ.4.12 లక్షలు

మైలవరం, న్యూస్‌టుడే: మండలంలోని బొర్రగూడెంలో గల ప్రసిద్ధ తిరుపతమ్మ, గోపయ్యస్వామి ఆలయంలోని హుండీల కానుకల లెక్కింపును బుధవారం దేవాదాయశాఖ అధికారుల ఆధ్వర్యంలో నిర్వహించారు. 4 నెలల 25 రోజులకు సంబంధించి రూ.4,12,154 ఆదాయం సమకూరినట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎం.తేజ తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

జి.కొండూరు: స్థానిక సామాజిక భవనంలో మండల వ్యాప్తంగా 37 మంది లబ్ధిదారులకు సీఎం సహాయనిధి చెక్కులను ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్ బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయనిధి పంపిణీలో మైలవరం నియోజకవర్గం ముందంజలో ఉందన్నారు.

తెలుగు ఉపాధ్యాయుడికి పురస్కారం

జి.కొండూరు, న్యూస్‌టుడే: గంగినేని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తెలుగు ఉపాధ్యాయుడిగా సేవలందిస్తున్న డాక్టర్ పెదగమళ్ల నాగరాజును గిడుగు రామమూర్తి పురస్కారం వరించింది. తెలుగు భాషకు ఆయన అందిస్తున్న సేవలను గుర్తించి తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ ఆంధ్రప్రదేశ్ వారు ఈ అవార్డును మంగళవారం రాత్రి విజయవాడలో అందజేశారు.

చవితి వేడుకలకు 9 రోజులే అనుమతి


సమీక్ష సమావేశంలో ఏసీపీ ప్రసాదరావు, సీఐ గిరిబాబు, ఎస్సైలు, పీఎస్సైలు

గంపలగూడెం, తిరువూరు, న్యూస్‌టుడే: ఈ ఏడాది వినాయక చవితి వేడుకలకు 9 రోజులే అనుమతిస్తామని మైలవరం ఏసీపీ వై.ప్రసాదరావు స్పష్టం చేశారు. ఉత్సవ కమిటీలు కూడా ముందస్తుగా పోలీస్‌స్టేషన్‌లో గణపతి నవరాత్రుల వివరాలను తెలియజేయాలన్నారు. తిరువూరులో బుధవారం జరిగిన సబ్‌డివిజన్ స్థాయి నేర సమీక్ష సమావేశంలో (క్రైమ్ మీటింగ్) ఆయన పాల్గొని మాట్లాడారు. సబ్‌డివిజన్‌లో గంజాయి రవాణా, విక్రయాలకు పాల్పడే వారిపై గట్టి నిఘా ఏర్పాటు చేయాలని ఎస్సైలను ఆదేశించారు. చోరీలు జరగకుండా రాత్రి గస్తీ నిర్వహించాలన్నారు. రౌడీషీటర్లపై నిఘా ఉంచాలని, ప్రతి ఆదివారం పోలీస్‌స్టేషన్‌లో నిర్వహించే కౌన్సెలింగ్‌కు వారంతా కచ్చితంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిరువూరు సీఐ కె.గిరిబాబు, సబ్‌డివిజన్‌లో ఎస్సైలు, ట్రైనీ ఎస్సైలు పాల్గొన్నారు.



కానిస్టేబుల్ అభ్యర్థులకు సత్కారం

మునుకుళ్ల(తిరువూరు), న్యూస్‌టుడే: మండలంలోని మునుకుళ్ల జడ్పీ ఉన్నత పాఠశాలలో అభ్యసించి కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన పూర్వ విద్యార్థులు డి.నాగేశ్వరరావు, వి.రవితేజను ప్రధానోపాధ్యాయుడు జె.మురళీకృష్ణ ఆధ్వర్యంలో బుధవారం ఉపాధ్యాయులు సత్కరించి అభినందించారు. ఉద్యోగ బాధ్యతలను క్రమశిక్షణతో నిర్వహించి ఊరికి, బడికి మంచి పేరు తీసుకురావాలని సూచించారు.

పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరి


చెవుటూరులో రైతులకు సూచనలిస్తున్న శాస్త్రవేత్తలు

జి.కొండూరు, న్యూస్‌టుడే: పత్తి పంటలో సస్యరక్షణ చర్యలు తప్పనిసరిగా తీసుకోవాలని గుంటూరు లాం ఫారం శాస్త్రవేత్తలు రైతులకు సూచించారు. మండలంలోని చెవుటూరు, వెంకటాపురం గ్రామాల్లోని పత్తి పంటను బుధవారం స్థానిక రైతులతో కలిసి పరిశీలించారు. పత్తిలో కొమ్మ పుచ్చు, రసం పీల్చే పురుగు, గులాబీ రంగు పురుగు నివారణకు తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు రాజమణి, మనోజ్‌కుమార్, రాజేష్, మైలవరం ఏడీఏ ఎం.శ్రీనివాసరావు, ఏవో సూరిబాబు, మైలవరం ఏవో సంధ్యారాణి పాల్గొన్నారు.

తిరువూరు న్యూస్‌టుడే: గుంటూరు లాంఫారం శాస్త్రవేత్తలు నియోజకవర్గంలోని ఎ.కొండూరు, తిరువూరు, గంపలగూడెం మండలాల్లో ఇటీవల కురిసిన వానలకు దెబ్బతిన్న ప్రత్తి చేలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు.

రుణాల లబ్ధిదారులతో సమావేశం

విస్సన్నపేట, న్యూస్‌టుడే: విస్సన్నపేట, రెడ్డిగూడెం మండలాల్లో వివిధ రుణాలు తీసుకొని, జీవనోపాధి సాగిస్తున్న లబ్ధిదారులతో ప్రభుత్వం బృంద ప్రతినిధులు రబ్బానీ, పర్వీనా తదితరులు విస్సన్నపేట వెలుగు కార్యాలయంలో సమావేశమయ్యారు. ఏ ఋణాలు, ఎంత సొమ్ము తీసుకున్నారు. ఏ వ్యాపారం పెట్టారు..ఆదాయం వస్తుందా లేదా.. ఇంకా వ్యాపార అభివృద్ధికి ప్రభుత్వం నుంచి ఏం కావాలి లాంటి వివరాలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వివిధ గ్రూపు సభ్యులు వారు ఉత్పత్తి చేస్తున్న పరికరాలు ప్రదర్శించారు. కార్యక్రమంలో సెర్ప్ ప్రతినిధులు భారతి, పావన జ్యోతి, శోభారాణి, విన్సెంట్ కుమార్, జిల్లా ఎల్‌హెచ్ డీపీఎం శ్రీనివాసరావు, ఎంఎస్ ప్రెసిడెంట్ నాగమణి, రెడ్డిగుడెం, విస్సన్నపేట ఏపీఎంలు రామకృష్ణ, జమలయ్య తదితరులు పాల్గొన్నారు.

నూతన విద్యా విధానంపై శిక్షణ


ఎ.కొండూరు: బాలికలతో మాట్లాడుతున్న అహోనాకృష్ణ

ఎ.కొండూరు, రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాల్లో సమగ్ర శిక్ష, ఎల్ఈఎఫ్ (లీడర్ షిప్ ఫర్ ఈక్విటీ) సంయుక్త ఆధ్వర్యంలో కొత్త బోధనాభ్యాసన పద్ధతులు ప్రవేశపెట్టి విద్యను మెరుగుపరచేందుకు విస్తృతస్థాయిలో ఉపాధ్యాయినులకు శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు జిల్లా బాలికాభివృద్ధి అధికారిణి బి.విశ్వభారతి తెలిపారు. ఈ నేపథ్యంలోనే ప్రభుత్వ సూచన మేరకు ఎల్ఈఎఫ్ సంస్థ ప్రతినిధులు కేజీబీవీలను సందర్శిస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా బుధవారం ఎ.కొండూరు కస్తూర్బా గాంధీ బాలికా విద్యాలయాన్ని సందర్శించిన ఎల్ఈఎఫ్ బృందం అహోనాకృష్ణ, ఎన్.రమేష్ అక్కడి విద్యాబోధన పరిస్థితులు, ఉపాధ్యాయులకు శిక్షణానంతరం నిరంతరం సందేహాలు నివృత్తి చేస్తూ సేవలు అందించే అంశాలను పరిశీలించారు. ఇతర రాష్ట్రాల్లో కేజీబీవీల సందర్శనతో తెలుసుకున్న ఉత్తమ బోధనాపద్ధతలను ఇక్కడి ఉపాధ్యాయినులకు, విద్యార్థులకు వివరించారు. ప్రిన్సిపాల్ ఎం.శ్యామల పాల్గొన్నారు. రెడ్డిగూడెం మండలంలోని రంగాపురంలోని కేజీబీవీని కూడా సందర్శించారు.

నిబంధనల మేరకు సర్వే పూర్తి చేయండి


అధికారులు, సిబ్బందితో మాట్లాడుతున్న డీపీవో లావణ్యకుమారి

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: కచ్చితమైన భూ రికార్డులను అందించడం ద్వారా ఆస్తి వివాదాలను తగ్గించడానికి నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను నిబంధనల మేరకు పూర్తిచేయాలని డీపీవో లావణ్య కుమారి సూచించారు. మూలపాడులో నిర్వహిస్తున్న స్వామిత్వ సర్వేను ఆమె బుధవారం పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ..గ్రామీణ ప్రాంతాల్లోని ఆస్తి హక్కుల గురించి నివాసితులకు వివరించడమే ఈ పథక లక్ష్యమన్నారు. అనంతరం గ్రామ పంచాయతీ నిర్వహిస్తున్న చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని పరిశీలించారు. గ్రామంలో తడి పొడి చెత్తసేకరణ ఎలా జరుగుతుందన్న విషయాన్ని గ్రామస్థుల నుంచి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో మనోజ్, గ్రామ పంచాయతీ కార్యదర్శి అనిల్‌కుమార్ సిబ్బంది పాల్గొన్నారు.

పథకం అందేలా చూడండి

మైలవరం, న్యూస్‌టుడే: స్థానిక నారాయణ పాఠశాలలో తల్లికి వందనం విషయంలో విద్యార్థులకు జరిగిన అన్యాయంపై స్పందించి, న్యాయం చేయాలని సీపీఎం మండల కార్యదర్శి సీహెచ్ సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం విద్యార్థుల తల్లిదండ్రులతో కలిసి పాఠశాలలో నిర్వాహకులతో చర్చించారు. అర్హత ఉన్నా పథకం అందలేదని..తల్లి ఆధార్ సంఖ్యలను తప్పుగా నమోదు చేయడంతో దాదాపు 220 మందికి తల్లికి వందనం అందలేదని పాఠశాల యాజమాన్యం బాధ్యత వహించి, ఫీజుల్లో మినహాయింపు ఇచ్చేలా చూడాలని కోరారు.

నిమ్రాలో ఉచితంగా ఏఆర్టీ సేవలు

ఇబ్రహీంపట్నం గ్రామీణం, న్యూస్‌టుడే: జూపూడి నిమ్రా బోధనాసుపత్రిలో ఉచితంగా ఏఆర్టీ వైద్యసేవలు అందించేందుకు ఏర్పాటు చేసినట్లు నిమ్రా వైద్య కళాశాల సూపరింటెండెంట్ డాక్టరు శ్యామల, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ఏఆర్టీ సెంటర్ వైద్యాధికారి గౌతం అంబేద్కర్‌లు తెలిపారు. కళాశాలలో బుధవారం రాష్ట్ర ఎయిడ్స్ కంట్రోలు సొసైటీ, విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రి ఏఆర్టీ సెంటరు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసి పరీక్ష కేంద్రాన్ని వారు ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఇప్పటి వరకు ఇబ్రహీంపట్నం పరిసర ప్రాంత వాసులు ఏఆర్టీ పరీక్షల కోసం విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి వచ్చేవారని ఇప్పుడు ఈ సేవలను ఇక్కడే ఉచితంగా పొందవచ్చునన్నారు. కార్యక్రమంలో వైద్యాధికారులు శివరంజన్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా మహాసభల విజయవంతానికి పిలుపు

ఇబ్రహీంపట్నం, న్యూస్‌టుడే: ఉద్యోగ, కార్మిక హక్కుల సాధన కోసం పోరాడుతున్న సీఐటీయూ జిల్లా మహాసభలను విజయవంతం చేయాలని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సీహెచ్ శ్రీనివాస్ పిలుపునిచ్చారు. యూనియన్ మండల సమీక్ష సమావేశాన్ని ఇబ్రహీంపట్నంలో బుధవారం నిర్వహించారు. కార్యక్రమంలో ఎ.వెంకటేశ్వరరావు, విఠలరావు, మహేష్, కొండలరావు, బుజ్జిమ్మ తదితరులు పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలను తయారు చేసేందుకే పీ4


ధనలక్ష్మితో మాట్లాడుతున్న రవిబాబు, వైస్ ఛైర్మన్ శ్రీను తదితరులు

కొండపల్లి, న్యూస్‌టుడే: బాధిత కుటుంబాలను బంగారు కుటుంబాలుగా తయారు చేసేందుకే పీ4 కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ప్రారంభించారని మైలవరం లయన్స్‌క్లబ్ ప్రతినిధి రవిబాబు అన్నారు. ఉండవల్లిలో మంగళవారం నిర్వహించిన పీ4 కార్యక్రమంలో కొండపల్లికి చెందిన కొమ్మినేని ధనలక్ష్మీ పాల్గొని తన బాధను వివరించారు. ఈ నేపథ్యంలో మైలవరానికి చెందిన మేడసాని కిషోర్ మార్గదర్శిగా నియోజకవర్గంలో 11 కుటుంబాలను దత్తత తీసుకున్నారు. అందులో భాగంగా ధనలక్ష్మి కుటుంబాన్ని ఆ సంస్థ ఉద్యోగి రవిబాబు, కొండపల్లి పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను, తెదేపా నాయకులు బుధవారం కోటయ్యనగర్‌లోని ఆమె నివాసాన్ని సందర్శించి ఆమెతో మాట్లాడారు. ఆమె భర్త వెంకటేశ్వరరావుకు నూతన పింఛను, కుమార్తెకు ఆర్థిక రుణం అందించి స్వయం ఉపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పురపాలిక వైస్ ఛైర్మన్ శ్రీను, తెదేపా నాయకులు విజయ్ కుమార్, లావణ్య, స్వప్న తదితరులు పాల్గొన్నారు.

రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలి


రైతులతో మాట్లాడుతున్న ఏవో రజని

ఇబ్రహీంపట్నం గ్రామీణం: వరద ముంపు తర్వాత వరి పంటను కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన చర్యలను మండల వ్యవసాయాధికారి రజని రైతులకు వివరించారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గుంటుపల్లి, ఈలప్రోలు గ్రామాల్లో ముంపునకు గురైన వరి పొలాలను రైతులతో కలిసి ఆమె బుధవారం పరిశీలించారు.

రెడ్డిగూడెం, న్యూస్‌టుడే: రైతులు రసాయన ఎరువుల వినియోగం తగ్గించాలని రెడ్డిగూడెం మండల వ్యవసాయ అధికారి డి.శ్రీనివాసరావు సూచించారు. బుధవారం అన్నేరావుపేట, రెడ్డిగూడెం గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. వ్యవసాయశాఖ సిబ్బంది, రైతులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విస్సన్నపేట, న్యూస్‌టుడే : మండలంలోని వేమిరెడ్డిపల్లి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం భాగంగా స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులకు, అన్నదాతలకు వ్యవసాయ, ఉద్యాన, రెవెన్యూ శాఖల అధికారులు వరి పంటలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లక్ష్మీ కల్యాణి, ఆర్ఐ సుజాత, ఉద్యాన శాఖాధికారి నరేంద్ర కుమార్, ఏఈవో ఉషారాణి పాల్గొన్నారు.



యూజీ/పీజీతో.. నేవీ అధికారి!

నేవీ అధికారిగా కొలువుదీరే అవకాశం వచ్చింది. షార్ట్ సర్వీస్ కమిషన్ విధానంలో భారతీయ నౌకా దళం 260 పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది. అవివాహిత మహిళలు, పురుషులు దరఖాస్తు చేసుకోవచ్చు. బీటెక్, ఎంఏ, ఎమ్మెస్సీ, ఎంబీఏ విద్యార్హతలున్నవారు అర్హులు. ఇంటర్వ్యూతో నియామకాలుంటాయి. ఇందులో ప్రతిభతో మెరిసినవారిని శిక్షణ అనంతరం సబ్ లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. మొదటి నెల నుంచే రూ.లక్షకు పైగా వేతనం అందుకోవచ్చు.





ఇండియన్ నేవీ భర్తీ చేస్తోన్న ఈ షార్ట్ సర్వీస్ కమిషన్ పోస్టులు.. ఎగ్జిక్యూటివ్, ఎడ్యుకేషన్, టెక్నికల్ బ్రాంచీల్లో ఉన్నాయి. అన్నీ లెవెల్-10 హోదా ఉద్యోగాలే. పరీక్ష లేకుండా ఉద్యోగంలోకి తీసుకోవడం వీటి ప్రత్యేకత. దరఖాస్తు చేసుకున్న వారిని అకడమిక్ మార్కుల ప్రతిభతో వడపోస్తారు. అందువల్ల యూజీ/పీజీలో గరిష్ఠ మార్కులు పొందినవారు విజయవంతం కావడానికి అవకాశాలెక్కువ. ఒక్కో పోస్టుకు నిర్ణీత సంఖ్యలో అభ్యర్థులను ఇంటర్వ్యూకు ఆహ్వానిస్తారు. ఇవి సర్వీస్ సెలక్షన్ బోర్డు (ఎస్ఎస్‌బీ) ఆధ్వర్యంలో జరుగుతాయి. ఇందులో విజయవంతమైనవారికి వైద్య పరీక్షలు నిర్వహించి, తుది నియామకానికి ఖరారు చేస్తారు.

వీరికి నేవల్ అకాడెమీ, ఎజిమాళలో జూన్, 2026 నుంచి 22 వారాలపాటు సంబంధిత విభాగాల్లో తర్ఫీదునిస్తారు. ఆ తర్వాత మరో 22 వారాలు సంబంధిత విభాగానికి చెందిన కేంద్రంలో తదుపరి శిక్షణ ఉంటుంది. అనంతరం సబ్ లెఫ్టినెంట్ హోదాతో విధుల్లోకి తీసుకుంటారు. ఉద్యోగంలో మూల వేతనం రూ.56,100 అందుతుంది. దీనికి డీఏ, హెచ్‌ఆర్‌ఏ, ఇతర ప్రోత్సాహకాలు అదనం. మొదటి నెల నుంచే రూ.1,10,000 జీతం అందుకోవచ్చు. ప్రొబేషన్ వ్యవధి పోస్టును బట్టి రెండు లేదా మూడేళ్లు ఉంటుంది. ఈ పోస్టులు పరిమిత కాల ప్రాతిపదికన (షార్ట్ సర్వీస్ కమిషన్) ఉంటాయి. అంటే ఎంపికైనవారు పన్నెండేళ్లు విధుల్లో కొనసాగుతారు. ఆపై రెండేళ్లు సర్వీసు పొడిగిస్తారు. అందువల్ల గరిష్ఠంగా 14 ఏళ్లపాటు ఉద్యోగ బాధ్యతలు నిర్వర్తించవచ్చు. ఆ తర్వాత విధుల నుంచి వైదొలగాలి. అయితే నేవీలో పని అనుభవంతో వీరు సులువుగానే సివిల్ ఉద్యోగాలు పొందగలరు.

ఖాళీలు.. అర్హతలు

● ఎగ్జిక్యూటివ్ బ్రాంచ్: జనరల్ సర్వీస్‌లో 57 ఖాళీలున్నాయి. ఏదైనా బ్రాంచీలో బీఈ/బీటెక్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. ఎయిర్ ట్రాఫిక్ కంట్రోలర్ 20, నేవల్ ఎయిర్ ఆపరేషన్స్ ఆఫీసర్ (అబ్జర్వర్) 20, పైలట్ 24 ఖాళీలకు బీఈ/బీటెక్‌లో 60, పది, ఇంటర్‌లోనూ 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు అర్హులు. లాజిస్టిక్స్ 10 ఖాళీలకు ఎందులోనైనా 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ లేదా ఎంబీఏ లేదా ఎమ్మెస్సీ (ఐటీ)/ఎంసీఏ లేదా బీఎస్సీ/ బీకాంతోపాటు లాజిస్టిక్స్/ సప్లై చెయిన్‌లో పీజీ డిప్లొమా ఉత్తీర్ణులు అర్హులు.



నేవల్ ఆర్మమెంట్ ఇన్‌స్పెక్టర్ క్యాడర్‌లో 20 ఖాళీలున్నాయి. ఏదైనా బ్రాంచీలో బీఈ/బీటెక్, పది, ఇంటర్‌లో 60 శాతం మార్కులతో ఉత్తీర్ణులు అర్హులు. వీటికి పురుషులు, మహిళలు ఇద్దరికీ సమాన ప్రాధాన్యం. లా విభాగంలో 2 పోస్టులకు 55 శాతం మార్కులతో లీగల్ పట్టభద్రులు దరఖాస్తు చేసుకోవచ్చు.



● ఎడ్యుకేషన్ బ్రాంచ్: ఇందులో అన్ని విభాగాల్లోనూ కలిపి 15 ఖాళీలున్నాయి. వీటికి ఆ పోస్టుల ప్రకారం బీఈ/బీటెక్, ఎంబీఏ, ఎంసీఏ, ఎమ్మెస్సీ చదివినవారు అర్హులు.



● టెక్నికల్ బ్రాంచ్: ఇంజినీరింగ్ బ్రాంచ్ 36, ఎలక్ట్రికల్ బ్రాంచ్ 40, నేవల్ కన్‌స్ట్రక్టర్ 16 ఖాళీలు ఉన్నాయి. సంబంధిత విభాగాల్లో 60 శాతం మార్కులతో బీఈ/బీటెక్ పూర్తిచేసుకున్నవారు దరఖాస్తు చేసుకోవచ్చు.

వయసు: పోస్టు ప్రకారం మారుతుంది. ఎక్కువ ఖాళీలకు జులై 2, 2001 - జనవరి 1, 2007 మధ్య జన్మించినవారు దరఖాస్తు చేసుకోవచ్చు. ఈ అన్ని పోస్టులకూ ప్రస్తుతం చివరి ఏడాది కోర్సులు చదువుతున్నవారూ అర్హులే. ఎన్‌సీసీ సి సర్టిఫికెట్ ఉన్నవారికి అకడమిక్ మార్కుల్లో 5 శాతం సడలింపు వర్తిస్తుంది. అభ్యర్థులు దరఖాస్తులో పోస్టులవారీ ప్రాధాన్యం తెలపడం తప్పనిసరి.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 01.09.2025
ఎస్ఎస్‌బీ ఇంటర్వ్యూ కేంద్రాలు: బెంగళూరు, భోపాల్, విశాఖపట్నం, కోల్‌కతా.
వెబ్‌సైట్: https://www.joinindiannavy.gov.in/

ఇంటర్న్‌షిప్స్

వర్క్ ఫ్రమ్ హోమ్

టీచింగ్ బయాలజీ ఫర్ ఐబీ అండ్ ఐజీసీఎస్ఈ
సంస్థ: ఆరివ్ లెర్నింగ్ నైపుణ్యాలు: బయాలజీ, ఇంగ్లిష్ రాయడం, మాట్లాడటం
స్టైపెండ్: రూ.15,000
☛ http://internshala.com/i/dc4f1b

రెజ్యూమె రైటింగ్ అండ్ కెరియర్ డాక్యుమెంటేషన్
సంస్థ: బ్రిడ్జ్‌లెజాబ్ నైపుణ్యాలు: ఏటీఎస్, క్రిటికల్ థింకింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ప్రాబ్లమ్ సాల్వింగ్, టైమ్ మేనేజ్‌మెంట్ స్టైపెండ్: రూ.14,000
☛ http://internshala.com/i/87b562

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 11

కంటెంట్ రైటింగ్
సంస్థ: కేఎల్ఎం గ్రోత్ అండ్ టెక్నికల్ సర్వీసెస్ నైపుణ్యాలు: కంటెంట్ రైటింగ్, క్రియేటివ్ రైటింగ్, సోషల్ మీడియా మార్కెటింగ్ స్టైపెండ్: రూ.10,000
☛ http://internshala.com/i/068a33

యూఐ/యూఎక్స్ డిజైన్
సంస్థ: దబ్లాక్‌జాబ్ గ్రూప్ నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, ఇలస్ట్రేటర్, మిడ్‌జర్నీ (జన్ ఏఐ), ఫిగ్మా, కేన్వా, యూఐ/యూఎక్స్ డిజైన్
స్టైపెండ్: రూ.10,000-20,000
☛ http://internshala.com/i/e5068d

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: స్కిల్స్‌క్యాపిటల్ నైపుణ్యాలు: అడాప్టబిలిటీ, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఇంగ్లిష్ మాట్లాడటం, ఇంటర్‌పర్సనల్ స్కిల్స్, ఎంఎస్-ఎక్సెల్, టీమ్‌వర్క్
స్టైపెండ్: రూ.10,000
☛ http://internshala.com/i/195f33

ఈ మూడిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 12

హైదరాబాద్‌లో

బిజినెస్ డెవలప్‌మెంట్
సంస్థ: సిద్ధి వినాయకా క్రియేటివ్ ల్యాబ్స్ నైపుణ్యాలు: క్లయింట్ రిలేషన్‌షిప్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఫీల్డ్ సేల్స్, ఫీల్డ్ వర్క్, మార్కెటింగ్, నెగోషియేషన్, సేల్స్, సేల్స్ స్ట్రాటజీ స్టైపెండ్: రూ.13,800
☛ https://shorturl.at/sqa4H

ఆడిటింగ్ ట్యాక్సేషన్
సంస్థ: రూపాకుల అసోసియేట్స్ నైపుణ్యాలు: అకౌంటింగ్, ఎంఎస్-ఆఫీస్, ట్యాలీ, ట్యాక్సేషన్ స్టైపెండ్: రూ.10,000-20,000
☛ https://shorturl.at/Rkh6r

ఈ రెండిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 6

డేటా ఎంట్రీ
సంస్థ: క్యాలిపర్స్ కన్సల్టింగ్ ప్రై.లి. నైపుణ్యాలు: డేటాఎంట్రీ, డేటా ఎక్స్‌ట్రాక్షన్, పవర్ బీఐ స్టైపెండ్: రూ.15,000-20,000
☛ https://shorturl.at/0VHIC

మార్కెటింగ్
సంస్థ: స్మార్ట్‌బ్రిడ్జ్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్ ప్రై.లి. నైపుణ్యాలు: ఈమెయిల్, సోషల్‌మీడియా మార్కెటింగ్, ఇంగ్లిష్ మాట్లాడటం, రాయడం, ఎంఎస్-ఎక్సెల్
స్టైపెండ్: రూ.10,000-15,000
☛ https://shorturl.at/dWiWN

యూఐ/యూఎక్స్ విత్ గ్రాఫిక్ డిజైనింగ్ ఆర్ ఫైనార్ట్ బ్యాక్‌గ్రౌండ్
సంస్థ: అవెక్సా సిస్టమ్స్ నైపుణ్యాలు: అడోబ్ ఇలస్ట్రేటర్, ఫొటోషాప్, కోర్, ఐ డ్రా, ఫిగ్మా
స్టైపెండ్: రూ.10,000-15,000
☛ https://shorturl.at/vHP45

ఈ మూడిటికీ దరఖాస్తు గడువు: సెప్టెంబరు 11

ఇన్‌సైడ్ సేల్స్
సంస్థ: బిస్ప్యాచ్ నైపుణ్యాలు: కోల్డ్ కాలింగ్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, సేల్స్, సేల్స్ స్ట్రాటజీ, సేల్స్ సపోర్ట్ స్టైపెండ్: రూ.12,000-30,001
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 7
☛ https://shorturl.at/yACqU

డేటా ఎంట్రీ
సంస్థ: ట్రూలాన్సర్
నైపుణ్యాలు: తెలుగు మాట్లాడటం, రాయడం
స్టైపెండ్: రూ.5,000-10,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 10
☛ https://shorturl.at/KVLD8

సివిల్ ఇంజినీరింగ్
సంస్థ: సియాండ్ నైపుణ్యాలు: కన్‌స్ట్రక్షన్ మేనేజ్‌మెంట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, ఎంఎస్-ఆఫీస్ స్టైపెండ్: రూ.8,000
దరఖాస్తు గడువు: సెప్టెంబరు 12
☛ https://shorturl.at/88xJn

వీడియో ఎడిటింగ్/ మేకింగ్
సంస్థ: మాస్టర్స్‌హెల్ప్ నైపుణ్యాలు: అడోబ్ ఫొటోషాప్, క్యాప్‌కట్, ఎఫెక్టివ్ కమ్యూనికేషన్, సోషల్ మీడియా మార్కెటింగ్, టైమ్ మేనేజ్‌మెంట్, వీడియో ఎడిటింగ్, వీడియో మేకింగ్ స్టైపెండ్: రూ.5,500-11,000
దరఖాస్తు గడువు: ఆగస్టు 31
☛ https://shorturl.at/iAwol

హార్డ్‌వేర్‌పై ఏయే ప్రశ్నలు?

మనం తాకగల కంప్యూటర్ వ్యవస్థ భౌతిక భాగాలే హార్డ్‌వేర్. అంటే మానిటర్, కీబోర్డ్, మౌస్‌తో పాటు కంప్యూటర్ కేస్ లోపలున్న హార్డ్ డిస్క్ డ్రైవ్, మదర్‌బోర్డ్, వీడియో కార్డ్, అనేక ఇతర భాగాలు. హార్డ్‌వేర్‌లో సిస్టమ్ యూనిట్, డిస్‌ప్లే, ఇన్‌పుట్, బాహ్య పరికరాలపై అవగాహన ఉంటే పోటీ పరీక్షల్లో ఇచ్చే ఎలాంటి ప్రశ్నలకైనా సమాధానాలు ఇవ్వొచ్చు!

ఈ విభాగం నుంచి విద్యార్థులను కొంత తికమక పెట్టే ప్రశ్నలను పరీక్షల్లో ఇస్తున్నారు.

■ వీటిలో ఈ కీని టాగుల్ కీ అని కూడా పిలుస్తారు-
ఎ. క్యాప్స్ లాక్ బి. నమ్ లాక్
సి. పై రెండూ డి. వీటిలో ఏదీ కాదు
జవాబు: సి


క్యాప్స్ లాక్, నమ్ లాక్ కీలను 'టాగుల్ కీలు' అంటారు. ఎందుకంటే అవి నొక్కినప్పుడు వాటి స్థితిని ఒక స్థితి నుంచి మరొక స్థితికి మారుస్తాయి. కీల ఇన్‌పుట్ పద్ధతిని ప్రత్యామ్నాయం చేయడానికి టాగుల్ కీని యాక్సెసిబిలిటీ ఎంపికగా కూడా ఉపయోగించవచ్చు. షిఫ్ట్, కంట్రోల్, ఆల్ట్ కీలను మాడిఫైయర్ కీలు అంటారు.

పాయింటింగ్ డివైసెస్ అయిన మౌస్, ట్రాక్ బాల్, జాయ్ స్టిక్, లైట్ పెన్, టచ్ స్క్రీన్, బార్ కోడ్ రీడర్, ఆప్టికల్ మార్క్ రీడర్, ఆప్టికల్ కారెక్టర్ రెకగ్నిషన్, మాగ్నెటిక్ ఇంక్ క్యారెక్టర్ రెకగ్నిషన్, స్మార్ట్ కార్డ్ రీడర్, బయో మెట్రిక్ సెన్సార్, స్కానర్, మైక్రో ఫోన్, వెబ్ కామ్ మొదలైన డివైసెస్‌పై ప్రశ్నలు వస్తున్నాయి.

■ మీరు ట్యాబ్ కీని ఉపయోగించి...
ఎ. కర్సర్‌ను స్క్రీన్‌పైకి తరలించవచ్చు
బి. పేరాగ్రాఫ్‌ను ఇండెంట్ చేయవచ్చు
సి. కర్సర్‌ను స్క్రీన్‌పైకి తరలించవచ్చు
డి. మొదటి, రెండో ఆప్షన్లు
జవాబు: బి

■ ఈ కోణంలో జాయ్‌స్టిక్ కదలికలను అనుమతిస్తుంది-
ఎ. 30° బి. 60°
సి. 90° డి. 360°
జవాబు: డి

కర్సర్ కదలికను నియంత్రించేది జాయ్‌స్టిక్. 360° కోణంలో కదలికలను అనుమతించే ఈ పరికరాన్ని CAD/CAM సిస్టమ్, ఫ్లైట్ సిమ్యులేటర్లు మొదలైనవాటిలో ఉపయోగిస్తారు.



ట్రాక్‌బాల్

మౌస్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగపడే ట్రాక్‌బాల్‌ను కంప్యూటర్ స్క్రీన్‌లో కర్సర్ కదలికలు, చర్యలను నియంత్రించడానికి కూడా ఉపయోగిస్తారు. దీన్ని CAD/CAM వర్క్‌స్టేషన్లలో, కొన్నిసార్లు కంప్యూటరైజ్డ్ స్పెషల్ పర్పస్ వర్క్‌స్టేషన్లలో ఉపయోగిస్తున్నారు.

లైట్‌పెన్

హ్యాండ్‌హెల్డ్ ఎలక్ట్రో- ఆప్టికల్ పాయింటింగ్ పరికరమైన లైట్‌పెన్‌ను డ్రాయింగ్‌లు, మెనూ ఎంపిక, గ్రాఫిక్స్ తయారీలకు ఉపయోగిస్తారు. ఈ పెన్నులో చిన్న ట్యూబ్‌లో ఫోటోసెల్ ఉంటుంది. ఇది స్క్రీన్ దగ్గరగా వచ్చినప్పుడు వచ్చే కాంతిని గ్రహించి పల్స్‌ను ఉత్పత్తి చేస్తుంది. ఇది పర్సనల్ డిజిటల్ అసిస్టెంట్లలోనూ, స్క్రీన్‌పై ఒక నిర్దిష్ట స్థానాన్ని గుర్తించడంలోనూ చాలా ఉపయోగకరం. స్క్రీన్‌లోని ఖాళీ భాగంలో పట్టుకున్నప్పుడు ఏ సమాచారాన్నీ అందించదు.

ఆప్టికల్ మార్క్ రీడర్ (ఓఎంఆర్)

ఉద్దేశించిన మార్క్ చేసిన ప్రతిస్పందనల ఉనికిని గుర్తించే ప్రక్రియ. ఇది డేటా ఉనికి, ఉనికి లేకపోవడాన్ని గ్రహించడానికి కాగితంపై ప్రతిబింబించే కాంతి పుంజాన్ని ఉపయోగిస్తుంది. ఓఎంఆర్ మార్కుల నమూనాను డేటా రికార్డులోకి అర్థం చేసుకుని, నిల్వ, విశ్లేషణ, నివేదిక కోసం కంప్యూటర్‌కు పంపుతుంది. ఆబ్జెక్టివ్ పరీక్షలు, ఓటింగ్ అప్లికేషన్లు, ఇతర మూల్యాంకన అధ్యయనాల సమాధానాలను చదవడానికి ఉపయోగించే ఓఎంఆర్‌ను ఆప్టికల్ మార్క్ రికగ్నిషన్ అనీ అంటారని గుర్తుంచుకోవాలి.

■ కింది వాటిలో ఏది వ్యక్తిగత భౌతిక లక్షణాలను గుర్తిస్తుంది?
ఎ. స్మార్ట్ కార్డ్ బి. బయోమెట్రిక్ సెన్సార్
సి. బార్ కోడ్ డి. ఎంఐసీఆర్
జవాబు: బి

భద్రతా ప్రయోజనాల కోసం విస్తృతంగా ఉపయోగించే బయోమెట్రిక్ సెన్సార్లు వ్యక్తి శారీరక/ ప్రవర్తనా లక్షణాలను కచ్చితత్వంతో గుర్తించే పరికరం. సంస్థల్లో ఉద్యోగుల/విద్యార్థుల హాజరును గుర్తించడానికి బయోమెట్రిక్ సెన్సార్లను ఉపయోగిస్తుంటారు.

స్మార్ట్ కార్డ్ రీడర్

స్మార్ట్ కార్డ్.. మైక్రోప్రాసెసర్‌ను యాక్సెస్ చేయడానికి ఉపయోగించే పరికరమే స్మార్ట్ కార్డ్ రీడర్. మెమరీ కార్డ్, మైక్రోప్రాసెసర్ కార్డుల్లో మెమరీ కార్డులు అస్థిర మెమరీ నిల్వ భాగాలు, కొన్ని నిర్దిష్ట భద్రతా తర్కాలను మాత్రమే కలిగివుంటాయి. మైక్రోప్రాసెసర్ కార్డులు అస్థిర మెమరీ, మైక్రోప్రాసెసర్ భాగాలను కలిగి ఉన్నందున బలమైన భద్రతా ప్రామాణీకరణ కోసం పెద్ద కంపెనీల్లో, సంస్థల్లో స్మార్ట్ కార్డులను ఉపయోగిస్తున్నారు.

వివిధ హార్డ్‌వేర్ పరికరాలను గురించీ, అవి పనిచేసే విధానాల గురించీ సమగ్రంగా అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే ఏ ప్రశ్నలకైనా సమాధానాలు రాయవచ్చు, అత్యధిక మార్కులు సాధించవచ్చు.



– డా. చెన్నంశెట్టి రమేష్

నోటీస్ బోర్డు

ఉద్యోగాలు

పంజాబ్ & సింధ్ బ్యాంకులో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్లు

పంజాబ్ & సింధ్ బ్యాంకు దేశంలోని వివిధ రాష్ట్రాల్లో 750 లోకల్ బ్యాంక్ ఆఫీసర్ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.
● తెలంగాణ: 50 ● ఆంధ్రప్రదేశ్: 80
● కర్ణాటక: 65 ● ఒడిశా: 85
● తమిళనాడు: 85 ● పుదుచ్చేరి: 05
● ఛత్తీస్‌గఢ్: 40 ● గుజరాత్: 100
● హిమాచల్ ప్రదేశ్: 30 ● ఝార్ఖండ్: 35
● పంజాబ్: 60 ● అస్సాం: 15
● మహారాష్ట్ర: 100
అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ.
వయసు: 01.08.2025 నాటికి 20 - 30 ఏళ్లు ఉండాలి. ఎస్సీ, ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్లు, పీడబ్ల్యూబీడీకి పదేళ్లు సడలింపు ఉంటుంది.
వేతన శ్రేణి: నెలకు రూ.48,480 - రూ.85,920.
ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 04.09.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.850. ఎస్సీ, ఎస్టీ, పీడబ్ల్యూబీడీలకు రూ.100.
ఎంపిక: రాత పరీక్షతో
వెబ్‌సైట్: https://punjabandsindbank.co.in/content/recruitment

బెల్‌లో ప్రాజెక్ట్ ఇంజినీర్లు

ప్రభుత్వ రక్షణ రంగ సంస్థ, నవరత్న హోదా కలిగిన భారత్ ఎలక్ట్రానిక్స్ లిమిటెడ్ (బెల్) బెంగళూరు తాత్కాలిక ప్రాతిపదికన 20 ప్రాజెక్ట్ ఇంజినీర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.
అర్హత: పోస్టును అనుసరించి బీఈ/బీటెక్‌తో పాటు పని అనుభవం.
గరిష్ఠ వయసు: 35 ఏళ్లు. ఓబీసీలకు మూడేళ్లు, ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
వేతనం: నెలకు రూ.40,000 - రూ.55,000.
ఆఫ్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: 13.09.2025
దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ, ఈడబ్ల్యూఎస్‌కు రూ.472. ఎస్సీ/ఎస్టీ/ పీడబ్ల్యూబీడీలకు ఫీజు లేదు.
ఎంపిక: రాత పరీక్ష, ఇంటర్వ్యూలతో.
వెబ్‌సైట్: https://bel-india.in/job-notifications/

వాక్ఇన్స్

మిధానిలో అసిస్టెంట్ పోస్టులు

హైదరాబాద్‌లోని మిశ్ర ధాతు నిగమ్ లిమిటెడ్ (మిధాని) వివిధ విభాగాల్లో 50 అసిస్టెంట్ పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.
విభాగాలు: మెటలర్జీ, మెకానికల్, ఎలక్ట్రికల్, కెమికల్, ఫిట్టర్, ఎలక్ట్రీషియన్, టర్నర్, వెల్డర్.
అర్హతలు: పోస్టును అనుసరించి బీఎస్సీ, డిప్లొమా, ఐటీఐ.
గరిష్ఠ వయసు: 35 ఏళ్లు.
వేతనం: నెలకు రూ.29,800 - రూ.32,640.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 2025 సెప్టెంబర్ 8, 9, 10, 11, 12, 15, 16, 17.
వేదిక: మిధాని కార్పొరేట్ ఆఫీస్ ఆడిటోరియం, హైదరాబాద్.
వెబ్‌సైట్: https://midhani-india.in/department_hrd/career-at-midhani/

క్యాన్సర్ హాస్పిటల్‌లో

విశాఖపట్నంలోని హోమి భాబా క్యాన్సర్ హాస్పిటల్ ఒప్పంద ప్రాతిపదికన 4 లేడీ కేర్‌టేకర్ /సెక్యూరిటీ గార్డ్ (మహిళ) పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు నిర్వహిస్తోంది.



అర్హత: పోస్టును అనుసరించి ఇంటర్మీడియట్‌తో పాటు పని అనుభవం.
వేతనం: నెలకు రూ.19,300.
ఎంపిక: ఇంటర్వ్యూతో.
ఇంటర్వ్యూ తేదీ: 29.08.2025.
వేదిక: హెచ్‌ఆర్‌డీ డిపార్ట్‌మెంట్, మొదటి అంతస్తు, హోమి భాబా క్యాన్సర్ హాస్పిటల్ & పరిశోధన కేంద్రం, విశాఖపట్నం.
వెబ్‌సైట్: https://tmc.gov.in/

ఎంఏ తర్వాత ఐటీఐ?



ఎంఏ (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్) చేస్తున్నాను. దీంతో ఉద్యోగం కష్టమంటున్నారు. ఇప్పుడు ఐటీఐ చేసి రైల్వేలు, ఇతర సంస్థల్లో టెక్నీషియన్ ఉద్యోగాలకు ప్రయత్నించడం సరైనదేనా?
- మనీష్

■ ఐటీఐ అనేది పదో తరగతి విద్యార్హత ఉన్నవారి కోసం రూపొందించిన సాంకేతిక శిక్షణ ప్రోగ్రాం. ఇందులో ఎలక్ట్రికల్, ఫిట్టర్, టర్నర్, మెకానిక్, వెల్డర్, ఎలక్ట్రీషియన్, కంప్యూటర్ ఆపరేటర్ లాంటి దాదాపు నలభై కోర్సులు చేయొచ్చు. ఉద్యోగాలకు అవసరమైన వివిధ సాంకేతిక వృత్తి నైపుణ్యాలు వీటిలో నేర్పిస్తారు. మీరు ఎంఏ పూర్తి చేసినప్పటికీ వయసు, విద్యార్హతల దృష్ట్యా ఐటీఐలో చేరడానికి ఎలాంటి ఇబ్బందీ ఉండదు. కానీ ఐటీఐ కోర్సులు ప్రధానంగా వర్క్‌షాప్, ఇండస్ట్రీల్లో చిన్న టెక్నికల్ ఉద్యోగాల కోసం ఉపయోగపడతాయి. మీరు పీజీ చేస్తున్నారు కాబట్టి ఐటీఐ లాంటి శిక్షణ కోర్సు చేస్తే.. భవిష్యత్తులో తప్పు నిర్ణయం తీసుకున్నానని బాధ పడే అవకాశం ఉంది. టెక్నికల్ స్కిల్స్ నేర్చుకోవాలనుకుంటే ఐటీఐ చేయడం కంటే స్వల్పకాలిక డిప్లొమాలు, కంప్యూటర్ కోర్సులు, డేటా అనలిటిక్స్, డిజిటల్ మేనేజ్‌మెంట్, పబ్లిక్ పాలసీ, ప్రాజెక్ట్ మేనేజ్‌మెంట్ లాంటి కోర్సులు చేస్తే మరింత ఉపయోగకరం.

> **పీజీ తర్వాత ఐటీఐ చేసే బదులు పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విద్యార్హతతోనే ఉద్యోగ ప్రయత్నాలు చేస్తే మంచి భవిష్యత్తుకు వీలుంటుంది**

పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్‌లో డిగ్రీ/పీజీ చేసినవారికి పరిశోధన, పరిపాలనలకు సంబంధించిన రంగాల్లో వివిధ ఉద్యోగాలుంటాయి. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ చదివినవారు చాలామంది సివిల్ సర్వీసెస్, రాష్ట్ర స్థాయి పబ్లిక్ సర్వీస్ కమిషన్ ఉద్యోగాల కోసం ప్రయత్నిస్తూ ఉంటారు. ఈ గ్రాడ్యుయేట్లు పాలసీ అనలిస్టులు, ఫీల్డ్ ఆఫీసర్లు, కన్సల్టెంట్లు లాంటి ఉద్యోగాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. స్వచ్ఛంద సేవా సంస్థలూ, యూఎన్‌డీపీ, ప్రపంచ బ్యాంకు, ఐఎంఎఫ్, యునెస్కో లాంటి అంతర్జాతీయ సంస్థల్లో, వివిధ కన్సల్టింగ్ సంస్థల్లో ఈ గ్రాడ్యుయేట్లకు వివిధ ఉద్యోగాలు లభిస్తాయి. వీటితో పాటు ప్రభుత్వ రంగ సంస్థల్లో, సామాజిక రంగాల్లో, వివిధ కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో, మంత్రిత్వ శాఖల్లో ఉద్యోగ ప్రయత్నాలు చేయవచ్చు.

మరో పీజీపై ఆసక్తి ఉంటే - బిజినెస్ అడ్మినిస్ట్రేషన్, పొలిటికల్ సైన్స్, సోషల్ వర్క్, పబ్లిక్ పాలసీ, లా, జర్నలిజం.. మొదలైనవి పరిశీలించవచ్చు. పీజీ అనంతరం నెట్/ సెట్/ పీహెచ్‌డీతో విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో అధ్యాపక ఉద్యోగాలకు పోటీ పడవచ్చు. ఆసక్తి ఉంటే డేటా అనాలిసిస్, డెవలప్‌మెంట్ స్టడీస్, టౌన్ ప్లానింగ్, పబ్లిక్ ఫైనాన్స్, కమ్యూనికేషన్ లాంటి వాటిలో స్వల్పకాలిక కోర్సుల్లోనూ చేరొచ్చు. బోధనపై ఆసక్తి ఉంటే డీఈడీ, బీఈడీ కూడా చేయవచ్చు. పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ గ్రాడ్యుయేషన్‌తో డిగ్రీ అర్హత ఉన్న అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగాలకూ దరఖాస్తు చేసుకొనే వీలుంది. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని సరైన నిర్ణయం తీసుకోండి.

– ప్రొ. బెల్లంకొండ రాజశేఖర్, కెరియర్ కౌన్సెలర్

ఆయిల్ ఇండియాలో అవకాశాలు

ఆయిల్ ఇండియా లిమిటెడ్, నోయిడా ఒప్పంద ప్రాతిపదికన 10 జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్ పోస్టులను భర్తీచేయనుంది. ఎంపికైనవారిని నోయిడా, దిల్లీలో నియమిస్తారు.

అర్హతలు: ఇంటర్మీడియట్, కంప్యూటర్ అప్లికేషన్స్‌లో ఆరునెలల డిప్లొమా/ సర్టిఫికెట్ కోర్సు పూర్తిచేయాలి. ఎంఎస్-వర్డ్, ఎంఎస్-ఎక్సెల్, ఎంఎస్-పవర్‌పాయింట్ పరిజ్ఞానం తప్పనిసరి.

వయసు: 30 సంవత్సరాలు మించకూడదు. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీ (ఎన్‌సీఎల్)లకు మూడేళ్ల సడలింపు ఉంటుంది. సంస్థ ఉద్యోగులకు గరిష్ఠ వయసు 50 ఏళ్లు.

దరఖాస్తు ఫీజు: రూ.200 (జీఎస్టీ అదనం). ఎస్సీ/ ఎస్టీ/ ఈడబ్ల్యూఎస్/ దివ్యాంగులు/ మాజీ సైనికోద్యోగులకు ఫీజు లేదు.

వేతనం: నెలకు రూ.26,000-90,000

ఎంపిక ఇలా: కంప్యూటర్ బేస్డ్ టెస్ట్ (సీబీటీ) ఆధారంగా ఎంపిక చేస్తారు. ప్రశ్నపత్రం మల్టిపుల్ ఛాయిస్ విధానంలో ఇంగ్లిష్, హిందీ భాషల్లో ఉంటుంది. మూడు సెక్షన్లు 100 మార్కులకు ఉంటాయి. సెక్షన్-ఏలో ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ జనరల్ నాలెడ్జ్/ అవేర్‌నెస్, ఆయిల్ ఇండియా లిమిటెడ్‌పై ప్రశ్నలు అడుగుతారు. వీటికి 20 మార్కులు.
● సెక్షన్-బీలో రీజనింగ్, అరిథ్‌మెటిక్/ న్యూమరికల్ ఎబిలిటీకి చెందిన 20 ప్రశ్నలు ఇస్తారు. ● సెక్షన్-సీలో టెక్నికల్ నాలెడ్జ్ ప్రశ్నలు 60 అడుగుతారు. ఇవి సబ్జెక్టు సంబంధిత అంశాలపై ఉంటాయి.
● నెగటివ్ మార్కులు ఉండవు. పరీక్ష వ్యవధి రెండు గంటలు. ● సీబీటీలో అన్‌రిజర్వ్‌డ్ అభ్యర్థులు 50 శాతం, ప్రత్యేక వర్గాలకు చెందినవారు 40 శాతం కనీసార్హత మార్కులు సాధించాలి. ● సీబీటీలో ప్రతిభ చూపినవారి ధ్రువపత్రాలను పరిశీలించి.. వైద్య పరీక్షల అనంతరం తుది ఎంపిక చేస్తారు.
● ఎంపికైనవారికి ఏడాది ప్రొబేషన్ ఉంటుంది. ఈ సమయంలో అభ్యర్థి పనితీరు సంతృప్తికరంగా లేకపోతే ప్రొబేషన్‌ను మరో ఆరు నెలలు పొడిగిస్తారు.
● సీబీటీ తేదీని అభ్యర్థులకు ఈమెయిల్/ ఎస్ఎంఎస్ ద్వారా తెలియజేస్తారు. పరీక్షను దిల్లీ/ఎన్‌సీఆర్‌లో నిర్వహిస్తారు. **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: 08.09.2025**
వెబ్‌సైట్: http://www.oil-india.com/

వసుంధర

vasundhara@eenadu.in

యుద్ధభూమి నుంచి అందాల రాణి!



దాదాపు రెండేళ్ల యుద్ధం. వేలల్లో పోయిన ప్రాణాలు. ఇంకా రక్తమోడుతోన్న నేల... అలాంటి పాలస్తీనా నుంచి ఓ అందాల తార అంతర్జాతీయ వేదికమీద అడుగుపెట్టబోతోంది. మిస్ యూనివర్స్ పోటీల్లో పోటీపడబోతోంది. నదీన్ అయుబ్... పాలస్తీనా నుంచి ఈ పోటీలకు ఎంపికైన తొలి పోటీదారు కూడా. కిరీటం కోసం కాదు... నా ప్రజల ఆశలు, ఆశయాలను మోసుకొస్తున్నా అంటున్న ఆమె గురించి...

నదీన్ అయుబ్ అడ్వొకేట్, మోడల్. లిటరేచర్, సైకాలజీల్లో డిగ్రీ చేసింది. సర్టిఫైడ్ వెల్‌నెస్ అండ్ న్యూట్రిషన్ కోచ్ కూడా. సస్టెయినబిలిటీని ప్రోత్సహించే 'గ్రీన్ అకాడమీ' సంస్థనీ ప్రారంభించింది. 'సయిదత్ పాలస్తీన్' అనే ఎన్‌జీఓతో కలిసి తన దేశ మహిళలకు ఉపాధి చూపడం, వాళ్ల కథలను ప్రపంచానికి పరిచయం చేస్తూ కావాల్సిన సాయాన్ని అందించడం వంటివీ చేస్తోంది. నిజానికి నదీన్‌కి అందాల పోటీలు కొత్తేమీ కాదు. 2022లో మిస్ పాలస్తీనాగా ఎంపికయ్యాక 'మిస్ ఎర్త్' పోటీల్లో పాల్గొంది. టాప్ ఫైనలిస్ట్‌ల్లో ఒకరిగా నిలిచి అప్పుడూ చరిత్ర సృష్టించింది. గాజా యుద్ధం కారణంగా తన మార్గం కాస్త మారింది. ఇప్పుడు మిస్ యూనివర్స్ పోటీల్లో పాల్గొనడమూ సవాళ్లతో కూడుకున్నదే. అయినా అంతర్జాతీయ వేదిక మీద పోటీపడటానికే మొగ్గుచూపింది. 'అందాల పోటీలు సమస్యలను ప్రపంచానికి తెలియజేసే మార్గం కూడా. అందుకే... నా దేశం, సంస్కృతుల గొప్పతనాన్నే కాదు... నరమేధం సృష్టిస్తున్నా వెరవక తమ గొంతు వినిపించాలనుకుంటున్న నా ప్రజల సందేశాన్నీ మోసుకొస్తున్నా. ప్రాతినిధ్యం వహిస్తున్న 140 దేశాలకు మా ఆర్తనాదాలనే కాదు మాలోని పోరాటపటిమ, భవిష్యత్తుపై మాకున్న ఆశ, మాతృభూమిపై ప్రేమనూ చూపించాలనుకుంటున్నా. ముఖ్యంగా మా మహిళలు, పిల్లల ఆత్మస్థైర్యాన్ని ఈ ప్రపంచానికి చూపిస్తా'నంటోంది నదీన్. ఆమె ప్రయత్నానికి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి.

చట్టానికి లోబడి దత్తత చేసుకోండి!

అవని, రాజేశ్... ఉన్నత చదువులు, కెరియర్ అంటూ ఆలస్యంగా పెళ్లి చేసుకున్నారు... పిల్లల్ని కనాలనుకునేసరికి సమస్యలు మొదలయ్యాయి. దీంతో ఓ పాపను దత్తత తీసుకోవాలనుకున్నారు. ప్రభుత్వ నిబంధనలు కఠినంగా ఉన్నాయని భావించి దళారులను సంప్రదించారు. లక్షలు చెల్లించి చిన్నారిని తెచ్చుకున్నారు. కానీ, ఆ సంతోషం ఎక్కువకాలం నిలవలేదు. కిడ్నాప్ చేసి పిల్లల్ని అమ్ముతున్నారంటూ ఆ ముఠాని పోలీసులు అరెస్ట్ చేశారు. ఈ దంపతుల దగ్గర నుంచి పాపనూ తీసుకెళ్లారు.

అదో ప్రముఖ ఫెర్టిలిటీ సెంటర్... సంతానభాగ్యం కోసం వచ్చిన దంపతులకు సరోగసీ పేరుతో పాపాయిని అప్పజెప్పారు వైద్యురాలు. సంతోషంగా రెండు మూడేళ్లు గడిచాయో లేదో... తమకు అసలు చికిత్సే చేయలేదనీ, మరొకరికి పుట్టిన చిన్నారిని తెచ్చిచ్చారని తెలిసి హతాశులయ్యారు. కన్నతల్లి న్యాయ పోరాటానికి దిగడంతో ఆ బిడ్డను అప్పజెప్పాల్సి వచ్చింది.



ఇలాంటి సంఘటనలు తరచుగా జరుగుతూనే ఉన్నాయి. అమ్మా అనే పిలుపు కోసం ప్రతి స్త్రీ ఎదురుచూస్తుంది. పొత్తిళ్లలో పాపాయిని పొదువుకుని మురిసిపోవాలనుకుంటుంది. కానీ పని ఒత్తిడి, అనారోగ్యాలు, జీవనశైలిలో మార్పులు... కారణాలు ఏవైతేనేం! ఎంతోమంది మహిళలు పిల్లల్ని కనే భాగ్యాన్ని కోల్పోతున్నారు... పిల్లలు పుట్టాలని గుడులూ-గోపురాలూ, చెట్టూ-పుట్టా తిరిగేవారు కొందరైతే, ఎలాగైనా సరే ఓ బిడ్డను ఇంటికి తెచ్చుకుని అమ్మా అని పిలిపించుకోవాలని ఆరాటపడేవారు మరికొందరు. కొన్ని ఫెర్టిలిటీ సెంటర్లు ఈ అవకాశాన్ని ఉపయోగించుకుని ఐవీఎఫ్, సరోగసీ వల విసురుతుంటే, మరోవైపు దత్తత పేరుతో దళారులు దండుకుంటున్నారు. చట్టవ్యతిరేకంగా జరుగుతోన్న ఈ కార్యక్రమాలకు ఆడవాళ్లే బాధితులవుతున్నారు. ఇందుకు కఠినంగా ఉన్న దత్తత నిబంధనలూ ఒక కారణం. అయితే, అపోహలు వదిలి ప్రభుత్వ నిబంధనలు సరిగా అర్థం చేసుకుంటే మీ కల నిజమవుతుంది. దత్తతకు ఓ నిర్దిష్ట ప్రక్రియ ఉంటుంది. అందులో కొన్ని న్యాయపరమైన అంశాలూ ఇమిడి ఉంటాయి. ఇది సుదీర్ఘ ప్రక్రియ కావడంతో ఓపిక అవసరం. ఇందుకు మానసికంగా సిద్ధంగా ఉండాలి. వీలైతే దంపతులిద్దరూ ఈ ప్రక్రియకు ముందే కౌన్సెలింగ్ తీసుకోవాలి.

నిబంధనలు ఇవి...



పిల్లలు లేని దంపతులు, వితంతువులు, విడాకులు తీసుకున్నవారు, ఒంటరిగా జీవిస్తున్నవారు... ఎవరైనా దత్తత తీసుకోవచ్చు. అయితే, దరఖాస్తుదారులు శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా స్థిరత్వం కలిగి ఉండాలి. ప్రాణాంతక వ్యాధులు కలిగి ఉండరాదు. అలానే, నేర చట్టాల ప్రకారం శిక్ష అనుభవించిన వారు, బాలల హక్కులను దుర్వినియోగపరిచినవారు పిల్లలను దత్తత తీసుకునేందుకు అనర్హులు. దత్తత కోరుకునే దంపతులు, వ్యక్తులు... 'కేరింగ్స్' పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. ఆధార్, పాన్, జనన, ఆదాయ, వివాహ, ఆరోగ్య ధ్రువపత్రాలతో పాటు పోలీసు స్టేషన్ నుంచి క్లియరెన్స్ వంటివన్నీ 30 రోజుల్లోగా అందులో అప్‌లోడ్ చేయాలి. ఒంటరి వ్యక్తి అయితే విడాకుల డిక్రీ/ భర్త లేదా భార్య మరణ ధ్రువపత్రం, బంధువుల ష్యూరిటీ కూడా సమర్పించాలి. ఈ దరఖాస్తులను వివిధ దశల్లో పరిశీలించి సీనియారిటీ, దంపతుల వయసు... ఇతర నిబంధనల్ని పరిగణనలోకి తీసుకుని పిల్లలను దత్తత ఇస్తారు. బంధువుల పిల్లల్ని దత్తత తీసుకోవాలన్నా సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ (కారా) అనుమతి పొందాల్సిందే.

ఇరువురి అనుమతీ కావాలి...



హిందూ అడాప్షన్ అండ్ మెయింటెనెన్స్ యాక్ట్‌లోని సెక్షన్-12 ప్రకారం దత్తత పిల్లలకు కన్నబిడ్డలతో సమానంగా హక్కులు ఉంటాయి. దత్తత జరిగేటప్పుడు ఇచ్చిపుచ్చుకోవడాలు(ఆర్థికలావాదేవీలు) ఉంటే అది చెల్లదు. ఈ చట్టంలోని సెక్షన్-9 ప్రకారం... దత్తత తీసుకునేది ఆడపిల్లని అయితే, అప్పటికే ఇంకో ఆడపిల్ల, అబ్బాయి అయితే మరో మగపిల్లాడు ఉండకూడదు. భార్యాభర్తలు రెండోవారి అనుమతి లేకుండా దత్తత తీసుకోకూడదు. 15 ఏళ్ల లోపు పిల్లలనే స్వీకరించాలి. అలానే, దత్తత తీసుకునే తండ్రికి కూతురికీ, తల్లి తీసుకుంటే ఆమెకీ ఆ కొడుక్కీ 21 సంవత్సరాల వయసు వ్యత్యాసం ఉండాలి. ఇచ్చేవారికి కూడా కొన్ని అర్హతలు ఉన్నాయి. తల్లిదండ్రులు కాకుండా వేరేవారు ఇస్తుంటే సంరక్షకులుగా కోర్టు పర్మిషన్ తీసుకోవాలి.



- జి. వరలక్ష్మి, న్యాయవాది

శోధిత

గర్భస్రావంతో... ఆ ప్రమాదం ఎక్కువట!



వయసు పైబడిన మహిళలు, ప్రత్యేకించి మెనోపాజ్ దశలో ఉన్నవాళ్లలో ఎముకలు గుల్లబారే సమస్య కనిపిస్తుంటుంది. అయితే, సంతాన సంబంధిత సమస్యలు ఉన్నవారిలో ఈ రిస్క్ మరింత ఎక్కువని ఫెర్టిలిటీ అండ్ స్టెరిలిటీ జర్నల్‌లోని తాజా అధ్యయనాలు చెబుతున్నాయి. వీటి ప్రకారం... సంతాన లేమి, గర్భస్రావం జరగటం, మృత శిశువు జన్మించటం... వంటివి గతంలో జరిగిఉంటే మెనోపాజ్ దశలో ఆడవాళ్లలో ఆస్టియోపోరోసిస్ (ఎముకలు గుల్లబారటం) ప్రమాదం పెరిగేలా చేస్తాయి. సంతాన సమస్యలు లేని మహిళలతో పోలిస్తే ఉన్నవారిలో ఆస్టియోపోరోసిస్ ముప్పు 16శాతం అధికం. ఇక, మూడు లేదా అంతకంటే ఎక్కువ గర్భస్రావాలు జరిగిన వారిలో ఇది 17శాతానికి ఎగబాకగా, మృత శిశువుకి జన్మనిచ్చిన వారిలో 14శాతంగా ఉంది. కాబట్టి, సంతానోత్పత్తికి సంబంధించిన అంశాల ఆధారంగా మహిళల్లో ఆస్టియోపోరోసిస్ ప్రమాదాన్ని ముందే పసిగట్టి, నివారణ చర్యలు తీసుకోవచ్చని చెబుతున్నారు పరిశోధకులు.

మూత్రపిండాల్లో రాళ్లు అందుకేనా..!

పాలకూర తింటే కిడ్నీలో రాళ్లు వస్తాయి అంటున్నారు. నిజమేనా? – ఓ సోదరి

ఆక్సలేట్స్ ఉత్పత్తి ఎక్కువై... అది మూత్రంలోని కాల్షియంతో కలిసినప్పుడు మూత్రపిండాల్లో రాళ్లు ఏర్పడతాయి. వీటిని కాల్షియం ఆక్సలేట్స్ అంటారు. పాలకూరలో ఆక్సలేట్ ఉంటుంది. కానీ దీన్ని తినడం వల్లే రాళ్లు వస్తాయన్న భావన సరికాదు. పాలకూరే కాదు కాఫీ, జీడిపప్పు, పిస్తా, వేరుశనగ లాంటివి తిన్నా కిడ్నీలో రాళ్లు వస్తాయని వీటికి దూరంగా ఉంటారు కొంతమంది. ఇవన్నీ అపోహలే. మితంగా, శరీరానికి కావాల్సినమేర ఏ ఆహారాన్ని తిన్నా... అనారోగ్య సమస్యలేవీ రావు. అతిగా అవసరానికి మించి తినడం వల్లే సమస్యంతా. అయితే మధుమేహం, స్థూలకాయం లాంటి దీర్ఘకాలిక అనారోగ్యాలతో బాధపడుతున్న వారికి కిడ్నీ సమస్యలు వచ్చే అవకాశం ఎక్కువ. ఇలాంటివాళ్లు ఆహారంలో కొన్ని మార్పులు చేసుకోవడం ద్వారా ఈ సమస్య నుంచి బయటపడొచ్చు. శరీరం ఎప్పుడూ హైడ్రేటెడ్‌గా ఉండేలా చూసుకోవాలి. రోజుకి రెండుమూడు లీటర్ల నీళ్లను తాగాలి. కర్బూజ, కీర వంటి నీళ్లు అధికంగా ఉండే పండ్లను తినాలి. ఆక్సలేట్స్ అధికంగా ఉండే పదార్థాల్ని తినేటప్పుడు పాలు, పాల సంబంధిత పదార్థాలు కలిపి, వండుకుని తింటే మంచిది. వీటిల్లో ఉండే కాల్షియం ఆక్సలేట్స్‌ను గ్రహిస్తుంది. దాంతో కిడ్నీలో రాళ్లు వచ్చే అవకాశం తక్కువ.

డియర్ వసుంధర



డాక్టర్ లతాశశి, పోషకాహార నిపుణులు

నెలసరి ఆలస్యానికి... జంక్‌ఫుడ్ కారణమా?

నాకు 26 ఏళ్లు, పెళ్లైంది. నూడుల్స్, మంచూరియా, బిర్యానీ అంటే చాలా ఇష్టం. ఇవి తినడం వల్లే నెలసరి ఆలస్యం అవుతుంది అంటున్నారు. నిజమేనా? నేను ఎలాంటి ఆహారం తినొచ్చు? – ఓ సోదరి

రోజువారీ ఆహారంలో కొవ్వు, చక్కెర, ఉప్పు అధికశాతం ఉంటే... హార్మోన్ల అసమతౌల్యానికి గురయ్యే ఆస్కారం ఉంది. అయితే మీ సమస్యకు ఇదొక్కటే కారణం అని చెప్పలేం. పీసీఓఎస్ సమస్య ఉన్నవాళ్లు తొందరగా దీనివల్ల ప్రభావితమవుతారు. అందుకే ముందు మీరు గైనకాలజిస్టుని కలిసి, పీసీఓఎస్ ఉందేమో తెలుసుకోండి. తర్వాత దానికి తగినట్లు ప్రణాళికలు సిద్ధం చేసుకోవచ్చు. ఆహార మార్పుల విషయానికొస్తే... ప్రాసెస్ చేసిన ఉత్పత్తుల్నీ, బయటి ఆహారాన్నీ పూర్తిగా తగ్గించాలి. రోజూ ఒకట్రెండు రకాల పండ్లని 100గ్రా. నుంచి 200 గ్రా. వరకూ తీసుకోండి. దీనివల్ల విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు శరీరానికి అందుతాయి. హార్మోన్ల పనితీరు మెరుగుపడటానికి ఇవి సహకరిస్తాయి. కూరగాయల్ని మీ ప్రణాళికలో ఉండేలా చూసుకోండి. ముడిధాన్యాల్ని తినండి. వీటివల్ల శరీరానికి అవసరమైన విటమిన్-బి, పీచు పుష్కలంగా అందుతాయి. వీటితోపాటూ పప్పు దినుసులు, శనగలు, పెసలు... వంటివి 30గ్రా. వరకూ తీసుకోవచ్చు. దీంతోపాటూ కొవ్వు తక్కువగా ఉండే పాలు, పాలసంబంధిత పదార్థాల్ని మీ డైట్‌లో చేర్చుకోండి. ఈ ఆహార నియమాల్ని క్రమం తప్పకుండా పాటిస్తే మీ సమస్య నుంచి బయటపడొచ్చు.

పిల్లలకు విద్య... పెద్దలకు ఉపాధి!



గుప్పెడు మెతుకుల కోసం... పోరాటం చేసే పిల్లల్ని చూసి చలించిపోయింది పిన్నమనేని శ్రీలక్ష్మి. ఆకలితో అలమటిస్తూ... తప్పుదోవ పడుతున్న వాళ్ల బతుకుల్ని మార్చాలనుకుంది. అందుకామె ఏం చేసిందంటే...



విద్య అర్హత మాత్రమే కాదు... గౌరవం, ఎవరి కాళ్లమీద వారు నిలబడే అవకాశం. అలాంటి దానికి దూరమవుతూ దుర్భరమైన జీవితాల్ని గడుపుతున్నారు మురికివాడల్లోని ప్రజలు. పెద్దల సంగతి సరే... పిల్లలదీ అదే పరిస్థితి. చిన్నవయసులోనే డ్రగ్ పెడ్లర్లుగా మారుతున్నారు. 14 ఏళ్లకే పెళ్లిళ్లు... ఏడాది తిరిగేలోపే పిల్లలు... ముప్పై ఏళ్లు నిండకముందే మరణాలు. ఇవన్నీ ఏ మారుమూలో చోటు చేసుకుంటున్న సమస్యలు కాదు. విజయవాడ స్లమ్స్‌లో కనిపిస్తోన్న దృశ్యాలు. దీన్ని మార్చాలనే ఓం శాంతి ఛారిటబుల్ ట్రస్ట్‌ను స్థాపించా. నేను పుట్టిపెరిగిందంతా విజయవాడే. నాన్న పిన్నమనేని పరంధామయ్య, ఆడిటర్. అమ్మ శాంతిశ్రీ. పదో తరగతి వరకూ నిర్మలా కాన్వెంట్‌లో చదువుకున్నా. చిన్నప్పట్నుంచే సామాజిక సేవలో ఆసక్తి చూపించేదాన్ని. సీఏ పూర్తయ్యాక, ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాను. తిరిగొచ్చి ఇక్కడే ఆడిటింగ్ సంస్థను స్థాపించా. అమెరికాలోని పలు కంపెనీలకు సేవలు అందిస్తున్నా.

ఆ ఒక్క ఘటనే...

ఈ క్రమంలోనే ఓ రోజు పనిమీద వెళ్తూ... రహదారి పక్కన ఇద్దరు పిల్లలు ఆహారం కోసం కొట్టుకోవడం చూశాను. ఇంటికి వెళ్లాకా అవే దృశ్యాలు కళ్లముందు కదిలాయి. మరుసటి రోజు వాళ్లను వెతుక్కుంటూ పక్కనే ఉన్న మురికివాడకు వెళ్లాను. అక్కడి పరిస్థితులు చూశాక, నా బాధ మరింత ఎక్కువైంది. దాదాపు సగానికి పైగా పిల్లలు కనీస వసతుల్లేని అపరిశుభ్ర వాతావరణంలో జీవనం సాగిస్తున్నారు. అప్పుడే నిర్ణయించుకున్నా... వారికి చేతనైనంత సాయం చేయాలని. విద్య ఒక్కటే వారి పరిస్థితుల్ని మార్చగలదు అనిపించింది. అప్పుడే మురికివాడల్లో పిల్లలకు అండగా నిలుస్తున్న సామాజిక కార్యకర్త జోన్స్ మానికొండతో పరిచయమైంది. ఆమె అక్కడి సమస్యలు, తీసుకురావాల్సిన మార్పు మీద కొన్నేళ్ల నుంచి పనిచేస్తున్నారు. దాంతో 2016 నుంచి జోన్స్‌తో కలిసి పనిచేయడం మొదలుపెట్టా. అవసరమైన మొత్తాన్ని విరాళంగా ఇచ్చేదాన్ని.

కొట్టడానికి వచ్చారు...

మీ పిల్లల్ని మాతో పంపండి, చదివిస్తాం అంటే... 'మా పొట్ట కూటికి ఆటంకం కలిగిస్తున్నా'రంటూ... మమ్మల్ని కొట్టడానికి వచ్చారు. ఆదాయ మార్గాలు లేక... పిల్లల్ని చెత్త కాగితాలు ఏరడానికి, బిక్షాటనకు, ఎలుకలు పట్టడానికి తీసుకెళ్లే వారే ఎక్కువ. వీళ్లకి ఉపాధి, ఆదాయ మార్గాలు చూపిస్తే... పిల్లల్ని ట్యూషన్ సెంటర్లకు పంపిస్తారు అనిపించింది. నెలవారీ సరకులు ఇచ్చాం. కొందరితో తోపుడు బండ్లు పెట్టించాం. మహిళలకు కుట్టు మెషీన్లు అందజేశాం. పిల్లలకు పోషకాహారం ఇచ్చేవాళ్లం. దాంతో తల్లిదండ్రులకు మాపై నమ్మకం పెరిగింది. పిల్లలు ట్యూషన్ సెంటర్లకు రావడం మొదలుపెట్టారు. ప్రస్తుతం 13 చోట్ల ఈ సెంటర్లు నడుస్తున్నాయి. ఒక్కో సెంటర్‌లో 20మందికి పైగా పిల్లలు ఉన్నారు. ఇక్కడ విద్యతోపాటు వ్యక్తిగత శుభ్రతకు సంబంధించిన పాఠాలూ చెబుతాం. చదువుకుని వీళ్లంతా పెద్ద పెద్ద అధికారులు కాలేకపోవచ్చేమో కానీ... మేము నేర్పుతున్న విలువలతో వాళ్ల జీవితాల్ని తీర్చిదిద్దుకుంటారనే మా ఈ ప్రయత్నం.

– మరిశర్ల జగదీష్‌కుమార్, విజయవాడ

పచ్చని పట్టణాలకోసం...

ఎటుచూసినా ఎడారి నేల, చెత్తకుప్పలు, వీధికుక్కలు, భూ ఆక్రమణలు... చూద్దామన్నా పచ్చదనం కనిపించదు. ఇదీ రాజస్థాన్‌లోని చూరూ, బార్మర్ జిల్లాల ఒకప్పటి పరిస్థితి. ఇప్పుడవి పచ్చదనంతో పల్లవిస్తున్నాయి. ఔషధ వనాలతో ఆరోగ్యాన్ని పండిస్తున్నాయి. పర్యటక ప్రదేశాలుగా కనువిందు చేస్తున్నాయి. కారణం ఇండియన్ ఫారెస్ట్ సర్వీస్ ఆఫీసర్... సవితా దహియా.



'ఈ మార్పు అంత తేలికగా రాలేదు. ఆక్రమణదారులు బెదిరించారు, చంపుతామన్నారు. కేసులు పెట్టారు. కోర్టులకెళ్లారు. అయినా భయపడలేదు. స్థానిక రాజకీయ నాయకులు, అధికారులతో ఎంతో చర్చించా. సమావేశాల్లో పాల్గొన్నా. వీటన్నింటితోపాటు స్థానికుల మద్దతు, మా సిబ్బంది కఠిన శ్రమతోనే ఇది సాధ్యమైంది. నేనిక్కడకు వచ్చినప్పుడు ఎంతో కలత చెందా. ఎక్కడా చిన్న పార్కు లేకుండా ఎలా బతికేస్తున్నారా అనిపించింది. ఏం చేయాలో తోచలేదు. సరిగ్గా అప్పుడే కొవిడ్ రావడం కలిసొచ్చింది. జనసంచారం తగ్గడంతో పనులు త్వరగా పూర్తయ్యాయి. పైగా ఆ సమయంలో గర్భిణిని కూడా. ప్రసూతి సెలవుల్లోనూ పనుల్ని పర్యవేక్షిస్తుండేదాన్ని' అంటారు సవిత.



రాజస్థాన్ క్యాడర్‌కి చెందిన సవిత... డెప్యూటీ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్ ఆఫీసర్‌గా చూరూ జిల్లాకు వెళ్లడంతోనే చెత్తనీ, ఆక్రమ నిర్మాణాల్నీ తొలగించారు. ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించి నిధులు తెప్పించారు. ఔషధ మొక్కలతో పార్కులు, నర్సరీలు ఏర్పాటుచేశారు. పిల్లల్లో మహిళల్లో రక్తహీనత ఎక్కువగా ఉండటం గుర్తించి, అటవీశాఖ నర్సరీల్లో మునగ మొక్కల్ని పెంచారు. సబ్సిడీమీద ఒక్క రూపాయికే వాటిని అందించేలా చేశారు. ఆహారంలో ఈ మొక్క ప్రాధాన్యం గురించి పాంఫ్లెట్లద్వారా అవగాహన కల్పించారు. పాఠశాలల్లో వర్క్‌షాపులు నిర్వహించడం ద్వారా పిల్లలు ఈ మొక్కలు నాటేలా చేశారు. ఎందుకంటే ఎడారి ప్రాంతమైన చూరూలో మునగ సాధారణంగా పెరగదు. అందుకే దాని సంరక్షణకోసం ఎన్నో చర్యలు చేపట్టారు. ఫలితం ఇప్పుడు చాలాచోట్ల ఇవి కనిపిస్తున్నాయి. మునగనే కాదు, ఎన్నో ఔషధ పార్కుల్ని ఏర్పాటుచేశారు. దాంతో పర్యటకుల సంఖ్య పెరిగింది. అందుకే చూరూ జిల్లాకి ఆ రాష్ట్ర ప్రభుత్వం నుంచి సీఎం ఎక్సలెన్స్ అవార్డు లభించింది.

సవిత చూరూ నుంచి బదిలీమీద బార్మర్ జిల్లాకు వెళ్లాక, బంజరుగా ఉన్న వేల ఎకరాల్ని గడ్డి నేలలుగా మార్చారు. నీటిగుంటలు తవ్వించారు. ఫెన్సింగ్ వేయించి, సీడ్ బాల్స్ ద్వారా స్థానిక వృక్షజాతులు పెరిగేలా చేసి కృష్ణజింకలు, చింకారాలకు ఆవాసాన్ని కల్పించారు. పచ్చదనం, జలసిరితో కూడిన ఈ నేల ఇప్పుడు ప్రజల జీవనానికి ఆధారంగా మారింది.

'ఎడారి పట్టణాల్లో వెలసిన పచ్చని పార్కుల్లో పిల్లలు ఆడుకోవడం, మహిళలు యోగా చేయడం, పెద్దవాళ్లు కబుర్లు చెప్పుకోవడం చూస్తుంటే నాకెంతో ఆనందంగా అనిపిస్తుంది. వ్యవస్థలూ వ్యక్తుల నుంచి వ్యతిరేకత ఎదురైనా ప్రజల సహకారంతో ముందుకెళ్లా. ముందు మనమీద మనకు నమ్మకం ఉండాలి. అప్పుడే సాధించగలం' అంటోన్న ఈ ఫారెస్ట్ ఆఫీసర్ కృషి ప్రశంసనీయమే కదూ!



మీకు తెలుసా?

పసిపిల్లల మెదడు తొలినాళ్లలో వేగంగా అభివృద్ధి చెందుతుంది. అయితే, ఇందుకు తల్లిపాలతో పాటు, చుట్టూ ఉండే వాతావరణం ప్రత్యేకించి సంరక్షకులతో ఉండే సానుకూల, ప్రతిస్పందనాత్మక సంబంధాలు (సర్వ్ అండ్ రిటర్న్ ఇంటరాక్షన్) వంటివీ కీలకమట. ఇది వారిలో ఆత్మవిశ్వాసం, భద్రతా భావాలను పెంచుతుంది.



బంగారం - వెండి

20న ముగింపు

	బంగారం (24క్యా)	ఆర్నమెంట్ (22క్యా)	వెండి (కిలో)
హైదరాబాద్	1,02,290	92,750	1,16,035
విజయవాడ	98,630	91,800	1,14,700
ప్రొద్దుటూరు	1,00,300	92,280	1,14,700
రాజమహేంద్రవరం	1,00,150	91,800	1,25,000
విశాఖపట్నం	99,790	91,800	1,23,000
తమిళనాడు	-----	91,800	1,25,000

డెస్క్ మీదా పెంచేద్దాం!

వాన ముసురు ఒకలాంటి నిరాశ భావనను తెస్తుంది. ఆ సమయంలో చివుళ్లు తొడుగుతున్న మొక్కలను చూస్తే తెలియని ఆనందం. కాబట్టే, ప్రతిఒక్కరూ మొక్కలను పెంచడానికి సిద్ధమవుతుంటారు. ఆఫీసులో ఒత్తిడి అదనం కదా! ఈ కాలానికి తగ్గట్టుగా కొన్ని మొక్కలను సూచిస్తున్నారు నిపుణులు. డెస్క్ మీద వాటికీ చోటిచ్చి చూడండి.

ఆంథూరియమ్



ఫ్లెమింగ్ ప్లాంట్‌గానూ పిలిచే ఈ మొక్క మీ డెస్క్‌కే కొత్త అందాన్ని తెస్తుంది. దీని ఆకులు ఎరుపు, పచ్చ రంగుల మేళవింపుతో ఉంటాయి. ఆకర్షణీయంగా కనిపించడమే కాదు, మూడ్‌నీ ఇట్టే మార్చేయగలదు. ఒకటి డెస్క్‌మీద పెట్టేయండి. పండగ కళను జోడించేస్తుంది.





బోస్టన్ ఫెర్న్

దీనికి పీస్‌ఫుల్ ఫెర్న్ అనీ పేరు. ఆకులు ఈకల్లా ముదురు ఆకుపచ్చ రంగులో కనిపిస్తాయి. గదిలో తేమను పెంచడమే కాదు... మనసునీ ఉత్తేజంగా మారుస్తాయి. అప్పుడప్పుడూ ఎండను అందిస్తే చాలు. చక్కగా పెరుగుతుంది.

పీస్ లిలీ



చల్లదనానికి జలుబు, దగ్గు వంటివి చుట్టుముడతాయి. శ్వాస ఇబ్బందుల సంగతి సరేసరి. దీన్ని దగ్గర్లో ఉంచుకోండి. శ్వాస సంబంధిత సమస్యలు దరికి చేరకుండా ఇది ఆపగలదట. ఇక ఈ మొక్క ముదురు ఆకుపచ్చ ఆకులు, తెల్లని పూలు మనసుకు కలిగించే హాయి గురించైతే ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు.

స్టార్ కాక్టస్



మొక్కలు పెంచుకోవాలి అని ఉంటుంది. కానీ ఎలా పెంచాలో తెలియదు అనుకున్నవాళ్లు దీన్ని ప్రయత్నించొచ్చు. నక్షత్రాకారంలో చూడటానికి డెకరేషన్ పీస్‌లాగే కనిపిస్తుంది. అప్పుడప్పుడూ కొద్దిగా నీళ్లు అందిస్తే చాలు... గాలిలో మలినాలను తొలగించి, రోజూ స్వచ్ఛమైన గాలినీ ఇస్తుంది.

క్యాథెటర్ గొట్టాలతో ఐసీయూలలో అంటురోగాలు




దిల్లీ: ఆస్పత్రుల ఇంటెన్సివ్ కేర్ యూనిట్ (ఐసీయూ)లలో రోగుల రక్తనాళాల్లో క్యాథెటర్ గొట్టాలను అమర్చడం అంటువ్యాధులకు దారితీస్తోందని దిల్లీ ఎయిమ్స్ వైద్యుల అధ్యయనం తేల్చింది. మందులకు లొంగని బ్యాక్టీరియాలు ఈ అంటువ్యాధులకు కారణమవుతున్నాయి. వీటి చికిత్సకు రోగులు ఎక్కువ కాలం ఆస్పత్రిలో ఉండాల్సి రావడంతో ఖర్చులు పెరిగిపోతున్నాయి. చేతులు, కాళ్లలోని నరాల బదులు పెద్ద సిరలో క్యాథెటర్ అమర్చడం ఐసీయూలలో సర్వసాధారణం. దీనివల్ల ప్రతి 1,000 రోజులకు ఎనిమిది రక్తనాళ అంటువ్యాధుల చొప్పున సంభవిస్తున్నాయి. అల్పాదాయ దేశాలతోపాటు భారత్ వంటి మధ్యాదాయ దేశాలలోనూ ఈ తరహా క్యాథెటర్లు అనారోగ్యానికీ, మరణాలకూ కారణమవుతున్నాయి. పెద్ద సిరకు క్యాథెటర్ అమర్చడం కొవిడ్ కాలంలో అత్యధిక అంటురోగాలకు దారితీసింది. దీన్ని నివారించాలని అధ్యయనకర్తలు సూచించారు.

అగ్ని-5 బాలిస్టిక్ క్షిపణి పరీక్ష విజయవంతం



దిల్లీ: క్షిపణి రంగంలో భారత్ మరోసారి తన సత్తా చాటుకుంది. మధ్యమ శ్రేణి బాలిస్టిక్ క్షిపణి అయిన 'అగ్ని-5'ను బుధవారం విజయవంతంగా ప్రయోగించింది. ఒడిశాలోని చాందీపుర్ పరీక్షా కేంద్రంలో జరిగిన ఈ ప్రయోగంలో 'అగ్ని-5'.. అన్ని సాంకేతిక, కార్యనిర్వాహక ప్రమాణాలను పాటిస్తూ లక్ష్యాన్ని ఛేదించిందని రక్షణ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ విజయం భారత వ్యూహాత్మక సైనిక సామర్థ్యాన్ని చాటి చెప్పిందని వెల్లడించింది. భారత అణ్వాయుధ కార్యకలాపాల నిర్వహణ, నియంత్రణలకు బాధ్యత వహించే స్ట్రాటజిక్ ఫోర్సెస్ కమాండ్ పర్యవేక్షణలో ఈ ఖండాంతర క్షిపణి పరీక్ష జరిగింది. రక్షణ పరిశోధన, అభివృద్ధి సంస్థ (డీఆర్‌డీవో) అభివృద్ధి చేస్తున్న ఈ క్షిపణి పరిధి 5 వేల కిలోమీటర్లు. ఒకేసారి మూడు అణు వార్‌హెడ్‌లను మోసుకెళ్లి.. ఫైర్ చేసే సామర్థ్యం దీనికి ఉంది.

ఉపరాష్ట్రపతి.. న్యాయమూర్తిలాంటి వారే



- 'ఈనాడు-ఈటీవీ'తో ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి

ఈనాడు, దిల్లీ: ఉపరాష్ట్రపతి పదవి.. న్యాయమూర్తి హోదా లాంటిదేనని, ఆ స్థానంలో ఉన్నవారు తరతమ భేదం లేకుండా నిష్పాక్షికంగా నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని ప్రతిపక్షాల అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆయన బుధవారం 'ఈనాడు-ఈటీవీ'తో తన మనసులోని భావాలను పంచుకున్నారు. "ఇండియా కూటమి నన్ను ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎన్నుకోవడం చాలా సంతోషం కలిగించింది. ఇది నా సుదీర్ఘ ప్రయాణానికి కొనసాగింపే. న్యాయవాదిగా, హైకోర్టు న్యాయమూర్తి, ప్రధాన న్యాయమూర్తి, సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా నాకు రాజ్యాంగంతో పేగుబంధం పెనవేసుకుపోయింది. ఉప రాష్ట్రపతి పదవి కూడా రాజ్యాంగ ప్రక్రియతో ముడిపడిన స్థానమే. సర్వేపల్లి రాధాకృష్ణన్, కె.ఆర్.నారాయణన్, కృష్ణకాంత్, హమీద్ అన్సారీ, వెంకయ్యనాయుడులాంటి ఎంతోమంది ప్రతిభావంతులు కూర్చున్న పీఠం అది. ఆ స్థానంలో కూర్చొనే అవకాశం వస్తే దేశానికి ఏదైనా మేలుచేసే వీలుంటుంది. నేను దీన్ని రాజకీయపరమైన పదవి అని అనుకోవడం లేదు. గతంలో వెంకయ్యనాయుడు ఒక రాజకీయపార్టీ నుంచి వచ్చినా బాధ్యతలు స్వీకరించగానే పార్టీలకు అతీతంగా వ్యవహరిస్తానని ప్రకటించారు. అందుకే దాన్ని నేను రాజకీయాలకు సంబంధంలేని స్థానంగా చెబుతున్నా. న్యాయమూర్తికి, ఉప రాష్ట్రపతి పదవిలో ఉన్నవారికి పెద్ద తేడా ఉండదు. అందర్నీ సమానంగా చూసి దేశానికి దిశానిర్దేశం చేయగలిగిన స్థానం అది. ఉపరాష్ట్రపతిని ఎన్నుకునేది ఎంపీలు తప్పితే రాజకీయ పార్టీలు కాదు. అందువల్ల సాధ్యమైనంతమంది ఎంపీలను కలవడానికి ప్రయత్నిస్తాను. వాళ్లు తమ విచక్షణను ఉపయోగించి ఓటు హక్కును వినియోగించుకుంటారని భావిస్తున్నాను" అని జస్టిస్ సుదర్శన్ రెడ్డి పేర్కొన్నారు.

టీచర్‌పై పెట్రోల్ పోసి నిప్పంటించిన విద్యార్థి

భోపాల్: ఓ 18 ఏళ్ల విద్యార్థి తన పూర్వ పాఠశాలలోని 26 ఏళ్ల ఉపాధ్యాయురాలిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన ఘటన మధ్యప్రదేశ్‌లో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. నర్సింగ్‌పుర్ జిల్లాలోని ఓ పాఠశాలకు చెందిన పూర్వ విద్యార్థిని రెండేళ్ల క్రితం యాజమాన్యం బహిష్కరించడంతో వేరే పాఠశాలలో చేరాడు. అయితే పూర్వ పాఠశాలలో బోధించే ఓ టీచర్‌పై ఆకర్షణ పెంచుకున్నాడు. ఈనెల 15న జరిగిన స్వాతంత్ర్య వేడుకల్లో ఆమెపై అసభ్యకర వ్యాఖ్యలు చేశాడు. దీంతో ఆమె పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో కోపోద్రిక్తుడైన విద్యార్థి సోమవారం మధ్యాహ్నం టీచర్ ఇంటికి పెట్రోల్ తీసుకెళ్లి ఒక్కసారిగా ఆమెపై పోసి, నిప్పంటించాడు. బాధితురాలు ప్రస్తుతం ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నట్లు పోలీసులు తెలిపారు. ఎటువంటి ప్రాణాపాయం లేదని వైద్యులు చెప్పినట్లు పేర్కొన్నారు. నిందితుణ్ని అదుపులోకి తీసుకున్నట్లు వెల్లడించారు.



మార్పులకు అనుగుణంగా మారాల్సిందే..

మునుపెన్నడూ లేనంత వేగంగా మార్పులు చోటుచేసుకుంటున్న ప్రస్తుత ప్రపంచంలో మనకు ఉండాల్సిన అతి ముఖ్యమైన సామర్థ్యమేంటో తెలుసా? మార్పులకు అనుగుణంగా మనల్ని మనం అంతే వేగంగా సిద్ధం చేసుకోవడం. ఆ నైపుణ్యం లేని వారు కనుమరుగవుతారు. అందుకే భవిష్యత్తులో రాబోయే పరిస్థితులపై అవగాహన పెంచుకుంటూ, అందుకు అవసరమైన నైపుణ్యాలను సాధన చేయండి.

– ఎడ్డీ క్వాన్, మార్కెటింగ్ ఎక్స్‌పర్ట్

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుకు లోక్‌సభ పచ్చజెండా

- ప్రతిపక్షాల ఆందోళనల మధ్యే మూజువాణి ఓటుతో ఆమోదం
- అతిక్రమణదారులకు మూడేళ్ల జైలు, రూ.కోటి జరిమానా ప్రతిపాదన



లోక్‌సభలో ఆన్‌లైన్ గేమింగ్ బిల్లును ప్రవేశపెడుతున్న కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్

దిల్లీ: నగదుతో ఆన్‌లైన్ గేమింగ్ నిర్వహణ, సహకారం, ప్రాచుర్యం కల్పించడాన్ని నిషేధించే కీలక బిల్లును బుధవారం లోక్‌సభ ఆమోదించింది. 'ది ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ బిల్లు, 2025'ను కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ మంత్రి అశ్వినీ వైష్ణవ్ లోక్‌సభలో బుధవారం ప్రవేశపెట్టారు. బిహార్‌లో ఓటర్ల జాబితాల్లో ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాల ఆందోళనల నేపథ్యంలో దీనిపై ఎటువంటి చర్చ జరగకుండానే బిల్లుకు సభ ఆమోదం తెలిపింది. ఆన్‌లైన్ ఆటలతో అనేకమంది బాధితులుగా మారుతున్న ఘటనలు పెరిగిపోతుండటం, ఈ వ్యవహారాల్లో నగదు అక్రమ చలామణి, ఆర్థిక అవకతవకలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. ఆన్‌లైన్ గేమ్స్, ఈ-స్పోర్ట్స్ మధ్య విభజన చూపించేలా బిల్లును రూపొందించారు. ఇది పార్లమెంటు ఆమోదం పొంది చట్టంగా మారితే నిబంధనల్ని ఉల్లంఘించి నగదుతో కూడిన ఆన్‌లైన్ గేమ్స్ అందిస్తున్నవారికి మూడేళ్ల వరకు జైలుశిక్ష, లేదా రూ.కోటి వరకు జరిమానా విధిస్తారు.

బిల్లును ప్రవేశ పెట్టిన సందర్భంగా అశ్వినీ వైష్ణవ్ మాట్లాడుతూ.. ఈ-స్పోర్ట్స్, ఆన్‌లైన్ సోషల్ గేమింగ్‌కు ప్రోత్సాహం ఇవ్వాలని కేంద్రం భావిస్తోందన్నారు. ఇందుకోసం ఓ అథారిటీని ఏర్పాటు చేస్తామన్నారు. ఈ బిల్లుపై చర్చలో పాల్గొనాలని ప్రతిపక్ష సభ్యులకు విజ్ఞప్తి చేశారు. ఆన్‌లైన్ మనీ గేమింగ్‌తో పలు కుటుంబాలు నాశనమయ్యాయని, యువత భవిష్యత్తు దెబ్బతింటోందని స్పీకర్ ఓం బిర్లా వ్యాఖ్యానించారు. చివరకు ప్రతిపక్ష సభ్యుల నిరసనల మధ్యే బిల్లుకు మూజువాణి ఓటుతో సభ ఆమోదం తెలిపింది. ఈ బిల్లు పోకర్, రమ్మీ ఇతర కార్డు గేములు, ఆన్‌లైన్ లాటరీలు సహా అన్నిరకాల ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ (సట్టా, జువా) కార్యకలాపాలను నిషేధిస్తుంది.

మళ్లీమళ్లీ పాల్పడితే ఐదేళ్ల జైలు

ఆన్‌లైన్ నగదు గేములకు సంబంధించిన ప్రకటనల్లో పాలు పంచుకున్నవారికి గరిష్ఠంగా రెండేళ్ల జైలుశిక్ష, రూ.50 లక్షల వరకు జరిమానా విధిస్తారు. వీటి ఆర్థిక లావాదేవీల్లో ప్రమేయం ఉన్నవారికీ గరిష్ఠంగా మూడేళ్ల శిక్ష, రూ.కోటి వరకు జరిమానా వేస్తారు. తరచూ ఈ నేరాలకు పాల్పడేవారికి మూడు నుంచి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. రెండు కోట్ల వరకూ జరిమానా విధిస్తారు. ఆన్‌లైన్ మనీ గేమ్స్ ఆడేవారిని నేరస్థులుగా కాకుండా.. బాధితులుగా ఈ బిల్లులో పేర్కొన్నారు.

అగ్రశ్రేణి క్రికెట్ క్రీడాకారులు, ప్రముఖ సినీ నటుల ప్రచారంతో డ్రీమ్ 11, గేమ్స్ 24/7, మొబైల్ ప్రీమియర్ లీగ్ వంటి నగదుతో కూడిన ఆన్‌లైన్ గేములకు ప్రాచుర్యం పెరిగింది.

నిషేధం వద్దు.. నియంత్రణ చాలు

మరోవైపు ఈ బిల్లు కారణంగా తమ రంగానికి తీవ్ర నష్టం కలుగుతుందని ఆల్ ఇండియా గేమింగ్ ఫెడరేషన్, ఈ-గేమింగ్ ఫెడరేషన్, ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఫాంటసీ స్పోర్ట్స్ ప్రతినిధులు కేంద్ర హోం మంత్రి అమిత్‌షాకు లేఖ రాశారు. గేమింగ్‌పై నిషేధం విధించేకంటే.. నియంత్రణ ఉంచాలని సూచించింది.

మకరాలను మట్టికరిపించిన మగువలు

కుమారుడి కోసం ఒకరు, భర్త కోసం మరొకరి సాహసం

బహరాయిచ్: ఉత్తర్‌ప్రదేశ్‌లోని బహరాయిచ్ జిల్లాలో రెండు మొసళ్లను ఎదిరించి ఇద్దరు మహిళలు ఒక్కసారిగా ప్రముఖులుగా మారిపోయారు. వేర్వేరుగా జరిగిన రెండు సంఘటనల్లో ఒకరు తన ఐదేళ్ల కుమారుడిని రక్షించుకోగా, మరొకరు తన భర్తను కాపాడుకోగలిగారు. మొదటి ఘటనలో ఖైరీఘాట్ ప్రాంతంలోని డాకియా గ్రామంలో ఆదివారం ఓ ఏడు అడుగుల మొసలి వీరు(5) అనే బాలుడిని మురుగునీటి కాలువలోకి లాక్కుపోయింది. చిన్నారి కేకలు విన్న అతని తల్లి వెంటనే అక్కడకు చేరుకుని ప్రాణాలకు తెగించి అందులో దూకింది. తన శక్తినంతా కూడదీసుకుని ఓ చేతితో బాలుడిని గట్టిగా పట్టుకుని మొసలి ఈడ్చుకుపోకుండా నిలువరించింది.




మరో చేతిలోని ఇనుప కడ్డీతో మొసలిని పదే పదే బలంగా కొట్టింది. దీంతో ఆ మకరం బాలుడిని విడిచిపెట్టి నీటిలో మునిగి పారిపోయింది. కొద్దిగా గాయాలపాలైన ఆ చిన్నారి ప్రాణాలకు ఎటువంటి ప్రమాదం లేదని స్థానిక డివిజనల్ అటవీ అధికారి ధ్రువీకరించారు.

మరో ఘటనలో మోతిపుర్ ప్రాంతంలో మాధవపుర్ గ్రామంలో సైపు(45) తన భార్య సూర్జానాతో కలిసి రామ్‌తాలియా కాలువ దాటుతున్నాడు. ఒక్కసారిగా ఓ మొసలి సైపు కాలును పట్టుకుంది. అతను సహాయం కోసం కేకలు వేస్తుంటే సూర్జానా తన చీరను అతడికి అందించింది. తద్వారా సైపును మకరం ఈడ్చుకువెళ్లకుండా నిలువరించింది. ఇంతలో అక్కడికి చేరుకున్న గ్రామస్థులు మొసలిని కర్రలతో గట్టిగా కొట్టారు. దీంతో అది సైపును విడిచిపెట్టింది.

రాజ్యాంగానికి కట్టుబడిన వ్యక్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి

- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ
- నేడు విపక్ష కూటమి ఉపరాష్ట్రపతి అభ్యర్థి నామినేషన్



ఈనాడు, దిల్లీ: రాజ్యాంగానికి త్రికరణశుద్ధిగా కట్టుబడిన వ్యక్తి జస్టిస్ సుదర్శన్‌రెడ్డి అని, అందుకే ఆయన గత 52 ఏళ్లుగా ఎక్కడికెళ్లినా జేబులో రాజ్యాంగాన్ని వెంట తీసుకెళ్తున్నారని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్‌గాంధీ పేర్కొన్నారు. రాజ్యాంగ సంరక్షకులు, విధ్వంసకుల మధ్య యుద్ధం జరుగుతున్న తరుణంలో న్యాయకోవిదుడిని ప్రతిపక్షాల తరఫున ఉపరాష్ట్రపతి అభ్యర్థిగా ఎంపికచేయడం సంతోషంగా ఉందని వ్యాఖ్యానించారు. ఇండియా కూటమి పార్టీలు బుధవారం తమ ఎంపీలకు ఆయన్ని పరిచయం చేశాయి. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీనేత సోనియాగాంధీ తోపాటు ఎన్సీపీ నాయకుడు శరద్ పవార్ తదితరులు పాల్గొన్నారు. రాహుల్‌గాంధీ మాట్లాడుతూ రాజ్యాంగ విలువల కోసం జస్టిస్ రెడ్డి పోరాడారని కొనియాడారు. దేనికైనా చివరి సమాధానం రాజ్యాంగంలోనే ఉంటుందని, అందుకే రాజ్యాంగాన్ని తనతోపాటే అన్నిచోట్లకూ తీసుకెళ్తున్నానని ఆయన చెప్పినట్లు రాహుల్ వెల్లడించారు. ఆయన ఎన్నో కీలక తీర్పులు వెలువరించి ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేశారని ఖర్గే కొనియాడారు. ఈ ఎన్నిక సైద్ధాంతిక పోరాటమని తెలిపారు. జస్టిస్ సుదర్శన్‌రెడ్డి మాట్లాడుతూ- తన సంతోషానికి అవధులు లేవని పేర్కొన్నారు. ఎంపీలను ఉద్దేశించి మాట్లాడటానికి ఉద్యుక్తమైన సమయంలో ఉత్కంఠ, ఉద్వేగం కలిగాయన్నారు. వివిధ సమస్యలపై వారు మాట్లాడినప్పుడు ప్రతి ఒక్కరినీ తాను పరిశీలిస్తూ వచ్చానని చెప్పారు. విపక్ష అభ్యర్థి గురువారం ఉదయం 11.30 గంటలకు నామినేషన్ పత్రాలను దాఖలు చేయనున్నారు.

అఫ్గానిస్థాన్‌లో ఘోర బస్సు ప్రమాదం.. 79 మంది మృతి

కాబూల్: ఇరాన్ నుంచి అఫ్గానిస్థాన్‌కు బస్సులో తిరిగి వస్తోన్న వలసదారులు తీవ్ర ప్రమాదానికి గురయ్యారు. వారు ప్రయాణిస్తున్న బస్సు ఎదురుగా వస్తోన్న ఓ ట్రక్కును, మోటార్‌బైక్‌ను ఢీకొనడంతో ఒక్కసారిగా మంటలు ఎగిశాయి. ఈ ఘటనలో 79 మంది చనిపోయారు. వీరిలో 19 మంది చిన్నారులు. మరో ఇద్దరికి తీవ్రంగా కాలిన గాయాలయ్యాయని అధికారులు తెలిపారు. వాయవ్య అఫ్గానిస్థాన్‌లోని హెరాత్ ప్రావిన్స్‌లో మంగళవారం రాత్రి ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ట్రక్కులో, బైక్‌పై ప్రయాణిస్తున్న ఇద్దరు వ్యక్తులు కూడా ప్రమాదంలో మరణించారు.

గాజాపై విస్తృత సైనిక చర్య

- ఆమోదం తెలిపిన ఇజ్రాయెల్

జెరూసలెం: గాజా నగరంపై మరింత విస్తృతమైన సైనిక చర్యకు ఇజ్రాయెల్ సిద్ధమవుతోంది. గాజాలో జనసాంద్రత అధికంగా ఉండే ప్రాంతాలపై కొత్తగా సైనిక చర్యను కేంద్రీకరించే ప్రతిపాదనకు తమ రక్షణమంత్రి ఆమోదం తెలిపారని ఇజ్రాయెల్ సైనిక వర్గాలు వెల్లడించాయి. ఈ ఆపరేషన్ కోసం 60 వేలమంది పౌరుల్ని సైనిక బాధ్యతల్లో రిజర్విస్టులుగా నియుక్తం చేస్తామని, ఇప్పటికే సైన్యంలో రిజర్విస్టులుగా పనిచేస్తున్న 20 వేల మంది సర్వీసును పొడిగిస్తామని ఆ వర్గాలు వెల్లడించాయి. 22 నెలలుగా సాగుతున్న యుద్ధం కారణంగా గాజాలో తీవ్ర క్షామ పరిస్థితులు తాండవిస్తున్న నేపథ్యంలో తాజా సైనిక చర్య పరిస్థితుల్ని మరింత దిగజార్చనుంది. మరోవైపు ఇజ్రాయెల్, హమాస్‌ల మధ్య కాల్పుల విరమణ కోసం జరుగుతున్న చర్చల్లో ప్రగతి కనిపించడం లేదు.



ఇజ్రాయెల్ దాడి కారణంగా గాజాలోని నుసిరత్‌లో ఓ భవనం శిథిలాల్లో చిక్కుకున్న మహిళ

సిరియాతో ఇజ్రాయెల్ చర్చలు

సిరియా విదేశాంగ మంత్రికి ఇజ్రాయెల్ ప్రతినిధి బృందానికి మధ్య మంగళవారం పారిస్‌లో చర్చలు జరిగాయి. ఇరుదేశాల మధ్య ఇటీవలి కాలంలో ఉద్రిక్తతలు పెచ్చుమీరిన నేపథ్యంలో అమెరికా చొరవతో ఈ చర్చలు జరిగాయి.

వెస్ట్‌బ్యాంక్‌లో యూదు ఆవాసాలకు ఆమోదం

వెస్ట్‌బ్యాంక్ ప్రాంతంలో యూదు ఆవాసాల ఏర్పాటుకు అనుమతినిస్తూ ఇజ్రాయెల్ ప్రభుత్వం వివాదాస్పద నిర్ణయం తీసుకుంది. ఈ నిర్ణయం వెస్ట్‌బ్యాంక్ ప్రాంతాన్ని రెండుగా విభజిస్తుందని, భవిష్యత్తులో పాలస్తీనా దేశ ఏర్పాటుకు వీలు లేకుండా చేస్తుందని పరిశీలకులు అంటున్నారు.

ఉక్రెయిన్‌కు భద్రత కల్పిస్తాం: అమెరికా

వాషింగ్టన్: ఉక్రెయిన్ గడ్డపైకి తమ సైన్యాన్ని పంపేది లేదని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టంచేసినట్లు వైట్‌హౌస్ ప్రెస్ కార్యదర్శి కరోలిన్ లివిట్ వెల్లడించారు. గగనతలం లేదా ఇతర మార్గాల్లో సాయమందించే విషయం కాదనలేమని ఆమె తెలిపారు. "ఉక్రెయిన్‌కు అమెరికా గగనతల రక్షణ కల్పిస్తుందా?" అని విలేకరులు ప్రశ్నించగా, అందుకు అవకాశం ఉందని కరోలిన్ లివిట్ బదులిచ్చారు. ఉక్రెయిన్ భద్రత కోసం ఏవిధమైన సైనిక సహాయాన్ని అందించాలనే అంశం అమెరికా అధ్యక్షుని పరిధిలోని విషయమని ఆమె అన్నారు. కచ్చితంగా చెప్పలేమన్నారు. ఐరోపాలోని మిత్రదేశాల సమన్వయంతో ఉక్రెయిన్‌కు తగిన భద్రతను కల్పిస్తామని ఆమె తెలిపారు.



రష్యా దాడితో ఉక్రెయిన్‌లోని ఒడెశాలో చమురు నిల్వ కేంద్రంలో చెలరేగిన మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

స్వర్గ సిద్ధి కోసమే శాంతి యత్నాలు: ట్రంప్

ఇంటర్నెట్ డెస్క్: ఉక్రెయిన్-రష్యా యుద్ధానికి ముగింపు పలుకుతూ ఇరుదేశాల మధ్య శాంతిఒప్పందం కుదిరితే తనకు మరణానంతరం స్వర్గం సంప్రాప్తించే అవకాశాలు పెరుగుతాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అభిప్రాయపడ్డారు. ఓ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం ఆ అవకాశాలు తక్కువగా ఉన్నాయన్నారు. గతంలో యుద్ధం ముగింపుపై పలుమార్లు మాట్లాడిన ట్రంప్.. నోబెల్ శాంతి బహుమతిని గెలుచుకునే ప్రయత్నంలో భాగంగానే ఇదంతా చేస్తున్నట్లు చెప్పిన విషయం తెలిసిందే. "నా ప్రయత్నాలు కేవలం లౌకిక జీవితానికి సంబంధించినవి మాత్రమే కావు. ఈ ప్రయత్నాల ద్వారా వీలైతే స్వర్గానికి వెళ్లాలనుకుంటున్నా... ఒకవేళ నేను స్వర్గానికి వెళ్తే అందుకు దోహదం చేసే అంశాల్లో ఇది కూడా ఒకటి అవుతుంది" అని శాంతి ఒప్పందం కోసం తాను చేస్తున్న ప్రయత్నాలను ట్రంప్ వివరించారు.



గేమింగ్ పరిశ్రమ భూస్థాపితమవుతుంది

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుపై శశిథరూర్

దిల్లీ: ఆన్‌లైన్ మనీ గేమింగ్‌ను నిషేధించాలన్న ప్రభుత్వ చర్యను కాంగ్రెస్ నేత శశిథరూర్ తప్పుపట్టారు. ఇటువంటి చర్యలు గేమింగ్ పరిశ్రమను భూస్థాపితం చేయగలవని, నేర ముఠాలకు మరింత బలం చేకూరుస్తాయని ఆరోపించారు. "దీనికి బదులుగా ఆన్‌లైన్ గేమింగ్‌ను చట్టబద్ధం చేసి.. దానిని నియంత్రించి, పన్ను విధిస్తే అది దేశానికి ఉపయోగపడుతుందని అనేక దేశాలు అధ్యయనంలో తేల్చాయి'' అని థరూర్ 'ఎక్స్'లో పోస్టు చేశారు.

గంపగుత్తగా నియామకాల రద్దు సమ్మతం కాదు: సుప్రీం కోర్టు

దిల్లీ: విధానపరమైన పొరపాట్ల కారణంగా ప్రభుత్వ నియామకాలను గంపగుత్తగా రద్దుచేసే కింది కోర్టుల ప్రవృత్తిని దేశ అత్యున్నత న్యాయస్థానం తప్పుపట్టింది. ఝార్ఖండ్‌లో మంజూరు చేసిన పోస్టుల సంఖ్యను మించిపోయారన్న కారణంగా ముగ్గురు రాష్ట్ర విద్యుత్ బోర్డు అధికారుల నియామకాన్ని హైకోర్టు పక్కన పెట్టడం సమర్థనీయం కాదని జస్టిస్ జె.కె.మహేశ్వరి, జస్టిస్ అరవింద్ కుమార్‌లతో కూడిన ధర్మాసనం పేర్కొంది. "హైకోర్టు డివిజన్ బెంచి ఉద్యోగుల నియామకాన్ని రద్దుచేస్తూ వెలువరించిన ఆదేశాలను సమర్థించడం అమాయకుల్ని శిక్షించడమే అవుతుంది. ఇది న్యాయసమ్మతం కాదు'' అని సుప్రీంకోర్టు పేర్కొంది. "ఉద్యోగుల నియామకం చెల్లదంటూ గంపగుత్త ఆదేశాలు జారీచేయడం నిజాయితీ కలిగిన ఉద్యోగుల నైతిక స్థైర్యాన్ని దెబ్బతీయడంతోపాటు ప్రజా పరిపాలక వ్యవస్థ విశ్వసనీయతనూ నశింపజేస్తుంది' ' అని న్యాయమూర్తులు పేర్కొన్నారు.



విడాకులు తీసుకున్నాక ఈగోలు చచ్చిపోవాలి

ఓ జంటను ఉద్దేశిస్తూ సుప్రీంకోర్టు వ్యాఖ్య

వివాహాన్ని రద్దు చేస్తూ ఆదేశాలిస్తున్నందున ఇక మీ అహంభావాలు నాశనమవుతాయని భావిస్తున్నట్లు సుప్రీంకోర్టు ఓ జంటను ఉద్దేశించి వ్యాఖ్యానించింది. చిన్నారిని జాగ్రత్తగా చూసుకోవాలని ఆదేశించింది. తమ వివాహాన్ని రద్దు చేయాలని పేర్కొంటూ ఓ జంట వేసిన ఉమ్మడి పిటిషన్‌పై జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఆర్.మహదేవన్‌ల ధర్మాసనం విచారణ జరిపింది. "వివాహ బంధంలో అహంభావం(ఈగో) ఉంటుంది. ఒకసారి దాని నుంచి బయటకు వచ్చేస్తే అది ఉండకూడదు. ఇక చిన్నారిని జాగ్రత్తగా చూసుకోండి' అని వ్యాఖ్యానించింది. అనంతరం వివాహాన్ని రద్దు చేస్తున్నట్లు ప్రకటించి పిటిషన్‌ను పరిష్కరించింది.

నిందితుడు దీర్ఘ కాలం జైల్లోనే మగ్గిపోరాదు

- సత్వరమే విచారణ జరపాలి: సుప్రీంకోర్టు

దిల్లీ: నేరారోపణలతో జైలు పాలైన నిందితుడిపై విచారణ జరపకుండా సుదీర్ఘ కాలం ఖైదీగా నిర్బంధించడాన్ని అనుమతించలేమని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. నిష్పాక్షికంగా, సత్వరమే విచారణ జరిగేలా చూడాలని చట్టవ్యతిరేక కార్యకలాపాల నిరోధక చట్టం (యూఏపీఏ) కింద నమోదైన ఓ కేసులో జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ కె.వి.విశ్వనాథన్ ధర్మాసనం బుధవారం ఆదేశించింది. వంద మందికి పైగా సాక్షులను ప్రశ్నించాల్సి ఉన్నందున రెండేళ్లలోగా విచారణ పూర్తి చేయాలని తెలిపింది. కర్ణాటక హైకోర్టు 2022 ఏప్రిల్‌లో తనకు బెయిల్ నిరాకరించడాన్ని సవాల్ చేస్తూ సహ నిందితుడు దాఖలు చేసిన కేసులో సుప్రీం ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. ఇదే వ్యవహారంలో మరో నిందితుడికి బెయిల్ ఇవ్వడాన్ని సర్వోన్నత న్యాయస్థానంలో కేంద్ర ప్రభుత్వం వ్యతిరేకించింది. అయితే, హైకోర్టు ఉత్తర్వుల్లో జోక్యం చేసుకోవడానికి నిరాకరిస్తూ సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. ఐదున్నరేళ్లుగా నిందితుడు జైలులోనే ఉన్న విషయాన్ని గుర్తు చేస్తూ సత్వర విచారణకు ఆదేశించింది.

సరిహద్దు నిర్వహణపై ఉమ్మడి అవగాహనకు వచ్చాం

వాంగ్ భారత పర్యటన అనంతరం చైనా ప్రకటన

బీజింగ్: చైనా విదేశాంగ మంత్రి వాంగ్ యీ భారత పర్యటన అనంతరం సరిహద్దు నిర్వహణ, నియంత్రణపై ఇరు దేశాలు ఉమ్మడి అవగాహనకు వచ్చాయని బీజింగ్ వెల్లడించింది. వాంగ్ పర్యటన సారాంశాన్ని బుధవారం చైనా విదేశీ వ్యవహారాల ప్రతినిధి మావో నింగ్ మీడియాకు తెలిపారు. వివిధ రంగాల్లో చర్చలు తిరిగి ప్రారంభించడానికి ఇరు దేశాలు అంగీకరించాయని, పరస్పర ప్రయోజనకరమైన సహకారాన్ని మరింత బలోపేతం చేయడానికి నిర్ణయించాయని ఆమె వెల్లడించారు. ప్రపంచ సవాళ్లను కలిసి ఎదుర్కొవడానికి, ఏకపక్ష బెదిరింపు చర్యలను ఎదుర్కొవడానికి భారత్, చైనా కలిసి పనిచేస్తాయని ట్రంప్ సుంకాల బెదిరింపులను ఉద్దేశిస్తూ వ్యాఖ్యానించారు. "సరిహద్దు సమస్యను పరిష్కరించడానికి భారత్-చైనా ఉమ్మడి అవగాహనకు వచ్చాయి. ఇరు దేశాల మధ్య తక్కువ వివాదాలు ఉన్న ప్రదేశాల్లో సరిహద్దును గుర్తించే ప్రక్రియపై చర్చలు జరిపాం'' అని మావో మీడియాకు తెలిపారు. మరోవైపు భారత్- చైనాల మధ్య సరిహద్దు నిర్ధారణ ప్రక్రియ త్వరలో ప్రారంభం కానున్నట్లు తెలుస్తోంది. ఇరు దేశాల మధ్య తక్కువ వివాదాలు ఉన్న ప్రదేశాల్లో కచ్చితమైన శాశ్వత సరిహద్దును గుర్తించే ప్రక్రియను త్వరలో ప్రారంభించనున్నట్లు సమాచారం. ఇప్పటికే సరిహద్దుల్లోని మూడు సెక్టార్లలో డోభాల్-వాంగ్‌యీ కలిసి స్వల్ప వివాదాలు ఉన్న ప్రాంతాలను గుర్తించినట్లు తెలుస్తోంది. త్వరలోనే సరిహద్దు పునర్విభజన కూడా జరుగుతుందని సంబంధిత అధికారులు తెలిపారు.

అత్యాధునిక క్షిపణులు సిద్ధంచేస్తున్న చైనా

ఇంటర్నెట్‌డెస్క్: క్షిపణుల రేసులో మిగిలిన దేశాల కంటే చైనా చాలా వేగంగా దూసుకుపోతోంది. రెండో ప్రపంచయుద్ధం ముగింపు దినోత్సవం సందర్భంగా వచ్చే నెల బీజింగ్‌లో నిర్వహించే విక్టరీ డే పరేడ్ కోసం నాలుగు కొత్త క్షిపణులను సిద్ధం చేస్తోంది. ఈ సరికొత్త ఆయుధాలను ప్రపంచం ముందు ఆవిష్కరించనున్నట్లు ఆ దేశ మీడియా వెల్లడించింది. వీటిల్లో వైజే సిరీస్‌లోని 15, 17, 19, 20 మోడళ్లు ఉండనున్నాయి. ఈ సిరీస్‌లోని క్రూయిజ్ క్షిపణులను భూమి, ఆకాశం, నౌకలు, జలాంతర్గాముల నుంచి ప్రయోగించవచ్చు. వీటిల్లో వైజే-15ను సూపర్ సోనిక్ యాంటీషిప్ మిసైల్‌గా భావిస్తున్నారు. వందల మంది పీఎల్ఏ సైనికులు, ఫైటర్ జెట్లు, బాంబర్లు, ఇతర పరికరాలు ఈ ప్రదర్శనలో ఉండనున్నట్లు చైనా సైనిక అధికారులు తెలిపారు.

పాతేసి పారిపోయిందన్నాడు

- భార్యను చంపేసిన ఓ భర్త దుష్ప్రచారం

ఇంటర్నెట్‌డెస్క్: తన భార్య శవాన్ని శ్మశానంలో పాతిపెట్టి ఆమె వేరొకరితో వెళ్లిపోయిందని నమ్మించే ప్రయత్నం చేస్తూ అడ్డంగా దొరికిపోయాడో భర్త. ఈ ఘటన దిల్లీలో చోటుచేసుకొంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమ్రోహాకు చెందిన షబాబ్ అలీ పెయింటర్‌గా పని చేస్తున్నాడు. అతడి భార్య ఫాతిమా(30). ఆమెకు మరొకరితో వివాహేతర సంబంధం ఉన్నట్లు నిందితుడికి అనుమానం ఉంది. దీంతో ఆమెకు నిద్రమాత్రలు ఇచ్చి.. తన స్నేహితులతో కలిసి మరో ప్రాంతానికి తీసుకెళ్లాడు. అక్కడ ఆమెతో పురుగుల మందు తాగించి హతమార్చాడు. అనంతరం ఆమె మృతదేహాన్ని దిల్లీలోని మోప్రాలీ శ్మశానంలో పాతిపెట్టాడు. అనంతరం సొంతూరుకు తిరిగి వెళ్లిపోయాడు. తన భార్య ప్రియుడితో కలిసి పారిపోయిందంటూ అందరినీ నమ్మించే ప్రయత్నం చేశాడు. ఫాతిమా కన్పించడం లేదంటూ ఆమె స్నేహితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో దర్యాప్తు చేయగా అసలు విషయం బయటపడింది. బాధితురాలిని ఆమె భర్త కారులో తీసుకెళ్తున్న దృశ్యాలు సీసీటీవీలో రికార్డయ్యాయి. దీని ఆధారంగా పోలీసులు అతడిని ప్రశ్నించగా.. నేరం అంగీకరించాడు.

రోటీకి పోట్లాడితే.. కత్తిపోటు ఎదురైంది

బల్లియా: రోటీ విషయంలో చోటుచేసుకున్న చిన్న తగదా చివరికి కత్తిపోటుకు దారితీసిన ఘటన ఉత్తర్‌ప్రదేశ్‌లోని బలియా జిల్లాలో మంగళవారం చోటుచేసుకుంది. మహావీర్ అఖాడా ప్రాంతంలోని రాస్రా పోలీస్‌స్టేషన్ పరిధిలో సంజయ్ కుమార్ (28) అనే వ్యక్తి.. వంట విషయంలో భార్యతో గొడవకు దిగాడు. ఇంట్లో పిండి లేకపోవడంతో మహిళ తన భర్త, ముగ్గురు పిల్లల కోసం కిచిడీ చేశారు. భర్త రోటీలు చేయాలని బలవంత పెట్టగా.. భార్య నిరాకరించారు. ఈ క్రమంలో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. ఆగ్రహానికి గురైన మహిళ భర్త ఛాతీలో కత్తితో పొడిచింది. సంజయ్‌ను గ్రామస్థులు ఆసుపత్రికి తరలించారు.

పాఠశాలలో సహ విద్యార్థి హత్య

- అహ్మదాబాద్‌లో ఘటన


అహ్మదాబాద్: గుజరాత్‌లోని అహ్మదాబాద్ నగరంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో దారుణ ఘటన చోటుచేసుకుంది. పదోతరగతి చదువుతున్న ఇద్దరు విద్యార్థుల మధ్య జరిగిన ఘర్షణ ఒకరి ప్రాణాలను బలి తీసుకుంది. మంగళవారం తలెత్తిన ఈ వివాదంలో సహ విద్యార్థిని మరో విద్యార్థి కత్తితో పొడవగా బాధితుడు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ అదే రోజు రాత్రి కన్నుమూశాడు. మృతుడి తల్లిదండ్రులు, బంధువులు బుధవారం ఉదయం పాఠశాలపై దాడి చేసి బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలను ధ్వంసం చేశారు. పాఠశాల యాజమాన్యంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మైనర్ నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపడుతున్నామని తెలిపారు.



గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో పదో తరగతి విద్యార్థి హత్యకు గురైన పాఠశాల వద్ద గుమిగూడిన ప్రజలు

తలుపు తడుతున్న తపాలా

ఇంటి వద్దకే 117 సేవలు



ఆ సైకిల్ బెల్ మోగితే... ప్రాణం లేచొచ్చేది! ఒక్క లెటర్‌తో, ఒక్క మనియార్డర్‌తో, ఒక్క రిజిస్టర్ పోస్టుతో... మనింటి మనిషిగా మారిన పోస్ట్‌మ్యాన్... ఇప్పుడు మరిన్ని సేవలతో సిద్ధమయ్యారు. వందకు పైగా పనులను ఇంటి వద్దే చక్కబెట్టేస్తానని భరోసా ఇస్తున్నారు.

ఇది డిజిటల్ చెల్లింపుల కాలమైనా జేబులో నగదుండాల్సిందే. ఖాతాలో డబ్బులు తీసుకోవాలంటే చెక్కుతో బ్యాంకుకు, లేదా డెబిట్‌కార్డుతో ఏటీఎంకు వెళ్లాలి. క్యూలో నుంచోవాలి. వయోవృద్ధులకు అయితే మరింత కష్టమే. ఇలాంటి సమస్యలకు తపాలశాఖ నుంచి ఓ పరిష్కారం ఉంది. ఒక ఫోన్ కాల్ చేస్తే చాలు.. పోస్ట్‌మ్యాన్ మీ ఇంటికే వచ్చి డబ్బులిస్తారు. ఇదొక్కటే కాదు పోస్టుమ్యాన్‌కు లేదా బ్రాంచి పోస్ట్‌మాస్టర్‌కు ఫోన్ చేసి చెబితే చాలు.. 17 విభాగాల్లో 117 రకాల సేవలను అతి తక్కువ ఖర్చుతో ఇంటిదగ్గరే అందిస్తారు.

- ఈనాడు, హైదరాబాద్

ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్



తపాలశాఖ సేవల్లో ఆధార్ ఎనేబుల్డ్ పేమెంట్ సిస్టమ్ (ఏఈపీఎస్) ముఖ్యమైంది. ఇంటికొచ్చిన పోస్టమాన్‌కు మీ ఆధార్ నెంబరు చెప్పి, బయోమెట్రిక్‌లోని స్కానర్‌పై వేలు పెట్టాలి. మీ ఆధార్‌తో లింకయిన బ్యాంకు ఖాతాలన్నీ తెరపై కనిపిస్తాయి. ఏ ఖాతాలో ఎంత బ్యాలెన్స్ ఉందో చూడొచ్చు. ఎందులో నుంచి డబ్బు కావాలన్నా ఇస్తారు. రోజుకు రూ.10వేల వరకు తీసుకోవచ్చు.

10 నిమిషాల్లో ఖాతా!



బ్యాంకులో కొత్త ఖాతా తెరవాలంటే పెద్ద ప్రక్రియ. అదే తపాలా బ్యాంక్‌లో 5, 10 నిమిషాల్లోనే పూర్తయిపోతుంది. 'ఇండియా పోస్టు పేమెంట్స్ బ్యాంక్(ఐపీపీబీ)లో డబ్బులు జమ చేయడం, తీసుకోవడం, ఇతరులకు పంపడం సహా 14 రకాల సేవల్ని అందిస్తోంది. పోస్టు మ్యాన్‌కు ఆధార్, పాన్, తదితర వివరాలు చెబితే చాలు..ఖాతా ఓపెన్ అయిపోతుంది.

ఆధ్యాత్మిక ఆనందం



భద్రాచలం సీతారాముల కల్యాణానికి వెళ్లలేకపోయారా.. తపాలశాఖలో కొంత మొత్తం చెల్లిస్తే చాలు ముత్యాల తలంబ్రాలను మీ ఇంటికి తెచ్చిస్తారు. ప్రముఖ ఆలయాల్లో మీ పేరుతో అంతరాలయ అర్చనలు చేయించి, ప్రసాదాలనూ తెప్పించుకునే సదుపాయం ఉంది.

డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ కూడా...



లైఫ్ సర్టిఫికెట్‌ను పింఛనుదారులు ఏటా సమర్పించాల్సి ఉంటుంది. ఇకపై దీనికోసం మీ-సేవా సెంటర్ల వరకు వెళ్లకుండానే ఆధార్ ఆధారిత బయోమెట్రిక్‌తో తీసుకోవచ్చు. ఆధార్‌సంఖ్య, ఓటీపీ, బయోమెట్రిక్ వెరిఫికేషన్ తర్వాత డిజిటల్ లైఫ్ సర్టిఫికెట్ ప్రక్రియ పూర్తవుతుంది.

విదేశాల్లో మనవాళ్లున్నారా...



విదేశాల్లో ఉన్న మన వారికి లేఖలు పంపాలన్నా, పార్శిళ్ల అందేలా చేయాలన్నా పోస్టాఫీసులు, కొరియర్ ఆఫీసుల దాకా వెళ్లాల్సిన అవసరం లేదు. నేరుగా ఇంటి నుంచే విదేశాలకు లేఖలు, స్పీడ్‌పోస్టు, ఇంటర్నేషనల్ పార్శిళ్లు పంపించొచ్చు. స్టాంపులు, స్టేషనరీ సేవలూ పొందొచ్చు. సాధారణ పార్శిళ్లు, లెటర్లు పంపించొచ్చు. ఇవన్నీ పోస్ట్‌మ్యాన్ చక్కబెట్టేస్తారు.

పొదుపు ఖాతాలు



రికరింగ్ డిపాజిట్ అయినా... సుకన్య సమృద్ధి యోజన అయినా... సీనియర్ సిటిజన్ల పొదుపు ఖాతాలైనా... మీకు కించిత్ కష్టంలేకుండా అన్నీ పోస్ట్‌మ్యాన్ ద్వారా ఓపెన్ చేసుకోవచ్చు. 16 రకాల సేవలు ఇంటిదగ్గరే పొందొచ్చు. మీరు చేయాల్సిందల్లా అవసరమైన పత్రాలు అందజేయడమే.

బీమా పాలసీ ఇంటి దగ్గరే



జీవిత బీమాలో తపాలశాఖ 12 రకాల గ్రామీణ తపాల పాలసీలు, పోస్టల్ లైఫ్‌ఇన్సూరెన్స్ పాలసీలను అందిస్తోంది. పోస్టుమ్యాన్ ఇంటికి వచ్చి వాటన్నిటినీ వివరిస్తారు. అందులో కావాల్సిన పాలసీ తీసుకోవచ్చు.

ప్రభుత్వ పథకాల డబ్బు ఇంటిదగ్గర...



ప్రభుత్వం అందించే కొన్ని పథకాల డబ్బుల్ని పోస్టాఫీసుల్లో ఇస్తారు. కోరితే ఇంటి దగ్గరకు వచ్చి కూడా చెల్లిస్తారు. చేయూత పింఛన్లు, పీఎం కిసాన్, రైతుభరోసా, ఎల్పీజీ సబ్సిడీ డబ్బులు బ్యాంకు ఖాతాలో పడితే..ఏఈపీఎస్ ద్వారా ఇంటిదగ్గరే పోస్టుమ్యాన్ దగ్గర ఉండే మైక్రో ఏటీఎం నుంచి పొందొచ్చు.

పని లేని చోట పురోగతి ఉండదు



కార్యాలయంలో మీకు పని ఎక్కువగా ఉండి ఒత్తిడిగా అనిపిస్తోందా? మీకు ఎక్కువ పని అప్పగిస్తున్నారంటే, మీ సమర్థత మీద బృందసారథికి విశ్వాసం ఉందని అర్థం. అంటే మీ సంస్థ దృష్టిలో మీరొక విలువైన ఉద్యోగి అన్నమాట. మీ సమర్థత, శ్రమను సంస్థ గుర్తిస్తోంది కాబట్టి భవిష్యత్తులో మీరు ఉన్నత స్థాయికి ఎదిగే అవకాశాలు పుష్కలంగా ఉంటాయి. పని లేనిచోట పురోగతి ఉండదని గుర్తుంచుకోండి. మరింత సమర్థంగా పనిచేయడానికి శక్తివంచన లేకుండా కృషిచేయండి.

– ఎలియోస్, ఏఐ కన్సల్టెంట్

పుస్తకంతో స్నేహం.. అందరికీ ఆహ్వానం



ఒకప్పుడు యువత చేతుల్లో సాహిత్య, సామాజిక రంగాలకు సంబంధించిన పుస్తకాలు విరివిగా కనిపించేవి. చదివిన పుస్తకాల గురించి విలువైన చర్చలు జరిగేవి. ఇప్పుడు ఎక్కడ చూసినా పుస్తకం స్థానంలో సెల్‌ఫోన్ కనిపిస్తోంది. పుస్తక పఠనం అనేది క్రమంగా తగ్గిపోతోంది. ఈ పరిస్థితిలో మార్పు తేవడానికి విజయవాడకు చెందిన 'పేజ్ క్లబ్' ప్రయత్నిస్తోంది. ప్రజల్లో పఠనాసక్తిని పెంచేలా సామూహిక పుస్తక పఠనం అనే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. పది, ఇంటర్ చదువుతున్న ఆరుగురు విద్యార్థులు ఈషాన్వి నిమ్మగడ్డ, మోక్షిత్‌రెడ్డి, రోనక్, విహాన్ సాయి వేములపల్లి, అవిర్నేని జైదేవ్ చౌదరి, లోహేంద్ర కలిసి ఏడాది క్రితం దీనికి రూపకల్పన చేశారు. తొలుత విద్యాసంస్థలు, ప్రభుత్వ, ప్రైవేట్ కార్యాలయాలు, గ్రంథాలయాలకు వెళ్లి పుస్తక పఠనం ఆవశ్యకత తెలియజేస్తున్నారు. కార్యక్రమం ఎక్కడ నిర్వహించాలో నిర్ణయించుకున్నాక.. ఆ ప్రాంతానికి వెళ్లి ఎలాంటి పుస్తకాలు నచ్చుతాయో స్థానికులను అడుగుతారు. సర్వోత్తమ గ్రంథాలయం నుంచి ఆ పుస్తకాలను సమకూర్చుకుంటారు. అలా ఇప్పటివరకు 15 చోట్ల సామూహిక పుస్తక పఠన కార్యక్రమాలు నిర్వహించారు. కొందరు తమ ఇళ్లలోని పుస్తకాలను వీరికి ఇచ్చి తోడ్పాటు అందిస్తున్నారు. ఇటీవల మాజీ ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు 'పేజ్ క్లబ్' గురించి తెలుసుకుని విద్యార్థులను అభినందించారు. 'మా పేజ్ క్లబ్'కు ఒక్క రోజులోనే స్పందన రాలేదు. మొదటి ఆరు నెలలు ఎంతమందిని అడిగినా ఆసక్తి చూపలేదు. ఒక్క కార్యక్రమం కూడా నిర్వహించలేకపోయాం. మెంటార్ వేమూరి సుజనశ్రీ ప్రోత్సాహంతో పుస్తక పఠనం ప్రాముఖ్యాన్ని వివరిస్తూ ముందుకు సాగాం. ప్రస్తుతం అన్ని వర్గాల నుంచి స్పందన వస్తోంది' అని క్లబ్ వ్యవస్థాపకులు తెలిపారు. – న్యూస్‌టుడే, పటమట

ఈ కొమ్ముల పురుగు పర్యావరణ ఫ్రెండు!



అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లిలో స్టాగ్ బీటిల్ కనిపించింది. ఇవి అరుదుగా ఉంటాయని, వీటి బలమైన కొమ్ముల్లాంటి భాగాలతో శత్రువులపై పోరాడుతాయని చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం కీటక విభాగం పరిశోధనా సహాయకులు బాపూజీ నాయుడు తెలిపారు. స్థానికంగా 'జింక కొమ్ముల పురుగు' అంటారని పేర్కొన్నారు. 'ఇవి కుళ్లిపోతున్న కలపను విచ్ఛిన్నం చేసి పర్యావరణానికి మేలు చేస్తాయి. మగ పురుగులకు శక్తిమంతమైన దవడలు ఉంటాయి. జపాన్‌లో వీటికి మంచి ధర ఉంది. చైనాలో వీటిని అదృష్టానికి చిహ్నంగా భావిస్తారు' అని వివరించారు.


– న్యూస్‌టుడే, చింతపల్లి

లంబోదరా.. లడ్డూ తినవా..!



వినాయకచవితి వేడుకలు పురస్కరించుకొని రాజస్థాన్‌లోని జైపుర్‌లో ఉన్న మోతీ దుంగ్రీ గణేశ్ ఆలయంలో నైవేద్యంగా సమర్పించిన 2,600 కిలోల లడ్డూలు

వయసు 11.. కథలు 22



పదకొండేళ్ల బుడతడు బాల సాహితీవేత్తగా ప్రతిభ చూపుతున్నాడు. సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలం అనంతసాగర్ గ్రామానికి చెందిన బి.విశ్వతేజ ఇప్పటివరకు 22 కథలు రాశాడు. 'విశ్వతేజం' పేరిట పుస్తకం వెలువరించేందుకు సిద్ధమయ్యాడు. విశ్వతేజ తల్లిదండ్రులు సంధ్య- లక్ష్మణ్ గ్రామంలో మీసేవ కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. చిన్నారి స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడో తరగతి చదువుతున్నాడు. 4వ తరగతి చదివే సమయంలో గ్రంథాలయం అందుబాటులోకి రాగా పుస్తకాలు చదవడం అలవాటు చేసుకున్నాడు. అయిదో తరగతిలో ఇద్దరు స్నేహితుల మధ్య క్రమశిక్షణ వివరిస్తూ 'బడి గంట' పేరిట కథ రాశాడు. ఆరో తరగతి చదివే సమయంలో హిందీ ఉపాధ్యాయుడు, సాహితీవేత్త దుర్గయ్య ప్రోత్సాహంతో కథలు రాయడం అభిరుచిగా మార్చుకున్నాడు. ఏడాది వ్యవధిలో 22 కథలు రాశాడు. ఈ క్రమంలో దుర్గయ్య సంపాదకీయంలో 18 కథలతో 'విశ్వతేజం' (బాలల కథలు) పుస్తకాన్ని రూపొందించారు. గురువారం పాఠశాలలో ఆవిష్కరించనున్నారు. ఇదే పాఠశాలకు చెందిన పలువురు రాసిన 'అనంతసాగర అక్షర కెరటాలు' (బడిపిల్లల కథలు) సంకలనంలో విశ్వతేజం రాసిన మూడు కథలు ప్రచురితమయ్యాయి. బెట్టింగ్ గేమ్ కథ ద్వారా ఓ బాలుడు నష్టపోయి కనువిప్పు పొందిన తీరు, సేంద్రియ ఎరువుల ప్రాధాన్యం, తదితర ఎన్నో సందేశాత్మక కథలు ఉండటం విశేషం. నిత్యం ఈటీవీలో ప్రసారమయ్యే వార్తల వీక్షణం, వార్తల పఠనం అలవాటుగా మార్చుకున్నానంటున్నాడు ఈ బుడతడు. – న్యూస్‌టుడే, సిద్దిపేట

సైకిల్‌గా.. చక్రాల కుర్చీగా!

విశాఖ యువకుడి మల్టీపర్పస్ సైకిల్‌కు పేటెంట్



ప్రాథమికంగా సైకిల్ రూపం



చక్రాల కుర్చీగా మార్చాక..



మడత పెట్టేస్తే ఇలా..

ఈ సైకిల్‌ను పిల్లలు సులువుగా తొక్కగలరు.. అవసరమైతే తాతయ్యకు చక్రాల కుర్చీగా మార్చవచ్చు.. పని పూర్తయ్యాక మడత పెట్టి మూలన పెట్టవచ్చు. విశాఖకు చెందిన ప్రైవేటు ఉద్యోగి కొట్యాడ రమేశ్ 'వన్ సైకిల్ ఫర్ వన్స్ ఎంటైర్ లైఫ్ సైకిల్' అనే ఇతివృత్తంతో తీర్చిదిద్దిన 'మల్టీపర్పస్ సైకిల్' ప్రత్యేకత ఇది. కొన్ని అదనపు పరికరాలు జోడించి లగేజ్ కార్ట్‌గా, బేబీ కార్ట్‌గా కూడా దీనిని మార్చవచ్చు. భవిష్యత్తులో వ్యాయామం చేయడానికి, ఈ-సైకిల్‌గా మార్చేందుకూ కృషి చేస్తున్నట్లు రమేశ్ తెలిపారు. దీనికి ఆయన పేటెంట్ కూడా పొందారు.



కొట్యాడ రమేశ్

◆ విజయనగరం జిల్లా జమ్మాదేవిపేటకు చెందిన రమేశ్ పర్యావరణ శాస్త్రంలో ఎమ్మెస్సీ పూర్తి చేశారు. కొవిడ్-19 సమయంలో కుమారుడిని చూసేందుకు ప్రతి వారం విశాఖ నుంచి కాకినాడ వెళ్లేవారు. అక్కడ బస్సు దిగిన తర్వాత 5 కిలోమీటర్లు నడిచి వెళ్లాల్సి వచ్చేది. ఆ సమయంలో ఎదురైన ఇబ్బందుల నుంచే ఈ ప్రత్యేక సైకిల్ తయారీకి బీజం పడింది.

తుక్కుతో నమూనా..

◆ ఆవిష్కరణకు పేటెంట్ రావడంతో ఐఐఎం విశాఖలోని ఇంక్యుబేషన్ ప్రోగ్రామ్‌కు రమేశ్ ఎంపికయ్యారు. ఏపీ ఇన్నోవేషన్ సొసైటీ ఆధ్వర్యంలో ఈవెంట్స్‌లో పాల్గొనేందుకు ఫైబర్‌ను వినియోగించి నమూనా తయారుచేశారు. ప్రోటోటైప్ తయారుచేయడానికి కేంద్ర ప్రభుత్వ టైడ్ 2.0 కార్యక్రమం కింద రూ.లక్ష మంజూరైంది. నమూనా తయారీకి అవసరమైన విడి పరికరాల కోసం ముడిసరకు స్థానికంగా అందుబాటులో లేదు. దీంతో తుక్కు దుకాణాల నుంచి సేకరించిన పరికరాలకు మార్పులు చేసి నమూనా తీర్చిదిద్దారు.

◆ ప్రస్తుతం ఈ సైకిల్ 25 కిలోల బరువు ఉంది. పూర్తిస్థాయిలో తయారైతే 6 కిలోల నుంచి 12 కిలోల మధ్య ఉంటుంది. అన్ని దశలు దాటితే ధర రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు ఉండొచ్చు.

–ఈనాడు, విశాఖపట్నం

గగనపు వీధి నుంచి వర్సిటీ ల్యాబ్‌లోకి విత్తనాలు!



అంతరిక్ష యాత్ర సందర్భంగా వ్యోమగామి శుభాంశు శుక్లా తీసుకెళ్లిన మెంతులు, పెసర గింజలు త్వరలోనే ధార్వాడ వ్యవసాయ విశ్వవిద్యాలయానికి చేరుకోనున్నాయి. అమెరికా నుంచి బెంగళూరు చేరుకున్న ఆ మొలకెత్తిన విత్తనాలు ఈ వారాంతంలోగా తమకు అందుతాయని వర్సిటీ వ్యవసాయ శాస్త్రవేత్తలు రవికుమార్ హొసమని, సుధీర సిద్ధాపురరెడ్డి తెలిపారు. మైనస్ 80 డిగ్రీల ఉష్ణోగ్రత కలిగిన పెట్టెలో అవి రానున్నాయి. ఇక్కడకు వచ్చిన అనంతరం అవి ఎంత మేర మొలకెత్తాయి, పోషకాల స్థాయిలు ఎలా ఉన్నాయనే అంశాలపై తాము ప్రత్యేక పరిశోధనలు చేస్తామని శాస్త్రవేత్తలు తెలిపారు. భవిష్యత్తులో అంతరిక్షంలో అధ్యయనానికి వెళ్లే యాత్రికులకు కావలసిన ఆహారాన్ని తయారు చేసే ఉద్దేశంతో ఈ విత్తనాలను పంపించామని గుర్తుచేశారు. ఇందులో సానుకూల ఫలితాలు వస్తే అంతరిక్ష యాత్రికులకు ఆరోగ్యవంతమైన కూరగాయలు, సలాడ్‌లను అభివృద్ధి చేసేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు.


–న్యూస్‌టుడే, ధార్వాడ

ఇది ములుగు అమెజాన్



ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని కొండాయి గ్రామం నుంచి తాడ్వాయి మండలం ఊరట్టం వైపు వెళ్లే దారిలో కొండ్రెడి వాగు ఉద్ధృతంగా ప్రవహిస్తోంది. ఇక్కడ ఏర్పాటు చేసిన అటవీ శాఖ వ్యూ పాయింట్ నుంచి ఈ వాగు దృశ్యాలు అమెజాన్ అడవిని తలపిస్తున్నాయి. వరద ప్రవాహంతో పాటు పచ్చని అడవి అందాలు ప్రకృతి ప్రేమికులను ఆకట్టుకుంటున్నాయి. – న్యూస్‌టుడే, ఏటూరునాగారం రూరల్

బాలచంద్రం అలియాస్ బ్లడ్ బాలు



ప్రభుత్వ ఆసుపత్రుల్లో రక్తం లేక చాలా మంది ఇబ్బంది పడుతుండటాన్ని గమనించి కామారెడ్డి జిల్లా బీబీపేట మండలకేంద్రానికి చెందిన డాక్టర్ నీల బాలచంద్రం అలియాస్ బాలు(41) 2007లో రక్త దాతల సమూహాన్ని ప్రారంభించారు. నాటి నుంచి ఆయన స్వయంగా 77 సార్లు రక్తదానం చేశారు. ఈ సమూహం ద్వారా 18 ఏళ్లలో 25 వేల యూనిట్ల రక్తాన్ని సేకరించారు. 350 రక్తదాన శిబిరాలు నిర్వహించారు. ఒకే సంవత్సరంలో తలసేమియా చిన్నారుల కోసం 2,306 యూనిట్ల రక్తం సేకరించి ఇండియా బుక్ ఆఫ్ ది రికార్డులో ఈ ఏడాది మార్చిలో చోటు దక్కించుకున్నారు. తాజాగా ఇంటర్నేషనల్ వైశ్య ఫెడరేషన్ వారు రక్తవీర్ అవార్డును ఇచ్చారు. లద్దాఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవీందర్ గుప్తా చేతుల మీదుగా మంగళవారం ఈ అవార్డును స్వీకరించారు. కరోనా సమయంలో సైతం 100 యూనిట్ల ప్లాస్మా, 800 యూనిట్ల రక్తాన్ని సేకరించారు. ప్రస్తుతం ఆయన రెడ్ క్రాస్ సంస్థ కామారెడ్డి జిల్లా సమన్వయకర్తగా కొనసాగుతున్నారు. 72 మందితో ప్రారంభమైన రక్తదాతల సమూహంలో ప్రస్తుత సభ్యుల సంఖ్య 3,500. సమాజ సేవ చేయాలంటే డబ్బే అవసరం లేదని.. ఆలోచన ఉంటే సరిపోతుందంటున్నారు బాలచంద్రం. భవిష్యత్తులో మరిన్ని యూనిట్ల రక్తం సేకరించి తలసేమియా బాధితులకు సహకారం అందిస్తానని చెబుతున్నారు. – ఈనాడు డిజిటల్, కామారెడ్డి

అక్కడ గంటలే కానుకలు



సాధారణంగా ఆలయంలో రెండో మూడో గంటలుంటాయి. కానీ, పల్నాడు జిల్లా బెల్లంకొండ మండలం పాపాయపాలెంలో ఉన్న శ్రీమహాలక్ష్మి ఆలయంలో వందల్లో గంటలు ఉండటం ప్రత్యేకం. అమ్మవారు గ్రామ ఇలవేల్పు. ఏళ్ల కిందట ఓ భక్తురాలు కోరిక తీరితే గంటను బహూకరిస్తానని మొక్కుకుంది. కోరిక నెరవేరాక మొక్కు చెల్లించుకుంది. అలా గ్రామస్థులు అనుకున్న కోరికలను అమ్మవారు తీర్చడంతో గంటల్ని కానుకగా ఇవ్వడం ఆనవాయితీగా మారింది. ఇక్కడి సిబ్బంది ఏడాదికోసారి గంటల్ని తీసేసి వేలం వేస్తుంటారు. గుంటూరు నుంచి మాచర్ల వెళ్లే దారిలో బెల్లంకొండ అడ్డరోడ్డు నుంచి ఈ గ్రామానికి చేరుకోవచ్చు.

– ఈనాడు డిజిటల్, నరసరావుపేట; న్యూస్‌టుడే, బెల్లంకొండ

చందమామ మందమైతే..!

చంద్రబింబంలాంటి ముఖం కావాలని ఎవరికుండదు..? అదే... కాస్తంత బరువు పెరిగితే... ముఖంలోనూ తేడా వచ్చేస్తుంది. మరీ ముఖ్యంగా గడ్డం కింద కొవ్వు పేరుకుపోయి డబుల్‌చిన్ స్పష్టంగా కనిపిస్తుంది. అందాన్నీ, ఆత్మవిశ్వాసాన్నీ మార్చేసే ఈ 'ఎక్కువ'ను ఎలా తగ్గించుకోవాలి?

వేడుక కోసం అందంగా ముస్తాబైన రూప అద్దంలో చూసుకుంది. ఎంత మేకప్ వేసుకున్నా గడ్డం కింద కొట్టొచ్చినట్టు కనిపిస్తున్న డబుల్‌చిన్ ఇబ్బందికరంగా అనిపిస్తోంది. ఈ సమస్య రూపనే కాదు... మరెందరినో బాధిస్తోంది. కాస్త దృష్టి పెట్టి, ఓపికగా ప్రయత్నిస్తే ఈ లోపాన్ని అధిగమించవచ్చని చెబుతున్నారు నిపుణులు.



ఎందుకిలా..?

- అధిక బరువు, హైపోథైరాయిడ్ బాధితుల్లో డబుల్ చిన్ సాధారణం. గర్భధారణ సమయంలోనూ ఇది రావచ్చు. కొందరిలో వారసత్వంగా వస్తుంది.
- వయసు పెరిగే కొద్దీ చర్మం కొల్లాజెన్, స్థితిస్థాపకతను కోల్పోతుంది. కండరాలు బలహీనం కావడంతో మెడ, దవడలోని చర్మం వదులుగా మారుతుంది.
- ఫోన్లు, ల్యాప్‌టాప్, కంప్యూటర్లు వినియోగించేటప్పుడు ఎక్కువగా కిందికి చూడటం వల్ల మెడ, దవడ కండరాలు బలహీనంగా మారి డబుల్ చిన్ వచ్చే అవకాశం ఉంది.

సహజంగా తగ్గొచ్చు...

ఈ సమస్యకు పరిష్కారం బరువు తగ్గడం. కాస్త ఎక్కువ సమయం పట్టినా ఇదే మంచి మార్గమని నిపుణులు చెబుతున్నారు.

ఒబెసిటీ ఉన్నవారైతే శరీర బరువులో 10 నుంచి 15 శాతం తగ్గితే డబుల్ చిన్ కూడా పోతుంది.

రోజూ కరిగించే వాటి కంటే 300 నుంచి 500 క్యాలరీలు అదనంగా ఖర్చు చేయడం లక్ష్యంగా పెట్టుకోవాలి.

గుడ్లు, చేపలు, చికెన్ తదితరాలను ఆహారంలో భాగం చేసుకుంటే కొవ్వు కరిగినా కండరాలు బలంగా ఉంటాయి.


గింజలు, నట్స్, ఆలివ్ ఆయిల్.. చర్మ స్థితిస్థాపకతకు సహకరిస్తాయి.

జాలైన్ (దవడ) వ్యాయామాలు కూడా డబుల్ చిన్ తగ్గేందుకు ఉపకరిస్తాయి. రోజుకు 2 నుంచి 3 లీటర్ల నీరు తాగాలి.

- ఈనాడు, విశాఖపట్నం

రేడియో ఫ్రీక్వెన్సీ.. లైపోసక్షన్..

- రేడియో ఫ్రీక్వెన్సీ (ఆర్ఎఫ్) చికిత్సలో చర్మాన్ని బిగుతుగా చేసి, గడ్డం కింద కొవ్వు తగ్గించడానికి వీలుంది. ఇందులో థెర్మేజ్, వీనస్ ఫ్రీజ్, ఎక్సిలైజ్ అల్ట్రా, మార్ఫస్ 8 సాంకేతికతలు అందుబాటులో ఉన్నాయి.
- చర్మ ఉపరితలం దెబ్బతినకుండా తక్కువ ఫ్రీక్వెన్సీ ఉన్న విద్యుదయస్కాంత తరంగాలను లోపలి పొరల్లోకి పంపిస్తారు. ఇవి శరీరం మరింత కొల్లాజెన్, ఎలాస్టిన్‌ను ఉత్పత్తి చేయడానికి సహకరిస్తాయి.
- దీంతో వదులైన చర్మం బిగుతుగా మారుస్తుంది. గడ్డం కింద కొవ్వు కణాలు కరిగిపోతాయి. కొద్ది వారాల్లో ఆ ప్రాంతం దృఢంగా మారి, సరైన ఆకృతిలోకి వస్తుంది.
- ఈ ప్రక్రియకు 6 నుంచి 10 సెషన్స్ పడతాయి. ఒక్కో సెషన్‌కు ఖర్చు రూ.2,500 నుంచి మొదలవుతుంది. ఇవి నొప్పి రహితం.
- డబుల్ చిన్ మరీ ఎక్కువగా ఉంటే లైపోసక్షన్ మెరుగైన చికిత్స అని వైద్యులు చెబుతున్నారు. ఈ ప్రక్రియలో సన్నటి కాన్యులాను లోపలికి పంపి.. అధిక కొవ్వును కరిగిస్తారు.
- కొందరిలో గడ్డం బాగా వెనక్కి ఉంటుంది. అలాంటి వారికి 'చిన్ అగ్మెంటేషన్' ద్వారా ఇంప్లాంట్ ఏర్పాటుచేస్తారు. వీటిలో ఏ చికిత్స చేయాలన్నది ప్లాస్టిక్ సర్జన్లు నిర్ణయిస్తారు.



- ఈ సమస్యకు కొంతమంది ఇంజెక్షన్లు తీసుకుంటున్నారు. వీటివల్ల దుష్ప్రభావాలకు ఆస్కారం ఉంది.

డబుల్ చిన్ తక్కువగా ఉంటే జీవనశైలి, ఆహారపు అలవాట్లు మార్చుకోవడం, దవడ వ్యాయామాల ద్వారా తగ్గించుకోవచ్చు.

మధ్యస్థమైతే.. రేడియో ఫ్రీక్వెన్సీ, అల్ట్రా సౌండ్ థెరపీ, క్రియోలిపోలిసిస్, కైబెల్లా చికిత్సలు ప్రయత్నించవచ్చు. తీవ్రమైతే.. లేజర్ ఆధారిత లైపోలిసిస్, లైపోసక్షన్ చేస్తారు.

కారణాలు తెలుసుకుని..

డబుల్ చిన్‌కు కారణాలేంటో తెలుసుకుని.. దానికి అనుగుణంగా చికిత్స తీసుకోవాలి. ఆహార నియమాలు, వ్యాయామం ద్వారా సమస్యను చాలా వరకు తగ్గించుకోవచ్చు. జంక్, అల్ట్రా ప్రాసెస్డ్ ఫుడ్‌కు దూరంగా ఉండాలి. పీచు పదార్థాలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవాలి. పొట్టు తక్కువగా తీసిన ధాన్యాలు, వేరుశనగ, సబ్జా గింజలు తీసుకోవాలి.

– మానస, పోషకాహార నిపుణులు, గీతం వైద్య కళాశాల

మూడు నెలల్లో ఫలితం

తాత్కాలికంగా డబుల్ చిన్ తక్కువగా కనిపించాలంటే మేకప్ ద్వారా అడ్జస్ట్ చేస్తారు. అవసరమైతే ఇతర చికిత్సలు చేస్తారు. వెంటనే ఫలితం రావాలనుకోవడం సరికాదు. 3 నెలల నుంచి ఫలితం కనిపిస్తుంది.

–సునీత, కాస్మెటాలజిస్ట్, విశాఖపట్నం

చాంపియన్


రోహిత్, కోహ్లి పేర్లు మాయం కావడంతో...


కోహ్లి, రోహిత్

దుబాయ్: టీమ్ఇండియా మాజీ కెప్టెన్లు విరాట్ కోహ్లి, రోహిత్ శర్మ వన్డేలకూ గుడ్‌బై చెప్పేశారా? ఈ విషయంపై బుధవారం క్రికెట్ వర్గాల్లో కాసేపు జోరుగా చర్చ సాగింది. కారణం ఐసీసీ ప్రకటించిన వన్డే బ్యాటింగ్ ర్యాంకుల జాబితాలో కెప్టెన్ రోహిత్ శర్మ, స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లిల పేర్లు కనిపించలేదు. దీంతో వారి అభిమానులు ఆందోళన చెందారు. టెస్టులకు, టీ20 క్రికెట్‌కు వీడ్కోలు పలికిన ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు వన్డేల నుంచి కూడా తప్పుకొన్నారేమో అన్న అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఇంత హఠాత్తుగా ఈ నిర్ణయం ఏంటో అని అభిమానులు కంగారు పడ్డారు. అయితే సాంకేతిక కారణాల వల్లే వాళ్లిద్దరి పేర్లు జాబితాలో కనిపించలేదని ఐసీసీ ప్రకటించింది. కాసేపటికి జాబితాలో రోహిత్, కోహ్లిల పేర్లు వరుసగా 2, 4 స్థానాల్లో కనిపించడంతో అభిమానులు ఊపిరి పీల్చుకున్నారు. ఛాంపియన్స్ ట్రోఫీ తర్వాత రోహిత్, కోహ్లి అంతర్జాతీయ క్రికెట్లో కనిపించలేదు. ఇంగ్లాండ్‌తో టెస్టు సిరీస్ ముంగిట ఈ ఇద్దరూ సుదీర్ఘ ఫార్మాట్‌కు గుడ్‌బై చెప్పిన సంగతి తెలిసిందే. నిరుడు టీ20 ప్రపంచకప్ విజయానంతరం ఆ ఫార్మాట్ నుంచి రోహిత్, కోహ్లి తప్పుకొన్నారు. నవంబరులో ఆస్ట్రేలియాలో వన్డే సిరీస్‌లో ఈ ఇద్దరూ బరిలోకి దిగనున్నారు.

మూడో స్థానంలో కుల్‌దీప్: ఐసీసీ వన్డే ర్యాంకింగ్స్‌లో భారత చైనామన్ స్పిన్నర్ కుల్‌దీప్ యాదవ్ ఒక స్థానం తగ్గి మూడో ర్యాంకులో నిలిచాడు. అతడి ఖాతాలో 650 పాయింట్లున్నాయి. ఆస్ట్రేలియాతో తొలి వన్డేలో 5 వికెట్లతో విజృంభించిన దక్షిణాఫ్రికా స్పిన్నర్ కేశవ్ మహరాజ్ (687) అగ్రస్థానం దక్కించుకున్నాడు. బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో భారత స్టార్ బ్యాటర్ శుభ్‌మన్ గిల్ 784 పాయింట్లతో అగ్రస్థానాన్ని నిలబెట్టుకున్నాడు. రోహిత్ (2), కోహ్లి (4) ర్యాంకుల్లో మార్పు లేదు. శ్రేయస్ అయ్యర్ (704) ఆరో స్థానంలో ఉన్నాడు. టీ20 బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అభిషేక్ శర్మ, తిలక్ వర్మ వరుసగా తొలి రెండు స్థానాల్లో కొనసాగుతున్నారు. సూర్యకుమార్ యాదవ్ 6, యశస్వి జైస్వాల్ 10వ ర్యాంకుల్లో ఉన్నారు. బౌలర్లలో వరుణ్ చక్రవర్తి 3, రవి బిష్ణోయ్ 7, అర్ష్‌దీప్ సింగ్ 10వ ర్యాంకుల్లో కొనసాగుతున్నారు.

బ్రసెల్స్ డైమండ్ లీగ్‌కు నీరజ్ దూరం


నీరజ్

దిల్లీ: డైమండ్ లీగ్ ఫైనల్స్‌కు ఇప్పటికే అర్హత సాధించిన భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా బ్రసెల్స్‌లో జరిగే చివరి డైమండ్ లీగ్ (22న) అంచెకు దూరం కావాలని నిర్ణయించుకున్నాడు. మొత్తం 14 డైమండ్ లీగ్ టోర్నీల్లో నాలుగింట్లో జావెలిన్ త్రో పోటీలను నిర్వహిస్తారు. అందులో రెండు టోర్నీల్లో పోటీపడిన నీరజ్.. ఆగస్టు 28న జ్యూరిచ్‌లో జరిగే ఫైనల్స్‌కు అర్హత సాధించాడు. దోహా డైమండ్ లీగ్‌లో 90.23 మీటర్ల ప్రదర్శనతో నీరజ్ రెండో స్థానంలో నిలిచాడు. పారిస్ డైమండ్ లీగ్‌లో 88.16 మీటర్లతో అగ్రస్థానం సంపాదించాడు.


అనంత్ జీత్

అనంత్ జీత్‌కు స్వర్ణం

- సౌరభ్-సురుచి జోడీకి కాంస్యం
- ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్

షింకెంట్ (కజకిస్థాన్): ఆసియా షూటింగ్ ఛాంపియన్‌షిప్‌లో భారత క్రీడాకారులు సత్తా చాటారు. అనంత్ జీత్ సింగ్ నరుక పురుషుల స్కీట్ విభాగంలో స్వర్ణం సాధించాడు. సౌరభ్ చౌదరి, సురుచి ఇందర్ సింగ్ జోడీ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో కాంస్యం గెలిచింది. ఉత్కంఠభరితంగా సాగిన ఫైనల్లో అనంత్ జీత్ 57-56తో అల్ రషీద్ (కువైట్)పై విజయం సాధించాడు. మిక్స్‌డ్ విభాగంలో మూడో స్థానం కోసం జరిగిన పోరులో సౌరభ్-సురుచి ద్వయం 17-9తో లియు హెంగ్-సీ సియాంగ్ చెన్ జంటను ఓడించింది. క్వాలిఫయింగ్ రౌండ్లో సౌరభ్ 286, సురుచి 292 పాయింట్లతో ఉమ్మడిగా అయిదో స్థానంతో ఫైనల్‌కు అర్హత సాధించారు. చైనా, దక్షిణ కొరియా జోడీలు వరుసగా స్వర్ణం, రజతం గెలిచాయి. ఈ టోర్నీలో స్టార్ షూటర్ మను భాకర్ 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ వ్యక్తిగత విభాగంలో కాంస్యం నెగ్గిన సంగతి తెలిసిందే. మరోవైపు జూనియర్ విభాగంలో వంశిక చౌదరి, గవిన్ ఆంటోనీ ద్వయం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్‌లో కాంస్యం గెలిచింది. ఈ జోడీ 16-14తో కిమ్ యెజిన్-కిమ్ డూయెన్ (దక్షిణ కొరియా) జంటను ఓడించింది.


శుభ్‌మన్ గిల్

ఆ రోజు త్వరలోనే..!

శుభ్‌మన్ గిల్ అంతర్జాతీయ టీ20లు ఆడి ఏడాది దాటింది. భారత్ చివరగా ఆడిన టీ20 సిరీస్‌లో వైస్ కెప్టెన్‌గా ఉన్నది అక్షర్ పటేల్. కానీ ఆసియా కప్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులో శుభ్‌మన్ చోటు దక్కించుకోవడమే కాదు, వైస్ కెప్టెన్ కూడా అయిపోయాడు. ఇది దేనికి సంకేతమో వివరించి చెప్పాల్సిన పని లేదు. ఇప్పటికే టెస్టు సారథిగా రుజువు చేసుకున్న శుభ్‌మన్.. సమీప భవిష్యత్తులోనే మూడు ఫార్మాట్ల కెప్టెన్ కావచ్చు!

ఈనాడు క్రీడావిభాగం

రోహిత్ శర్మ టెస్టు క్రికెట్‌కు రిటైర్మెంట్ ప్రకటించాక అతడి వారసుడిగా శుభ్‌మన్ గిల్‌ను ప్రకటించినపుడు చాలామంది అది సరైన ఎంపికేనా అని సందేహించారు. కానీ టీమ్ఇండియాకు ఏమంత గొప్ప రికార్డు లేని ఇంగ్లాండ్‌లో జట్టును గొప్పగా నడిపించి ఆ సందేహాలకు తెర దించాడు గిల్. ఇటు బ్యాటర్‌గా, అటు కెప్టెన్ తన ప్రదర్శన విమర్శకుల ప్రశంసలు అందుకుంది. దీంతో గిల్‌ను మూడు ఫార్మాట్లలోనూ కెప్టెన్‌ను చేస్తే బాగుంటుందనే చర్చ మొదలైంది. కోచ్ గౌతమ్ గంభీర్, చీఫ్ సెలక్టర్ అజిత్ అగార్కర్ కూడా అదే ఆలోచనతో ఉన్నట్లున్నారు. ప్రస్తుతం వన్డేల్లో రోహిత్ కెప్టెన్ కాగా.. టీ20 జట్టును సూర్యకుమార్ యాదవ్ నడిపిస్తున్నారు. వీరి నుంచి రాబోయే రోజుల్లో శుభ్‌మనే బాధ్యతలు అందుకునే అవకాశాలు మెండుగా ఉన్నాయి. రోహిత్‌కు ఇప్పటికే 39 ఏళ్లు వచ్చేశాయి. 2027 వన్డే ప్రపంచకప్ వరకు అతను కొనసాగుతాడా అన్నది సందేహమే. నవంబరులో ఆస్ట్రేలియాలో జరిగే సిరీస్‌తో తన భవితవ్యంపై ఒక నిర్ణయానికి వస్తాడని భావిస్తున్నారు. శుభ్‌మన్ ఇప్పటికే వన్డే జట్టులో బాగా నిలదొక్కుకున్నాడు. అతను ఐసీసీ వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో ఉండడం విశేషం. బ్యాటింగ్‌లో స్థిరంగా రాణిస్తున్న అతడికి జట్టు పగ్గాలు ఇవ్వడానికి సెలక్టర్లు పూర్తి సానుకూలంగానే ఉన్నట్లు కనిపిస్తోంది. అతనెప్పుడు వన్డే సారథి అవుతాడన్నది రోహిత్ చేతుల్లోనే ఉంది. ఇక టీ20 సారథ్యానికి కూడా గిల్ చేరువగా ఉన్నట్లే. నిరుడు రోహిత్ సారథ్యంలో భారత్ టీ20 ప్రపంచకప్ గెలిచాక పొట్టి ఫార్మాట్లో పగ్గాలందుకున్న సూర్యకుమార్ జట్టును బాగానే నడిపిస్తున్నాడు. అతడి సారథ్యంలో జట్టు ఆడిన నాలుగు సిరీస్‌ల్లోనూ విజయం సాధించింది. కానీ సూర్య బ్యాటింగ్ ఫామ్ మాత్రం గొప్పగా లేదు. అతడికి 34 ఏళ్లు వచ్చేశాయి. కుర్రాళ్ల ఫార్మాట్‌గా పేరున్న టీ20 క్రికెట్లో ఇది కాస్త ఎక్కువ వయసే. రాబోయే ఆసియా కప్‌లో బ్యాటర్‌గా, కెప్టెన్‌గా సూర్య ఉత్తమ ప్రదర్శన చేయాల్సిందే. లేదంటే సెలక్టర్ల దృష్టి శుభ్‌మన్ వైపు మళ్లుతుంది. ఆ తర్వాత కూడా సూర్యకు కెప్టెన్‌గా ప్రతి సిరీస్ పరీక్షే. అతను నిలకడగా రాణించి, జట్టు మెరుగైన ప్రదర్శన చేస్తుంటేనే వచ్చే ఏడాది టీ20 ప్రపంచకప్‌లో కెప్టెన్‌గా కొనసాగుతాడు. లేదంటే శుభ్‌మన్‌కు బాధ్యతలు అప్పగించాల్సిందే. ఇక ఏడాది తర్వాత టీ20లు ఆడబోతున్న శుభ్‌మన్.. ఆసియా కప్‌లో ఎలాంటి ప్రదర్శన చేస్తాడన్నది ఆసక్తికరం. ఈ ఏడాది ఐపీఎల్‌లో అతను పరుగుల వరద పారించాడు. తన కెప్టెన్సీ కూడా ఆకట్టుకుంది. కాబట్టే టీమ్ఇండియా టీ20 సారథ్య బాధ్యతలను కూడా అతడికే అప్పగించాలన్న డిమాండ్లు ఊపందుకున్నాయి. ఆసియా కప్ సందర్భంగా వైస్ కెప్టెన్‌గా మైదానం బయట, లోపల జట్టు ప్రణాళికల్లో శుభ్‌మన్ పాత్ర కూడా కీలకం కాబోతోంది. ఆటతో పాటు వ్యూహాల్లోనూ కోచ్ గంభీర్‌ను మెప్పించగలిగితే అతడికి మార్గం మరింత సుగమమవుతుంది.

హాకీ జట్టులో దిల్‌ప్రీత్

ఆసియా కప్‌నకు జట్టు ఎంపిక


దిల్‌ప్రీత్

దిల్లీ: ఆసియా కప్ హాకీ టోర్నీలో స్టార్ డ్రాగ్ ఫ్లికర్ హర్మన్‌ప్రీత్ సింగ్ సారథ్యంలో భారత జట్టు బరిలో దిగనుంది. ఈనెల 29న బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ఆరంభంకానున్న ఈ టోర్నీ కోసం 18 మందితో కూడిన భారత జట్టును హాకీ ఇండియా (హెచ్ఐ) బుధవారం ప్రకటించింది. మిడ్ ఫీల్డర్ రాజిందర్ సింగ్.. ఫార్వర్డ్‌లు శిలానంద్ లక్రా, దిల్‌ప్రీత్ సింగ్ తమ స్థానాల్ని నిలబెట్టుకోవడం మినహా జట్టులో ఆశ్చర్యకర ఎంపికలేమీ లేవు. ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని ప్రధాన ఆటగాళ్లతో జట్టును సిద్ధం చేశారు. ఇటీవలి ఆస్ట్రేలియా పర్యటనకు వెళ్లిన జంబో జట్టులో రాజిందర్, లక్రా, దిల్‌ప్రీత్ కూడా ఉన్నారు. షంషేర్ సింగ్ బదులు రాజిందర్.. గుర్జంత్ సింగ్ స్థానంలో దిల్‌ప్రీత్ వైపు సెలెక్టర్లు మొగ్గు చూపారు. రిటైర్మెంట్ ప్రకటించిన లలిత్ ఉపాధ్యాయ్ స్థానంలో లక్రాను ఎంపిక చేశారు.

భారత జట్టు: గోల్ కీపర్లు: క్రిషన్ పాథక్, సూరజ్ కర్కేర, **డిఫెండర్లు:** సుమిత్, జర్మన్‌ప్రీత్ సింగ్, సంజయ్, హర్మన్‌ప్రీత్ సింగ్, అమిత్ రోహిదాస్, జుగ్‌రాజ్ సింగ్, **మిడ్ ఫీల్డర్లు:** రాజిందర్ సింగ్, రాజ్ కుమార్ పాల్, హార్దిక్ సింగ్, మన్‌ప్రీత్ సింగ్, వివేక్ సాగర్ ప్రసాద్, **ఫార్వర్డ్‌లు:** మన్‌దీప్ సింగ్, శిలానంద్ లక్రా, అభిషేక్, సుఖ్‌జీత్ సింగ్, దిల్‌ప్రీత్ సింగ్, **స్టాండ్‌బై:** నీలం సందీప్ ఎక్సెస్, సెల్వం కార్తి

సెమీస్‌లో టాప్ సీడ్ జోడీ

యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్‌లో పెగులా, డ్రేపర్ ముందంజ

న్యూయార్క్: ఈసారి భిన్నంగా, అసలు టోర్నీ కంటే చాలా ముందుగా జరుగుతున్న యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ ఈవెంట్లో టాప్ సీడ్ జెస్సికా పెగులా (అమెరికా)-జాక్ డ్రేపర్ (బ్రిటన్) జోడీ సెమీస్‌కు దూసుకెళ్లింది. క్వార్టర్స్‌లో ఈ ద్వయం 4-1, 4-1తో మిరా ఆంద్రీవా-డేనియల్ మెద్వెదెవ్ (రష్యా) జోడీని అలవోకగా ఓడించింది. ఈ జోడీ గురువారం తెల్లవారుజామున జరిగే సెమీస్‌లో మూడో సీడ్ ఇగా స్వైటెక్ (పోలెండ్)-కాస్పర్ రూడ్ (నార్వే) ద్వయాన్ని ఢీకొంటుంది. రెండో సెమీస్‌లో డేనియలీ-కొలిన్స్ ద్వయం.. సారా ఎరాని-వావసోరి జోడీని ఢీకొంటుంది. ఆ తర్వాత ఫైనల్‌ను నిర్వహిస్తారు. క్వార్టర్ ఫైనల్లో డేనియెలీ కొలిన్స్ -క్రిస్టియన్ హారిసన్ (అమెరికా) జోడీ 4-1, 5-4 (7-2)తో టేలర్ టౌన్‌సెండ్-బెన్ షెల్టన్ (అమెరికా) జంటపై విజయం సాధించింది. ఈసారి 16 జోడీలే తలపడుతున్న యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ ఈవెంట్‌ను అసలు టోర్నీ కంటే ముందు విడిగా రెండు రోజుల పాటు నిర్వహిస్తున్నారు. ఈ ఈవెంట్లో సెట్‌కు 4 గేమ్‌లే ఉండడం విశేషం.


పెగులా, డ్రేపర్

ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుతో క్రికెట్ ఆదాయానికి గండి

దిల్లీ: లోక్‌సభలో ప్రవేశపెట్టిన ఆన్‌లైన్ గేమింగ్ బిల్లుతో క్రికెట్ ఆదాయానికి గండి పడనున్నట్లు తెలుస్తోంది. తాజా బిల్లుతో ఫాంటసీ గేమింగ్ పరిశ్రమ ఆదాయంలో గణనీయమైన తగ్గుదల ఉండొచ్చని మార్కెట్ అంచనా వేస్తోంది. ఈ ప్రభావం క్రికెట్‌తో పాటు ఆటగాళ్ల వ్యక్తిగత స్పాన్సర్‌షిప్‌లపై పడుతుందని భావిస్తున్నారు. ప్రస్తుతం భారత జట్టుకు డ్రీమ్11 టైటిల్ స్పాన్సర్‌గా వ్యవహరిస్తోంది. రూ.358 కోట్లకు భారత జట్టు టైటిల్ హక్కుల్ని ఈ సంస్థ కొనుక్కుంది. రూ.625 కోట్లకు ఐపీఎల్ ఫాంటసీ గేమింగ్ హక్కుల్ని మై11 సర్కిల్ దక్కించుకుంది. దీంతో పాటు పలు ఫాంటసీ, గేమింగ్ సంస్థలతో ప్రస్తుత, మాజీ స్టార్ క్రికెటర్లకు ఒప్పందాలు ఉన్నాయి. ఈ ఒప్పందాల భవిష్యత్తుపైనా నీలినీడలు కమ్ముకోనున్నాయి. మరోవైపు ఈ బిల్లు ద్వారా ఈ-స్పోర్ట్స్‌కు మంచి గుర్తింపు, ప్రోత్సాహం లభిస్తుందని నిపుణులు అంచనా వేస్తున్నారు. 2023 హాంగ్‌జౌ ఆసియా క్రీడల్లో ఈ-స్పోర్ట్స్ అరంగేట్రం చేసింది. అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీ (ఐఓసీ) 2027లో రియాద్‌లో మొట్టమొదటి ఈ-స్పోర్ట్స్ ఒలింపిక్స్ నిర్వహించనుంది.

ఆసియా కప్‌లో భారత జట్టు మేనేజర్‌గా ప్రశాంత్


ప్రశాంత్


ఈనాడు, అమరావతి: ఆసియా కప్ టీ20 టోర్నీలో బరిలోకి దిగనున్న భారత జట్టుకు తెలుగు వాడైన పీవీఆర్ ప్రశాంత్ మేనేజర్‌గా నియమితులయ్యారు. యూఏఈ వేదికగా సెప్టెంబర్ 9 నుంచి 28 వరకు ఈ టోర్నీ జరగనుంది. భీమవరానికి చెందిన ప్రశాంత్.. ఉమ్మడి పశ్చిమగోదావరి క్రికెట్ జట్టుకు ప్రాతినిధ్యం వహించారు. ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. 1997లో టీమ్ఇండియా వెస్టిండీస్ పర్యటనలో అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్‌గా డీవీ సుబ్బారావు వ్యవహరించారు. మళ్లీ ఇప్పుడు ఆంధ్ర ప్రాంతానికి చెందిన వ్యక్తికి అవకాశం దక్కింది. ప్రశాంత్ నియామకంపై ఏసీఏ అధ్యక్షుడు కేశినేని శివనాథ్, కార్యదర్శి సానా సతీశ్‌బాబు హర్షం వ్యక్తం చేశారు.

ఒక్క ఆటగాడు.. 1391 సాకర్ మ్యాచ్‌లు


ఫాబియో

రియో డి జెనీరో: బ్రెజిల్ ఆటగాడు ఫాబియో ప్రపంచంలో అత్యధిక ప్రొఫెషనల్ సాకర్ మ్యాచ్‌లు ఆడిన ఫుట్‌బాలర్‌గా రికార్డులకెక్కాడు. అతడి మ్యాచ్‌ల సంఖ్య 1,391కు చేరుకుంది. ఫాబియో ఫ్లుమినెన్స్ క్లబ్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్నాడు. ఇంగ్లాండ్ గోల్ కీపర్ పీటర్ షిల్టన్ నెలకొల్పిన రికార్డును ఫాబియో అధిగమించాడు. 90వ దశకంలో కెరీర్‌ను ఆరంభించిన ఫాబియో వయసు ప్రస్తుతం 44ఏళ్లు.

రాకెట్ వేగంతో..


అల్కరాజ్, రదుకాను

ఈనాడు క్రీడావిభాగం

టెన్నిస్‌లో ఓ సెట్ పూర్తవ్వాలంటే సాధారణంగా 40 నిమిషాల నుంచి గంట సమయం పడుతుంది. కానీ ఈ సమయంలో మ్యాచ్ పూర్తయితే..! యుఎస్ ఓపెన్‌లో ప్రయోగాత్మకంగా ఆరంభమైన మిక్స్‌డ్ డబుల్స్ టోర్నీలో మ్యాచ్‌లు రాకెట్ వేగంతో ముగిసిపోతున్నాయి. ఈ విభాగంలో తొలి రోజు మొత్తం 12 మ్యాచ్‌లు జరిగితే ఒకే ఒక్క మ్యాచ్ నిడివి గంట దాటింది. ఒసాకా (జపాన్), మోన్‌ఫిల్స్ (ఫ్రాన్స్) - కేటీ మెక్‌నల్లీ (అమెరికా), ముసెట్టి (ఇటలీ) మధ్య మ్యాచ్ గరిష్ఠంగా 68 నిమిషాలు జరిగింది. మిక్స్‌డ్ డబుల్స్ టోర్నీని మరింత ఆసక్తికరంగా మలిచేందుకు రూపొందించిన ఈ ఫార్మాట్ టెన్నిస్ అభిమానులను ఆకర్షించడంలో విజయం సాధించిందనే చెప్పొచ్చు. సాధారణంగా సింగిల్స్ జరిగేటపుడే నిర్వహించే ఈ మ్యాచ్‌లపై ఆసక్తి పెద్దగా ఉండదు. స్టార్ ప్లేయర్లు కూడా దూరంగా ఉంటారు. కానీ ఈసారి ప్రధాన పోటీల కంటే ముందుగా నిర్వహించిన ఈ ఈవెంట్లో జట్ల సంఖ్యను 32 నుంచి 16కు కుదించారు. సింగిల్స్‌లో కంబైన్డ్ ర్యాంకింగ్ ఆధారంగా 8 జట్లను ఎంపిక చేశారు. మరో ఎనిమిది జట్లకు నిర్వాహకులు వైల్డ్ కార్డులు ఇచ్చారు. స్టార్ ప్లేయర్లు పాల్గొనేలా చేయడం కోసం విజేత ప్రైజ్‌మనీని అయిదు రెట్లు పెంచి రూ. 8.7 కోట్లు చేశారు. స్టార్ ప్లేయర్లు మిక్స్‌డ్ డబుల్స్‌లో పోటీపడితే ప్రేక్షకులు ఎక్కువమంది వస్తారన్నది నిర్వాహకుల ఆలోచన. ఈ విషయంలో వారు విజయవంతమయ్యారనే చెప్పొచ్చు. ఎప్పుడూ ఖాళీ స్టేడియాల మధ్య జరిగే మిక్స్‌డ్ డబుల్స్ పోటీలు ఈసారి ప్రేక్షకులతో కళకళలాడాయి. తొలి రోజు ఉచిత ప్రవేశం కావడం కూడా ఓ కారణమే. కానీ రెండో రోజు సెమీస్, ఫైనల్‌ను చూసేందుకు ఎంట్రీ టికెట్లు తీసుకోవాల్సివున్నా ప్రేక్షకులు ఉత్సాహం చూపుతుండటం పట్ల నిర్వాహకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రేక్షకుల మద్దతు లభిస్తున్నా డబుల్స్ ప్లేయర్లు, టెన్నిస్ విశ్లేషకుల నుంచి ఈ కొత్త ఫార్మాట్‌పై వ్యతిరేక స్పందన వినిపిస్తోంది. సెట్‌కు నాలుగు గేమ్‌ల చొప్పున నిర్వహిస్తున్న ఈ కొత్త ఫార్మాట్ పట్ల టెన్నిస్ మ్యాచ్‌లో ఉండే అసలైన మజా కనిపించడం లేదని, మ్యాచ్ ఎప్పుడు రెండో సెట్‌కు వచ్చిందో కూడా అర్థం కావడం లేదని విమర్శిస్తున్నారు. ఈ టోర్నీలో పోటీపడిన జాక్ డ్రేపర్ (బ్రిటన్) యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ టోర్నీ ఓ గ్రాండ్‌స్లామ్ టోర్నీలా కాకుండా ఎగ్జిబిషన్ టోర్నీలా ఉందని అన్నాడు. డబుల్స్ స్పెషలిస్ట్ వావసోరి (ఇటలీ) కొత్త విధానం వల్ల డబుల్స్ ప్లేయర్లు తీవ్ర అన్యాయానికి గురవుతున్నారని వాపోయాడు. "ఈ కొత్త ఫార్మాట్‌లో కొన్ని సానుకూలాంశాలు.. కొన్ని ప్రతికూలాంశాలున్నాయి. ప్రేక్షకుల మధ్య మ్యాచ్‌లు ఆడుతుండటం ఆహ్వానించదగ్గ పరిణామం. భవిష్యత్‌లో డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్‌కు ఈ ఫార్మాట్ ఎంతో మేలు చేస్తోంది. కానీ.. నిరుడు టైటిల్ గెలిచినా మా జట్టు (వావసోరి, ఎరాని) ఈసారి టోర్నీలో ఆడుతుందో లేదో అన్న విషయం ఆఖరి వరకు తేలలేదు. చాలా మంది డబుల్స్ స్పెషలిస్ట్‌లు పోటీకి దూరమయ్యారు" అని అన్నాడు. కొన్ని విమర్శలు ఉన్నా ఈసారి యుఎస్ ఓపెన్ మిక్స్‌డ్ డబుల్స్ పట్ల సానుకూలతే ఎక్కువ. ఎవరికీ పట్టని విభాగంలా మిగిలిపోకుండా.. అల్కరాజ్ (స్పెయిన్), జకోవిచ్ (సెర్బియా), స్వైటెక్ (పోలెండ్), రదుకాను (బ్రిటన్).. ఇలా స్టార్ ప్లేయర్లు బరిలో దిగడం ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంది. మరి ఇదే ఫార్మాట్‌ను ఇతర గ్రాండ్‌స్లామ్‌లు అనుసరిస్తాయా అన్నది చూడాలి!

ఆనంద్ × కాస్పరోవ్


ఆనంద్, కాస్పరోవ్

దిల్లీ: చెస్ దిగ్గజాలు విశ్వనాథన్ ఆనంద్, గ్యారీ కాస్పరోవ్ (రష్యా).. ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్, నంబర్‌వన్ ర్యాంకర్ మాగ్నస్ కార్ల్‌సన్ (నార్వే) ముఖాముఖి తలపడనున్నారు. ఈ ప్రతిష్ఠాత్మక పోరాటాలకు అమెరికాలోని సెయింట్ లూయిస్ వేదిక కానుంది. క్లచ్ చెస్ ఎగ్జిబిషన్‌లో భాగంగా అక్టోబరు 7 నుంచి 11 వరకు ఈ మ్యాచ్‌లు నిర్వహించనున్నట్లు సెయింట్ లూయిస్ చెస్ క్లబ్ ప్రకటించింది. 2021లో క్రొయేషియా ర్యాపిడ్, బ్లిట్జ్ టోర్నీలో ఆనంద్, కాస్పరోవ్ చివరిసారిగా తలపడ్డారు. ఈ మ్యాచ్‌లో ఆనంద్ విజయం సాధించాడు. వీరిద్దరు భిన్న ఫార్మాట్లలో 82 సార్లు పోటీపడ్డారు. ఎక్కువసార్లు కాస్పరోవ్ గెలిచాడు. అక్టోబరు 27 నుంచి 29 వరకు కార్ల్‌సన్, హికరు నకమురు, ఫాబియానో కరువానా, గుకేశ్‌లతో టోర్నీ జరుగుతుందని సెయింట్ లూయిస్ క్లబ్ పేర్కొంది.

గుకేశ్ విజయం, ప్రజ్ఞానందకు డ్రా

సెయింట్‌లూయిస్ (అమెరికా): ప్రపంచ ఛాంపియన్ దొమ్మరాజు గుకేశ్ సింక్వెఫీల్డ్ కప్ చెస్ టోర్నీలో పుంజుకున్నాడు. తొలి రౌండ్లో సహచర క్రీడాకారుడు ప్రజ్ఞానంద చేతిలో ఓటమి పాలైన గుకేశ్.. రెండో రౌండ్లో నాదిర్బెక్ అబ్దుసత్తరోవ్ (ఉజ్బెకిస్థాన్)పై అలవోకగా విజయం సాధించాడు. ఈ విజయంతో ఒక పాయింటు సాధించిన అతను. కరువానా, వెస్లీ, సెవియన్, వాచియెర్‌లతో కలిసి ఉమ్మడిగా నాలుగో ర్యాంకులో కొనసాగుతున్నాడు. మరోవైపు రెండో రౌండ్లో.. కరువానాతో గేమ్‌ను డ్రా చేసుకున్నాడు. అతను అరోనియన్, ఫిరౌజియాలతో కలిసి ఉమ్మడిగా అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. వీరి ఖాతాలో 1.5 పాయింట్లున్నాయి.

చెలరేగిన తన్మయ్

పంజాబ్‌పై హైదరాబాద్ విజయం


తన్మయ్

చెన్నై: తన్మయ్ అగర్వాల్ (163; 127 బంతుల్లో 12×4, 5×6) సెంచరీతో చెలరేగడంతో అఖిల భారత బుచ్చిబాబు క్రికెట్ టోర్నీలో హైదరాబాద్ శుభారంభం చేసింది. బుధవారం నాలుగు వికెట్ల తేడాతో పంజాబ్‌పై విజయం సాధించింది. ఓవర్‌నైట్ స్కోరు 267/6తో మూడో రోజు ఉదయం ఆట కొనసాగించిన హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో ఏడు వికెట్లకు 355 పరుగులు సాధించింది. వరుణ్ గౌడ్ (74 నాటౌట్) రాణించడంతో ఏడు పరుగుల స్వల్ప ఆధిక్యం లభించింది. అనంతరం పంజాబ్ 39.5 ఓవర్లలో 298/8 స్కోరు వద్ద రెండో ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. ప్రభ్‌సిమ్రన్ సింగ్ (59), అన్మోల్‌ప్రీత్ సింగ్ (73), సలిల్ అరోరా (68) మెరిశారు. హైదరాబాద్ బౌలర్లలో నిశాంత్ (2/89), రవితేజ (3/70), తనయ్ త్యాగరాజన్ (2/50) సఫలమయ్యారు. 292 పరుగుల లక్ష్యాన్ని హైదరాబాద్ 41 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి ఛేదించింది. తన్మయ్ అద్భుత సెంచరీతో జట్టు విజయంలో కీలక పాత్ర పోషించాడు. రాహుల్ సింగ్ (20), హిమతేజ (50), రోహిత్ రాయుడు (25) రాణించారు. బుచ్చిబాబు టోర్నీలో లీగ్ దశ మ్యాచ్‌లన్నీ మూడు రోజులు జరుగుతాయి. ఒక్కో జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 90 ఓవర్లు.. రెండో ఇన్నింగ్స్‌లో 45 ఓవర్ల చొప్పున ఆడతాయి. సెమీస్, ఫైనల్ మ్యాచ్‌ల్ని టెస్టు ఫార్మాట్‌లో నాలుగు రోజులు నిర్వహిస్తారు.

ఆవిష్కరణలను అలవాటుగా మార్చాలి

- రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లో దిగ్గజ పారిశ్రామిక సంస్థలకు భాగస్వామ్యం
- టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్


ఆర్‌టీఐహెచ్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్. వేదికపై సీఎం చంద్రబాబు, భారత్ ఫోర్జ్ సీఎండీ బాబా కళ్యాణి, మంత్రులు లోకేశ్, నాదెండ్ల మనోహర్, పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్

ఈనాడు, అమరావతి: వినూత్న ఆలోచనలు.. ఆవిష్కరణలను ఒక అలవాటుగా చేయడమే రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రధాన లక్ష్యమని టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్ అన్నారు. దేశంలోని దిగ్గజ పారిశ్రామిక సంస్థలన్నీ ఇందులో పాలుపంచుకుంటాయన్నారు. రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ.. ఇన్నోవేషన్ కేంద్రాల్లో స్టార్టప్‌లకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని... వ్యవసాయం, వైద్యం, రక్షణ తదితర కీలక రంగాల్లోని వివిధ అంశాలకు సంబంధించి నవకల్పనలకు అవకాశాలున్నాయని చెప్పారు. స్థానిక, ప్రాంతీయ, జాతీయ, అంతర్జాతీయ స్థాయి అంశాలకు ఇన్నోవేషన్ హబ్ వేదికగా మారుతుందని ఆకాంక్షించారు. ఇన్నోవేషన్ హబ్‌కు 'రతన్ టాటా' పేరు పెట్టాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినందుకు టాటా సంస్థ తరఫున కృతజ్ఞత తెలిపారు. చంద్రబాబు ఇన్నోవేషన్ హబ్ గురించి కలగనడమే కాదు దాన్ని సాకారం చేశారని ప్రశంసించారు. దీన్ని విజయవంతం చేయగలిగిన సమర్థత ఆయనకు ఉందని చంద్రశేఖరన్ అన్నారు.

చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం: బాబా కళ్యాణి, భారత్ ఫోర్జ్ ఛైర్మన్

సీఎం చంద్రబాబు ప్రతిసారీ ఒక మెగా ఐడియాతో వస్తారు. 30 ఏళ్ల కిందట ఉమ్మడి రాష్ట్రంలో హైదరాబాద్‌ను తీర్చిదిద్దారు. ప్రస్తుతం అమరావతి అభివృద్ధిపై దృష్టి పెట్టారు. గ్రామ, నగర, పారిశ్రామిక స్థాయిలో సాంకేతికత ఆధారంగా నవకల్పన కేంద్రంగా అమరావతిని తీర్చిదిద్దాలన్న లక్ష్యంతో ఆయన పనిచేస్తున్నారు. ఆయనకున్న అద్భుతమైన దార్శనికతకు ఇది నిదర్శనం.

చంద్రబాబు బ్రాండ్ ఇమేజ్‌తో అమరావతికి విరాళం

అమరావతిలో రూ.100 కోట్లతో ప్రపంచస్థాయి ప్రమాణాలతో గ్రంథాలయాన్ని ఏర్పాటు చేసేందుకు దుబాయ్‌కి చెందిన ఒక సంస్థ ముందుకొచ్చిందని పరిశ్రమల శాఖ మంత్రి టీజీ భరత్ చెప్పారు. రాష్ట్రంలో ఎలాంటి వ్యాపారాన్ని ప్రారంభించేందుకు ఆ కంపెనీకి ఆసక్తి లేకున్నా.. కేవలం చంద్రబాబుకు ఉన్న బ్రాండింగ్ కారణంగా ఆ మొత్తాన్ని ఇచ్చేందుకు అంగీకరించిందన్నారు. ఎంతో మంది యువత వినూత్న ఆలోచనలను వాస్తవ రూపంలోకి తీసుకురావడంలో హబ్ కీలకంగా మారుతుందని పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి ఆవిష్కరణల కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దడానికి చంద్రబాబు కంకణం కట్టుకున్నారన్నారు. తిరుపతి హబ్‌లో తాము భాగస్వాములయ్యామని మాజీ ఎంపీ గల్లా జయదేవ్ చెప్పారు. యువ ఔత్సాహికులకు మద్దతుగా నిలుస్తామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నేతృత్వంలో ఇన్నోవేషన్‌కు కేంద్రంగా రాష్ట్రం మారుతుందన్నారు. కార్యక్రమంలో పరిశ్రమల శాఖ కార్యదర్శి యువరాజ్, ఐటీ శాఖ కార్యదర్శి భాస్కర్ కాటమనేని పాల్గొన్నారు. విజయవాడ, తిరుపతి, రాజమహేంద్రవరం, అనంతపురం, విశాఖల్లోని ఇన్నోవేషన్ హబ్ అండ్ స్పోక్‌లను బుధవారం ప్రారంభించారు.

గ్రామాల నుంచీ ఆవిష్కరణలకు అవకాశం: మంత్రి లోకేశ్



నవకల్పనల కేంద్రంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు దిగ్గజ పారిశ్రామికవేత్తలు, విద్యావేత్తలతో కలిసి పనిచేసేందుకు సిద్ధమని మంత్రి లోకేశ్ పేర్కొన్నారు. ఆవిష్కరణలు అంటే కేవలం ఐటీ ఆధారిత సాంకేతికతలో మాత్రమే కాదు.. గ్రామాల నుంచి ప్రపంచ స్థాయి వరకు అన్ని రంగాల్లో ఆవిష్కరణలకు అవకాశం ఉందని చెప్పారు. 'విద్యార్థి దశ నుంచే మెరుపులాంటి ఆలోచనలతో ఆవిష్కరణలపై దృష్టి పెట్టాలి. లక్షల మంది యువత ఆశాకిరణంగా రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఉంటుంది. ఉమ్మడి రాష్ట్రంలో ప్రపంచపటంలో హైదరాబాద్‌ను నిలిపిన చంద్రబాబు.. అమరావతిని ఆదే స్థాయిలో అభివృద్ధి చేయాలన్న పట్టుదలతో ఉన్నారు. 14 నెలల కూటమి పాలనలో స్నేహపూర్వక పారిశ్రామిక విధానాల ద్వారా భారీ పెట్టుబడులు ఆకర్షించాం. ఏపీ పెట్టుబడుల టాస్క్‌ఫోర్స్ కమిటీ ఛైర్మన్‌గా టాటా గ్రూప్ ఛైర్మన్ చంద్రశేఖరన్ సూచనలు ఇస్తున్నారు. విద్యతో పాటు వినూత్న ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఇన్నోవేషన్ హబ్ ఉపయోగపడుతుంది' అని పేర్కొన్నారు.

సీఎంకు 'రోబో' స్వాగతం


రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లోకి వెళ్తున్న సీఎం చంద్రబాబుకు స్వాగతం పలుకుతున్న రోబో. చిత్రంలో మంత్రులు టీజీ భరత్, నాదెండ్ల మనోహర్, మాజీ ఎంపీ గల్లా జయదేవ్

ఈనాడు, అమరావతి: రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌ను ప్రారంభించేందుకు వచ్చిన సీఎం చంద్రబాబుకు రోబో స్వాగతం పలికింది. సీఎం వచ్చిన వెంటనే 'టెకీ బాట్' రోబో రెండు కాళ్లపై నిలుచుని నమస్కారం చేసింది. దీంతో సీఎం నవ్వులు చిందిస్తూ.. 'యా..యా..గుడ్..గుడ్.. వెరీ గుడ్ అంటూ ప్రతి నమస్కారం చేశారు. సీఎం ఆసక్తిగా గమనించడంతో తయారీ సంస్థ రెండోసారి నమస్కారం చేయించింది. రోబోకు ఇచ్చే సూచనల ఆధారంగా డ్యాన్స్ కూడా చేస్తుందని తెలిపింది. పక్కనే ఉన్న టాటా సంస్థల ఛైర్మన్ చంద్రశేఖరన్‌కు. . ఓర్వకల్‌లో డ్రోన్ సిటీ ఏర్పాటు ప్రతిపాదన గురించి సీఎం వివరించారు.

హైడ్రోజన్‌తో గాల్లో వస్తువులను మోసుకెళ్లే వ్యవస్థ



'వియర్ స్పేస్.. స్ట్రాటోస్ఫియరిక్ సిస్టమ్'ను ప్రదర్శిస్తున్న సంస్థ సహ వ్యవస్థాపకులు సీవీఎస్ శిరీష్, కిరణ్

ఎయిర్ కార్గో ధరలో సగానికే వాయుమార్గంలో సరకు రవాణా చేసే 'వియర్ స్పేస్.. స్ట్రాటోస్ఫియరిక్ సిస్టమ్'ను విజయవాడకు చెందిన డీప్ టెక్ స్టార్టప్ రెడ్ బెలూన్ ఏరోస్పేస్ ప్రైవేట్ లిమిటెడ్ అభివృద్ధి చేసింది. కృత్రిమ మేధ ఆధారంగా, హైడ్రోజన్‌తో నడిచే దీని ద్వారా 20 టన్నుల పేలోడ్ తీసుకెళ్లే అవకాశం ఉందని సంస్థ ప్రతినిధులు సీఎం చంద్రబాబు, టాటా సన్స్ ఛైర్మన్ చంద్రశేఖరన్‌లకు వివరించారు. 'సూపర్ ప్రెజర్ మల్టీ లేయర్ పాలిమర్స్‌తో దీన్ని తయారు చేశాం. విమానాలు ప్రయాణించలేని వాతావరణంలో (భూఉపరితలం నుంచి 20-50 కి.మీ. మధ్య ఎత్తులో) ఇది ప్రయాణిస్తుంది. దీనికి 5 వేల కి.మీ. వరకు ప్రయాణించే సామర్థ్యం ఉంది. ఈ తరహా సాంకేతికత దేశంలో ఎక్కడా లేదు' అని సంస్థ సహ వ్యవస్థాపకులు సీవీఎస్ కిరణ్, శిరీష్ వివరించారు.

నేతన్నలకు సకాలంలో ముద్ర రుణాలు అందించండి

మంత్రి సవిత

ఈనాడు, అమరావతి: అర్హులైన నేతన్నలకు ముద్ర రుణాల్ని మంజూరు చేయాలని, లబ్ధిదారుల ఎంపికలో ఎమ్మెల్యేలను సమన్వయం చేసుకోవాలని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత సూచించారు. డిసెంబరు నాటికి నిర్దేశిత లక్ష్యంలో 70 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మంగళగిరిలోని చేనేత, జౌళిశాఖ కమిషనరేట్‌లో మంత్రి బుధవారం సమీక్షించారు. "ఒక జిల్లా - ఒక ఉత్పత్తి కింద జిల్లాల్లో మరిన్ని ఉత్పత్తుల్ని ఎంపిక చేయాలి. చేనేత కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత విద్యుత్తు గురించి ప్రచారం కల్పించాలి. నూతన సహకార సంఘాల ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలి. ఆప్కో షోరూంలలో నూతన డిజైన్ వస్త్రాల్ని ఉంచాలి. సామాజిక మాధ్యమాల ద్వారా వీటికి విస్తృత ప్రచారం కల్పించాలి" అని సవిత తెలిపారు. శాఖ పరంగా చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై కమిషనర్ రేఖారాణి పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోదియా తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎస్ఏకు అదనంగా రూ.432 కోట్లు

ఈనాడు, అమరావతి: సమగ్ర శిక్షా అభియాన్ పథకం కింద రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం గతంలో కంటే అదనంగా రూ.432.19 కోట్లు మంజూరు చేసింది. విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ ప్రయత్నంతో ఈ నిధులు మంజూరయ్యాయి. సెకండరీ, సీనియర్ సెకండరీ పాఠశాలల్లో ఐసీటీ ల్యాబ్‌లు, స్మార్ట్ తరగతులు, సైన్సు ప్రయోగశాలలు ఏర్పాటు చేసేందుకు రూ.167.46 కోట్లు.. డైట్ కళాశాలలను సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌గా మార్చేందుకు రూ.43.23 కోట్లను అదనంగా మంజూరు చేసింది. గతంలో 50% నిధులు ఇవ్వగా.. ఈసారి 96% ఇచ్చింది. ధర్తి ఆబా జన జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్‌లో భాగంగా రాష్ట్రంలోని ఆదివాసీ విద్యార్థులకు నాలుగు వసతి గృహాలు నిర్మించేందుకు కేంద్రం రూ.11 కోట్లు, జన జాతీయ ఆదివాసీ న్యాయ మహా అభియాన్ కింద రూ.210.5 కోట్లు ఇచ్చింది. ఈ పథకంలో భాగంగా రెండు దశల్లో మొత్తం 79 వసతి గృహాలు నిర్మించేందుకు నిధులు కేటాయించింది. గతేడాది నాలుగు వసతిగృహాలు మంజూరు కాగా.. ఈసారి 79 ఏర్పాటుకు ఆమోదం తెలిపింది. పీఎంశ్రీ పాఠశాలల కింద ఏపీ నుంచి 80 ఎంపికయ్యాయి.

జగన్ రాజీనామా ఇస్తే మా జడ్పీటీసీలూ చేస్తారు

మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి

ఈనాడు, అమరావతి: గత అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయానికి ఈవీఎంలే కారణమని ఆరోపించిన వైకాపా అధినేత జగన్... ఇప్పుడు బ్యాలట్ విధానంలో పులివెందుల, ఒంటిమిట్టల్లో జరిగిన జడ్పీ ఎన్నికల్లోనూ ఓటమి పాలయ్యారని మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి ఎద్దేవా చేశారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగితే వైకాపా పరిస్థితేంటో ప్రజలకు చూపించాలనే ఈ ఎన్నికల్లో పోటీ చేసినట్టు పేర్కొన్నారు. డిపాజిట్లు రాలేదనే అక్కసుతోనే రిగ్గింగ్ జరిగిందని జగన్ మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. "కేంద్ర బలగాల సమక్షంలో పులివెందుల, ఒంటిమిట్ట జడ్పీ ఎన్నికల్ని మళ్లీ నిర్వహించాలని వైకాపా వాళ్లు డిమాండ్ చేస్తున్నారు. అసెంబ్లీకి వెళ్లి తన నియోజకవర్గ సమస్యల్ని ప్రస్తావించని జగన్.. పులివెందుల ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలి. వెంటనే మా జడ్పీటీసీలూ రాజీనామా చేస్తారు. అప్పుడు ఈ రెండు ఉపఎన్నికలూ ఒకేసారి నిర్వహిద్దాం" అని జగన్‌కు బీటెక్ రవి సవాలు విసిరారు.

హెచ్ఎం, టీచర్ల అంతర జిల్లా బదిలీలకు దరఖాస్తులు నేటి నుంచి

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు.. జీవిత భాగస్వామి ఉద్యోగం చేసే ప్రాంతం, పరస్పర సర్దుబాటు ప్రాతిపదికన అంతర జిల్లా బదిలీలు పొందేందుకు పాఠశాల విద్యాశాఖ మార్గదర్శకాలు జారీ చేసింది. అర్హులైన వారు ఈ నెల 21 నుంచి 24లోపు లీప్ యాప్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించింది. మండల, జిల్లా స్థాయిల్లో దరఖాస్తులను పరిశీలించిన అనంతరం రాష్ట్ర విద్యాశాఖ డైరెక్టర్ కార్యాలయానికి పంపిస్తారు. ఇక్కడ పరిశీలించిన తర్వాత 30న ప్రభుత్వానికి వెళతాయి. బదిలీకి దరఖాస్తు చేసుకునే వారు జులై 31 నాటికి కనీసం రెండేళ్ల సర్వీసు పూర్తి చేసుకుని ఉండాలి. జీవిత భాగస్వామి హెచ్ఓడీ, రాష్ట్ర సచివాలయంలో పని చేస్తూ ఉంటే ఉమ్మడి గుంటూరు, కృష్ణా జిల్లాలకు దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది.

ఏపీ.. ఆవిష్కరణల చిరునామా

(మొదటి పేజీ తరువాయి)

తీర్చిదిద్దాలన్నదే ఆలోచన. వ్యవసాయం, విద్య, వైద్యం, రక్షణ వంటి రంగాల్లో కొత్త ఆలోచనలతో వచ్చేవారికి అపార అవకాశాలున్నాయి' అని పేర్కొన్నారు.

ప్రాంతాలవారీగా అభివృద్ధికి ప్రణాళిక



అమరావతి నిర్మించే మరో అవకాశం తనకు వచ్చిందని చంద్రబాబు పేర్కొన్నారు. 'అమరావతి క్వాంటమ్ కంప్యూటింగ్ హబ్‌గా అభివృద్ధి చెందుతుంది. కాంటమ్ కంప్యూటింగ్ ద్వారా రియల్ టైం డేటాను విశ్లేషించి, క్షేత్రస్థాయిలో అమలు చేస్తాం. క్వాంటమ్ వ్యాలీ, కృత్రిమ మేధ (ఏఐ) విప్లవాత్మక అంశాలుగా మారబోతున్నాయి. హైదరాబాద్‌ను అభివృద్ధి చేసిన అనుభవం నాకు ఉంది. సిలికాన్ వ్యాలీలో ఉన్న అద్భుతమైన వసతులు, అవకాశాలు అక్కడ ఉన్నాయి. ఇప్పుడు రాష్ట్రంలో పారిశ్రామికవేత్తల అవసరాలు, విధానాలను అనుసంధానం చేసేలా ప్రతిపాదనలు రూపొందిస్తున్నాం. ప్రతి కుటుంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త రావాలన్నదే ఆలోచన. మన దేశం త్వరలో ప్రపంచంలోనే మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించబోతోంది. అప్పుడు సంపద మరింతగా పెరుగుతుంది. ఈ అవకాశాలను యువత అందిపుచ్చుకోవాలి. దీనికోసం అమరావతి సహా ప్రాంతాలవారీగా అభివృద్ధి ప్రణాళికలు రూపొందించాం. అంతర్జాతీయ ప్రమాణాలతో ఉత్పత్తులు తయారు చేసి మెరుగైన ఫలితాలు సాధించాలి. దీనికి పరిశ్రమలు, పరిశోధనలు, అనువైన పరిస్థితులు ఉండాలి' అని పేర్కొన్నారు.

పర్యాటక రంగంలో అధిక ఉపాధి

సంపద సృష్టించడం ద్వారా పేదల జీవన ప్రమాణాల్ని మెరుగుపరిచేందుకు ప్రయత్నిస్తున్నట్లు సీఎం పేర్కొన్నారు. 'కమ్యూనిజం, క్యాపిటలిజం ఉండవు. భవిష్యత్తులో టూరిజం మాత్రమే ఉంటుంది. పర్యాటక రంగం ద్వారా ఎక్కువ మందికి ఉపాధి లభిస్తుంది. ప్రభుత్వానికి ఆదాయం కూడా సమకూరుతుంది. వాట్సప్ గవర్నెన్స్ ద్వారా ప్రజలకు 704 రకాల సేవలను ఆగస్టు 15 నుంచి అందుబాటులోకి తెచ్చాం. ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం డిజినెర్వ్ సెంటర్ ప్రాజెక్టులోనూ టాటా సంస్థతో కలిసి కుప్పంలో పనిచేస్తున్నాం. దీని ద్వారా ప్రపంచవ్యాప్తంగా వైద్య చికిత్సల్లో అనుసరిస్తున్న సాంకేతికతను ఒకేచోటకు తీసుకొచ్చి ప్రజల ఆరోగ్యాన్ని సంరక్షించాలన్నది లక్ష్యం. రామాయణంలో లక్ష్మణుడి ప్రాణాలు కాపాడేందుకు హనుమంతుడు సంజీవని పర్వతాన్ని తీసుకొచ్చాడు. అదే స్ఫూర్తితో దీనికి సంజీవని అని పేరు పెట్టాం' అని అన్నారు.

రాజకీయాల్లోకి రాకుంటే.. మీకు పోటీ వచ్చేవాణ్ని!

తాను రాజకీయాలను ఎంచుకున్నానని.. ఒకవేళ పారిశ్రామికవేత్తను అయితే మీకు గట్టి పోటీ ఇచ్చేవాడినేమోనని సీఎం (చంద్రశేఖరన్ వైపు తిరిగి నవ్వుతూ) వ్యాఖ్యానించారు. 'ఆర్థిక, రెవెన్యూ శాఖల మంత్రిగా ఏడాది పనిచేసిన తర్వాత సీఎంగా బాధ్యతలు చేపట్టా. అప్పుడు నా భార్యను హెరిటేజ్ బాధ్యతలు చూడాలని అడిగితే తిరస్కరించింది. ఆసక్తి లేకుండానే బాధ్యతలు చేపట్టి ఇప్పుడు అద్భుతంగా పరిశ్రమను నడిపిస్తోంది' అని పేర్కొన్నారు. వివిధ స్టార్టప్ కంపెనీలు తమ ఉత్పత్తులతో ఏర్పాటు చేసిన స్టాళ్లను సీఎం పరిశీలించారు.

గిన్నిస్ బుక్‌లో చోటు

ఇన్నోవేషన్, బిజినెస్ స్టార్టప్‌ల కోసం 1,67,321 మంది రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. ఈ స్థాయిలో 24 గంటల్లో రిజిస్ట్రేషన్ చేసుకోవడంతో ఏపీ ఇన్నోవేషన్ సొసైటీకి గిన్నిస్ బుక్ ఆఫ్ రికార్డుల్లో చోటు దక్కింది. ఆ సంస్థ ప్రతిధులు హబ్ ప్రారంభోత్సవ వేదికపై సీఎంకు ధ్రువపత్రాన్ని అందించారు.

ఈ రోబో దిగితే మురుగు పరుగే!


రోబో ప్రదర్శిస్తున్న కంపెనీ ప్రతినిధులు

భూగర్భ మురుగు కాలువలు, తాగునీటి పైపుల్లో అవరోధాలు తొలగించడం ఒక్కోసారి పారిశుద్ధ్య కార్మికుల వల్ల కాదు. భారీ పైపుల లోపల చెత్త పోగై మురుగు ముందుకు సాగదు. ఇలాంటి సమస్యను పరిష్కరించేందుకు విశాఖకు చెందిన ఓ కంపెనీ ఒక యంత్రాన్ని తయారు చేసింది. మురుగు వెళ్లే మార్గాలు పూడికతో మూసుకుపోయినా, గొట్టాల్లో ఏమైనా చిక్కుకున్నా.. వాటిని బయటకు లాగేస్తుంది. ఇప్పటికే దీన్ని మహారాష్ట్రలోని పుణె మున్సిపల్ కార్పొరేషన్ వినియోగిస్తోంది. బుధవారం విశాఖలో ఆరంభించిన రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ వద్ద దీన్ని ప్రదర్శించారు.

– ఈనాడు, విశాఖపట్నం

తితిదేపై సాక్షి మీడియా దుష్ప్రచారం

- రూ.10 కోట్లకు పరువునష్టం దావా వేశాం
- వెంటనే క్షమాపణలు చెప్పాలి
- భవిష్యత్‌లో 1, 2 గంటల్లోనే శ్రీవారి దర్శనం
- అన్యమత ఉద్యోగులకు బదిలీ, వీఆర్ఎస్
- తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు


తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు

ఈనాడు, హైదరాబాద్: తిరుమల తిరుపతి దేవస్థానంపై అసత్య ప్రచారం చేసిన సాక్షి మీడియాపై పరువు నష్టం దావా వేసినట్లు తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు తెలిపారు. రూ.10 కోట్ల నష్టపరిహారం చెల్లించాలంటూ లీగల్ నోటీసు పంపినట్లు వెల్లడించారు. సాక్షి మీడియా తక్షణమే తితిదేకి బేషరతుగా క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. సాక్షి ద్వారా అసత్యాలు ప్రచారం చేస్తున్న జగన్, భారతీరెడ్డిలు తిరుమలకు వచ్చి స్వామి వారి ప్రసాదం స్వీకరించి మాట్లాడాలని సవాల్ విసిరారు. బీఆర్ నాయుడు బుధవారం హైదరాబాద్‌లో విలేకరులతో మాట్లాడారు. భవిష్యత్తులో 1, 2 గంటల్లోనే భక్తులు శ్రీవారి దర్శనం చేసుకునేలా కృత్రిమమేధ (ఏఐ) ఆధారిత వ్యవస్థను ప్రవేశపెట్టేందుకు చర్యలు చేపట్టామని ఆయన తెలిపారు. భక్తుల ఇబ్బందులు తగ్గించేందుకు వీఐపీల దర్శనం ఉదయం 8 నుంచి 8.30లోపు ముగిసేలా సమయాలను మార్చినట్లు చెప్పారు. శ్రీవాణి దర్శనం కూడా త్వరితంగా పూర్తయ్యేలా సర్దుబాటు చేస్తున్నామన్నారు. తితిదేలో పనిచేస్తున్న అన్యమత సిబ్బందిని వేరే విభాగాలకు బదిలీ చేసినట్లు, కొంతమందికి స్వచ్ఛంద పదవీ విరమణ (వీఆర్ఎస్) ఇచ్చినట్లు వివరించారు. అన్యమత ప్రచారాల్లో పాల్గొంటే సిబ్బందిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన చెప్పిన మరికొన్ని వివరాలివి..

భూమన వేయని అక్రమం లేదు

"జగన్ పాలనలో తిరుమల పవిత్రతను దెబ్బతీసిన వారే ఇప్పుడు నాపై అసత్య ఆరోపణలు చేస్తున్నారు. తితిదే ఛైర్మన్‌గా భూమన కరుణాకరరెడ్డి చేయని అక్రమం లేదు. ఆయన మూలంగానే తిరుమల ఖజానాకు భారీ నష్టం వాటిల్లింది. వైకాపా పాలనలో ఆ పార్టీ నేతలు హోటళ్ల కేటాయింపులో మాఫియాలా వ్యవహరించారు. 12 మంది వైకాపా వర్గీయులకు తిరుమలలో హోటళ్లు ఇచ్చారు. ఇప్పుడు ఈ-టెండర్ల ద్వారా పారదర్శకంగా కేటాయింపులు జరుగుతున్నాయి. కరుణాకరరెడ్డి పనికట్టుకొని తిరుమలపై దుష్ప్రచారం చేస్తున్నారు. ఆయన అవినీతి చిట్టా నాదగ్గర ఉంది. సుబ్బారెడ్డి, కరుణాకరరెడ్డి ఎవరెవరికి ఎన్ని టికెట్లు ఇచ్చారో నాకు తెలుసు. రోజా టూరిజం ముసుగులో టికెట్లు అమ్ముకున్నారు.

జగన్, భారతిరెడ్డి వచ్చి ప్రసాదం తింటారా?

మేం ఎంత నిస్వార్థంగా పనిచేస్తున్నా కొంతమంది పిచ్చి పిచ్చి మాటలు మాట్లాడుతున్నారు. జగన్‌మోహన్ రెడ్డి, భారతీరెడ్డిలు ఏనాడైనా తిరుమలకు వచ్చి శ్రీవారికి తలనీలాలు ఇచ్చారా? స్వామి ప్రసాదం తిన్నారా? హిందూ ధర్మం అంటే వారికి పడదు. అందుకే దాడులు చేస్తున్నారు. మేం తప్పు చేస్తే చెప్పాలి కానీ ఇలా నిందలు వేయడం సరికాదు. కావాలంటే నామీద దాడి చేయండి. కానీ వేంకటేశ్వరస్వామిని అడ్డం పెట్టుకొని అసత్య ప్రచారం చేయొద్దు" అని బీఆర్ నాయుడు అన్నారు. తీరప్రాంతాల్లో మత మార్పిడులు ఎక్కువగా జరుగుతున్నాయి. అలాంటి వాటిని సహించబోమన్నారు. మతమార్పిళ్లను నివారించేందుకు కొత్త దేవాలయాలు నిర్మిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకు 320 ఆలయాలు నిర్మించగా, మరో 500 - 1000 ఆలయాలు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నామని ఆయన చెప్పారు.

అమరావతిలో హడ్కో కన్వెన్షన్ సెంటర్

- కేంద్ర సహాయ మంత్రి పెమ్మసాని

ఈనాడు, అమరావతి: రాష్ట్ర రాజధాని అమరావతిలో పది ఎకరాల స్థలంలో కన్వెన్షన్ సెంటర్‌ను హడ్కో నిర్మించనుంది. ఈ విషయాన్ని కేంద్ర గృహనిర్మాణం, పట్టణాభివృద్ధి, ఇంధనశాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్ ప్రకటించారు. రాష్ట్రానికి చెందిన కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్‌కు ఆయన ఈ మేరకు లేఖ రాశారు. ఈ విషయాన్ని పెమ్మసాని బుధవారం ఎక్స్ వేదికగా వెల్లడించారు. 'కేంద్ర ప్రభుత్వానికి చెందిన హడ్కో ఆధ్వర్యంలో ఈ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తారు. ఇప్పటికే సీఆర్‌డీఏ ఇందుకోసం 8 ఎకరాలు కేటాయిస్తూ తీర్మానం కూడా చేసింది. మరో 2 ఎకరాలు కేటాయించే అంశం సీఆర్‌డీఏ పరిశీలనలో ఉంది. ఎకరం రూ.4 కోట్ల చొప్పున కొని హడ్కో కన్వెన్షన్ సెంటర్‌ను ఏర్పాటు చేస్తుంది' అని కేంద్ర మంత్రి ఖట్టర్ తన లేఖలో పేర్కొన్నారు.

దిల్లీలోని హ్యాబిటేట్ తరహాలో

'దిల్లీలో హ్యాబిటేట్ సెంటర్ తరహాలోనే అమరావతిలో ఈ కన్వెన్షన్ సెంటర్‌ను నిర్మిస్తారు. ఇందులో వివిధ కార్యాలయాల ఏర్పాటుకు ప్రపంచస్థాయి మౌలిక సౌకర్యాలు కల్పిస్తారు. గృహనిర్మాణం, పట్టణాభివృద్ధిలో శిక్షణ కార్యక్రమాల నిర్వహణకు ఇది తోడ్పడుతుంది. జాతీయ, అంతర్జాతీయ అభివృద్ధి సంస్థలకు ఇదొక ఫైనాన్స్ హబ్‌గా ఉంటుంది. ఇందులో కన్వెన్షన్ హాళ్లు ఉంటాయి. అతిథుల కోసం నిర్మాణాలు ఉంటాయి. ఆహ్లాదకరంగా, వినోదాల కేంద్రంగా ఉంటుంది' అని పెమ్మసాని 'ఎక్స్'లో పేర్కొన్నారు. ఈ సెంటర్‌ను నిర్మించిన తర్వాత ఇది అంతర్జాతీయ కార్యక్రమాలకు వేదికగా మారుతుందని, పెట్టుబడులను ఆకర్షిస్తూ, ఆర్థిక రంగాన్ని బలోపేతం చేసేందుకు సహకరిస్తుందన్న ఆశాభావాన్ని వ్యక్తం చేశారు.

చంద్రబాబుతో దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ భేటీ

- కట్టుదాటొద్దని ఎమ్మెల్యేకు హెచ్చరిక

ఈనాడు, అమరావతి: రాష్ట్ర సచివాలయంలో ముఖ్యమంత్రి చంద్రబాబును అనంతపురం ఎమ్మెల్యే దగ్గుపాటి వెంకటేశ్వరప్రసాద్ బుధవారం కలిశారు. వరుస వివాదాల్లో చిక్కుకోవడం, ఇతర ఆరోపణల నేపథ్యంలో ఆయనపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. తెదేపా క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, కట్టుదాటితే చర్యలు తప్పవని హెచ్చరించారు. నియోజకవర్గంలో మరో కీలక నేతతో ఎమ్మెల్యేకున్న విభేదాలపైనా ఆరా తీశారు. స్థానిక నేతలతో కలిసి సాగాలని, ఎట్టి పరిస్థితుల్లో వివాదాల జోలికి వెళ్లొద్దని సూచించారు. పార్టీకి, ప్రభుత్వానికి నష్టం చేసేలా ఉంటే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ఆ ఆడియోలో ఉంది తన వాయిస్ కాదని, కావాలనే ఇరికించారని ఎమ్మెల్యే సంజాయిషీ ఇచ్చినట్టు తెలుస్తోంది. నియోజకవర్గంలో వర్గ విభేదాలు, 'వార్' సినిమా విడుదలకు సంబంధించి జూనియర్ ఎన్టీఆర్‌పై అనుచిత వ్యాఖ్యల ఆరోపణల గురించి తెదేపా అధిష్ఠానం వివరణ కోరిన నేపథ్యంలో ఈ భేటీ జరిగింది.

డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ జాబితా 22న?

ఈనాడు, అమరావతి: మెగా డీఎస్సీ అభ్యర్థుల మెరిట్ జాబితాను విడుదల చేసేందుకు పాఠశాల విద్యాశాఖ సిద్ధమైంది. ఈ నెల 22న (శుక్రవారం) మెరిట్ జాబితాను విడుదల చేయాలని భావిస్తోంది. సబ్జెక్టుల వారీగా.. జిల్లాల వారీగా జాబితాలను విడుదల చేసి.. ఆన్‌లైన్‌లోనే అభ్యర్థులకు అందుబాటులో ఉంచనున్నారు. సర్టిఫికెట్ల పరిశీలనకు విద్యాశాఖ జిల్లాల్లో ప్రత్యేక కమిటీలను ఏర్పాటు చేసింది. కూటమి ప్రభుత్వం 16,347 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేసేందుకు డీఎస్సీ నిర్వహించింది. జూన్ 6 నుంచి 30 వరకు కంప్యూటర్ ఆధారిత పరీక్షలు (సీబీటీ) జరిగాయి. అన్ని పోస్టులకు కలిపి 3,35,401 మంది 5,77,675 దరఖాస్తులు సమర్పించారు. ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) మార్కుల సవరణకు గురువారం మధ్యాహ్నం వరకు సమయం ఇచ్చారు.

నెల రోజుల్లో 3 లక్షల గృహప్రవేశాలు

సీఎం చంద్రబాబు దిశానిర్దేశం

ఈనాడు, అమరావతి: రానున్న నెల రోజుల్లో మూడు లక్షల గృహప్రవేశాలు చేయించాలని అధికారులకు ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. సంక్రాంతి నాటికి మరో 2 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసి లబ్ధిదారులకు అప్పగించాలని ఆదేశించారు. వచ్చే మార్చికల్లా 10లక్షల ఇళ్ల నిర్మాణాన్ని పూర్తిచేయాలని లక్ష్యం నిర్దేశించారు. ప్రస్తుతం చేపట్టిన ఇళ్ల నిర్మాణాన్ని ఏ, బీ, సీ కేటగిరీలుగా విభజించి నిర్మాణం చేపట్టాలని సూచించారు. సచివాలయంలో ఆయన గృహనిర్మాణ శాఖపై బుధవారం సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'ఇంకా ఇళ్లు లేని పేద కుటుంబాలను గుర్తించి జాబితా రూపొందించాలి. దీనిపై 15 రోజుల్లోగా సర్వే పూర్తిచేయాలి. పట్టణాల్లో 2 సెంట్లు, గ్రామాల్లో 3 సెంట్ల పంపిణీకి అనుగుణంగా అవసరమైన స్థలాలను గుర్తించాలి. పెద్ద కుటుంబాలకు ఉమ్మడిగా ఇళ్లు నిర్మించే ఆలోచన చేయాలి. ఎన్టీఆర్ గృహనిర్మాణ పథకం కింద చేపట్టిన ఇళ్లను పూర్తిచేసేందుకు విడతల వారీగా నిధులివ్వాలి' అని ఆదేశించారు.

ఏడాదిలో రూ.2,013 కోట్ల వ్యయం: కూటమి అధికారంలోకి వచ్చిన తర్వాత ఏడాదిలో పేదల ఇళ్ల నిర్మాణానికి రూ.2,013 కోట్లు ఖర్చుచేసినట్లు అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. 2.81 లక్షల గృహనిర్మాణాలు పూర్తయ్యాయని.. వచ్చే నెలలో 19 వేల ఇళ్లు పూర్తి కానున్నాయని తెలిపారు. 84,094 టిడ్కో గృహాల నిర్మాణం తుది దశకు చేరిందని పేర్కొన్నారు. కుప్పం నియోజకవర్గంలో 4,647 మంది గృహనిర్మాణ లబ్ధిదారులకు ఇప్పటికే ప్రభుత్వం రూ.16.37 కోట్లు చెల్లించగా.. రాష్ట్రంలోని 2,73,709 మంది లబ్ధిదారులకు రూ.919.29 కోట్లు త్వరలో విడుదల చేయనుంది. పీఎం జన్‌మన్ నిర్మాణాలకు రూ.100 కోట్లు, ప్రధానమంత్రి ఆవాస్ యోజన గ్రామీణ పథకం కింద చేపట్టేవాటికి రూ.75 కోట్లు అందించనుంది.

డిసెంబరు నాటికి లక్ష టిడ్కో గృహాల పూర్తి

మంత్రులు పార్థసారథి, నారాయణ

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ 2029 నాటికి ఇళ్లు నిర్మించి ఇవ్వాల్సిందిగా ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారని గృహనిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, పురపాలకశాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం రాత్రి వారిద్దరూ విలేకర్లతో మాట్లాడారు. మంత్రి పార్థసారథి మాట్లాడుతూ గృహనిర్మాణ శాఖ సర్వేలో రాష్ట్రంలో 6లక్షల మందికి ఇళ్లు అవసరమని గుర్తించామని వెల్లడించారు. కూటమి అధికారంలోకి వచ్చాక గ్రామీణప్రాంతాల్లో 2.81 లక్షల ఇళ్ల నిర్మాణం పూర్తిచేసిందని, వచ్చే నెల 15కల్లా 3లక్షల ఇళ్లు పూర్తిచేసి ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించాలన్నది లక్ష్యమని తెలిపారు. పీఎంఏవై-1లో మంజూరైన 5 లక్షల ఇళ్లు రెండేళ్లలో పూర్తిచేయాలన్నది లక్ష్యమని చెప్పారు. పీఎంఏవై-2లో పట్టణ ప్రాంతాల్లో 40వేల ఇళ్లు మంజూరు చేశామని, వీటితోపాటు గృహనిర్మాణ శాఖకు చెందిన లక్ష గృహాలు, టిడ్కోకు చెందిన లక్ష గృహాలు సంక్రాంతి నాటికి లబ్ధిదారులకు అందజేస్తామన్నారు.

23న రూ.145 కోట్ల 'ఉపాధి' బిల్లుల విడుదల

ఈనాడు, అమరావతి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (నరేగా)లో మెటీరియల్ నిధులతో 2014-19 మధ్య కాలంలో తెదేపా ప్రభుత్వంలో పనులు చేపట్టి పెండింగ్ బిల్లుల కోసం ఎదురు చూస్తున్న చిన్న గుత్తేదారులు, ప్రజలకు కూటమి ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రూ.145 కోట్ల పెండింగ్ బిల్లులు ఈ నెల 23న గుత్తేదారుల ఖాతాల్లో జమ కానున్నట్లు ముఖ్యమంత్రి ప్రకటించారు. మిగిలిన పెండింగ్ బిల్లులపై తలెత్తిన సాంకేతిక సమస్యలు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. నరేగాపై ముఖ్యమంత్రి చంద్రబాబు బుధవారం సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. 2014-19 మధ్య చేసిన 3.54 లక్షలకు పైగా పనులకు సంబంధించి గత ప్రభుత్వం కక్ష పూరితంగా నిలిపి వేసిన బిల్లులపై కూటమి ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపింది. దీంతో ఆ బిల్లులను పోర్టల్‌లో తిరిగి అప్‌లోడ్ చేసేందుకు అనుమతించారు. ఇటీవలే రూ.105 కోట్ల బిల్లుల మేర చెల్లింపులు చేశారు. మరో రూ.145 కోట్లు 23న చెల్లించేందుకు ఏర్పాట్లు చేసిన విషయాన్ని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు సీఎం దృష్టికి తీసుకొచ్చారు.

బెయిల్‌పై కాకాణి విడుదల


జైలు నుంచి బయటకు వస్తున్న కాకాణి

నెల్లూరు (నేర విభాగం), న్యూస్‌టుడే: రుస్తుం మైనింగ్ అక్రమ తవ్వకాలతో పాటు పలు కేసుల్లో నిందితుడిగా ఉన్న మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి నెల్లూరులోని జైలు నుంచి బుధవారం బెయిల్‌పై విడుదలయ్యారు. మంగళవారం బెయిల్ మంజూరు కాగా, పత్రాలు జైలుకు రావడానికి ఆలస్యం కావడంతో విడుదల వాయిదా పడింది. ఆయన జైలు నుంచి బయటకు రాగానే కూటమి ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ రెండుసార్లు ఎమ్మెల్యే, జడ్పీ ఛైర్మన్, మంత్రిగా పనిచేసిన తనను చాలా రోజులు జైల్లో పెట్టారన్నారు. ఏడు పీటీ వారంట్లు వేశారని, ఎన్నికల సమయంలో జరిగిన లిక్కర్ కేసులు తిరిగి ఓపెన్ చేశారన్నారు. కేసులు, జైళ్లు తమను ఆపలేవని, తెదేపా నేతలు చేసే దోపిడీని భవిష్యత్తులో విచారణ ఉంటుందన్నారు.



మీ భార్య ప్రతిభను గుర్తించి ప్రోత్సహించండి

మీ అర్ధాంగిలోని నైపుణ్యాలు, ప్రతిభను గుర్తించే ప్రయత్నం చేయండి. తన సామర్థ్యాలను సద్వినియోగం చేసుకొనే దిశగా ప్రోత్సాహం అందించి ఆమె ఎదుగుదలకు తోడ్పడండి. అందుకు అవసరమైన వనరులు, సమయం ఆమెకు అందుబాటులో ఉండేలా చూడండి. అందుకోసం ఇంటి బాధ్యతలు పంచుకోండి. మీ జీవిత భాగస్వామి ఇంతకు మించిన విలువైన కానుకలేమీ కోరుకోదు.

– జాక్ పీచ్, రిలేషన్‌షిప్ కౌన్సెలర్

కిలాడీ లేడీ.. జైలు గూటికి

- మరో ముగ్గురు అనుచరులు కూడా అరెస్టు
- నలుగురికీ వచ్చే నెల 3 వరకూ రిమాండ్
- బిల్డర్‌ను చంపేస్తామని బెదిరించిన కేసులో అర్ధరాత్రి అదుపులోకి తీసుకున్న పోలీసులు
- హైదరాబాద్ పారిపోతుండగా అద్దంకి వద్ద పట్టివేత

ఈనాడు, నెల్లూరు, అమరావతి: హత్య కేసులో దోషిగా తేలి యావజ్జీవ కారాగార శిక్ష అనుభవిస్తున్న కరుడుగట్టిన నేరగాడు అవిలేలి శ్రీకాంత్ తరఫున రౌడీ గ్యాంగును నడిపిస్తున్న అతడి ప్రియురాలు నిడిగుంట అరుణను ఎట్టకేలకు నెల్లూరు పోలీసులు అరెస్టు చేశారు. కావలికి చెందిన మునగ వెంకట మురళీ కృష్ణమోహన్‌ను చంపేస్తానని బెదిరించిన కేసులో ఆమెతో పాటు మరో ముగ్గుర్ని అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో అనేక నాటకీయ పరిణామాలు చోటుచేసుకున్నాయి. పలువురు ప్రజాప్రతినిధుల పేర్లు వెల్లడవడంతో, ఐపీఎస్, ఐఏఎస్ అధికారుల అండదండలతో అరుణ పేట్రేగిపోయిన తీరు రాష్ట్రమంతా చర్చనీయాంశమవుతోంది. తనను అరెస్టు చేసే అవకాశముందని భావించిన ఆమె మంగళవారం రాత్రి హైదరాబాద్ పారిపోయేందుకు నెల్లూరు నుంచి కారులో బయలుదేరారు. పోలీసులు మంగళవారం అర్ధరాత్రి బాపట్ల జిల్లా అద్దంకి వద్ద ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఇక తప్పించుకోలేనని అర్థమైన అరుణ మరో కొత్త నాటకానికి తెర తీసింది. 'పోలీసులు నన్ను అక్రమంగా నిర్బంధించారు. కారు డోర్ తెరవాలని ఒత్తిడి తెస్తూ గంజాయి పెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. లొకేషన్ షేర్ చేస్తున్నా. మీడియా ప్రతినిధులు కాపాడాలి' అంటూ ఆమె ఫేస్‌బుక్ ఖాతా నుంచి ఓ వీడియో లైవ్ ప్రసారం చేసింది. పోలీసులు ఆమెను నెల్లూరుకు తరలించారు. ఆమె అనుచరులైన పల్లం వేణు, అంకెం రాజా, సీరం ఎలీషాను వేర్వేరుచోట్ల అదుపులోకి తీసుకున్నారు. వారందరినీ నెల్లూరులోని రెండో అదనపు మెజిస్ట్రేట్ న్యాయస్థానంలో హాజరుపరచగా సెప్టెంబరు 3 వరకు రిమాండు విధిస్తూ న్యాయాధికారి ఆదేశాలిచ్చారు. అరుణను ఒంగోలు జైలుకు, మిగతా ముగ్గురు నిందితుల్ని నెల్లూరు జైలుకు తరలించారు. అరుణ, శ్రీకాంత్ ముఠా బాధితులు ఇప్పుడు ఆమెపై ఫిర్యాదు చేయడానికి ముందుకొస్తున్నారు.


ఒంగోలులోని జిల్లా కారాగారంలోకి వెళ్తున్న లేడీడాన్ అరుణ

మెడపై కత్తిపెట్టి చంపేస్తానని బెదిరింపులు..

కావలికి చెందిన మునగ వెంకట మురళీ కృష్ణమోహన్ కోవూరు నియోజకవర్గం పడుగుపాడులో 2010లో అపార్ట్‌మెంట్ నిర్మించారు. అందులో ఓ ఫ్లాట్‌ను అరుణ అద్దెకు తీసుకుంది. తర్వాత దాన్ని రూ.28 లక్షలకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకుని అడ్వాన్సుగా రూ.3 లక్షలు ఇచ్చింది. మిగతా సొమ్ము ఇవ్వలేదు సరికదా అందులో పాగా వేసి.. డబ్బు అడిగిన బిల్డర్ కృష్ణమోహన్‌ను అరుణ, ఆమె అనుచరులు బెదిరింపులతో హెచ్చరించారు. ఫ్లాట్‌ను అరుణ పేరిట రిజిస్టర్ చేయాలని, లేదంటే చంపేస్తామని మెడపై కత్తిపెట్టి బెదిరించారు. ఒప్పంద పత్రంపై బలవంతంగా సంతకాలు చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు అరుణ, ఆమె అనుచరులను పోలీసులు అరెస్టు చేశారు.

పోలీసు అధికారులతో ఆడియోలు, వీడియోలు

అరుణను అదుపులోకి తీసుకున్న పోలీసులు ఆమె నుంచి రెండు ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. అందులో పలువురు పోలీసు అధికారులతో ఆడియో సంభాషణలు, వీడియో రికార్డులు, కొంతమంది అధికారులు, పలువురు నాయకులు, ప్రజాప్రతినిధులతో దిగిన ఫొటోలు ఉన్నట్లు సమాచారం. అవి ఎవరివి అనేది చర్చనీయాంశంగా మారింది. మరోవైపు శ్రీకాంత్, అరుణతో కలిసి అక్రమాలకు పాల్పడిన రౌడీషీటర్లు, ఇతరుల వివరాలను సేకరించిన పోలీసులు, వారిని పోలీస్‌స్టేషన్‌కు పిలిచి విచారిస్తున్నారు.

ఆరుగురు ఏఆర్ సిబ్బందిపై వేటు

చికిత్స కోసమంటూ శ్రీకాంత్‌ను జైలు నుంచి తిరుపతి, నెల్లూరు ఆసుపత్రులకు తీసుకెళ్లిన సమయంలో నిబంధనలు ఉల్లంఘించిన ఏఆర్ సిబ్బందిపై ఉన్నతాధికారులు వేటు వేశారు. శ్రీకాంత్‌ను ఆమె ప్రియురాలు అరుణ కలిసేందుకు అవకాశం ఇవ్వటం, దారిలో వారికి సకల సదుపాయాలు కల్పించటంపై అదనపు ఎస్పీ సీహెచ్.సౌజన్య విచారణ చేసి నివేదిక అందించారు. దాని ఆధారంగా గార్డు డ్యూటీ చేసిన ఏఆర్ సిబ్బంది ఖలీల్, కాజా, సుబ్బారావులను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఎస్కార్ట్ డ్యూటీకి వెళ్లిన హెడ్ కానిస్టేబుల్ గోపాల్, కానిస్టేబుళ్లు కిషోర్, గంగరాజులపై చర్యలకు ఉపక్రమించారు.

దౌర్జన్యాలు, తప్పుడు కేసులు

'దారి దోపిడీలు, దౌర్జన్యాలు, విధ్వంసాలతో భయభ్రాంతులకు గురిచేయడంలో లేడీడాన్ అరుణ ఆరితేరిపోయింది. వైకాపా హయాంలో ఐదేళ్లలో సెటిల్‌మెంట్లు, దందాలతో ఆమె రూ.కోట్లు సంపాదించింది. ఆమె గంజాయి స్మగ్లింగ్ చేయటం నేను కళ్లారా చూశా. ఆమెను చూస్తే పోలీసులే భయపడేవారు. అరుణ ఆరాచకాలపై ఎవరైనా ప్రశ్నిస్తే.. వారిపై అక్రమంగా ఎస్సీ, ఎస్టీ కేసులు బనాయించి వేధించేది. ఆమె ఆరాచకాలపై విచారణ జరపాలి. అసలు ఆమె ఎస్సీ కాదు. తప్పుడు ధ్రువపత్రాలతో ఎస్సీ పేరిట చలామణి అవుతోంది' అని న్యాయవాది రాజారావు ఆరోపించారు. ఆమె అక్రమాలపై కొద్దికాలంగా పోరాడుతున్న ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు.

మిరప ధరతో రైతులను ఊరిస్తున్నారు

- క్వింటాల్‌కు రూ.1,000 నుంచి రూ.1,500 పెరుగుదల
- నారు పోసే కీలక సమయంలో కదలిక

ఈనాడు, అమరావతి: హైబ్రిడ్ మిరప నాటే కీలక సమయం ఇదే కావడంతో వ్యాపారుల ధరల గారడీ మొదలైంది. ప్రస్తుతం మిరప విత్తన వ్యాపారం గత 20 ఏళ్లలో ఎన్నడూ లేనంతగా పడిపోయింది. నారు పోసే పరిస్థితి కానరాక నర్సరీలూ వెలవెలబోతున్నాయి. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక, తెలంగాణ, మధ్యప్రదేశ్‌ల్లోనూ సాగు భారీగా తగ్గనుంది. దీంతో వ్యాపారుల మాయాజాలం మొదలైంది. రేట్లు కాస్త కదిలిస్తే పెరిగిన మిరప ధరలతో రైతుల్లో ఆశ మొదలవుతుందని, మళ్లీ ముమ్మరంగా సాగుకు సిద్ధమవుతారని భావించారు. ఈ క్రమంలో మూడు రోజుల్లోనే ధరలు క్వింటాల్‌కు రూ.1,000 నుంచి రూ.1,500 వరకు పెరిగాయి. ఇది నెల కిందటితో పోలిస్తే సగటున రూ.2వేల ఎక్కువ. ఏసీలో నిల్వ ఉంచిన మిరపకాయలకు రకాల వారీగా రూ.11 వేల నుంచి రూ.15 వేల వరకు ఇస్తున్నారు. గుంటూరు మార్కెట్‌లో రోజూ 50 వేలకు పైగా బస్తాల అమ్మకం జరుగుతోంది.

ఇప్పుడే ఎందుకు పెరిగాయి?

వాస్తవానికి గుంటూరు పరిధిలోని శీతల గోదాముల్లోనే సుమారు 40 లక్షల బస్తాలు నిల్వ ఉన్నట్లు అంచనా. అయినా రైతులు అమ్మకానికి ఉంచడం లేదు. దీంతో వ్యాపారులు ధరల్ని కొంతమేర పెంచుతున్నారు. సీజన్ కావడంతో పాటు నాణ్యమైన సరుకు అమ్మకానికి రాకపోవడంతోనే కొంతమేర పెరిగాయని వ్యాపారులు చెబుతున్నారు.

విశాఖ కేజీహెచ్‌లో సికిల్‌సెల్ జన్యు పరీక్షల కేంద్రం

మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడి

ఈనాడు, అమరావతి: సికిల్ సెల్ ఎనీమియాతో బాధపడుతున్న గిరిజనుల కోసం విశాఖలోని జీజీహెచ్‌లో రూ.4 కోట్లతో సెంటర్ ఆఫ్ కాంపిటెన్స్ (సీవోసీ) కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదం తెలిపింది. 2047 నాటికి సికిల్ సెల్ వ్యాధి నివారించాలనే లక్ష్యంతో జాతీయ సికిల్‌సెల్ ఎనీమియా నివారణ కేంద్రం చర్యలు చేపడుతోంది. తీవ్రత ఎక్కువగా ఉన్న ఆంధ్రప్రదేశ్‌తోపాటు 17 రాష్ట్రాల్లో సీవోసీ కేంద్రాల ఏర్పాటుకు చర్యలు చేపట్టింది. సికిల్‌సెల్ వ్యాధి స్థాయి తెలుసుకునేందుకు జన్యు పరీక్షల నిర్వహణకు విశాఖ జీజీహెచ్‌లోని కేంద్రాన్ని మరో మూడు నెలల్లో ప్రారంభించేలా అవసరమైన పరికరాల కోసం ఏపీఎంఎస్ఐడీసీ ద్వారా టెండర్లు పిలిచామని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. గుంటూరు జీజీహెచ్‌లో మరో కేంద్రం ఏర్పాటుకు కేంద్ర ప్రభుత్వం సూత్రప్రాయంగా ఆమోదం తెలిపిందని పేర్కొన్నారు. కేంద్ర గిరిజన సంక్షేమశాఖ నిధులతో ఏర్పాటయ్యే సీవోసీలు రాష్ట్ర వైద్యారోగ్యశాఖ పర్యవేక్షణలో పనిచేస్తాయని తెలిపారు.

ఆక్వా సమస్యలపై త్వరలో కేంద్రానికి నివేదిక

- ప్రత్యామ్నాయ ఎగుమతులపైనా దృష్టి సారించాలి
- ఆక్వా ఎడ్వైజరీ కమిటీ సమావేశంలో మంత్రి నారా లోకేశ్

ఈనాడు, అమరావతి: ఆక్వా రంగం ఎదుర్కొంటున్న సమస్యలు, పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై భాగస్వాములందరితో చర్చించి, త్వరలో కేంద్రానికి నివేదిక అందిస్తామని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. దిల్లీ పర్యటన సందర్భంగా ఇప్పటికే కేంద్ర మంత్రులకు ఈ రంగంలోని సమస్యలను వివరించామని తెలిపారు. అమెరికా సుంకాలు పెంచిన నేపథ్యంలో ప్రత్యామ్నాయంగా రష్యా, యూరోపియన్ యూనియన్‌లకు ఎగుమతులు పెంచడంపై దృష్టి పెట్టాలని సూచించారు. ఆక్వా ఎడ్వైజరీ కమిటీ సమావేశం బుధవారం ఉండవల్లిలోని సీఎం నివాసంలో జరిగింది. వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు, అప్సడా వైస్ ఛైర్మన్ ఆనం వెంకటరమణారెడ్డి, ఎగుమతిదారులు, ప్రాసెసింగ్ యూనిట్ల యజమానులు, రైతులు, ఫీడ్, హేచరీల యజమానులు, అధికారులు హాజరయ్యారు. 'లక్షల మంది ఆధారపడిన ఆక్వా రంగానికి ప్రభుత్వం అండగా ఉంటుంది. అమెరికా 25 శాతం సుంకం విధించింది. త్వరలో మరో 25 శాతం పెంచనుంది. ఈ నేపథ్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆక్వా పరిశ్రమ కలిసి సమస్యల పరిష్కారం కోసం కృషి చేద్దాం. ఉత్పత్తి వ్యయం తగ్గింపు, విద్యుత్తు బిల్లులపై చర్చించాలి. సంక్షోభాన్ని అవకాశంగా మలచుకుందాం. సీఎం చంద్రబాబు ఈ విషయంపై దృష్టి సారించారు' అని లోకేశ్ వివరించారు. ఎగుమతులపైనే ఆధారపడకుండా దేశీయంగా రొయ్యల వినియోగం పెంచడంపై దృష్టి సారించాలని వ్యవసాయ మంత్రి అచ్చెన్నాయుడు సూచించారు. ఆక్వా రంగానికి ప్రత్యేక ప్యాకేజీ ఇచ్చే అంశాన్ని పరిశీలించాలని ఎగుమతిదారులు, ఆక్వా అనుబంధ పరిశ్రమల యజమానులు కోరారు. ప్రభుత్వ చర్యల ఫలితంగా ఫీడ్ ధర తగ్గిందని రైతులు వివరించారు. విద్యుత్తు రాయితీ త్వరగా అమలు చేయాలని, దాణా, ఇతర పన్నులపైనా నిర్ణయం తీసుకోవాలన్నారు.

రెండో విడత భూ సమీకరణ అవసరమే

- సిటిజన్ ఫర్ డెమోక్రసీ సమావేశంలో పలువురు వక్తల అభిప్రాయం
- మొదటి విడత రైతులకు న్యాయం చేసి ముందుకు వెళ్లాలని మరికొందరి సూచన

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి చుట్టూ పరిశ్రమలు, పెద్ద ప్రాజెక్టులు ఏర్పాటై ఉద్యోగ, ఉపాధి అవకాశాలు పెరగాలంటే రెండో విడత భూ సమీకరణను ప్రభుత్వం చేపట్టడం అవసరమని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. ప్రపంచస్థాయి నగరంగా అమరావతి విస్తరించేందుకు ఇప్పుడు ముందుకు వెళ్లడమే సమంజసమని, అభివృద్ధి చెందిన తర్వాత భూముల్ని తీసుకోవాలంటే ఇబ్బంది తలెత్తే అవకాశముందని పేర్కొన్నారు. రెండో విడత సమీకరణ చేయకపోతే ఇప్పటికే భూములిచ్చిన రైతులకు కూడా మేలు జరగదని స్పష్టం చేశారు. అయితే మరికొందరు దీనికి భిన్నంగా అభిప్రాయాలు వ్యక్తం చేశారు. మొదటి విడత రైతులకు రిటర్నబుల్ ప్లాట్లను ఇచ్చాకే రెండో విడత సమీకరణకు వెళ్లాలని సూచించారు. ఇప్పుడు కాకుండా అమరావతి నిర్మాణం పూర్తయ్యాక రెండో విడతకు ముందుకెళ్లాలని ఇంకొందరు అభిప్రాయపడ్డారు. 'సిటిజన్ ఫర్ డెమోక్రసీ' ఆధ్వర్యంలో విజయవాడలో 'రెండో విడత భూసమీకరణ అంశం'పై చర్చ నిర్వహించారు. ఆ సంస్థ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ తొలుత భూసమీకరణ విధానం, ఒనగూరే లబ్ధిపై ప్రజంటేషన్ ఇచ్చారు. ఆ సంస్థ సభ్యుడు ఎంసీ దాసు సభకు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వ్యక్తమైన అభిప్రాయాలివి..


రాజధాని అమరావతి రెండో విడత భూ సమీకరణపై నిర్వహించిన చర్చావేదికలో మాట్లాడుతున్న నిమ్మగడ్డ రమేశ్‌కుమార్. చిత్రంలో ఎంసీ దాస్, పట్టాభిరామయ్య

కొత్త భూసమీకరణపై అస్పష్టత

– నిమ్మగడ్డ రమేశ్‌కుమార్, సిటిజన్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి

ప్రభుత్వం కొత్తగా చేపడుతున్న భూసమీకరణపై రైతుల్లో అస్పష్టత ఉందని, అది మంచిది కాదని సిటిజన్ ఫర్ డెమోక్రసీ ప్రధాన కార్యదర్శి నిమ్మగడ్డ రమేశ్‌కుమార్ అభిప్రాయపడ్డారు. సమగ్ర సమాచారం లేకపోతే భిన్నాభిప్రాయాలు వచ్చే అవకాశముందని అన్నారు. రెండో విడత సమీకరణపై తమది తటస్థ వైఖరి అని చెబుతూ.. భిన్న వాదనలు వినిపించడానికి, ప్రభుత్వానికి సూచనలివ్వడానికి ఈ వేదిక ఏర్పాటు చేశామన్నారు. 'రెండో విడత సమీకరణ తప్పనిసరి అని, రాజధాని రాష్ట్ర స్థూల ఆర్థికాభివృద్ధికి ఉద్దేశించినదని.. ప్రపంచస్థాయి నగరంగా అభివృద్ధి చెందితేనే అన్ని రకాల అవకాశాలు ఇక్కడికి వస్తాయని రాజధాని రైతు ఐకాస కన్వీనర్ పువ్వాడ సుధాకర్ పేర్కొన్నారు. అమరావతి చుట్టూ పెద్ద పెద్ద ప్రాజెక్టులు రావాలంటే ప్రభుత్వం వద్ద అదనపు భూమి అవసరమని, ఇప్పుడు దాని ఫలితం తెలియకపోయినా వచ్చే తరాలు కచ్చితంగా ఆ ఫలాల్ని పొందుతాయని బి.ప్రియాంక అనే మహిళా రైతు వివరించారు. మొదటి విడత భూములిచ్చిన రైతుల సమస్యల్ని పరిష్కరించి రెండో విడత సమీకరణకు ముందుకెళ్లాలన్నారు. రాజధాని నిర్మాణానికి కొంత సమయం పడుతుందని, ప్రజలు ఆశాభావంతో ముందుకు సాగాలని ప్రముఖ వైద్యుడు, సామాజికవేత్త డాక్టర్ సమరం వివరించారు. ఇప్పటికే చాలా కంపెనీలతో ఒప్పందాలు జరిగాయని.. మరికొన్ని ఎంవోయూలు చేసుకుంటున్నాయని.. స్థలం ఉంటే తప్ప వాటిని ఎక్కడ నిర్మించాలనే ప్రణాళిక ఉండదని పేర్కొన్నారు.

రైతులకు స్పష్టంగా వివరించాలి

పెట్టుబడిదారుల్ని ఆకర్షించాలంటే ల్యాండ్ బ్యాంక్ అవసరమని మహిళా పారిశ్రామికవేత్త అపర్ణ అభిప్రాయపడ్డారు. క్వాంటం వ్యాలీ ప్రారంభమైన తర్వాత వచ్చే పరిశ్రమలకు భూమి కేటాయించాలంటే ఎక్కడుందని ఆమె ప్రశ్నించారు. ఇప్పటికే భూములు తీసుకున్న రైతులకు న్యాయం చేయాలని భానుప్రసాద్ అనే రైతు వివరించారు. భూసమీకరణపై లోతైన అధ్యయనం జరగాలని నీటిపారుదల రంగ విశ్లేషకుడు లక్ష్మీనారాయణ చెప్పారు. భూములిచ్చిన రైతులు మొదటి లబ్ధిదారులుగా ఉండాలన్నారు. సిటిజన్ ఫర్ డెమోక్రసీ సభ్యుడు కె.పట్టాభిరామ్ మాట్లాడుతూ.. రెండో విడత భూ సమీకరణ అవసరం లేదని, రాజధాని నిర్మాణం తర్వాత మిగతా అభివృద్ధిని ప్రైవేటు సంస్థలే చూసుకుంటాయని అభిప్రాయపడ్డారు. మూడేళ్లలోపు రిటర్నబుల్ ప్లాట్లను ప్రభుత్వం అభివృద్ధి చేసి ఇస్తుందా.. లేదా అనే ఆందోళన రైతుల్లో ఉందని నరసింహారావు అనే రాజధాని రైతు పేర్కొన్నారు. రెండో విడత భూమి అవసరమే కానీ సమర్థమైన నాయకులతో కమిటీ వేసి చర్చించాలని భాజపా కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి అశోక్ పేర్కొనగా, మళ్లీ సమీకరణ భావ్యం కాదని యుగంధర్ అనే రాజధాని రైతు అభిప్రాయపడ్డారు. భూములు ఎందుకో రైతులకు వివరించి ముందుకెళ్లాలని రైతు సంఘం నాయకుడు స్వరాజ్యరావు పేర్కొన్నారు. ఇప్పటికే భూములిచ్చిన వారికి భరోసానిచ్చేలా చర్చించకపోవడం మంచిది కాదని రాజధాని దళిత ఐకాస నాయకుడు చిలకా బసవయ్య పేర్కొన్నారు. ఒకసారి రాజధాని నిర్మాణం జరిగాక మిగతా అభివృద్ధి అంతా ప్రైవేటు ద్వారా జరుగుతుందని, హైదరాబాద్ కూడా ఇలానే ప్రగతిబాట పట్టిందని రాజధాని రైతు గద్దె తిరుపతిరావు తెలిపారు.

ప్రాణాలు తీసిన ఈత సరదా

- నీటి కుంటలో మునిగి ఆరుగురు విద్యార్థుల మృతి

ఈనాడు, కర్నూలు, ఆలూరు, ఆస్పరి, ఆదోని నేర విభాగం, న్యూస్‌టుడే: నీటికుంటలో ఈత కొట్టేందుకు వెళ్లిన చిన్నారులు మృత్యుఒడికి చేరిన విషాద ఘటన కర్నూలు జిల్లా ఆస్పరి మండలం చిగిలి గ్రామంలో జరిగింది. గ్రామంలోని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఐదోతరగతి చదువుతున్న భీమేశ్, వినయ్, మహబూబ్ బాషా, సాయికిరణ్, కిన్నెరసాయి, శశికుమార్, దుర్గాప్రసాద్ స్నేహితులు. వీరందరి వయసు పదేళ్లే. నిత్యం పాఠశాల వదిలాక కాసేపు ఆడుకోవడం వారికి అలవాటు. బుధవారం సాయంత్రం పాఠశాల వదిలిన తర్వాత గ్రామ శివారులోని కొండ దగ్గర ఉన్న నీటి కుంట వద్దకు వెళ్లారు. ఇటీవల వర్షానికి అందులో నిండా నీరు చేరింది. ఈదాలని కుంటలోకి దిగారు. వారికి ఈత రాదని.. దిగితే చనిపోతామన్న అవగాహన లేదు. దుర్గాప్రసాద్ మినహా అందరూ ఒకేసారి దిగడంతో అంతా మునిగిపోయారు. గట్టు మీద కూర్చున్న విద్యార్థి కంగారు పడి, గ్రామంలోని ఉన్నత పాఠశాల వద్దకు వెళ్లి వ్యాయామ ఉపాధ్యాయుడికి చెప్పాడు. దీంతో ఆయన కొందరు పదోతరగతి విద్యార్థులతో కలిసి ఆ కుంట వద్దకు వెళ్లారు. అక్కడ ఎవరూ లేకపోవడంతో గ్రామస్థులను పిలిచారు. ఈత వచ్చిన వాళ్లు కుంటలోకి దిగి వెతికి చిన్నారులను బయటకు తీశారు. వినయ్, మహబూబ్ బాషా, భీమేశ్ అప్పటికే చనిపోయారు. మరో ముగ్గురు కొన ఊపిరితో ఉన్నట్లు భావించారు. ఆ ముగ్గురిలో సాయికిరణ్, శశికుమార్‌ను ఆదోనిలోని ప్రైవేటు ఆసుపత్రికి, కిన్నెరసాయిని ఆదోని ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి వారూ మృతిచెందినట్లు నిర్ధారించారు. ఒకే గ్రామానికి చెందిన ఆరుగురు విద్యార్థులు మృతిచెందడంతో తల్లిదండ్రులు, గ్రామస్థుల రోదనలతో విషాదఛాయలు అలముకున్నాయి. మంగళవారం సైతం వారంతా కుంట వద్దకు వెళ్లారు. లోపలకు దిగకుండా.. ఆ పరిసరాల్లో ఆడుకుని క్షేమంగా తిరిగివచ్చారు. బుధవారం దుర్గాప్రసాద్‌నూ కుంటలో దిగడానికి మిగిలినవారు పిలిచినా.. నీళ్లంటే భయం కావడంతో తాను రానని చెప్పి ప్రాణాలతో బయటపడ్డాడు. ఆస్పరి సీఐ గంగాధర్, పత్తికొండ ఆర్డీవో భరత్‌నాయక్‌లు గ్రామానికి చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సబ్‌కలెక్టర్ మౌర్య భరద్వాజ్, ఆదోని డీఎస్పీలు ఆదోని ఆసుపత్రికి వెళ్లి మృతదేహాలను చూసి తల్లిదండ్రులతో మాట్లాడారు.


కిన్నెరసాయి | భీమేష్ | సాయికిరణ్ | శశికుమార్ | వినయ్ | మహబూబ్‌బాషా


చిన్నారులను మింగిన నీటి కుంట

చిన్నారుల మృతిపై చంద్రబాబు దిగ్భ్రాంతి

ఈనాడు, అమరావతి: చిన్నారులు మృతిచెందిన ఘటనపై సీఎం చంద్రబాబు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ప్రభుత్వం తరపున ఆదుకుంటామని ఓ ప్రకటనలో హామీ ఇచ్చారు. ● ప్రమాదం అత్యంత బాధాకరమని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేశ్, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు మాధవ్, వైకాపా అధ్యక్షుడు జగన్ వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

కేతిరెడ్డికి భద్రతపై సింగిల్ జడ్జి ఉత్తర్వుల సస్పెన్షన్

మధ్యంతర ఉత్తర్వులిచ్చిన ధర్మాసనం

ఈనాడు, అమరావతి: తాడిపత్రిలోని తన ఇంటికి వెళ్లేందుకు వైకాపా మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డికి పోలీసు భద్రత కల్పించాలని, సమస్య ఏర్పడితే ఎదుర్కొనేందుకు అదనపు బలగాలను మోహరించాలని పేర్కొంటూ.. కోర్టుధిక్కరణ వ్యాజ్యంలో హైకోర్టు సింగిల్ జడ్జి ఇచ్చిన ఉత్తర్వులను ధర్మాసనం సస్పెండ్ చేసింది. ప్రధాన వ్యాజ్యంలో జారీచేసిన ఆదేశాలకు అదనంగా కోర్టుధిక్కరణ పిటిషన్లో సింగిల్ జడ్జి ఉత్తర్వులిచ్చారని ప్రాథమికంగా అభిప్రాయపడింది. పెద్దారెడ్డికి నోటీసులు జారీచేస్తూ కౌంటర్ వేయాలని ఆదేశించింది. విచారణను మూడు వారాలకు వాయిదా వేసింది. హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ హరి హరినాథశర్మలతో కూడిన ధర్మాసనం బుధవారం ఈ మేరకు ఉత్తర్వులిచ్చింది.

● ఈ నెల 18న తాడిపత్రిలోని తన ఇంటికి వచ్చేందుకు పెద్దారెడ్డికి భద్రత కల్పించాలని, రాజకీయ ప్రత్యర్థితో సమస్య ఏర్పడితే ఎదుర్కొనేందుకు అదనపు బలగాలను మోహరించాలని పోలీసులను ఆదేశిస్తూ హైకోర్టు సింగిల్ జడ్జి ఉత్తర్వులిచ్చారు. వీటిని సవాలు చేస్తూ అనంతపురం జిల్లా ఎస్పీ ధర్మాసనం ముందు అప్పీల్ వేశారు. బుధవారం జరిగిన విచారణలో ఎస్పీ తరపున ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ వాదనలు వినిపిస్తూ 'కోర్టు ఆదేశాలను అమలుచేయాల్సిన బాధ్యత పోలీసులపై ఉంది. పెద్దారెడ్డి దాఖలుచేసిన వ్యాజ్యంలో ఇచ్చిన ఉత్తర్వులకు మించి కోర్టుధిక్కరణ వ్యాజ్యంలో సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీచేయడంపైనే మా అభ్యంతరం. సింగిల్‌జడ్జి ఉత్తర్వులను సస్పెండ్ చేయండి' అని కోరారు. పెద్దారెడ్డి తరఫున సీనియర్ న్యాయవాది పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపిస్తూ సింగిల్ జడ్జి ఉత్తర్వులు సరైనవేనన్నారు.

● ధర్మాసనం స్పందిస్తూ.. 'ఉత్తర్వులను అమలుచేయలేదని కోర్టు భావిస్తే అధికారికి నోటీసు ఇచ్చి వివరణ తీసుకోవాలి. ఆదేశాలను ఉల్లంఘించినట్లు తేలితే శిక్ష విధించాలి. అధికారి ఇచ్చిన వివరణపై సంతృప్తి చెందితే కోర్టుధిక్కరణ వ్యాజ్యాన్ని కొట్టేయాలి. ఈ రెండు అంశాలకు పరిమితం కావడం తప్ప కోర్టుధిక్కరణ పిటిషన్లో అదనంగా ఉత్తర్వులివ్వడానికి వీల్లేదు' అని స్పష్టం చేసింది. ఏజీ వాదనలతో ప్రాథమికంగా సంతృప్తి చెందుతున్నట్లు పేర్కొంటూ సింగిల్ జడ్జి ఉత్తర్వులను సస్పెండ్ చేసింది.

వెంకటేశ్ నాయుడి ఫోన్ తెరిచేందుకు అనుమతించండి

ఏసీబీ కోర్టులో సిట్ పిటిషన్

ఈనాడు, అమరావతి: మద్యం కేసులో అరెస్టయిన చెవిరెడ్డి భాస్కరరెడ్డి అనుచరుడు వెంకటేశ్ నాయుడి ఫోన్‌ను తెరిచేందుకు అనుమతివ్వాలని సిట్ అధికారులు విజయవాడలోని ఏసీబీ కోర్టులో బుధవారం పిటిషన్ దాఖలు చేశారు. జూన్ 18న బెంగళూరులోని విమానాశ్రయంలో అరెస్టు చేసిన సమయంలో అతని వద్ద ఉన్న ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్న సంగతి తెలిసిందే. ఇందులోని డేటాను పరిశీలించాల్సి ఉందని, దర్యాప్తునకు ఉపకరిస్తుందని, ఆధారాలు సేకరించాల్సి ఉందని పిటిషన్‌లో పోలీసులు పేర్కొన్నారు. దీనిపై నిందితుడి తరపు న్యాయవాదులు కౌంటరు దాఖలు, వాదనల నిమిత్తం న్యాయాధికారి భాస్కరరావు.. ఈ నెల 25కి వాయిదా వేశారు.

పదవీ విరమణ చేసిన ఉద్యోగుల పునర్నియామకం!

ఈనాడు, అమరావతి: ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ చేసిన అనంతరం కాంట్రాక్ట్/పొరుగు సేవల విధానంలో ఏడాది మాత్రమే పనిచేసేందుకు గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ప్రభుత్వం సవరించింది. ఈ నియామకాలపై సీఎస్ నేతృత్వంలోని కమిటీ నిర్ణయం తీసుకునేది. ఏడాది పూర్తయ్యాక కూడా వారిని తిరిగి కొనసాగించే ప్రతిపాదనను ఈ కమిటీ పరిగణనలోకి తీసుకుంటుందని సవరించిన ఉత్తర్వులను జారీ చేసింది.

అప్పు ఎగ్గొట్టి.. ఆపై దాడి

- బాకీ తీర్చాలని అడిగినందుకు అనుచరులతో బంధువును చావబాదించారు
- 'వ్యూహం' నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ దాష్టీకం
- హైదరాబాద్‌లో అరెస్టు చేసిన బెజవాడ పోలీసులు

ఈనాడు–అమరావతి, న్యూస్‌టుడే–పటమట: వైకాపా వీర విధేయుడు, 'వ్యూహం' సినిమా నిర్మాత దాసరి కిరణ్‌కుమార్ అరెస్టయ్యారు. బుధవారం హైదరాబాద్‌లో విజయవాడ పోలీసులు అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొచ్చి విచారిస్తున్నారు. అప్పు ఎగ్గొట్టడమే కాకుండా అడిగినందుకు అనుచరులతో తీవ్రంగా దాడి చేయించిన కేసులో కిరణ్‌కుమార్ నిందితుడు. తన సమీప బంధువు వద్ద రూ.4.50 కోట్ల అప్పు తీసుకుని తీర్చకుండా కొంతకాలంగా తప్పించుకుని తిరుగుతున్నారు. దీనిపై విజయవాడలోని పటమట స్టేషన్‌లో కేసు నమోదైంది.

విడతలవారీగా అప్పు

గుంటూరు జిల్లా తెనాలి సమీపంలోని పెరవల్లికి చెందిన గాజుల మహేష్ వ్యాపారరీత్యా హైదరాబాద్‌లోని బంజారాహిల్స్‌లో స్థిరపడ్డారు. సమీప బంధువైన నిర్మాత దాసరి కిరణ్‌కుమార్.. వ్యాపార అవసరాల నిమిత్తం 2021 నుంచి 2024 వరకు విడతల వారీగా రూ.4.5 కోట్లు అప్పుగా తీసుకున్నారు. తర్వాత అడిగితే సమాధానం చెప్పట్లేదు. ఫోన్‌లోనూ స్పందించడం లేదు. విజయవాడ, విశాఖపట్నం, హైదరాబాద్‌లో కిరణ్ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేసేవారు.

● గత వారం వరుస సెలవులు రావడంతో భార్యాపిల్లలతో కలిసి మహేష్ పెరవల్లి వచ్చారు. ఈ క్రమంలో విజయవాడ బెంజిసర్కిల్ సమీపంలోని మాతా టవర్స్‌లోని కిరణ్‌కుమార్‌కు చెందిన రియల్ ఎస్టేట్ కార్యాలయానికి ఈ నెల 16, 17 తేదీల్లో తన భార్యతో పాటు వెళ్లాడు. ఆ సమయంలో కిరణ్‌కుమార్ ఆఫీస్‌లో లేరు. తిరిగి ఈ నెల 18న మధ్యాహ్నం 12.40కి వెళ్లారు. దీంతో ఆఫీసు సిబ్బంది కిరణ్‌కు ఫోన్ చేసి తెలిపారు. కాసేపటికే కిరణ్ పంపిన అవారు నాగతేజ అనే వ్యక్తితో పాటు మరో 14 మంది అక్కడకు వచ్చి మహేష్, అతని భార్యను అసభ్యకరంగా దూషిస్తూ దాడిచేశారు. నాగతేజ తన చేతి కడియంతో మహేష్ ఎడమ చెవిపై కొట్టడంతో తీవ్ర గాయమైంది. భార్యాభర్తలపై దాడిచేస్తూ ఆఫీసు బయటకు ఈడ్చివేశారు. ఈ దాడిలో మహేష్ చెవి, భుజానికి గాయమైంది. అతని భార్యకు ముఖంపై గాయాలయ్యాయి. దీనిపై బాధితుడు పటమట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేశారు.


మహేష్‌పై (చారలచొక్కా) దాడిచేసి నెట్టేస్తున్న కిరణ్ అనుచరులు



జగన్‌తో నిర్మాత కిరణ్ కుమార్ ● రామ్‌గోపాల్‌వర్మతోనూ..

జగన్‌కు వీర విధేయుడు

కిరణ్‌కుమార్ వైకాపాకు వీర విధేయుడిగా వ్యవహరించేవాడు. జగన్‌కు అనుకూలంగా పలు చిత్రాలను నిర్మించారు. జగన్ చేసిన పోస్టులను తన ఖాతాలో షేర్ చేసేవారు. వైకాపా ప్రభుత్వంలో 2022లో తితిదే బోర్డు సభ్యుడిగా నియమితులయ్యారు. ప్రమాణస్వీకారం అనంతరం ఆలయం వెలుపల మీడియాతో మాట్లాడుతూ.. 'జగన్ దైవసమానుడు.. భగవత్ స్వరూపుడు.. ఎన్ని జన్మలెత్తినా ఆయన రుణం తీర్చుకోలేను..' అంటూ చెప్పారు. దర్శకుడు రామ్‌గోపాల్ వర్మతో కలిసి 'వ్యూహం' సినిమాను నిర్మించారు. 'వ్యూహం' సినిమాలో జగన్‌ను ఉన్నతుడిగా చూపిస్తూ.. చంద్రబాబు, లోకేశ్, పవన్ కల్యాణ్‌లను కించపరిచేలా వారి పాత్రలను రూపొందించారు.

అటవీశాఖ ఉద్యోగులపై శ్రీశైలం ఎమ్మెల్యే దాష్టీకం

- అర్ధరాత్రి వరకు వాహనంలో తిప్పుతూ దాడి



శిఖరం చెక్‌పోస్టు దగ్గర అటవీశాఖ ఉద్యోగి కరీముల్లాపై చేయిచేసుకుంటున్న బుడ్డా రాజశేఖరరెడ్డి

ఈనాడు, కర్నూలు: అటవీశాఖ ఉద్యోగులపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి మంగళవారం రాత్రి దాడి చేయించిన ఉదంతం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఆయన కారును మంగళవారం రాత్రి పది గంటల సమయంలో శిఖరం చెక్‌పోస్టు దగ్గర ఆపారు. రాత్రి తొమ్మిది దాటాక వాహనాలను క్షుణ్నంగా తనిఖీ చేసి పంపిస్తారు. ఎమ్మెల్యే వాహనాన్ని పంపేయాల్సి ఉన్నా, అటవీశాఖాధికారులు ఆ మేరకు చర్యలు తీసుకోలేదు. దీంతో ఆగ్రహించిన ఎమ్మెల్యే వెంటనే అటవీశాఖ ఉద్యోగుల జీపు దగ్గరకు వెళ్లారు. అందులో ఉన్న ప్రకాశం జిల్లా మార్కాపురం డివిజన్ నెక్కటి రేంజ్‌కు చెందిన డిప్యూటీ రేంజి అధికారి డి.రామ్‌నాయక్, ఇన్‌ఛార్జి సెక్షన్ అధికారి జె.మోహన్‌కుమార్, అటవీ బీట్ అధికారి టీకే గురవయ్య, డ్రైవర్ షేక్ కరీముల్లాలను బయటకు పిలిపించారు. వారిపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైవర్ కరీముల్లా చెంపపై రెండు దెబ్బలు కొట్టారు. మోహన్‌కుమార్, గురవయ్యలనూ కొట్టినట్లు సమాచారం. వారిని అసభ్యపదజాలంతో దూషించారు. అప్పటికీ ఆయన ఆగ్రహం చల్లారలేదు. తన అనుచరులను అధికారుల జీపులో కూర్చోవాలన్నారు. అటవీశాఖ సిబ్బందినీ అందులోకి ఎక్కించి, ఎమ్మెల్యేనే ఆ వాహనాన్ని డ్రైవ్ చేసుకుంటూ సున్నిపెంట, శ్రీశైలం ప్రాంతాలకు వెళ్లారు. దారిలో ఎమ్మెల్యే అనుచరులు ఇద్దరు ఉద్యోగులను కొట్టారు. కొట్టడం సరైన పద్ధతి కాదని ఓ ఉద్యోగి చెబుతున్నా వినిపించుకోలేదు. వారిపై పిడిగుద్దులు కురిపించారు. వారినుంచి వాకీటాకీలు, సెల్‌ఫోన్లు, పర్సులు, జేబులోని నగదు లాక్కున్నారు. శ్రీశైలంలో వాహనాన్ని అర్ధరాత్రి రెండు గంటల వరకు తిప్పుతూ వారిని కొడుతూనే ఉన్నారు. అనంతరం వారందరినీ ఓ కాటేజీకి తీసుకెళ్లి బంధించారు. అర్ధరాత్రి రెండు గంటల ప్రాంతంలో విడిచిపెట్టారు. తమపై దాడి జరిగిందని బాధితులు అటవీశాఖ ఉన్నతాధికారులకు ఫిర్యాదుచేశారు. వారి సూచనతో శ్రీశైలం పోలీసుస్టేషన్లో ఫిర్యాదుచేశారు. ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి అటవీశాఖ ఉద్యోగులను బెదిరించడం, ఓ ఉద్యోగి చెంపపై కొట్టిన దృశ్యాలు సీసీ కెమెరాల్లో నమోదయ్యాయి.

చెక్‌పోస్టుల దగ్గర వసూళ్లకు పాల్పడుతున్నారు

– బుడ్డా రాజశేఖరరెడ్డి, ఎమ్మెల్యే, శ్రీశైలం

శిఖరం, దోర్నాల చెక్‌పోస్టుల దగ్గర సిబ్బంది అవినీతికి పాల్పడుతున్నారు. రాత్రి 9గంటల తర్వాత వచ్చే వాహనదారుల నుంచి రూ.2వేల వరకు తీసుకుంటున్నారు. మంగళవారం రాత్రి నా వాహనాన్నీ ఆపేశారు. వారి వాహనాన్ని నా వాహనం ముందుపెట్టి నన్ను అడ్డుకున్నారు. ఇది ఎంతవరకు సమంజసం? రాత్రి 9 తర్వాత వాహనాలపై నిషేధం ఉంటే ఘాట్‌రోడ్డులో అన్ని వాహనాలు ఎలా ఉన్నాయి? బ్రీత్ ఎనలైజర్లు పట్టుకుని భారీ ఎత్తున అపరాధరుసుము వసూలు చేస్తున్నారు. శ్రీశైలం పరిసరాల్లోని అటవీభూముల్లో పలు ఆక్రమణలున్నాయి. అటవీశాఖ అధికారులకు అవి కనిపించట్లేదు. దీంతోపాటు అటవీప్రాంతం పేరు చెప్పి ప్రతి అభివృద్ధి పనికీ అడ్డం తగులుతున్నారు. ఒక్క రోడ్డుకూ అనుమతులు ఇవ్వట్లేదు. అందుకే వారి వాహనంలో వారిని తీసుకెళ్లి శ్రీశైలంలో నేను చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలు చూపించాను. వారిని గట్టిగా ప్రశ్నించిన విషయం వాస్తవమే. అధికారులను ప్రశ్నించాను గానీ వారు దళితులా? గిరిజనులా? అన్న విషయం నాకెలా తెలుస్తుంది? అటవీశాఖాధికారులు నాపై దుష్ప్రచారం చేస్తున్నారు. నేను కూడా విలేకరుల సమావేశం పెట్టి వాస్తవాలు వివరిస్తాను.

ఎమ్మెల్యే తీరుపై చంద్రబాబు ఆగ్రహం

ఈనాడు, అమరావతి: శ్రీశైలం శిఖరం చెక్‌పోస్టు వద్ద అటవీ ఉద్యోగులపై శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డి దాడి చేశారన్న ఆరోపణలపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరాతీశారు. సీఎంఓ అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే తీరుపై ఆగ్రహం వ్యక్తం చేసినట్టు సమాచారం. తరచుగా ఆయన వివాదాల్లో చిక్కుకోవడంపైనా అసంతృప్తి వ్యక్తం చేశారు. పూర్తిస్థాయి విచారణ చేసి కేసు నమోదుచేయాలని, మొత్తం వివాదంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారుల్ని చంద్రబాబు ఆదేశించారు.

ఏ స్థాయి వ్యక్తులైనా ఉపేక్షించం: పవన్‌కల్యాణ్

శ్రీశైలంలో అటవీశాఖ ఉద్యోగులపై దాడి ఘటనలో ఎమ్మెల్యే, ఆయన అనుచరుల ప్రమేయంపై విచారణ జరిపి సమగ్ర నివేదిక ఇవ్వాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తెలిపారు. నిబంధనల ప్రకారం బాధ్యులపై కేసులు నమోదుచేయాలని స్పష్టం చేసినట్లు చెప్పారు. ఈ మేరకు బుధవారం రాత్రి ఆయన ఎక్స్‌లో పోస్ట్ చేశారు. "ఉద్యోగులపై దాడి చేసిన వారు ఏ స్థాయి వ్యక్తులైనా సరే చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం ఉపేక్షించదు" అని పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు.

రాజశేఖరరెడ్డిపై చర్యలు తీసుకోవాలి: ఉద్యోగులు

యర్రగొండపాలెం, న్యూస్‌టుడే: విధుల్లో ఉన్న అటవీశాఖ సిబ్బందిపై దాడిచేసిన శ్రీశైలం ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖరరెడ్డిపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ జూనియర్ ఫారెస్ట్ ఆఫీసర్స్ అసోసియేషన్ (ఏపీజేఎఫ్ఓఏ) డిమాండ్ చేసింది. యర్రగొండపాలెం అటవీశాఖ కార్యాలయంలో ఏపీజేఎఫ్ఓఏ మార్కాపురం డివిజన్ అధ్యక్షుడు పి.కరీముల్లా మాట్లాడుతూ.. ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఉపముఖ్యమంత్రి, అటవీశాఖ మంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి విషయం తీసుకెళ్తామన్నారు.

కృత్రిమ మేధతో రూ.850 కోట్ల మోసం

- పొంజీ స్కీమ్‌తో 3 వేల మందికి టోకరా
- ముగ్గురు అంతర్రాష్ట్ర మాయగాళ్ల అరెస్టు



వేణుగోపాల్ వెంకటరావు శ్రేయస్‌పాల్

ఈనాడు, హైదరాబాద్: స్టాక్‌మార్కెట్‌లో పెట్టుబడితో అధిక ఆదాయం పొందొచ్చంటూ పొంజీ స్కీమ్‌తో మోసాలకు పాల్పడిన గడ్డం వేణుగోపాల్, గడ్డం వెంకటరావు, శ్రేయస్‌పాల్‌లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సైబరాబాద్ ఈవోడబ్ల్యూ డీసీపీ ముత్యంరెడ్డి తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లోని ప్రకాశం జిల్లా మల్లవరప్పాడుకు చెందిన వేణుగోపాల్ మణికొండలో ఉంటున్నాడు. మాదాపూర్‌లో పలు ఫేక్ కంపెనీలను, నకిలీ వెబ్‌సైట్లను ప్రారంభించాడు. ప్రధాన నగరాల్లో 20 మందికిపైగా ఏజెంట్లను నియమించాడు. టెక్నికల్ డెవలపర్స్, వెబ్‌సైట్ అడ్మినిస్ట్రేటర్లను ఏర్పాటు చేసుకున్నాడు. వివిధ పేర్లతో నకిలీ వెబ్‌సైట్లు తయారుచేశాడు. సాంకేతికతతో రోజూ ఏయే స్టాక్స్ పెరుగుతాయనేది పసిగట్టవచ్చని ఏపీ, తెలంగాణాల్లో ఇన్వెస్ట్‌మెంట్ సెమినార్స్ నిర్వహించి సామాన్యులను నమ్మించాడు. గడ్డం వెంకటరావు ఐబీటీ క్యాపిటల్ టెక్నాలజీస్ పేరిట మోసానికి పాల్పడ్డాడు. వేణుగోపాల్ పెట్టిన ఏవీ సొల్యూషన్స్‌లో శ్రేయస్‌పాల్ కీలక ఉద్యోగిగా ఉండేవాడు.

స్టాక్స్ భవిష్యత్ గుప్పిట్లో...

మధ్యతరగతి కుటుంబాల వారిని, విశ్రాంత ఉద్యోగులను లక్ష్యంగా చేసుకొని వేణుగోపాల్, గడ్డం వెంకటరావులు అధిక రాబడి(పొంజీ స్కీమ్) ఆశ చూపారు. తమ సంస్థలలో పెట్టుబడి పెట్టేందుకు మరొకరి రిఫరెన్స్ ఉండాలనే నిబంధన విధించారు. ప్రతినెలా 7%, ఏటా 84% రిటర్న్స్ ఖాయమంటూ నమ్మకం కలిగించారు. నకిలీ డ్యాష్‌బోర్డులు రూపొందించి భారీ లాభాలొస్తున్నట్లు చూపించారు. బాధితుల నుంచి సేకరించిన డబ్బును 21 మ్యూల్ ఖాతాల్లోకి మళ్లించారు. పెట్టుబడి పెట్టినవారికి ఆ సొమ్మంతా స్టాక్ మార్కెట్‌లోనే ఉన్నట్టు చూపారు. సేకరించిన డిపాజిట్లతో స్థిరాస్తి వ్యాపారం, బంగారం, ఖరీదైన వాహనాలు కొన్నారు. దుబాయి కేంద్రంగా చేసుకొని మనీ లాండరింగ్‌కు పాల్పడ్డారు. డబ్బు తిరిగివ్వాలన్న బాధితులను బెదిరించారు. డిజిటల్ రికార్డులు తొలగించారు.

బయటపడిందిలా...

పుప్పాలగూడకు చెందిన ప్రైవేటు ఉద్యోగి వారి మాటలు నమ్మి రూ.23 లక్షలు స్టాక్స్‌లో పెట్టుబడి పెట్టారు. లాభం ఇవ్వకపోవడంతో సైబరాబాద్ ఈవోడబ్ల్యూలో ఫిర్యాదుచేశారు. డీసీపీ ముత్యంరెడ్డి ఆధ్వర్యంలో ఏసీపీ రవీందర్, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్సైలు ప్రదీప్‌కుమార్, అలంక్రిత్‌గౌడ్ బృందం దర్యాప్తు చేపట్టింది. 2022-25 మధ్య నకిలీ కంపెనీలు, ఏఐ సాయంతో దేశవ్యాప్తంగా 3,164 మందిని మోసగించి రూ.850.59 కోట్లు కొల్లగొట్టినట్లు గుర్తించారు. ఏవీ సొల్యూషన్స్ పేరిట వేణుగోపాల్ 2,388 మంది నుంచి రూ.441.52 కోట్లు, ఐబీటీ క్యాపిటల్ టెక్నాలజీస్ పేరిట వెంకటరావు 776 మంది నుంచి రూ.409.07 కోట్లు కాజేసినట్లు ఆధారాలు సేకరించారు. బుధవారం నిందితుల నుంచి రెండు ఖరీదైన కార్లు, 11 ల్యాప్‌టాప్‌లు, 3 ఫోన్లు, 3,164 మంది బాధితుల డేటాబేస్, బినామీ పేర్లతో మణికొండ, హ్యాపీ హోమ్స్‌లో ఉన్న ఫ్లాట్‌లను స్వాధీనం చేసుకున్నారు.

మంగళగిరి ఎయిమ్స్ ప్రెసిడెంట్‌గా తపన్‌కుమార్ సాహా



ఈనాడు, దిల్లీ: మంగళగిరి ఎయిమ్స్ సాధారణ పరిపాలన విభాగం ప్రెసిడెంట్‌గా మేజర్ జనరల్ డాక్టర్ తపన్‌కుమార్ సాహాను నియమిస్తూ కేంద్ర వైద్యఆరోగ్యశాఖ బుధవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇదివరకు పాలకమండలి సభ్యుడిగా ఉన్న బెంగళూరు నిమ్హాన్స్ డైరెక్టర్ స్థానంలో తపన్‌కుమార్‌ను నియమించి ఆయన్నే పాలకమండలి అధ్యక్షుడిగా ప్రకటించింది. డాక్టర్ సాహా 35 ఏళ్లకుపైగా భారత సైనికదళాల్లో సేవలందించారు. వివిధ ఆర్మీ బోధనా సంస్థల్లో 20 ఏళ్లకుపైగా బోధకుడిగా పనిచేసిన అనుభవం ఉంది. వివిధ ప్రముఖ విద్యాసంస్థల ఎగ్జామినర్‌గానూ పనిచేశారు. ఇందిరాగాంధీ హత్యానంతరం భారతసైన్యం నిర్వహించిన సిక్కు పునరావాస కేంద్రాల్లో ఆయన ఆధ్వర్యంలోని వైద్యబృందం సేవలు అందించింది. భారత సాయుధదళాల ఆధ్వర్యంలో పనిచేసే అతిపెద్ద పుణె వైద్యకళాశాలకు 2015-16 మధ్య నేతృత్వం వహించారు. ఆయన మేరఠ్‌లోని లాలా లజపతిరాయ్ స్మారక వైద్య కళాశాలలో ఎంబీబీఎస్, పుణె ఆర్మ్‌డ్ ఫోర్సెస్ వైద్యకళాశాలలో బయోకెమిస్ట్రీలో ఎండీ చేశారు. క్లినికల్ బయోకెమిస్ట్రీ, మెడికల్ ఎడ్యుకేషన్‌లో నైపుణ్యం సాధించారు.

డిగ్రీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభం

ఈనాడు, అమరావతి: డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కౌన్సెలింగ్‌కు ఉన్నత విద్యామండలి బుధవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. ప్రవేశాల కోసం ఈనెల 26 లోపు విద్యార్థులు రిజిస్ట్రేషన్లు చేసుకోవాలని సూచించింది. ప్రాసెసింగ్ ఫీజు కింద ఓసీలు రూ.400, బీసీలు రూ.300, ఎస్సీ, ఎస్టీలు రూ.200 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. ప్రత్యేక కేటగిరీ అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన 25 నుంచి 28 వరకు నిర్వహించనున్నారు. కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఐచ్ఛికాల నమోదు 24 నుంచి 28 వరకు ఇచ్చారు. వెబ్ ఐచ్ఛికాల మార్పు 29న, సీట్ల కేటాయింపు 31న చేయనున్నారు. సెప్టెంబరు ఒకటి నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి.

ఉగ్ర బాధిత కుటుంబాలకు ఎంబీబీఎస్ సీట్లు

ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం, న్యూస్‌టుడే: ఉగ్రవాదుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన, దివ్యాంగులైన పౌరుల జీవిత భాగస్వాములు, సంతతికి సెంట్రల్ పూల్‌లో ఎంబీబీఎస్ సీట్లు కేటాయించనున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఆరోగ్య, వైద్య కుటుంబ సంక్షేమ శాఖ... డీఎంఈ, ఎన్టీఆర్ ఆరోగ్య విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్‌కు ఉత్తర్వులు జారీ చేసింది. బిహార్‌లోని గయా మగధ్ మెడికల్ కళాశాలకు ఒకటి, ముంబయిలోని గ్రాంట్ మెడికల్ కళాశాలకు ఒకటి, ఛత్తీస్‌గఢ్‌లోని రాయ్‌పూర్ పి.జె.ఎన్.ఎం.మెడికల్ కళాశాలకు రెండు సీట్లను ఉగ్ర బాధిత కుటుంబాల కోసం కేంద్రం కేటాయించింది. అభ్యర్థులు జాతీయ వైద్య కమిషన్ నియమాల మేరకు విద్య, వయసు కలిగి ఉండాలి. నీట్ యూజీ - 2025లో కనీస అర్హత సాధించాలి. అర్హత కలిగిన అభ్యర్థులు సంబంధిత ధ్రువీకరణ పత్రాలతో కూడిన దరఖాస్తులను ఆగస్టు 31వ తేదీలోగా రాజధాని అమరావతిలోని హోం శాఖకు పంపాలి.

ఎర్రచందనం ధర నిర్ణయంపై మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర ప్రభుత్వం సీజ్ చేసిన ఎర్రచందనాన్ని వేలంలో విక్రయించేందుకుగానూ సరైన ధర నిర్ణయించటం కోసం ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అధ్యక్షతన మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటైంది. ఇందులో ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్, రహదారులు, భవనాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డిని సభ్యులుగా నియమించారు. ఈ మేరకు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.



మిమ్మల్ని విమర్శించేది వారే..

జీవితంలో మీ కన్నా ఎక్కువ సాధించినవారు మిమ్మల్ని చూసి ఈర్ష్యపడరు, మీపై విమర్శలు చేయరు. మీ కన్నా తక్కువ స్థాయిలో ఉన్నవారు మాత్రమే మిమ్మల్ని విమర్శిస్తుంటారు. మీ ఎదుగుదలను చూసి అసూయ పడుతుంటారు. వారి ఉనికిని గుర్తించనికి మీ సమయాన్ని వృథా చేసుకోకండి.

– డెంజిల్ వాషింగ్టన్, నటుడు



జస్టిస్ ఎన్.హరినాథ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు చిదంబరం, కార్యవర్గ సభ్యులు ★ జస్టిస్ సుమతికి జ్ఞాపికను అందజేస్తున్న న్యాయవాదుల సంఘం కార్యవర్గ సభ్యులు ★ జస్టిస్ ఎన్.విజయ్‌కు జ్ఞాపికను అందజేస్తున్న చిదంబరం

శాశ్వత న్యాయమూర్తులకు ఘన సన్మానం

ఈనాడు, అమరావతి: హైకోర్టు శాశ్వత న్యాయమూర్తులుగా నియమితులైన జస్టిస్ నూనెపల్లి హరినాథ్, జస్టిస్ జగడం సుమతి, జస్టిస్ న్యాపతి విజయ్‌లను హైకోర్టు న్యాయవాదుల సంఘం బుధవారం ఘనంగా సన్మానించింది. సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో న్యాయమూర్తులకు శాలువాలు కప్పి, జ్ఞాపికలను అందజేశారు. కార్యక్రమంలో ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్, అదనపు ఏజీ సాంబశివ ప్రతాప్, అదనపు సొలిసిటర్ జనరల్ చల్లా ధనంజయ, పీపీ మెండ లక్ష్మీనారాయణ, న్యాయవాదుల సంఘం ఉపాధ్యక్షుడు రఘువీర్, ప్రధాన కార్యదర్శి సుబోధ్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

వినాయక మండపాల అనుమతులకు ప్రత్యేక వెబ్‌సైట్

ఈనాడు, అమరావతి: వినాయకచవితి సందర్భంగా బహిరంగ ప్రదేశాల్లో మండపాలు ఏర్పాటు చేసే నిర్వాహకులు ఎలాంటి రుసుములూ చెల్లించాల్సిన అవసరం లేకుండా సులువుగా అనుమతులు పొందేందుకు పోలీసు శాఖ ప్రత్యేకంగా ganeshutsav.net వెబ్‌సైట్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది. దరఖాస్తుదారులు వారి చిరునామా, మండపం ఏర్పాటు చేసే ప్రదేశం, కమిటీ సభ్యుల ఫోన్ నంబర్లు, నిమజ్జనం తేదీ, సమయం, విగ్రహాన్ని ఏ వాహనంలో తీసుకెళ్తారనే వివరాలు నమోదు చేయాలి. ఈ వివరాల మేరకు స్థానిక పోలీసులు క్షేత్రస్థాయిలో పరిశీలించి, నిబంధనలకు అనుగుణంగా ఉన్న మండపాలకు అనుమతులిస్తారు. పోలీసులు జారీ చేసే నిరభ్యంతర పత్రాన్ని దరఖాస్తుదారు నేరుగా ఈ వెబ్‌సైట్ నుంచే డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఉత్సవ నిర్వాహకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా కోరారు.



వరద ముంపులో వీఆర్ పురం మండలంలోని పంట పొలాలు



ఆసుపత్రికి తీసుకెళ్లేందుకు చింతరేవుపల్లిలో గర్భిణులను పడవలోకి ఎక్కించిన వైద్య సిబ్బంది

గోదావరికి పెరుగుతున్న వరద

- జలదిగ్బంధంలో విలీన మండలాలు
- కోనసీమ లంక గ్రామాల్లో గుబులు

వరరామచంద్రాపురం, కూనవరం, చింతూరు, పి.గన్నవరం, ధవళేశ్వరం, న్యూస్‌టుడే: గోదావరి వరద క్రమేణా పెరుగుతోంది. దీంతో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని వశిష్ఠ, వైనతేయ, గౌతమి, వృద్ధగౌతమి గోదావరి నదీపాయలు ఉద్ధృతంగా ప్రవహిస్తున్నాయి. పశ్చిమగోదావరి జిల్లా కనకాయలంక వద్ద లోతట్టు కాజ్‌వే పూర్తిగా ముంపులో ఉండడంతో అక్కడి ప్రజలు మరపడవల్లో రాకపోకలు సాగిస్తున్నారు. బూరుగులంక, అరిగెలవారిపేట, జి.పెదపూడి లంక, ఊడుమూడిలంక, ఆనగార్లంక, పెదమల్లంక, అయోధ్యలంక, మర్రిమూల గ్రామస్థులూ మరపడవలను ఆశ్రయిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలో విలీన మండలాలైన వరరామచంద్రాపురం, కూనవరం, చింతూరు పరిధిలోని పలు గ్రామాలు బుధవారం గోదావరి, శబరి నదుల వరద ఉద్ధృతికి జలదిగ్బంధంలోకి వెళ్లిపోయాయి. మూడు రోజుల నుంచి పెరుగుతున్న వరదనీరు గ్రామాల్లోని ఇళ్ల చెంతకు నీరు చేరింది. వందల ఎకరాల్లో పంట పొలాలు నీట మునిగాయి. ఇద్దరు గర్భిణులను వైద్య సిబ్బంది రేఖపల్లి ఆసుపత్రికి తరలించారు. చింతూరు నుంచి ఒడిశా వెళ్లే 326వ నంబరు జాతీయ రహదారిపైకి వరద నీరు చేరడంతో ఏపీ - ఒడిశా రాష్ట్రాల మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. కూనవరంలో వరద ప్రవాహం 43 అడుగులు దాటింది. పోలిపాక వద్ద ప్రధాన రహదారిపైకి వరద నీరు చేరడంతో భద్రాచలం, కూనవరం మధ్య రాకపోకలు నిలిచిపోయాయి. మరోవైపు, ధవళేశ్వరం కాటన్ బ్యారేజీ వద్ద బుధవారం రాత్రి 7 గంటలకు నీటిమట్టం 10.50 అడుగులకు చేరింది. 8,20,677 క్యూసెక్కుల వరద నీటిని బ్యారేజీ 175 గేట్లు పూర్తిగా పైకెత్తి దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ వద్ద గురువారం ఉదయం వరద ఉద్ధృతి మరింత పెరిగి 10 లక్షల క్యూసెక్కులకు చేరుకోవచ్చని జలవనరులశాఖ అధికారులు తెలిపారు.

తక్షణమే పీఆర్‌సీ వేయండి

- ఉద్యోగ సంఘాల నేతల డిమాండ్

ఈనాడు, అమరావతి: వెంటనే పీఆర్సీ కమిషన్ వేయాలని, గత పీఆర్సీ బకాయిలతోపాటు, డీఏలు, ఇతర బకాయిలు వెంటనే చెల్లించాలని, మధ్యంతర భృతి మంజూరు చేయాలని ఉద్యోగ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. ఏ ఉద్యోగికి ప్రభుత్వం ఎంత బకాయి ఉందో స్పష్టంగా తెలియజేయాలని కోరారు. ఏపీ సివిల్ సర్వీసెస్ జాయింట్ స్టాఫ్ కౌన్సిల్‌లోని శాశ్వత సంఘాలతో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి విజయానంద్ అధ్యక్షతన బుధవారం సచివాలయంలో సమావేశం నిర్వహించారు. ఇందులో ఆయా శాఖల ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, 14 ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల నేతలు పాల్గొన్నారు. సీఎస్ విజయానంద్ మాట్లాడుతూ గతంలో ఉన్న 230 సమస్యల్లో 115 పరిష్కారం అయ్యాయని వివరించారు. ఉద్యోగుల సమస్యలన్నీ తెలుసుకొని నివేదిక ఇస్తే వాటిపై గురువారం జరిగే మంత్రివర్గ సమావేశంలో చర్చిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారని వివరించారు. పీఆర్సీ కమిషన్ నియామకం, డీఏలు, ఇతర బకాయిలకు చెందిన అంశాలన్నీ ఆయన దృష్టికి తీసుకెళ్లి, తగిన నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కూటమి ప్రభుత్వం వచ్చాక జరిగిన తొలి సమావేశం కావడంతో. . అనేక అంశాలపై సుదీర్ఘ చర్చ జరిగింది. అన్ని సంఘాల నేతలు సీఎస్‌కు, అధికారులకు తమ సమస్యలను వివరించారు. అంతకుముందు సచివాలయ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు వెంకట్రామిరెడ్డి.. ఈ సమావేశంలో పాల్గొనేందుకు రాగా, ఆయన్ను అనుమతించలేదు. తాను వివిధ కారణాలతో సస్పెండ్ అయ్యాయని, సంఘానికి అధ్యక్షునిగా కొనసాగుతున్నానని, దీనిపై కోర్టును ఆశ్రయిస్తానని ఆయన తెలిపారు.

30 శాతం ఐఆర్ ఇవ్వాలి

– విద్యాసాగర్, ఏపీ ఎన్జీవో అధ్యక్షుడు

ఉద్యోగులకు 30 శాతం ఐఆర్ ఇవ్వాలి. నాలుగు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయి. ప్రస్తుతానికి కనీసం ఒకటి ఇవ్వాలి. ఈహెచ్‌ఎస్ కార్డులు పనిచేయడంలేదు. ఉద్యోగులకు ఇన్సూరెన్స్ వర్తింపజేసి, రీఎంబర్స్‌మెంట్ ఇవ్వాలి. రిటైర్డ్ ఉద్యోగులకు గ్రాట్యుటీ వంటివి తక్షణమే విడుదల చేయాలి. బకాయిలు ఇవ్వకపోవడం వల్ల 14 నెలలుగా వారంతా ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు సీఎస్ దృష్టికి తీసుకెళ్లాం. 2004 సెప్టెంబరు 1లోపు నోటిఫికేషన్ ద్వారా నియమితులైన ఉద్యోగులకు ఓపీఎస్ వర్తింపజేయాలి. హెచ్‌వోడీ ఉద్యోగులకు రాజధాని ప్రాంతంలో ఇళ్ల స్థలాలు కేటాయించాలి. ఆర్టీసీ ఉద్యోగులకు పదోన్నతులు ఇవ్వాలని కోరాం.

బకాయి ఎంతో తెలియజేయాలి

– సూర్యనారాయణ, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేసరికి గత ఏడాది జూన్‌లో ఉద్యోగుల బకాయిలు రూ.22,000 కోట్లు ఉన్నట్లు చూపారు. ఇప్పుడది రూ.30,000 కోట్లకు చేరి ఉంటుంది. అసలు ఏ ఉద్యోగికి ఎంత బకాయి ఉందో సర్వీస్ రిజిస్టర్‌లో నమోదు చేయాలి. బకాయిలు ఎలా చెల్లిస్తారో కూడా స్పష్టత ఇవ్వాలి. ఆర్థికపరమైన అంశాలపై సీఎస్ ఎటువంటి హామీ ఇవ్వలేదు.

రీ-అపాయింట్‌మెంట్లతో ఉద్యోగులకు నష్టం

– బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఏపీ జేఏసీ అమరావతి అధ్యక్షుడు

రిటైర్ అయిన అధికారులు, ఉద్యోగులను అదే పోస్టుల్లో రీఅపాయింట్‌మెంట్ చేస్తున్నారు. అందువల్ల ఆయా విభాగాల ఉద్యోగులు పదోన్నతులు కోల్పోవాల్సి వస్తోంది. వీటిపై సమీక్ష చేయాలి. ప్రతి ఉద్యోగి, పింఛనరుకు ప్రభుత్వం ఎంత బకాయి ఉందో, వారి పే స్లిప్‌లో చూపించాలి. హెల్త్‌కార్డులు వ్యర్థమని చెప్పాం. నగదు రహిత చికిత్స కొనసాగించాలని, ఇన్సూరెన్స్ విధానంలోకి వెళ్లకూడదని కోరాం. రూ.10 వేల లోపు పింఛను తీసుకుంటున్న వారికి రేషన్ కార్డులిచ్చి, ప్రభుత్వ పథకాలు అందించాలి.

డిమాండ్లు పరిష్కరించాలని కోరాం

–హృదయరాజు, ఏపీటీఎఫ్ అధ్యక్షులు

ఉద్యోగుల న్యాయపరమైన డిమాండ్లు పరిష్కరించాలని కోరాం. బకాయిలన్నీ వెంటనే చెల్లించాలి. 13 లక్షలమంది ఉద్యోగులు ప్రభుత్వ సానుకూల నిర్ణయం కోసం ఎదురుచూస్తున్నారు. మా డిమాండ్లు పరిష్కరించకపోతే తగిన కార్యాచరణ చేపడతాం.

తపాలాశాఖ ఆధ్వర్యంలో విద్యార్థులకు రూ.6 వేలు

- 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్' కింద అందజేత

ఈనాడు డిజిటల్, హైదరాబాద్: విద్యార్థుల నుంచి తపాలాశాఖ.. 'దీన్ దయాళ్ స్పర్శ్ యోజన స్కాలర్‌షిప్- 2025-26'కు దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. ఆరు నుంచి తొమ్మిదో తరగతి చదివే విద్యార్థులు గురువారం నుంచి సెప్టెంబరు 13 వరకు దరఖాస్తు చేసుకోవచ్చు. చరిత్ర, క్రీడలు, సాంఘికశాస్త్రం, సామాన్యశాస్త్రం, జనరల్ నాలెడ్జ్, స్టాంపులు వంటి సబ్జెక్టుల్లో విద్యార్థుల ప్రతిభను పరీక్షిస్తారు. తపాలా బిళ్లల సేకరణ, అధ్యయనం (ఫిలాటలీ)తో కలిగే ప్రయోజనాలను విద్యార్థులకు వివరించేందుకు ఏటా తపాలాశాఖ ఈ పరీక్షలను నిర్వహిస్తోంది.

✦ ఈ స్కాలర్‌షిప్‌కు ఎంపిక ప్రక్రియ రెండు దశల్లో ఉంటుంది. ఒకటి ప్రిలిమినరీ పరీక్ష, రెండోది ప్రాజెక్టు వర్క్. ప్రిలిమినరీలో 50 ప్రశ్నలకు పరీక్ష నిర్వహిస్తారు. అర్హత సాధించినవారు 16 స్టాంపులతో 4 నుంచి 5 పేజీలకు మించకుండా ప్రాజెక్టు వర్క్ పూర్తి చేయాలి. అనంతరం సంబంధిత తపాలాశాఖ రీజినల్ ఆఫీసు చిరునామాకు తమ ప్రాజెక్టును పోస్టు ద్వారా సమర్పించాలి. రెండు దశల్లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులను విజయవాడ, హైదరాబాద్‌లోని తపాలాశాఖ సర్కిల్ కార్యాలయ అధికారులు ఎంపిక చేస్తారు.

✦ ఒక్కో తరగతి నుంచి 10 మంది విద్యార్థుల చొప్పున మొత్తం 40 మందిని ఎంపిక చేస్తారు. వారికి నెలకు రూ.500 చొప్పున ఏడాదికి ఒక్కొక్కరికి రూ.6 వేల స్కాలర్‌షిప్‌ను అందిస్తారు. దరఖాస్తు వివరాలకు www.indiapost.gov.in ను, దగ్గరలోని సూపరింటెండెంట్ కార్యాలయాన్ని సంప్రదించొచ్చు.





బస్సులో ప్రయాణిస్తున్న విద్యార్థినులు

పాఠశాల ప్రాంగణం లోపలికే వచ్చిన బస్సులో ఎక్కుతున్న విద్యార్థులు

సర్కారీ విద్యార్థులకు ప్రత్యేక బస్సులు

- చెన్నైలో అమలు చేస్తున్న తమిళనాడు సర్కారు
- 4.1 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం

ఈనాడు, చెన్నై: ప్రభుత్వ పాఠశాలకు రవాణా సదుపాయం లేక వాటిలో చదివే విద్యార్థులు పడే ఇబ్బందులు ఎన్నో! ఆర్టీసీ బస్సుల్లో లేదా ఆటోల్లో కిక్కిరిసి ప్రయాణించాల్సిన దుస్థితి. వారి అగచాట్లను గుర్తించిన తమిళనాడు ప్రభుత్వం చెన్నై మహా నగర పరిధిలోని సర్కారీ బడుల పిల్లల కోసం ఉచితంగా బస్సులు నడుపుతోంది. అవి ఉదయాన్నే సమీప కూడలికి వస్తాయి.. గంట కొట్టకముందే బడి లోపల దింపుతాయి. సాయంత్రం మళ్లీ విద్యార్థుల్ని ఇళ్లకు తీసుకెళ్తుంటాయి. పిల్లలు వాటిలో కూర్చుని హాయిగా కబుర్లు చెప్పుకొంటూ వెళ్తుంటారు. ఇదివరకు రద్దీ బస్సుల్లో నిల్చుని, బస్టాపుల్లో దిగి అక్కడి నుంచి నడుచుకుని వచ్చేసరికి డీలా పడిపోయేవారు. ఇప్పుడా పరిస్థితి లేదు. చెన్నై మహానగరంలోని ప్రభుత్వ, ఎయిడెడ్, కార్పొరేషన్ బడుల్లో చదివే పేద పిల్లల కోసం తొలి విడతగా ప్రభుత్వ, ఎయిడెడ్ బడుల కోసం 50, కార్పొరేషన్ బడుల కోసం 4 బస్సులు తిరుగుతున్నాయి. సుమారు 30 పాఠశాలల విద్యార్థులు వాటిని వినియోగించుకుంటున్నారు.

త్వరలో అన్ని బడులకూ..

చెన్నైలో బస్‌పాస్‌లు పొందిన విద్యార్థులు 4.1 లక్షలమంది ఉన్నారు. ప్రస్తుతం బాగా డిమాండ్ ఉన్న పాఠశాలలను ఎంపికచేసి బస్సులు నడుపుతున్నామని, భవిష్యత్తులో మిగిలిన పాఠశాలలకూ కేటాయిస్తామని మెట్రోపాలిటన్ ట్రాన్స్‌పోర్ట్ కార్పొరేషన్ ఎండీ టి.ప్రభుశంకర్ తెలిపారు. ఎల్‌కేజీ నుంచి ప్లస్ 2 దాకా చదివే విద్యార్థులు వీటిలో ప్రయాణిస్తున్నారు. ప్రతి బస్సులోనూ విద్యార్థుల భద్రత కోసం సీసీ కెమెరాలను, ప్రత్యేక సిబ్బందిని ఏర్పాటుచేశారు. చెన్నై మున్సిపల్ కార్పొరేషన్ కూడా కొన్ని బస్సులను ఉచితంగా నడుపుతోంది. దీనివల్ల ప్రభుత్వ బడుల్లో విద్యార్థుల శాతం కూడా పెరుగుతుందని ప్రభుత్వం భావిస్తోంది.

శ్రీశైలంలో తెరచుకున్న 10 గేట్లు



సున్నిపెంట సర్కిల్, న్యూస్‌టుడే: శ్రీశైలం జలాశయానికి జూరాల, సుంకేశుల, హంద్రీల నుంచి 4,73,016 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో జలాశయం 10 గేట్లను 18 అడుగుల మేర ఎత్తి 4,19,790 క్యూసెక్కులు, విద్యుత్తు కేంద్రాల ద్వారా 65,507 క్యూసెక్కుల ప్రవాహాన్ని నాగార్జునసాగర్‌కు వదులుతున్నారు. బుధవారం సాయంత్రం 6 గంటలకు జలాశయ నీటిమట్టం 881.80 అడుగుల వద్ద 197.91 టీఎంసీల నీటి నిల్వ నమోదైంది.

EENADU Vol: 52, Issue: 12 Printed and Published by M Nageswara Rao on behalf of Ushodaya Publications, a division of Ushodaya Enterprises Pvt Ltd. Printed and Published at Ushodaya Publications, Eenadu Press, Survey No. 239/3, 240/3B & 240/4, Gudavalli Village, Vijayawada Rural Mandal, NTR District - 521 104, Andhra Pradesh. Editor: M Nageswara Rao. Phones: 0866-2494900, 2862111. Regd. No. VJ/013/2024-26. RNI No.32238/1978. Air Surcharge Extra. Mumbai, Kolkata, Goa. Re. 1.00, Portblair Rs. 10.00. Founder Ramoji Rao



ఆదిపూజలు అందుకునే దేవుడు..
ఊరూవాడా కొలువై ఉండ్రాళ్లు స్వీకరించే బొజ్జగణపయ్య..
వ్యక్తిలో ధైర్యాన్ని, సమూహంలో స్ఫూర్తిని నింపే ఏకదంతుడు..
తన భక్తుల మొర ఆలకించి ఆశీర్వదించేందుకు ఈసారీ మండపాల్లోకి విచ్చేస్తున్నాడు!

గణపతి పూజతో విశేష ఫలాలు

వినాయకుడ్ని ఆరాధించి విశేష ఫలితాల్ని పొందిన ఉదంతాలు మన పురాణాల్లో కోకొల్లలు. కృష్ణుని సలహా మేరకు కుచేలుడు వినాయకవ్రతం చేసి దారిద్ర్యం నుంచి విముక్తుడయ్యాడని 'శ్రీకృష్ణ శమంతకమణి' వృత్తాంతం చెబుతోంది. అలాగే లంబోదరుడి పూజ మనల్ని అపనిందల బారిన పడకుండా కాపాడుతుందని ఆ కథ వివరిస్తుంది. వారధి కట్టేముందు శ్రీరాముడు విఘ్ననాథుని అర్చించి, రావణునిపై సునాయాసంగా విజయాన్ని సాధించాడని వినాయక వ్రతకథలో ఉంది. క్షీరసాగర మథనంలో దేవతలు అమృతం కోసం, వామనుడు బలిని జయించటం కోసం కూడా తొలుత ఆయననే పూజించారట. వనవాసం పూర్తయ్యాక పాండవులు వినాయకవ్రతం చేసి యుద్ధానికి వెళ్లినట్లు మహాభారతంలో కనిపిస్తుంది. శివభక్తుడైన రావణుడు శివుని ఆత్మలింగం పొందే ముందు వినాయకవ్రతం ఆచరించలేదట. అందుకే విఘ్నం వాటిల్లి దశకంఠుడి కోరిక నెరవేరలేదట. సృష్టి ఆరంభంలో బ్రహ్మదేవుడు, భూభారం తలదాల్చే ముందు ఆదిశేషుడు, రాక్షస సంహారానికి వెళ్లబోయే ముందు శ్రీమహావిష్ణువు విఘ్నేశ్వరుడిని పూజించారని పురాణాలు చెబుతున్నాయి. మహేశ్వరుడు, ఇంద్రుడు, జగదాంబ గణపతికి తొలిపూజలు చేశారన్నది ధార్మిక గ్రంథాల మాట.

మకరందం

makarandam@eenadu.in

మా చిరునామా: మకరందం, ఈనాడు ప్రధాన కార్యాలయం, రామోజీ ఫిలింసిటీ, హైదరాబాద్ - 501512

శరణమయ్యా శంకరతనయా..

గణపతి మంగళకరుడు. లోకాల్ని పీడించే దుష్ట రాక్షస శక్తుల్ని రూపుమాపేందుకు పార్వతీ పరమేశ్వరులు సంకల్పించి ఆయన్ను సృష్టించారు. దేహాన్ని తల్లి, శిరోభాగాన్ని తండ్రి ప్రసాదించగా అవతరించిన స్వామి గజాననుడు. ఆయన ప్రథమ ప్రమథ గణాధ్యక్షుడు. సద్గుణ గణాలకి అధిపతి గణపతి. విశ్వమంతటినీ ఆదేశించగల నాయకుడు. లోకంలో సామరస్య భావానికి అంకురార్పణ చేసినవాడు. ఆయన చైతన్య ప్రదాత, వేదవేద్యుడు, ప్రణవస్వరూపుడు. ఇచ్ఛాశక్తి, జ్ఞానశక్తి, క్రియాశక్తి స్వరూపుడు. వక్రతుండుడు సమస్త విద్యలకు, కళలకు ఆదిమూలమైన ఆచార్యుడు, అధినేత. భారత రచనలో వ్యాసభగవానుడు చెప్పే సంఘటనల్ని అర్థం చేసుకుంటూ ఘంటం ఆపకుండా గ్రంథాన్ని రాసిపెట్టిన ఘనత గణనాథుడిదే!



ఎన్నోనామాలు..

విఘ్నేశ్వరుడికి ఎన్నో పేర్లు. వినాయకుడు అంటే వేరొక నాయకుడు లేని సర్వస్వతంత్రుడు. గణపతి- శివ, ప్రమథ గణాలకు సర్వప్రధాని. గజముఖుడు - జ్ఞాన మోక్షాలిచ్చేవాడు. ఏకదంతుడు- అద్వైత సిద్ధాంతానికి ప్రతీక. ఆత్మే పరమాత్మ అని సూచించే నామం. లంబోదరుడు- బ్రహ్మాండమంత బొజ్జగలవాడు. హేరంబుడు- భక్తుల క్షేమాన్ని అభివృద్ధిని కోరేవాడు. అంతే కాదు ఆ రెండింటినీ ప్రసాదించేవాడు.

మోదకహస్తుడు- జ్ఞాన పరిపూర్ణుడు, జ్ఞానదాత. మూషికవాహనుడు- అజ్ఞాన చపలత్వాన్ని అణచేవాడు. ఇలా అనేక నామాలతో భక్తులను అనుగ్రహిస్తున్నాడు. వినాయకుని ఉపాసన సర్వ శక్తిప్రదం. పెద్ద తల జ్ఞానానికి ప్రతీక. తొండం సూక్ష్మగ్రాహ్యతకు చిహ్నం. పెద్ద చెవులు వైదిక శ్రవణాసక్తికి సాధనాలు. ఆయన మొలతాడు అంటే నాగబంధం కుండలినీ శక్తికి ఆలంబనం. ఏకదంతం విద్యాసాధనకూ, కవితా శిల్పానికి ప్రతిరూపం. అందుకే విశిష్ట జ్ఞానప్రదాత అయిన ఉమాసుతుడికి తొలిపూజ చేయటం సర్వ శ్రేయస్కరం, శుభప్రదమని భక్తులు నమ్ముతారు.

ఆగస్టు-27 వినాయకచవితి

గణపతి యజ్ఞోపవీతం - పాము, వాహనం - ఎలుక. పాము-ఎలుక సహజంగా శత్రువులు. కానీ గణపతి దగ్గర అవి వైరం లేకుండా గడుపుతున్నాయి. పతంజలి మహర్షి యోగసూత్రంలో సహజ వైరం ఉన్న ప్రాణులు ఏ దేవుని సన్నిధిలో వైరం లేకుండా ఉంటాయో ఆ దేవుణ్ని పూజించటం వల్ల యోగసిద్ధి కలుగుతుందని స్పష్టం చేశారు. అందుకే కార్యసిద్ధి, యోగ సిద్ధి, జ్ఞానసిద్ధి పొందాలంటే వినాయకుడిని శరణువేడాలి.

భారతీయులు జరిపే అన్ని పండుగల్లోనూ ప్రశస్తమైంది వినాయకచవితి. ఇది జీవ చైతన్యానికి, ఇచ్ఛా క్రియాశక్తుల సంయమనానికీ సంకేతమని తాత్వికులు వ్యాఖ్యానిస్తారు. భాద్రపద శుద్ధ చవితి వినాయకుడు ఆవిర్భవించిన పవిత్రదినం. అదే 'వినాయక చవితి'. ఆ రోజు పూజాపీఠం సిద్ధం చేసి, ప్రతిమను ప్రతిష్ఠించి, గణేశుని స్తుతించి 21 రకాల పత్రితో పూజించటం ఆనవాయితీ. విఘ్నపతికి ఇష్టమైన పదార్థాలు నివేదించడం, వ్రతకథ చదవడం సంప్రదాయం. గణపతి పూజ సులభం, ఫలం అధికమని భక్తుల విశ్వాసం.

– బి.సైదులు

చిలుక కృతజ్ఞత



స్కంధపురాణం కృతజ్ఞత ఆవశ్యకతను ప్రబోధిస్తూ ఒక అద్భుత కథను వివరించింది. పూర్వం బ్రహ్మదేవుడి ఉపదేశం మేరకు.. లక్ష్మీదేవి అనుగ్రహం కోసం ఇంద్రాది దేవతలు లోక సంచారం చేస్తూ, ఒక వనంలో ప్రవేశించారు. అక్కడ ఓ మహావృక్షం క్షీణదశలో ఉండటాన్ని గమనించారు. వారు ఆ చెట్టును పరిశీలిస్తుండగా ఒక పెద్ద తొర్ర కనిపించింది. అందులో చిక్కిశల్యమైన ఒక చిలుక ఉంది. వారు ఆ చిలుకను 'ఓ పక్షీ! ఈ వృక్షం ఫల పత్ర రహితంగా, ఎందుకూ పనికిరాని స్థితిలో ఉంది. అయినా నువ్వు ఇక్కడే నివసించడంలో ఆంతర్యం ఏమిట'ని ప్రశ్నించారు. అప్పుడా చిలుక 'ఓ దేవతలారా! ఇది ఓ గొప్ప వృక్షం. ఎంతోకాలంపాటు నాకు ఆశ్రయమిచ్చింది. దీని మధురఫలాలు తిని నేను ఆనందంగా జీవిస్తూ వచ్చాను. కాలధర్మాన్ని బట్టి ఈ చెట్టు నేడు క్షీణదశకు చేరింది. నాకు ఆశ్రయం ఇచ్చిన ఈ వృక్షాన్ని ఈ రోజు ఇలాంటి స్థితిలో వదలివెళ్లడం భావ్యం కాదు. అందుకే నేను ఈ స్థలాన్ని వీడి వెళ్లడం లేదు.' అని బదులు చెప్పింది. చిలుక ఇచ్చిన చక్కని సమాధానంతో సంతోషించిన ఇంద్రుడు దాన్ని ఒక వరం కోరుకోమన్నాడు. దాంతో చిలుక 'ఓ దేవేంద్రా! నాకు ఏ భోగాలపై, సౌఖ్యాలపై కోరిక లేదు. నాకెన్నో ఇచ్చిన ఈ వృక్షం రుణం తీర్చుకోవాలని ఉంది. ఇది బాగుంటే ఎందరికో ఆశ్రయం దొరుకుతుంది కనుక ఈ వృక్షాన్ని తిరిగి సజీవంగా మార్చండి.' అని కోరింది. ఆ మాటకు ఇంద్రుడు ముగ్ధుడై అలాగే కానిమ్మని వరం ప్రసాదించి, చిలుకను దీవించాడు.

అప్పుడే తెలిసేది

కాకః కృష్ణః పికః కృష్ణః కో భేధః పికకాకయో।
వసన్తసమయే ప్రాప్తే కాకః కాకః పికః పికః॥

భావం: కాకి నల్లగా ఉంటుంది. కోకిల కూడా నల్లగానే ఉంటుంది. అందువల్ల రంగును బట్టి వాటిని కనిపెట్టడం కష్టం. కానీ వసంత కాలం రాగానే కోకిల వీనులవిందుగా కూస్తుంది. అప్పుడే కాకి, కోకిలలను స్పష్టంగా గుర్తించవచ్చు. అదే విధంగా సందర్భం వచ్చినప్పుడు వ్యక్తుల అసలు స్వభావాలు బయటపడతాయి.

శుద్ధి, నియమం.. రుషిపంచమి

భాద్రపద శుక్లపంచమి రోజున చేసుకునే పండుగ రుషిపంచమి. ఈనెల 28వ తేదీన జరిగే ఈ పర్వదినానికి హిందూ సంప్రదాయంలో గొప్ప ప్రాముఖ్యం ఉంది. ఈ తిథిన సప్తరుషులైన కశ్యప, అత్రి, భరద్వాజ, విశ్వామిత్ర, గౌతమ, జమదగ్ని, వశిష్ఠులను తలచుకుంటారు. పాపనివారణకు చేయాల్సిన వ్రతాన్ని ఒక సందర్భంలో అగస్త్య మహర్షి సూచించారట. అదే క్రమేణా రుషిపంచమి వ్రతంగా మారిందని చెబుతారు. దీన్ని ముఖ్యంగా స్త్రీలు ఆచరిస్తారు. ఆరోజు తెల్లవారుజామున స్నానం చేసి, మట్టితో శరీరాన్ని శుద్ధి చేసుకొని, సప్తరుషులను పూజిస్తారు. తులసి, ద్రోణపుష్పం, పసుపు, కుంకుమతో అర్చించిన అనంతరం వ్రతకథ వినడం సంప్రదాయం. రుషిపంచమి మనకు శుద్ధి, నియమం, కృతజ్ఞత అనే భావనలను గుర్తుచేస్తుంది. మన జ్ఞాన సంపదకు పునాది వేసిన రుషుల పట్ల కృతజ్ఞత వ్యక్తం చేయడం ఈ పర్వదినం ప్రధాన ఉద్దేశం.

ఉపవాసం ఉద్దేశం

ఇష్టపూర్వకంగా చేసే ఉపవాసాలు ఇంద్రియ నిగ్రహానికి తోడ్పడతాయి. చాలామంది బయటికి ఉపవాసం చేస్తారే కానీ మనసును అదుపులో పెట్టుకోలేరు. ఉపవాసం పూర్తయిన తర్వాత ఏం తినాలో ఆలోచించుకుంటూ ఉంటారు. ఉపవాస సమయంలోనే ఆ పదార్థాల రుచులను తలచుకుంటూ ఆస్వాదిస్తుంటారు. మనసు ఆధీనంలో ఉన్నప్పుడే ఉపవాసాలు ఉపయోగపడతాయి. లేకపోతే అవి నిష్ఫలమవుతాయి. కోరికలన్నింటికీ మనసే మూలం. దాని నోటికి తాళం వేయకుండా ఎన్ని ఉపవాసాలు చేసినా ఫలితం ఉండదు. – సత్యశోధనలో మహాత్మాగాంధీ

అలాంటి వారు అరుదు

జేతవన విహారంలో ఒక భిక్షువుకి కాలాన్ని వృథా చేయడం అస్సలు నచ్చేది కాదు. ప్రతి రోజూ భిక్షకి వెళ్లడం వల్ల సమయం వృథా అవుతోందని అతడు భావించాడు. అందువల్ల ఒకే రోజు నాలుగైదు గ్రామాలు తిరిగి పెద్దమొత్తంలో ఆహారం తెచ్చుకునేవాడు. ఆ రోజుకు అతడికి కావాల్సినంత తిని, మిగిలింది ఎండబెట్టేవాడు. తర్వాతి రోజు దాన్ని నీటిలో నానబెట్టి తినేవాడు. తోటి భిక్షువులకు అతడి తీరు వింతగా తోచింది. ఆహారాన్ని అలా కూడబెట్టడం వారి నియమాలకు విరుద్ధం. అయితే, అప్పటికి బుద్ధుడు అలాంటి విధానం మీద నిషేధం విధించలేదు. దీంతో శిష్యులు విషయాన్ని బుద్ధుడికి తెలియజెప్పారు. తథాగతుడు ఆ భిక్షువు తీరును ఏమాత్రం తప్పుపట్టలేదు. 'అతడు లోభంతో ఆహారాన్ని దాచిపెట్టుకోవడం లేదు. మరింత సమయాన్ని మిగుల్చుకుని ధ్యానానికి వినియోగించాలన్న తలంపుతో అతడు అలా చేస్తున్నాడు. ఉద్దేశం మంచిదే అయినా, భిక్షువుగా ఉన్నవాడు ఆహారాన్ని కూడబెట్టడం సరికాదు. అందుకే, ఇకమీదట దాన్ని నిషేధిస్తూ నియమం పెట్టుకుందాం' అని చెప్పాడు. 'ఆకాశంలో ఎగిరే పక్షుల అడుగుజాడలు కనిపెట్టడం అసాధ్యం. అలాగే, కూడబెట్టే మనస్తత్వం లేనివారు, జిహ్వా చాపల్యాన్ని బట్టి కాకుండా ప్రాణాన్ని కాపాడుకోవడం కోసం ఆహారం తినేవారు, మోక్షం పట్ల ఎరుక ఉన్నవారిని లోకంలో గుర్తించడం చాలా కష్టం (అలాంటివారు అరుదని అంతరార్థం)' అని ఆ సమయంలో బుద్ధుడు బోధించాడు.



బుద్ధం శరణం

మన ఊరి పండుగ



గ్రామ దేవతలను, తమ జీవనాధారమైన వ్యవసాయానికి సహకరించే పశువులను పూజించే పర్వదినం పోలాల అమావాస్య. శ్రావణ శుద్ధ బహుళ అమావాస్యనే ఈ పేరుతో పిలుస్తారు. ఎక్కువగా గ్రామీణ ప్రాంతాల్లో ఆచరిస్తారు.


ఆగస్టు 23 పోలాల అమావాస్య

ఈ రోజున రైతులు ఎద్దులకు పూజ చేస్తారు, సాగు లేనివారు మట్టితో చేసిన ఎద్దు బొమ్మలను పూజిస్తారు. గ్రామీణ ప్రాంతాలకు చెందిన ప్రజలు 'పోలాంబ' అమ్మవారిని కొలుస్తారు. ఆమెకి ఇష్టమైన నైవేద్యాలతోపాటు చీర సారెలు సమర్పిస్తారు. ఇలా చేయడం వలన ఆ తల్లి అనుగ్రహం లభిస్తుందనీ, ఫలితంగా వర్షాలు సరిగ్గా కురిసి పంటలు పండుతాయని విశ్వసిస్తారు.

❖ పోలాల అమావాస్య వ్రతం ప్రత్యేకంగా సంతాన సంరక్షణ కోసం నిర్దేశించినట్టు పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇందుకోసం పూజచేసే చోట అలికి, వరిపిండితో ముగ్గువేసి ఒక కందమొక్కను, పసుపుకొమ్ము కట్టిన నాలుగు తోరాలను ఉంచాలి. ముందుగా వినాయకుని పూజించి ఆ తర్వాత ఆ కందమొక్కలోకి మంగళగౌరీ దేవినిగానీ, సంతాన లక్ష్మీ దేవినిగానీ ఆవాహన చేసి, షోడశోపచారాలు చేయాలి. తొమ్మిది పూర్ణం బూరెలు, తొమ్మిది రకాల కూరగాయలతో చేసిన పులుసు అమ్మకు నైవేద్యంగా సమర్పించాలి. ఆపైన బహు సంతానవతి అయిన పెద్ద ముత్తయిదువను పూజించి, కొత్తచీర, రవిక వస్త్రం పెట్టి, నైవేద్యం పెట్టని తొమ్మిది పూర్ణంబూరెలు, ఒక తోరాన్ని, వాయనంగా ఇవ్వాలి. ఆశీర్వాదం తీసుకోవాలి. ఒక తోరాన్ని కందమొక్కకు కట్టి, మరొకటి వ్రతం ఆచరించిన వారు మెడలో కట్టుకోవాలి. మిగిలిన తోరాన్ని తన ఆఖరు సంతానం మొలలో కట్టాలి. అలా చేస్తే సంతానం పదికాలాలు పచ్చగా ఉంటారని నమ్మకం.

నిజమైన స్నేహితుడు

మనమంతా సంఘజీవులం. కుటుంబం, స్నేహితులు లాంటి బంధాలు లేకుండా ఎవరి జీవితం పరిపూర్ణం కాదు. ఇస్లాం స్నేహాన్ని దైవికమైన వరంగా పరిగణిస్తుంది. ఆధ్యాత్మిక వృద్ధికి, సామాజిక శ్రేయస్సుకు సాధనంగా చూస్తుంది. నీతిమంతులు, నిజాయతీపరులు, విశ్వసనీయులైన స్నేహితులను ఎంచుకోవాలని సూచిస్తుంది. బలహీనమైన వ్యక్తిత్వం ఉన్నవారితో లేదా దుష్ప్రవర్తన కలిగిన వారితో సహవాసం ప్రతికూల ప్రభావాలకు దారితీయవచ్చని హెచ్చరిస్తుంది. 'ఒక వ్యక్తి తన సన్నిహితుడి విశ్వాసాలతో ప్రభావితమవుతాడు. కాబట్టి మీరు ఎవరితో స్నేహం చేస్తున్నారో పరిశీలించుకోండి' అని ప్రవక్త ముహమ్మద్ (స) సలహా ఇచ్చారు. నిజమైన స్నేహితులంటే దైవారాధనలో, ధర్మబద్ధమైన పనుల్లో పరస్పరం ప్రోత్సహించుకునేవారు, పాపం.. చెడు పనుల నుంచి దూరంగా ఉండటానికి సహాయం చేసుకునే వారై ఉండాలి. సరైన మార్గం చూపేవాడే స్నేహితుడు అని ఇస్లామిక్ ధర్మం చెబుతుంది.




ఇస్లాం సందేశం

చెకుముకి రాయిలా ఉంటేనే..



శ్రద్ధ, విశ్వాసాల ప్రాధాన్యం గురించి రామకృష్ణ పరమహంస ఇలా చెబుతారు.. ఒకణ్ని చంపాలనుకుంటే కత్తులు, ఇతర మారణాయుధాలు కావాలి. తనను తాను అంతం చేసుకోవాలంటే చిన్న సూది సరిపోతుంది. అలాగే పక్క వాళ్లకు బోధించాలంటే చాలా గ్రంథాలు చదవాల్సి ఉంటుంది. అదే తాను స్వయంగా భగవంతుడి సాక్షాత్కారం పొందాలంటే ఒక్క మంత్రంపై శ్రద్ధ వహిస్తే చాలు! ఒక రాయి చాలా ఏళ్లపాటు నీళ్లలో పడి ఉన్నా, ఒక్క చుక్క నీరు కూడా అందులోకి ప్రవేశించదు. కానీ, నీరు తగలగానే మట్టి మెత్తబడుతుంది. అదే విధంగా ఎన్ని కష్టాలు ఎదురైనా భగవంతుడు ఒడ్డున పడేస్తాడని గట్టిగా నమ్మే వ్యక్తి తనకు వచ్చిన బాధలకు ఎప్పుడూ కుంగిపోడు. ఆ విశ్వాసం లేని వ్యక్తి చిన్న బాధ కలగగానే బెంబేలెత్తిపోతాడు. చెకుముకి రాయి వందల ఏళ్లు నీటి అడుగున పడి ఉన్నా, దానిలోని అగ్ని అంతర్ధానం కాదు. నీటి నుంచి బయటికి తీసి ఆ రాయిని ఇనుముతో కొట్టిన వెంటనే నిప్పురవ్వలు విరజిమ్ముతుంది. అలాగే పరమాత్మపై విశ్వాసం ఉన్న వ్యక్తి ఎలాంటి చెడ్డ వ్యక్తుల మధ్యలో ఉన్నా తన భక్తి ప్రపత్తులను వదులుకోడని వ్యాఖ్యానించారు పరమహంస.

సిందూర హనుమ



ఒకనాడు ఆంజనేయస్వామి.. ఆశీర్వాదం కోసం సీతమ్మ తల్లి వద్దకు వచ్చాడు. సీతమ్మ పాదాలపై శిరస్సు ఉంచి నమస్కరించి తలపైకెత్తి చూడగా... ఎంతో ప్రకాశవంతమైన సీతమ్మ నుదిటిన కుంకుమను, పాపిడి మొదట్లో సిందూరం ఉండటాన్ని గమనించాడు. దాంతో హనుమ 'పాపిడిలో అలా సిందూరం ఎందుకు పెట్టుకున్నావు తల్లీ?' అని సీతాదేవిని అడిగాడు.

అప్పుడు సీతమ్మ 'నా నాథుడు శ్రీరామచంద్రుని క్షేమం కోసం పెట్టుకున్నాను, ఇలా నుదిటిన సిందూరం ధరిస్తే నా ప్రభువుకి రక్షణ కవచంలా ఉంటుంది, ఆయనకు ఏ కష్టం రాకుండా కాపాడుతుంది' అని చెప్పింది.

శ్రీరామునికి ప్రియమైన భక్తుడు హనుమ.. రాముని కోసం తన సర్వస్వం ధారపోసేవాడు. 'రామయ్య రక్ష కోసం సీతమ్మ తల్లి పాపిట సిందూరం ధరించింది, మరి నా దేహం అంతా రామమయమే కదా! నేనేమి చేయాలి' అనుకుని శరీరమంతా దట్టంగా సిందూరం పూసుకుని శ్రీరాముని వద్దకు వెళ్లి నమస్కరించాడు. హనుమంతుడి తీరు చూసి రామయ్య నవ్వుతూ 'ఇదంతా ఏమిటి హనుమా?' అని అడిగాడు. దానికి తానెందుకు అలా చేసిందీ వివరించాడు హనుమంతుడు. ఆ జవాబుకి ముచ్చటపడిన శ్రీరాముడు.. 'హనుమా! నా రక్షణ కోసం నువ్వు దేహమంతా సిందూరం రాసుకున్నావు కాబట్టి.. నిన్ను సిందూరంతో పూజించిన వారికి నేను రక్షగా నిలిచి ఉంటాను' అని వరమిచ్చాడు.

ముక్తినివ్వని వేషమెందుకు..



దేశ సంచారంలో భాగంగా నానక్ ఒకసారి తన శిష్యుడు మర్దానాతో కలిసి వారణాసి వెళ్లారు. అక్కడ చతురదాసు అనే పండితుడు 'నీ మెడలో తులసి మాల, చేతిలో జపమాల లేవు. నువ్వేం సాధువువి' అని నానక్‌ను గేలి చేశాడు. అప్పుడు ఆయన ఇలా బదులిచ్చారు.. 'ఓ పండితుడా! సత్ప్రవర్తన అనే తులసిమాలను ధరించి, మనసులో దైవానుగ్రహం కోసం ప్రార్థిస్తూ, భగవంతుడి ప్రేమ అనే నావను అధిరోహిస్తే జీవితానికి ముక్తి దొరుకుతుంది. అంతేతప్ప ప్రత్యేక వేషంతో మాత్రమే దైవ సాన్నిధ్యం సాధ్యం అనుకోవడం మూర్ఖత్వం' అన్నారు. అప్పుడు ఆ పండితుడు 'ఎప్పుడూ కామ క్రోధాలతో నిండిన మనసును ఎలా జయించాలి?' అని ప్రశ్నించాడు. దానికి నానక్... 'అది అసాధ్యమేమీ కాదు. అవి మనిషిని లొంగదీసుకోవడం కంటే, మానవుడే వాటిపై ఆధిపత్యం సాధించాలి.' అని చెప్పారు. అలాగే 'తెలుసుకోవడం వేరు. అర్థం చేసుకోవడం వేరు. మేధ ఉన్నంత మాత్రాన వివేకం అలవడదు. హృదయం పగ్గాలు లేని గుర్రం లాంటిది. అది చెడును నిరోధించలేదు. అందుకే ప్రతివారినీ ఆశ, కోరిక, రాగం, ద్వేషం పట్టి పీడిస్తుంటాయి. దైవంపై ధ్యాస నిలిపి వాటిని నిరోధించాలి. భక్తి అనే తాడుతో మనసును కట్టిపడేయాలి. మానవత్వాన్ని అలవరచుకోవాలి. ప్రాణులపై దయ కలిగి ఉండాలి' అని బోధించారు.

ఎలా జీవించాలి?



క్రీస్తువాణి

ఏసుని నమ్మిన వారు చనిపోతే వారి సమాధిపైన వాక్యాలు రాయడం సహజం. ఒక రోజు ఓ వ్యక్తి దారిలో వెళ్తుంటే కొన్ని సమాధులు కనిపించాయి. అతడు దేని మీద ఏ వాక్యం రాశారో చూద్దామని అనుకుని ముందుకు సాగాడు. ఒక్కొక్క సమాధిని చూసుకుంటూ, చదువుకుంటూ వెళ్తున్నాడు. ఒక దానిపై 'నేడు నేను - రేపు నువ్వు' అని రాసి ఉంది. అది చూసి ఆశ్చర్యపోయాడు. 'నిజమే కదా.. ఏదో ఒకరోజు నేనూ ఇక్కడికి చేరాల్సిన వాడినే. కానీ చేరేముందు నేను సాధించాల్సింది ఏమైనా ఉందా?' అనే ఆలోచనతో నడుస్తూ ఉండగా మరో సమాధి రాయి కనిపించింది. దానిపై 'క్షమాపణ పొందాను' అని రాసి ఉంది.

ఆ మాటలు ఆ వ్యక్తిని ఎంతో ప్రభావితం చేశాయి. 'అవును, నేడో రేపో నేనూ ఇక్కడికి రావాల్సిందే. వచ్చేముందు నేను సాధించాల్సింది చాలా ఉంది. నేను కూడా పాపాల నుంచి క్షమాపణ పొందాలి. విలువైన జీవితాన్ని ఇచ్చిన దేవుని మాటలు అనుసరిస్తూ బతకాలి. మనం భూమిపై పంచిన ప్రేమ, చేసిన సేవ అందరి హృదయాల్లో జ్ఞాపకాలుగా మిగిలిపోవాలి. నలుగురి కోసం జీవించాలి' అనుకుని మెరుగైన, ఉన్నతమైన జీవితం వైపు అడుగులు వేశాడు.

ఈనాడు బిజినెస్

గిగా ఫ్యాక్టరీపై మరో రూ.1200 కోట్ల పెట్టుబడి

అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ నిర్ణయం



ఈనాడు, హైదరాబాద్: అగ్రశ్రేణి బ్యాటరీ తయారీ సంస్థ అయిన అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ లిమిటెడ్ ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో గిగా ఫ్యాక్టరీపై రూ.1200 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. లిథియం సెల్ ప్రాజెక్టులో భాగంగా 1 గిగావాట్ సెల్ ఉత్పత్తి సామర్థ్యాన్ని సిద్ధం చేశారు. మలిదశలో 2 గిగావాట్ సెల్ దశ ఎల్ఎఫ్‌పీ సిలిండ్రికల్ సెల్స్ ఉత్పత్తి చేయాలనే ఆలోచన ఈ సంస్థకు ఉంది. దీనిపై ఇప్పటి వరకూ రూ.1,200 కోట్లు పెట్టుబడి పెట్టారు. ఇంకా రీసెర్చ్ ల్యాబ్, ప్లాంట్, గిగా ఫ్యాక్టరీని పూర్తి చేయటానికి మరో రూ.1,200 కోట్ల పెట్టుబడి అవసరమవుతుందని అంచనా. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఈ అదనపు పెట్టుబడి పెట్టనున్నట్లు అమరరాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ సీఎఫ్ఓ వై. ఢిల్లీ బాబు తెలిపారు. దీంతో గిగా ఫ్యాక్టరీపై పెట్టుబడి రూ.2,400 కోట్లకు చేరుతుంది. గిగా ఫ్యాక్టరీని తెలంగాణలోని దివిటిపల్లిలో నిర్మిస్తున్న విషయం విదితమే. ఆటోమోటివ్, స్టోరేజ్ విభాగాలకు అవసరమైన బ్యాటరీ ఉత్పత్తులను ఈ ఫ్యాక్టరీ అందిస్తుంది. దశల వారీగా 16 గిగావాట్ ఉత్పత్తి సామర్థ్యాన్ని ఇక్కడ సమకూర్చుకోవాలనేది ఈ సంస్థ యాజమాన్యం ఆలోచనగా ఉంది.

ముందుగా ఈ ప్లాంట్‌లో ఎన్ఎంసీ(నికెల్ మాంగనీస్ కోబాల్ట్) సెల్స్ ఉత్పత్తి చేస్తారు. వీటిని ప్రధానంగా ద్విచక్ర వాహనాల్లో వినియోగిస్తారు. బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ యూనిట్ ఒకటి తిరుపతిలో ఉండగా, దివిటిపల్లిలో మరొక బ్యాటరీ ప్యాక్ అసెంబ్లీ యూనిట్‌ను సిద్ధం చేసిన విషయం విదితమే. కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ (సీక్యూపీ), రీసెర్చ్ ల్యాబ్‌కు సంబంధించి యంత్ర పరికరాలు ఆర్డర్ చేశారు. రీసెర్చ్ ల్యాబ్ ఈ నెలాఖరునాటికి సిద్ధం అవుతుందని అంచనా. వచ్చే ఏడాది మార్చి నాటికి సీక్యూపీ పనిచేసే దశకు చేరుకుంటుందని భావిస్తున్నారు.

18 నెలల్లో 3 కొత్త మోడళ్లు

నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స



ఈనాడు, హైదరాబాద్: భారత రహదారులకు తగ్గట్లుగా వచ్చే 12-18 నెలల్లో మూడు కొత్త మోడళ్లను తీసుకురాబోతున్నట్లు నిస్సాన్ మోటార్ ఇండియా ఎండీ సౌరభ్ వత్స తెలిపారు. ఇందులో బీ-ఎంపీవీ, 5సీటర్ సీ-ఎస్‌యూవీలతోపాటు ఒకటి ఉంటాయని పేర్కొన్నారు. వీటితో భారత వినియోగదారుల విభిన్న అవసరాలను తీర్చనున్నామన్నారు. 'నిస్సాన్‌కు భారత్ కీలక మార్కెట్‌గా కొనసాగుతోంది. 2024-25లో 99,000 యూనిట్లకు పైగా విక్రయాలు సాధించామ'ని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో 7, తెలంగాణలో 17 టచ్‌పాయింట్లు ఉన్నాయని, వీటిని వ్యూహాత్మకంగా పెంచేందుకు ప్రయత్నిస్తున్నామని తెలిపారు. తెలుగు రాష్ట్రాల్లో మ్యాగ్నైట్‌కు మంచి ఆదరణ లభిస్తోందని పేర్కొన్నారు. 'దేశ వ్యాప్తంగా 283 టచ్ పాయింట్లను విస్తరించాం. ఈ ఏడాది కొత్తగా మరో 35-40 ఏర్పాటు చేయాలని ప్రణాళికలున్నాయి. ప్రస్తుతం భారత మార్కెట్లో విద్యుత్ కార్ల వాటా 2-2.5 శాతం వరకూ ఉంది. ఈ విభాగం అంతర్జాతీయ స్థాయి మంచి వృద్ధి చెందే అవకాశాలు కనిపిస్తున్నాయ'ని తెలిపారు. 'దేశీయంగా ఉత్పత్తి చేసిన విద్యుత్ ఎస్‌యూవీని సరైన సమయంలో విడుదల చేస్తాం. సమాంతరంగా ప్రత్యామ్నాయ ఇంధన పరిష్కారాల నిమిత్తం మాగ్నైట్ కోసం ప్రభుత్వం ఆమోదించిన సీఎన్‌జీ రిట్రోఫిట్‌మెంట్‌ను తీసుకొచ్చామని తెలిపారు. ఇది ఇప్పటికి 13 రాష్ట్రాల్లో అందుబాటులో ఉంది. త్వరలోనే మరిన్ని రాష్ట్రాలకు విస్తరించే ఆలోచన ఉందన్నారు.

హైదరాబాద్‌లో జీసీసీల జోరు

వరుస కడుతున్న అగ్రశ్రేణి విదేశీ కంపెనీలు



ఈనాడు, హైదరాబాద్: అగ్రశ్రేణి బహుళ జాతి కంపెనీలకు చెందిన జీసీసీ (గ్లోబల్ కేపబిలిటీ సెంటర్)లను ఆకర్షించటంలో హైదరాబాద్ జోరు కొనసాగుతోంది. రోజురోజుకీ కొత్త కంపెనీలు ఇక్కడ కొలువుదీరుతున్నాయి. ఇందులో ఆర్థిక సేవలు, జీవశాస్త్రాల విభాగానికి చెందిన కంపెనీలు ఎక్కువగా ఉండటం ప్రత్యేకత. గత కొద్ది వారాల్లోనే అమెరికా, ఆస్ట్రేలియా, ఐరోపా దేశాలకు చెందిన కంపెనీలు తమ జీసీసీలను ఇక్కడ ఏర్పాటు చేశాయి. యూఎస్‌కు చెందిన సంపద నిర్వహణ, ఆర్థిక సేవల సంస్థ అమెరిప్రైస్ ఫైనాన్షియల్, అమెరికాకే చెందిన డెయిరీ, పశుపోషక ఉత్పత్తుల సంస్థ లాండ్‌ఓలేక్స్, ఆటోమోటివ్ సర్వీసెస్ సంస్థ హాల్‌మ్యాన్ హైదరాబాద్‌లో తమ తమ జీసీసీలను ప్రారంభించాయి. ఆస్ట్రేలియాకు చెందిన ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ మెక్వారీ గ్రూపు, జర్మనీలోని ఫ్రాంక్‌ఫర్ట్ స్టాక్ ఎక్స్ఛేంజీని నిర్వహించే సంస్థ అయిన డాయిష్ బోర్స్ సైతం హైదరాబాద్‌లో జీసీసీ కేంద్రాలను ఇటీవల ఏర్పాటు చేశాయి.

ఆకర్షణ ఎందుకంటే..: జీవ శాస్త్రాలు, ఫార్మా రంగానికి చెందిన బహుళ జాతి కంపెనీలు ఇప్పటికే ఇక్కడ తమ కేంద్రాలను ఏర్పాటు చేశాయి. అగ్రగామి-10 ఫార్మా కంపెనీల్లో ఎనిమిది కంపెనీలు హైదరాబాద్‌లో జీసీసీలు నెలకొల్పాయి. ఇందులో ఎలీ లిల్లీ, నొవార్టిస్, బీఎంఎస్ (బ్రిస్టల్ మేయర్స్ స్క్విబ్), సనోఫి, రోష్, ఆమ్‌జెన్, బేయర్, ఎంఎస్‌డీ(మెర్క్) ఉన్నాయి. ఇవే కాకుండా హెల్త్‌కేర్ సేవల సంస్థ అయిన ఎవర్‌నార్త్, ప్రపంచంలోని అతిపెద్ద యానిమల్ హెల్త్ కంపెనీ అయిన జోటిస్ తమ పరిశోధనా కేంద్రాలను ఇక్కడ నిర్వహిస్తున్న విషయం గమనార్హం. స్థానికంగా ఫార్మా, బయోటెక్ పరిశ్రమ విస్తరించటం, ఐటీ- సైన్స్ తెలిసిన మానవ వనరుల లభ్యతను దృష్టిలో పెట్టుకొని ఆయా విభాగాలకు చెందిన కంపెనీలు జీసీసీలను ఏర్పాటు చేయటానికి హైదరాబాద్ నగరాన్ని ఎంచుకుంటున్నాయని పరిశ్రమ వర్గాలు స్పష్టం చేస్తున్నాయి. దీనికి తోడు రాష్ట్రప్రభుత్వం అందిస్తున్న తోడ్పాటు, ఎంతో మెరుగైన మౌలిక సదుపాయాలు కూడా దీనికి దోహదపడుతున్నాయి.

బెంగళూరుకు గట్టిపోటీ

రియల్ ఎస్టేట్ కన్సల్టింగ్ సేవల సంస్థ అయిన 'వెస్టియన్' తాజా నివేదిక ప్రకారం కొత్త జీసీసీలను ఆకర్షించటంలో బెంగళూరు నగరానికి హైదరాబాద్ గట్టి పోటీ ఇస్తోంది. ప్రస్తుతం మనదేశంలో 1700 జీసీసీలు ఉండగా, ఇందులో బెంగళూరులో 487 కేంద్రాలు, హైదరాబాద్‌లో 273 కేంద్రాలు ఏర్పాటయ్యాయి. చెన్నై, దిల్లీ ఎన్‌సీఆర్, ముంబయి నగరాలు తదుపరి స్థానాల్లో కనిపిస్తున్నాయి. మన దేశంలో 2028 నాటికి జీసీసీల సంఖ్య 2100కు పెరుగుతుందని అంచనా. ఇందులో కొత్తగా ఏర్పాటయ్యే కేంద్రాలను హైదరాబాద్ అధికంగా ఆకర్షిస్తుందని స్థానిక ప్రభుత్వ, పరిశ్రమ వర్గాలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నాయి.


మొక్కజొన్నలో కలుపు నివారణకు అశితాకా



ఈనాడు, హైదరాబాద్: మొక్కజొన్నలో గడ్డి, ఆకుజాతి కలుపు మొక్కల నివారణ కోసం గోద్రెజ్ అగ్రోవెట్ కొత్తగా 'అశితాకా'ను ఆవిష్కరించింది. ఐఎస్‌కే జపాన్‌తో కలిసి దీన్ని దేశీయంగా అందుబాటులోకి తెస్తున్నట్లు సంస్థ క్రాప్ ప్రొటెక్షన్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్‌కే వెల్లడించారు. మొక్కజొన్న సాగు విస్తీర్ణం పరంగా భారత్ నాలుగో స్థానంలో ఉందన్నారు. కలుపును నివారించి, పంట దిగుబడిని పెంచేందుకు వీలుగా ఈ సరికొత్త ఉత్పత్తిని తీసుకొచ్చినట్లు పేర్కొన్నారు. ఎకరాకు 50 మిల్లీలీటర్ల అశితాకా సరిపోతుందన్నారు. దీని ఖరీదు రూ.1800 అని తెలిపారు. కలుపు 2-4 ఆకుల దశలో ఉన్నప్పుడు ఇది మంచి పనితీరు చూపిస్తుందన్నారు. అక్టోబరు నుంచి ఇది తెలుగు రాష్ట్రాల్లోని డీలర్ల వద్ద అందుబాటులో ఉంటుందని పేర్కొన్నారు.

బీమా పాలసీలపై జీఎస్‌టీ మినహాయింపు!

- ప్రతిపాదించిన కేంద్రం
- నివేదిక సమర్పించనున్న జీఓఎం



దిల్లీ: వ్యక్తిగత జీవిత, ఆరోగ్య బీమా పాలసీలను వస్తు, సేవల పన్ను (జీఎస్‌టీ) నుంచి మినహాయించాలని కేంద్రం ప్రతిపాదించిందని బీమా అంశాలపై ఏర్పాటు చేసిన మంత్రుల బృందం (జీఓఎం) కన్వీనర్, బిహార్ ఉప ముఖ్యమంత్రి సమ్రాట్ చౌదరి తెలిపారు. ప్రస్తుతం జీవిత, ఆరోగ్య బీమా ప్రీమియాలపై 18 శాతం జీఎస్‌టీ ఉంది. దీనిపై ఏర్పాటైన మంత్రుల బృందం తన నివేదికను జీఎస్‌టీ మండలికి సమర్పించనుంది. సభ్యులందరూ బీమా పాలసీలపై జీఎస్‌టీ రేట్లను తగ్గించేందుకు ఆమోదం తెలిపారు. కొన్ని రాష్ట్రాలు తమ అభిప్రాయాలను తెలియజేశాయని చౌదరి తెలిపారు. కొంతమంది వ్యక్తం చేసిన అభిప్రాయాలు, ఆందోళనలూ నివేదికలో ఉన్నాయని తెలిపారు. వ్యక్తిగత బీమా పాలసీలను జీఎస్‌టీ నుంచి మినహాయించాలని కేంద్రం ప్రతిపాదన స్పష్టంగా ఉంది. దీనిపై మంత్రుల బృందం విపరంగా చర్చించిందని చౌదరి జీఓఎం సమావేశం అనంతరం తెలిపారు. తుది నిర్ణయం జీఎస్‌టీ కౌన్సిల్ తీసుకుంటుందని వివరించారు. బీమా జీఓఎంలో 13 మంది సభ్యులున్నారు.

ప్రయోజనం పాలసీదారులకు చేరాలి: మల్లు భట్టి విక్రమార్క: 'బీమా పాలసీలపై జీఎస్‌టీని మినహాయించాలని లేదా తగ్గించాలని అన్ని రాష్ట్రాలూ కోరుతున్నాయి. దీనివల్ల ప్రభుత్వం దాదాపు రూ.9,700 కోట్ల వరకూ ఆదాయం కోల్పోతుందని అంచనా. ఈ నేపథ్యంలో బీమా పాలసీలపై జీఎస్‌టీ తగ్గింపు ప్రయోజనాలు కంపెనీలకు కాకుండా పాలసీదారులకు చేరేలా ఒక ప్రత్యేక యంత్రాంగాన్ని రూపొందించాల్సిన అవసరం ఉందని స్పష్టం చేశాం' అని జీఓఎం సభ్యుడైన తెలంగాణ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క తెలిపారు. జీఎస్‌టీ కౌన్సిల్ దీనిపై నిర్ణయం తీసుకుంటుందని పేర్కొన్నారు.

ఇన్ఫీ ఉద్యోగులకు సగటున 80% బోనస్ చెల్లింపు!



దిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి త్రైమాసికానికి అర్హులైన ఉద్యోగులకు పనితీరు ఆధారిత బోనస్‌ను ఐటీ సేవల దిగ్గజం ఇన్ఫోసిస్ చెల్లించినట్లు తెలుస్తోంది. సరాసరిన ఈ బోనస్ చెల్లింపు 80 శాతంగా ఉందని ఓ ఆంగ్ల వార్తా సంస్థ తన కథనంలో వెల్లడించింది. ఏప్రిల్-జూన్ త్రైమాసికానికి ఆకర్షణీయ ఫలితాలను ప్రకటించిన నేపథ్యంలో ఉద్యోగులకు ఈ బోనస్ చెల్లింపును చేయడం గమనార్హం. పీఎల్4 ఉద్యోగులకు 80-89%, పీఎల్5 ఉద్యోగులకు 78-87%, పీఎల్6కు 75-85% శ్రేణిలో బోనస్‌ను ఇన్ఫోసిస్ చెల్లించినట్లుగా తెలుస్తోంది.

2% మంది పైనే ఉద్యోగాల కోత ప్రభావం. . టీసీఎస్ : టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టీసీఎస్) ఇటీవలి ఉద్యోగాల కోత నిర్ణయంతో సుమారు 30,000 మంది ఉద్యోగులపై ప్రభావం పడిందంటూ ఐటీ, ఐటీ ఆధారిత సేవల ఉద్యోగుల సంఘం (యూఎన్ఐటీఈ) చేస్తున్న ఆరోపణలను టీసీఎస్ ఖండించింది. ప్రపంచవ్యాప్తంగా తమ మొత్తం సిబ్బందిలో కేవలం 2 శాతం లేదా సుమారు 12,000 మంది పైనే ఉద్యోగాల కోత ప్రభావం పడిందని స్పష్టం చేసింది.

యూఎస్ మార్కెట్‌కు నాట్కో ఔషధం

ఈనాడు, హైదరాబాద్: ఊపిరితిత్తుల్లో అధిక రక్తపోటును అదుపు చేయటానికి వినియోగించే బొసెంటాన్ 32 ఎంజీ ట్యాబ్లెట్‌ను యూఎస్ మార్కెట్లో నాట్కో ఫార్మా విడుదల చేసింది. ఈ మందును 180 రోజుల 'మార్కెట్ ఎక్స్‌క్లూజివిటీ' హోదాలో విడుదల చేసినట్లు నాట్కో ఫార్మా వెల్లడించింది. నాట్కో ఫార్మా తరఫున యూఎస్‌లో లుపిన్ ఈ మందును విక్రయిస్తుంది. అక్టెలియన్ ఫార్మాసూటికల్స్ యూఎస్ ఇంక్., అనే కంపెనీకి చెందిన ట్రాక్లీర్ బ్రాండు ట్యాబ్లెట్‌కు ఇది జనరిక్ ఔషధం.

పటిష్ఠ స్థితిలోనే ఆర్థిక వ్యవస్థ

టారిఫ్ అనిశ్చితుల ప్రభావాన్ని గమనించాలి: ఆర్‌బీఐ గవర్నరు

ముంబయి: అమెరికా టారిఫ్ అనిశ్చితులు కొనసాగుతున్నందున ఎప్పటికప్పుడు పరిస్థితులను గమనిస్తూ పరపతి విధాన నిర్ణయాలు తీసుకోవాల్సి ఉంటుందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) గవర్నరు సంజయ్ మల్హోత్రా అన్నారు. ప్రస్తుతమైతే భారత ఆర్థిక వ్యవస్థ బలంగా, స్థిరత్వంతో, అవకాశాలతో కనిపిస్తోందన్నారు. బుధవారం ఆర్‌బీఐ విడుదలైన విధాన కమిటీ (ఎంపీసీ) సమావేశ వివరాలు పై విషయాన్ని చెబుతున్నాయి. ఆగస్టు 4-6 వరకు ఆర్‌బీఐ ఎంపీసీ సమావేశం జరిగిన సంగతి తెలిసిందే. 'పటిష్ఠ మూలాలు, వృద్ధి ఆధారిత విధానాలు, దూరదృష్టితో కూడిన వ్యూహాల వల్ల భారత్ బలమైన స్థితిలో ఉన్న విషయం స్పష్టం అవుతోంద'ని మల్హోత్రా అన్నారు. వృద్ధిలో స్థిరత్వం కొనసాగుతుండగా.. ద్రవ్యోల్బణం మరింత కిందకు దిగివచ్చిందని అన్నారు. 'సమీపకాలంలో ద్రవ్యోల్బణం నియంత్రిత లక్ష్యం కంటే కూడా కిందకు రావొచ్చని అనుకుంటున్నాం. మూడో త్రైమాసికం నుంచి ద్రవ్యోల్బణం పెరగడం ప్రారంభం కావొచ్చు' అని ఆయన వ్యాఖ్యానించినట్లు ఎంపీసీ సమావేశ ముఖ్యాంశాల ఆధారంగా తెలుస్తోంది.

కోడి గుడ్డు

21న ఫారం వద్ద రైతు అమ్మకం ధరలు (నెక్) (100కు రూపాయలలో)

హైదరాబాద్	495
వరంగల్	497
విజయవాడ	525
గోదావరి	520
విశాఖపట్నం	520
చిత్తూరు	553

నెమ్మదించిన కీలక రంగాల వృద్ధి



దిల్లీ: జులైలో ఎనిమిది కీలక రంగాల వృద్ధి నెమ్మదించింది. కిందటేడాది జులైలో ఈ రంగాల్లో మొత్తంగా 6.3 శాతం వృద్ధి నమోదు కాగా.. ఈ ఏడాది జులైలో 2 శాతానికి పరిమితమైంది. జూన్‌లోని 2.2 శాతంతో పోలిస్తే కూడా తగ్గింది. ముఖ్యంగా బొగ్గు, ముడి చమురు, సహజవాయువు, శుద్ధి ఉత్పత్తుల రంగాల్లో ఉత్పత్తి తగ్గడమే ఇందుకు కారణమైంది. ప్రభుత్వం విడుదల చేసిన వివరాల ప్రకారం..

✦ జులైలో ఎరువుల రంగంలో 2 శాతానికి, విద్యుత్ రంగంలో 0.5 శాతానికి ఉత్పత్తి వృద్ధి తగ్గింది. కిందటేడాది ఇదే నెలలో ఈ రెండు రంగాల ఉత్పత్తిలో వరుసగా 5.3%, 7.9 శాతం వృద్ధి ఉంది.

✦ ఉక్కు రంగ ఉత్పత్తి 12.8%; సిమెంటు ఉత్పత్తి 11.7 శాతం మేర పెరిగింది.

✦ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఏప్రిల్- జులై కాలానికి కూడా కీలక రంగాల వృద్ధి 1.6 శాతానికి తగ్గింది. కిందటేడాది ఇదే సమయంలో ఈ రంగాల్లో 6.3 శాతం వృద్ధి ఉంది.

దక్షిణాఫ్రికా విపణిలోకి టాటా మోటార్స్ మళ్లీ ప్రవేశం

దిల్లీ: దక్షిణాఫ్రికా ప్రయాణికుల వాహన విపణిలోకి మరోసారి ప్రవేశిస్తున్నట్లు టాటా మోటార్స్ బుధవారం వెల్లడించింది. అనుబంధ సంస్థ టాటా మోటార్స్ ప్యాసింజర్ వెహికల్స్ (టీఎంపీవీ) ద్వారా అక్కడ హ్యారియర్, కర్వ్, పంచ్, టియాగో మోడళ్లను విడుదల చేసింది. దక్షిణాఫ్రికాకు చెందిన వాహన గ్రూప్ మోటస్ హోల్డింగ్స్‌తో కలిసి వ్యూహాత్మకంగా ఈసారి అక్కడి మార్కెట్లోకి ప్రవేశించినట్లు టాటా మోటార్స్ తెలిపింది. దక్షిణాఫ్రికా వ్యాప్తంగా 40 డీలర్‌షిప్‌ల నెట్‌వర్క్‌ను టీఎంపీవీ నిర్వహించనుంది. అక్కడ వినియోగదార్ల నుంచి బలమైన మద్దతుతో 2026 నాటికి వీటిని 60కు పెంచనున్నట్లు కంపెనీ వెల్లడించింది.

అరుదైన వ్యాధులకు 4 కొత్త ఔషధాలు

నీతి ఆయోగ్ సభ్యుడు వీకే పాల్

దిల్లీ: అరుదైన వ్యాధులకు 4 కొత్త మందులు త్వరలో రాబోతున్నాయని నీతి ఆయోగ్ సభ్యుడు (ఆరోగ్య విభాగం) వీకే పాల్ వెల్లడించారు. 7 అనారోగ్యాలకు 5 మందులు ఇప్పటికే మార్కెట్లోకి వచ్చాయని తెలిపారు. ఇవి రోగుల బాధలను తగ్గిస్తాయని పేర్కొన్నారు. స్థానిక కంపెనీలు ఉత్పత్తి చేస్తున్న జనరిక్ మందులు అరుదైన వ్యాధులతో బాధపడేవారికి అపారమైన పొదుపును అందించాయని వివరించారు. ప్రస్తుతం సెంట్రల్ టెక్నికల్ కమిటీ ఫర్ రేర్ డిసీజెస్ (సీటీసీఆర్‌డీ) సిఫారసు మేరకు 63 అరుదైన వ్యాధులను జాతీయ అరుదైన వ్యాధుల విధానం కింద చేర్చారు. వీటిలో 7 వ్యాధులకు సంబంధించి, గణనీయమైన పురోగతి సాధించామని పాల్ తెలిపారు. వీటిలో తలసీమియా, విల్సన్స్ వ్యాధి, సిస్టిక్ ఫైబ్రోసిస్ ఉన్నాయి. ఇప్పుడు మార్కెట్‌లో వీటి కోసం 5 మందులు అందుబాటులో ఉన్నాయి. మరో 4 మందులు అందుబాటులోకి రానున్నాయి. నీతి ఆయోగ్ 2023లో 13 వ్యాధులను ప్రాధాన్యత జాబితాలో చేర్చింది.

ఆన్‌లైన్ గేమింగ్‌తో ఏటా రూ.20,000 కోట్ల నష్టం

45 కోట్ల మంది పోగొట్టుకుంటున్నారు: ప్రభుత్వ అంచనా

దిల్లీ: ఆన్‌లైన్ రియల్ మనీ గేమింగ్‌లో ప్రతి ఏడాదీ 45 కోట్ల మంది ప్రజలు దాదాపు రూ.20,000 కోట్లు పోగొట్టుకుంటున్నట్లు ప్రభుత్వం అంచనా వేసిందని అధికార వర్గాలు వెల్లడించాయి. సమాజానికి ఆన్‌లైన్ రియల్ మనీ గేమింగ్ పెద్ద సమస్యగా మారిందని ప్రభుత్వం గుర్తించిందని, దీంతో ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని.. ఆదాయాన్ని వదులుకునేందుకు సిద్ధమైనట్లు తెలిపాయి.

ఇక నుంచైనా దిగుమతులు తగ్గించాలి

- 100 బి. డాలర్లకు చేరిన వాణిజ్య లోటు
- దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచాలి
- ఆ దేశం ఎగుమతి ఆంక్షలు సడలించడం మంచిదే: జీటీఆర్ఐ



దిల్లీ: భారత్‌కు అరుదైన ఖనిజాలు, ఎరువుల ఎగుమతులపై ఆంక్షలను సడలించేందుకు చైనా నిర్ణయించడం.. సానుకూల పరిణామమేనని గ్లోబల్ ట్రేడ్ రీసెర్చ్ ఇనీషియేటివ్ (జీటీఆర్ఐ) తెలిపింది. అయితే చైనాపై ఆధారపడటాన్ని తగ్గించుకోవడంపై భారత్ దృష్టి సారించాల్సిన అవసరం కూడా ఉందని పేర్కొంది. చైనాతో 100 బిలియన్ డాలర్ల వాణిజ్య లోటును భారత్ కలిగి ఉండటం ఆందోళనకర పరిస్థితికి సంకేతమని తెలిపింది. 2014 నుంచి 2024 మధ్య భారత్ దిగుమతుల్లో చైనా పాత్ర మరింత పెరిగిందని గుర్తుచేసింది. దేశీయ తయారీదార్ల ప్రయోజనాలను పరిరక్షించాలంటే.. .. చైనా నుంచి దిగుమతులను తగ్గించుకోవడమే కాకుండా తయారీపై మరింతగా పెట్టుబడులు పెట్టాల్సిన అవసరం ఉందని జీటీఆర్ఐ వ్యవస్థాపకుడు అజయ్ శ్రీవాస్తవ తెలిపారు. 'చైనాకు భారత్ ఎగుమతులు తగ్గుతుండటం వల్లే వాణిజ్య లోటు భారీగా పెరిగేందుకు కారణం. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యంలో భారత్ వాటా రెండు దశాబ్దాల క్రితం 42.3 శాతం కాగా.. ప్రస్తుతం 11.2 శాతానికి తగ్గింది. దీని వల్ల భారత్‌కు భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల ముప్పు అవకాశాలు పెరుగుతాయి. అందువల్ల తక్షణ కర్తవ్యంగా దేశీయ ఉత్పత్తి సామర్థ్యాన్ని పెంచుకోవడంపై దృష్టి పెట్టాల'ని ఆయన వెల్లడించారు.

✦ భారత టెలికాం, ఎలక్ట్రానిక్స్ దిగుమతుల్లో చైనా వాటా 57.2 శాతానికి చేరగా.. యంత్రాలు, హార్డ్‌వేర్‌ల విభాగంలో 44%, రసాయనాలు, ఔషధాల విభాగంలో 28.3 శాతం దిగుమతులు చైనా నుంచే భారత్‌కు వస్తున్నాయి.

చైనా నుంచి భారత్‌కు ఆయా ఉత్పత్తుల దిగుమతులు

ఉత్పత్తులు	దిగుమతి విలువ (మి.డాలర్లలో)	చైనా వాటా (%లో)
ఎరిత్రోమైసిన్	166.3	97.7
సిలికాన్ వేఫర్స్	151.60	96.8
ఫ్లాట్ ప్యానెల్ తెరలు	1060	86
ల్యాప్‌టాప్‌లు,ట్యాబ్లెట్లు	4450	80.5
కంప్యూటర్ మానిటర్‌లు	376.50	66.8
స్మార్ట్‌ఫోన్లు	259.70	58.8
స్మార్ట్‌ఫోన్ విడిభాగాలు	763.80	55.4
ప్రింటెడ్ సర్క్యూట్ బోర్డులు	612.20	37–40.5
మెమొరీ చిప్స్	1750	
మైక్రోప్రాసెసర్‌లు	1650	

రూ.168 లక్షల కోట్లకు రిటెయిల్ రంగం

- 2030 నాటికి చేరొచ్చు
- హైదరాబాద్, బెంగళూరుల్లో రిటెయిల్ స్థలాలకు గిరాకీ: డెలాయిట్-ఫిక్కీ



దిల్లీ: దేశీయ రిటెయిల్ రంగం 2030 నాటికి రెట్టింపు అయ్యే అవకాశం ఉందని డెలాయిట్-ఫిక్కీ నివేదిక వెల్లడించింది. ఇక్కడ నుంచి వార్షికంగా 10 శాతం సమ్మిళిత వృద్ధితో 1.93 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.168 లక్షల కోట్ల)కు చేరొచ్చని అంచనా వేసింది. హైదరాబాద్, బెంగళూరు వంటి నగరాలు మొత్తం రిటెయిల్ స్థలాల్లో గతేడాది 60 శాతం వాటా కలిగి ఉన్నాయని పేర్కొంది. ప్రపంచ వాణిజ్య అస్థిరత పరిస్థితుల్లోనూ రాణిస్తున్న గృహ విపణితో రిటెయిల్ రంగం ఊపందుకుంటుందని విశ్లేషించింది. నివేదిక ప్రకారం..

✦ పట్టణ, అభివృద్ధి చెందుతున్న విపణుల్లో డిజిటల్ స్వీకరణ, ప్రీమియమైజేషన్, ఇ-కామర్స్ వేగవంత వృద్ధితో పాటు బలమైన దేశీయ వినియోగం ద్వారా దేశ రిటెయిల్ రంగంతో పాటు వినియోగదార్ల ధోరణిలో మార్పు కనిపిస్తోంది.

✦ 'స్పాటింగ్ ఇండియాస్ ప్రైమ్ ఇన్నోవేషన్ మూమెంట్' నివేదిక ప్రకారం, 2024లో భారతదేశ రిటెయిల్ రంగం విలువ 1.06 లక్షల కోట్ల డాలర్ల (సుమారు రూ.92 లక్షల కోట్ల)కు చేరింది. జెన్ జెడ్‌ల వ్యయాలే 250 బిలియన్ డాలర్లు (సుమారు రూ.21.75 లక్షల కోట్లు)గా నమోదయ్యాయి.

✦ మాల్స్, హై-స్ట్రీట్ స్థలాలు అనుభవ కేంద్రాలుగా అభివృద్ధి చెందుతున్నాయి. బెంగళూరు, హైదరాబాద్ వంటి నగరాలు 2024లో మొత్తం రిటెయిల్ స్థలాల శోషణలో 60 శాతం వాటాను కలిగి ఉన్నాయి.

పతంజలికి ఏఈఓ టైర్-2 ధ్రువపత్రం

హైదరాబాద్: అంతర్జాతీయ స్థాయిలో ఉన్నత ప్రమాణాలతో వ్యాపారం నిర్వహిస్తున్నందుకుగాను పతంజలి ఫుడ్స్ లిమిటెడ్‌కు ఏఈఓ (ఆథరైజ్డ్ ఎకనామిక్ ఆపరేటర్) టైర్-2 ధ్రువపత్రం లభించింది. వరల్డ్ కస్టమ్స్ ఆర్గనైజేషన్ (డబ్ల్యూసీఓ), భారత ఆర్థిక మంత్రిత్వ శాఖ- కస్టమ్స్ నుంచి ఈ ధ్రువపత్రాన్ని అందుకున్నట్లు సంస్థ తెలిపింది. దేశంలోని అగ్రశ్రేణి కంపెనీల్లో కొన్నిటికి మాత్రమే ఈ సర్టిఫికెట్ ఉందని పేర్కొంది. దీంతో 28 రకాల అంతర్జాతీయ వాణిజ్య ప్రయోజనాలు అందుతాయని తెలిపింది. డైరెక్ట్ పోర్ట్ డెలివరీ (డీపీడీ), 24×7 క్లియరెన్స్ సౌలభ్యంలాంటివి ఇందులో కొన్ని. వ్యాపార రంగం, ఉద్యోగాల సృష్టిలో పతంజలి ఎంతో వేగంగా ముందుకు సాగుతోందని ఈ సందర్భంగా బాబా రామ్‌దేవ్ పేర్కొన్నారు. ఈ ధ్రువపత్రం తమకు దక్కిన గౌరవంగా పేర్కొన్నారు.

మళ్లీ 25,000 పైకి నిఫ్టీ

ఎఫ్ఐఐ విక్రయాలు: రూ.1100 కోట్లు
డీఐఐ కొనుగోళ్లు: రూ.1,806 కోట్లు

సెన్సెక్స్ ▲ 213	నిఫ్టీ ▲ 70
81858	25051



సూచీల లాభాల జోరు వరుసగా అయిదో రోజుకు చేరింది. ఐటీ, ఎఫ్ఎంసీజీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించడంతో నిఫ్టీ మళ్లీ 25,000 పాయింట్ల ఎగువకు చేరింది. డాలర్‌తో పోలిస్తే రూపాయి 6 పైసలు పెరిగి 87.07 వద్ద ముగిసింది. బ్యారెల్ ముడిచమురు 1.14% లాభంతో 66.54 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. ఆసియా మార్కెట్లలో కొరియా, టోక్యో నష్టపోగా.. షాంఘై, హాంకాంగ్ లాభపడ్డాయి.

✦ బీఎస్‌ఈలోని నమోదిత సంస్థల మొత్తం మార్కెట్ విలువ బుధవారం రూ.1.77 లక్షల కోట్లు పెరిగి రూ.456.17 లక్షల కోట్లు (5.24 లక్షల కోట్ల డాలర్లు)గా నమోదైంది.

✦ సెన్సెక్స్ ఉదయం 27 పాయింట్ల (క్రితం ముగింపు 81,644.39) లాభంతో 81,671.47 పాయింట్ల వద్ద ప్రారంభమైంది. ఆరంభ ట్రేడింగ్‌లో తడబడిన సూచీ, 81,494.50 వద్ద కనిష్ఠాన్ని తాకింది. అనంతరం బలంగా పుంజుకుని లాభాల్లోకి వచ్చిన సెన్సెక్స్, 81,985.62 వద్ద గరిష్ఠానికి చేరింది. చివరకు 213.45 పాయింట్ల లాభంతో 81,857.84 వద్ద ముగిసింది. నిఫ్టీ 69.90 పాయింట్లు పెరిగి 25,050.55 దగ్గర స్థిరపడింది. ఇంట్రాడేలో ఈ సూచీ 24,929.70- 25,088.70 పాయింట్ల మధ్య కదలాడింది.

✦ సెన్సెక్స్ 30 షేర్లలో 15 లాభాలు నమోదుచేశాయి. ఇన్ఫోసిస్ 3.88%, టీసీఎస్ 2.69%, హెచ్‌యూఎల్ 2.48%, ఎన్‌టీపీసీ 2.10%, టాటా స్టీల్ 1.79%, టెక్ మహీంద్రా 1.76%, ఎటెర్నల్ 1.57%, హెచ్‌సీఎల్ టెక్ 1.29% పెరిగాయి. బీఈఎల్ 2.16%, బజాజ్ ఫైనాన్స్ 1.64%, టాటా మోటార్స్ 1.49%, ట్రెంట్ 0.82%, ఐటీసీ 0.75% నష్టపోయాయి. రంగాల వారీ సూచీల్లో.. ఫోకస్డ్ ఐటీ 2.70%, ఐటీ 2.61%, టెక్ 2.22%, ఎఫ్ఎంసీజీ 1.36%, స్థిరాస్తి 1.04%, టెలికాం 0.68% రాణించాయి.

✦ ఆన్‌లైన్ గేమ్స్‌ను నిషేధిస్తూ ప్రభుత్వం తీసుకొచ్చిన చట్టానికి లోక్‌సభ ఆమోదం లభించడంతో నజారా టెక్నాలజీస్ 12.82%, డెల్టా కార్ప్ 6.47%, ఆన్‌మొబైల్ గ్లోబల్ 3.53% చొప్పున నష్టపోయాయి.

✦ **5 ఐపీఓలకు సెబీ పచ్చజెండా:** ఇన్నోవేటివ్యూ ఇండియా, పార్క్ మెడి వరల్డ్ సహా 5 కంపెనీల ఐపీఓలకు మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ అనుమతి ఇచ్చింది. ఐపీఓకు అనుమతి పొందిన సంస్థల్లో రన్వాల్ ఎంటర్‌ప్రైజెస్, జింకుశాల్ ఇండస్ట్రీస్, అడ్వాన్స్ అగ్రోలైఫ్ ఉన్నాయి. ఈ అయిదు కంపెనీలు ఫిబ్రవరి-ఏప్రిల్ మధ్య ఐపీఓలకు దరఖాస్తు చేసుకున్నాయి.

✦ వేదాంతా ప్రతిపాదిత విభజనపై విచారణను సెప్టెంబరు 17కు నేషనల్ కంపెనీ లా ట్రైబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ) వాయిదా వేసింది. ఈ ప్రతిపాదనపై పరిశీలను సెబీ ఇంకా పూర్తి చేయకపోవడమే ఇందుకు కారణం. అంతకు ముందు ఈ విభజనపై కేంద్ర ప్రభుత్వం కొన్ని అభ్యంతరాలను లేవనెత్తింది.

✦ జపాన్ వాహన దిగ్గజం హోండా మోటార్ కంపెనీ లిమిటెడ్ మన దేశంలో రిటెయిల్ విక్రయాలకు సంబంధించి ఆర్థిక సేవలు అందించేందుకు అనుబంధ సంస్థను నెలకొల్పుతున్నట్లు బుధవారం వెల్లడించింది.

✦ **మెరిసిన రీగాల్ రిసోర్సెస్ షేర్లు:** రీగాల్ రిసోర్సెస్ షేర్లు అరంగేట్రంలో రాణించాయి. బీఎస్‌ఈలో ఇష్యూ ధర రూ.102తో పోలిస్తే షేరు 39% లాభంతో రూ.141.80 వద్ద నమోదైంది. ఇంట్రాడేలో రూ.145.70 వద్ద గరిష్ఠాన్ని తాకింది. చివరకు 29.07 శాతం పెరిగి రూ.131.65 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.1,352.35 కోట్లుగా ఉంది.

✦ శ్రీజీ షిప్పింగ్ గ్లోబల్ ఐపీఓ రెండో రోజు 6.59 రెట్ల స్పందన లభించింది. ఇష్యూలో భాగంగా 1,14,08,600 షేర్లను ఆఫర్ చేయగా, 7,51,80,354 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి. రిటైల్ విభాగంలో 6.99 రెట్ల స్పందన వచ్చింది.

✦ పటేల్ రిటెయిల్ ఐపీఓ రెండో రోజు 19.48 రెట్ల స్పందన దక్కింది. ఇష్యూలో భాగంగా 78,15,612 షేర్లను జారీ చేయగా, 15,22,78,014 షేర్లకు బిడ్లు వచ్చాయి.


✦ జెమ్ ఆరోమాటిక్స్ ఐపీఓ రెండో రోజు 2.90 రెట్ల స్పందన కనిపించింది. ఇష్యూలో భాగంగా 97,82,363 షేర్లను ఆఫర్ చేయగా, 2,83,51,410 షేర్లకు బిడ్లు దాఖలయ్యాయి.

✦ మంగళ్ ఎలక్ట్రికల్ ఇండస్ట్రీస్ ఐపీఓ మొదటి రోజు 65% స్పందన నమోదైంది.

ఈనాడు సినిమా

తాజా కబురు

మళ్లీ ఇన్నేళ్లకు ఒకే చిత్రంలో?


రజనీకాంత్


కమల్‌హాసన్

'కూలీ' తర్వాత లోకేశ్ కనగరాజ్ చేయాల్సిన సినిమాలు చాలానే ఉన్నాయి. తాను ఇదివరకు తీసిన 'ఖైదీ'కి కొనసాగింపుగా 'ఖైదీ 2', హిందీలో ఆమిర్‌ఖాన్‌తోనూ ఓ సినిమా చేయాలనుకున్నారు. ఆ విషయాల్ని ఇదివరకు లోకేశ్ స్వయంగా ప్రకటించారు. 'కూలీ' ఐదేవరి ప్రేక్షకుల ముందుకొచ్చింది. ఇంతలోనే లోకేశ్ తదుపరి చేయనున్న కొత్త సినిమాపై తమిళ చిత్ర పరిశ్రమలో ఆసక్తికరమైన చర్చ కొనసాగుతోంది. ఆయన ఖరారు చేసిన రెండు సినిమాలకంటే ముందుగా మరోసారి రజనీకాంత్‌తోనే సినిమా చేయనున్నారని, ఈసారి ఆయనకు తోడుగా కమల్ హాసన్ కూడా అందులో కథానాయకుడిగా నటిస్తారని ప్రచారం సాగుతోంది. గ్యాంగ్‌స్టర్ డ్రామాగా ఈ సినిమాని తెరకెక్కించనున్నారని, రజనీ - కమల్ ఇద్దరూ గ్యాంగ్‌స్టర్లుగానే సందడి చేయనున్నారని సమాచారం. ఇదే నిజమైతే 46 ఏళ్ల తర్వాత రజనీ- కమల్ మళ్లీ కలిసి తెరపై ముందుకు వచ్చినట్లవుతుంది. ఈ ఇద్దరూ పలు భాషల్లో కలిసి 20కిపైగా సినిమాలు చేశారు. అయితే అదంతా 1970 దశకంలోనే. ఆ తర్వాత ఈ ఇద్దరూ మళ్లీ తెరను పంచుకునే అవకాశం రాలేదు. ఇన్నేళ్లకు లోకేశ్ రాసిన కథ ఈ ఇద్దరినీ మళ్లీ కలుపుతోందని తమిళ సినీ వర్గాలు చెబుతున్నాయి.

అల్లు అర్జున్‌తో విజయ్ సేతుపతి?





ప్రపంచస్థాయి ప్రమాణాలతో అల్లు అర్జున్ - అట్లీ కలయికలోని సినిమా రూపొందుతోంది. ఇప్పటికే ఇటు ప్రేక్షకుల్లోనూ అటు వ్యాపార వర్గాల్లోనూ ప్రత్యేకమైన ఆసక్తిని రేకెత్తించిన ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించిన రోజుకొక కొత్త కబురు వినిపిస్తోంది. తారలకు సంబంధించి ఇప్పటికి పుడు ఈ సినిమా మరింత పెద్దదవుతోంది. అల్లు అర్జున్ సరసన ముగ్గురు కథానాయికలు నటిస్తారని సమాచారం. ఇప్పటికే దీపిక పదుకొణె పేరుని అధికారికంగా ప్రకటించారు. మృణాల్ ఠాకూర్, రష్మిక పేర్లు కూడా వినిపిస్తున్నాయి. సీనియర్ కథానాయిక రమ్యకృష్ణ కూడా ఇందులో ఓ కీలక పాత్ర కోసం ఎంపికయ్యారని ఇటీవలే వినిపించింది. తాజా సమాచారం ఏంటంటే తమిళ స్టార్ విజయ్ సేతుపతి కూడా ఇందులో ఓ కీలక పాత్రలో సందడి చేయనున్నారట. ఈ విషయాలపై చిత్ర బృందం నుంచి స్పష్టత రావల్సి ఉంది.

వేటకి కదిలే... ఘాటి


విక్రమ్ ప్రభు, అనుష్క

అనుష్క ప్రధాన పాత్రధారిగా... క్రిష్ జాగర్లమూడి దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'ఘాటి'. విక్రమ్ ప్రభు కీలక పాత్ర పోషిస్తున్నారు. ఫస్ట్ ఫ్రేమ్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై రాజీవ్‌రెడ్డి, సాయిబాబు జాగర్లమూడి నిర్మిస్తున్నారు. యు.వి.క్రియేషన్స్ సమర్పిస్తోంది. పాన్ ఇండియా స్థాయిలో రూపొందుతున్న ఈ చిత్రం సెప్టెంబరు 5న తెలుగుతోపాటు, తమిళ, మలయాళ, కన్నడ, హిందీ భాషల్లో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా ఈ చిత్రంలోని 'దస్సోరా...' అంటూ సాగే పాటని బుధవారం విడుదల చేశారు. 'తూరుపు కనుమల నడుమింటి... కారడవుల్లో కాలెట్టి...సిరుతై ఉరికే యమజెట్టీ... వేటకి కదిలే ఘాటీ...' అంటూ సాగే ఈ పాటని ఈఎస్ మూర్తి రచించగా, గీతా మాధురి, సాకేత్, శ్రుతిరంజని ఆలపించారు. సాగర్ నాగవెల్లి స్వరకర్త. ఘాటీ బృందం పట్టుదలని చాటి చెప్పే పాట ఇదని, కథ పరంగానే కాకుండా... విజువల్‌గానూ ఈ సినిమా ప్రేక్షకుల్ని కట్టిపడేస్తుందని సినీ వర్గాలు చెప్పాయి. చైతన్యరావు, జగపతిబాబు, రవీంద్ర విజయ్ తదితరులు నటించిన ఈ చిత్రానికి కథ: తోట తరణి, సంభాషణలు: సాయిమాధవ్ బుర్రా, కథ: చింతకింది శ్రీనివాసరావు, ఛాయాగ్రహణం: మనోజ్‌రెడ్డి కాటసాని.

చిత్రసీమలో కష్టపడి పనిచేస్తేనే అవకాశాలు లభిస్తాయని అంటోంది బాలీవుడ్ కథానాయిక వామికా గబ్బి. వైవిధ్యమైన కథలతో ప్రయాణం చేస్తున్న ఈమె.. ఇటీవలే 'భూల్ చుక్ మాఫ్' చిత్రంతో ప్రేక్షకుల్ని పలకరించింది. ప్రస్తుతం అడివి శేష్ సరసన 'జీ 2'తో బిజీగా గడుపుతోంది. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న వామిక తను ఎంచుకొనే పాత్రలు, సవాళ్ల గురించి కొన్ని ఆసక్తికర విషయాల్ని పంచుకుంది.

ఎందరో నటులది అదే పరిస్థితి



కుటుంబమే ముఖ్యమని అర్థం చేసుకున్నా

"కొన్ని సమయాల్లో నటనను మానేయాలనుకున్నా. చిత్రసీమకు సంబంధించిన అన్ని విషయాల్ని సులభంగా తెలుసుకోవడానికి నేను సినిమా కుటుంబంలో పుడితే బాగుండు అని ఒకప్పుడు కోరుకున్నా. మంచిగా డబ్బు సంపాదించి ధనవంతురాల్ని కావాలనుకున్నా. ఇప్పుడు వెనక్కి తిరిగి చూసుకుంటే.. నా ప్రయాణం, నేను జన్మించిన కుటుంబం, ఎదుర్కొన్న కష్టాలు.. వీటన్నింటికీ దేవుడికి కృతజ్ఞతలు చెప్పుకుంటున్నా. నేను కోరుకున్నవన్నీ తాత్కాలికమైనవే అని తెలుసుకున్నా. ప్రస్తుతం నా జీవితంలో దేన్నీ మార్చాలనుకోవట్లేదు. చాలా ప్రశాంతంగా ఉంటున్నా. బంధాలు, స్నేహాలు, కుటుంబమే ముఖ్యమైనదని అర్థం చేసుకున్నా".

వామికా గబ్బి

"చిత్రసీమలో ఎంత కష్టపడి పనిచేసినా.. పరిస్థితులు అన్యాయంగా మనకు అనుకూలంగా ఉండవని కొన్నేళ్ల తర్వాత తెలుసుకున్నా. ఇక్కడ ఇలాగే ఉంటుందని అర్థం చేసుకున్నా. ఎందుకంటే కొంతమందికి కష్టపడకుండానే అవకాశాలు వరుస కడుతుంటాయి. మరికొందరికి ఆ అవకాశాలు లభించాలంటే చాలా సవాళ్లు ఎదుర్కోవాల్సి ఉంటుంది. నేను కూడా కష్టపడి పనిచేయాలని.. అప్పుడే అవకాశాల్ని పొందగలనని అర్థమైంది. ప్రస్తుతం ఈ దిశగానే అడుగులు వేస్తూ దాని కోసం కృషి చేయడం ప్రారంభించాను".


అత్యంత సవాలుతో కూడిన పాత్రిది

"ఇన్నేళ్ల నా సినీ ప్రయాణంలో నేనెప్పుడూ పూర్తిస్థాయి కామెడీ చిత్రాల్లో నటించలేదు. అందుకే ఇటీవలే విడుదలైన 'భూల్ చుక్ మాఫ్'లో చాలా సవాళ్లు ఎదుర్కొన్నా. నేను నటించిన 'ఖుఫియా' కూడా సవాలుతో కూడుకున్న చిత్రమే. ఇందులో నేను తల్లిగా నటించాను. చిన్నప్పుడు ఒక తల్లి తన బిడ్డ పట్ల ఎలా ప్రవర్తిస్తుందో ఎంత ప్రేమగా ఉంటుందో నాకు తెలియదు. అందుకే ఆ పాత్రలో ఎలా నటించాలో అర్థమయ్యేది కాదు. అప్పుడు మా అమ్మ, అమ్మమ్మ, అత్తతో మాట్లాడి వారి అనుభవాల్ని తెలుసుకున్నా. నా కెరీర్‌లో అత్యంత సవాలుతో కూడిన పాత్ర ఇదే".

ఇది చిత్రపరిశ్రమలో కొత్తేమీ కాదు

"చాలా సార్లు నేను ఆడిషన్‌కి వెళ్లిన పాత్ర వేరే వాళ్లకు దక్కేది. ఇది చిత్రపరిశ్రమలో కొత్తేమీ కాదు. చాలా కాలంగా జరుగుతూనే ఉంది. నాలాగే ఎంతో మంది నటీనటులు కూడా ఈ పరిస్థితిని ఎదుర్కొనే ఉంటారని అనుకుంటున్నా. ముఖ్యంగా యువనటులు, కొత్త ప్రతిభపై పెట్టుబడి పెట్టడానికి దర్శకనిర్మాతలు వెనుకాడతారు. వారు ఎక్కువ ప్రజాదరణ పొందిన నటులతో చిత్రాల్ని రూపొందించడానికే ఆసక్తి చూపిస్తుంటారు. కానీ కొత్తవారిపై నమ్మకం ఉంచి సినిమాలు తీసేవారు కొందరు ఉన్నారు. కరణ్ జోహార్, ఆదిత్య చోప్రా లాంటి వారు కొత్త నటులను, ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేయడంలో ముందుంటారు".

అవార్డు అందుకోవడానికి ఒక చెయ్యి చాలు


షారుక్ ఖాన్

షారుక్‌ఖాన్ ఇటీవల తాను హీరోగా నటిస్తోన్న 'కింగ్' చిత్రీకరణలో గాయపడ్డారు. తన చేతి గాయం, జాతీయ అవార్డుపై ముంబయిలో జరిగిన 'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' ట్రైలర్ విడుదల వేడుకలో ఆయన స్పందించారు. "'కింగ్' షూటింగ్‌లో గాయపడటంతో భుజానికి గాయమై సర్జరీ జరిగింది. ఒకటీ రెండు నెలల్లో కోలుకుంటాను. జాతీయ అవార్డు అందుకొనేందుకు ఒక చెయ్యి సరిపోతుంది. కానీ మీ ప్రేమను మూటగట్టుకోవడానికి మాత్రం ఒక చెయ్యి సరిపోదు"అని చెప్పారు. ఇటీవల ప్రకటించిన 71వ జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో షారుక్ ఉత్తమ నటుడిగా ఎంపికైన సంగతి తెలిసిందే. విక్రాంత్ మాస్సేతో కలిసి ఈ అవార్డును అందుకోనున్నారు షారుక్.

బాలీవుడ్ కలల నగరం.. కానీ అందరికీ కాదు


'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్'

"కొందరు హీరో అవ్వాలనుకుంటారు. మరికొందరు హీరోగానే జన్మిస్తారు" అంటూ 'ది బ్యాడ్స్ ఆఫ్ బాలీవుడ్' ప్రపంచాన్ని పరిచయం చేసింది ఓటీటీ వేదిక నెట్‌ఫ్లిక్స్. హిందీ యాక్షన్ హీరో షారుక్ ఖాన్ కుమారుడు ఆర్యన్ ఖాన్ దర్శకుడిగా పరిచయమవుతున్న సిరీస్ ఇది. లక్ష్య, సహేర్, బాబీ దేవోల్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. తాజాగా ఈ సిరీస్ సెప్టెంబరు 18న రాబోతున్నట్లు తెలుపుతూ.. ఇన్‌స్టా వేదికగా ట్రైలర్‌ను విడుదల చేసింది ఓటీటీ సంస్థ. 'బాలీవుడ్ ఒక కలల నగరం. . కానీ అందరికీ కాదు' అనే షారుక్ సంభాషణలతో మొదలైన ఈ ట్రైలర్ ఆద్యంతం ఆసక్తిగా సాగింది. ఇందులో సల్మాన్ ఖాన్, రణ్‌వీర్ సింగ్ తదితరులు అతిథి పాత్రల్లో మెరుస్తూ.. ట్రైలర్‌కు ప్రధాన ఆకర్షణగా నిలిచారు. హిందీ చిత్రసీమ నేపథ్యంలో రూపొందుతున్న ఈ సిరీస్‌ను రెడ్‌చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్ నిర్మిస్తోంది.

'అప్నే 2' సన్నాహాలు


'అప్నే'

'అప్నే'.. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో రూపొంది బాలీవుడ్ ప్రేక్షకుల్ని విశేషంగా ఆకట్టుకున్న చిత్రమిది. అనిల్ శర్మ దర్శకత్వంలో సీనియర్ నటుడు ధర్మేంద్ర.. ఆయన కుమారులు, నటులు సన్నీ దేవోల్, బాబీ దేవోల్‌తో కలిసి నటించిన మొదటి చిత్రమిది. ఇప్పుడీ సినిమాకు సీక్వెల్ రాబోతున్నట్లు తెలిపారు దర్శకుడు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. ''అప్నే 2' కచ్చితంగా ఉంటుంది. స్క్రిప్ట్ పనులు ఇప్పటికే పూర్తయ్యాయి. త్వరలో ప్రీ-ప్రొడక్షన్ పనులు ప్రారంభం కానున్నాయ"ని తెలిపారు. ప్రస్తుతం సన్నీ దేవోల్ 'బార్డర్ 2', బాబీ దేవోల్ 'జన నాయగన్', 'ఆల్ఫా' లాంటి చిత్రాలతో బిజీగా ఉన్నారు. మరి చాన్నాళ్ల తర్వాత తమ తండ్రి ధర్మేంద్రతో కలిసి వస్తోన్న వీరిద్దరూ ఎలాంటి మ్యాజిక్ సృష్టిస్తారో చూడాలంటే ఇంకొన్ని రోజులు వేచి చూడాల్సిందే.

భాయ్ వకీల్ వచ్చేశాడు


అర్షద్, అక్షయ్

"మీరు చింతించకండి.. మీ వకీల్ తిరిగొచ్చాడ"ని అంటున్నారు బాలీవుడ్ హీరో అక్షయ్ కుమార్. ఇదంతా ఆయన ప్రధాన పాత్రలో నటిస్తున్న 'జాలీ ఎల్ఎల్‌బీ 3' సినిమా కోసమే. అర్షద్ వార్సి కీలక పాత్ర పోషిస్తున్నారు. సినీప్రియుల్ని విశేషంగా ఆకట్టుకున్న 'జాలీ ఎల్ఎల్‌బీ' ఫ్రాంఛైజీలో రాబోతున్న చిత్రమిది. సుభాశ్ కపూర్ దర్శకత్వం వహిస్తున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్ అభిమానుల్లో నవ్వులు పూయించింది. సెప్టెంబరు 19న రాబోతుందీ చిత్రం. ఈ నేపథ్యంలోనే ప్రచార కార్యక్రమంలో భాగంగా తాజాగా ఇందులోని మొదటి పాటను ఇన్‌స్టా వేదికగా పంచుకుంది చిత్రబృందం. 'భాయ్ వకీల్ హై..' అంటూ సాగుతున్న ఈ పాటలో నల్ల కోటు ధరించి తన స్టెప్పులతో ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నారు అక్షయ్, అర్షద్. అమన్ పంత్ దీన్ని స్వరపరిచారు.

చాయ్‌వాలా వినోదం


శివ, తేజు అశ్విని

'నా చాయ్ విలువ 15 రూపాయలు. అంతకన్నా ఒక్క రూపాయి ఎక్కువ తీసుకున్నా... నా విలువ పడిపోతుంది' అంటాడు చాయ్‌వాలా. టీ కొట్టుతోనే జీవితాన్ని నెట్టుకొస్తున్న అతను, అతని కొడుకు కథేమిటో తెలియాలంటే 'చాయ్‌వాలా' చూడాల్సిందే. శివ కందుకూరి కథానాయకుడిగా నటించిన చిత్రమిది. తేజు అశ్విని కథానాయిక. రాజీవ్ కనకాల ముఖ్యభూమిక పోషించారు. ప్రమోద్ హర్ష దర్శకుడు. విజయలక్ష్మి, వెంకట్.ఆర్.పాపుడిప్పు నిర్మాతలు. బుధవారం హైదరాబాద్‌లో టీజర్ ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. చిత్రబృందంతోపాటు నిర్మాత రాజ్ కందుకూరి పాల్గొన్నారు. కథానాయకుడు శివ కందుకూరి మాట్లాడుతూ ''తండ్రీ కొడుకుల అనుబంధానికి అద్దం పట్టే కథ ఇది. ఈ సినిమా చూసి బయటికొచ్చాక ప్రతి ఒక్కరూ వాళ్ల తండ్రితో కాసేపు మాట్లాడతారు. థియేటర్ నుంచే ఓ మంచి భావోద్వేగంతో బయటికొస్తార'న్నారు. దర్శకుడు మాట్లాడుతూ "ప్రతి మనిషి జీవితంలో జరిగే సంఘటనలే మా చిత్రంలో ప్రతిబింబిస్తాయి. ప్రతి ఒక్కరికీ కనెక్ట్ అయ్యేలా పాత్రలు ఉంటాయి. కథ నుంచే 'చాయ్‌వాలా' పేరుని తీసుకున్నాం" అన్నారు. రాజీవ్ కనకాల మాట్లాడుతూ "ప్రమోద్ చెప్పిన ఈ కథ విని ఆశ్చర్యపోయా. తను హాస్యాన్ని, భావోద్వేగాల్ని మేళవించిన తీరు చాలా బాగుంది. కథానాయకుడు శివ కందుకూరి నటుడిగా ఎంతో ఎత్తుకు ఎదుగుతారు. 'చాయ్‌వాలా' పంచే వినోదం అందరికీ నచ్చుతుందని ఆశిస్తున్నా" అన్నారు. థియేటర్లోనే వదిలేయకుండా, ఇంటికి కూడా తీసుకెళ్లేలా ఉండే చిత్రాలే హిట్ అవుతాయని... అలాంటి చిత్రమే ఇదని నిర్మాత రాజ్ కందుకూరి చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్ కుమార్ కసిరెడ్డితో, తేజు అశ్వినితోపాటు ఇతర చిత్రబృందం పాల్గొంది.

నిజ జీవిత పాత్రలతో... 'కన్యాకుమారి'


గీత్ సైని, సిద్ధు, మధుశాలిని

"నాకు మధుశాలిని ఎప్పటినుంచో తెలుసు. తను ఓ సినిమాకి సమర్పకురాలిగా వ్యవహరిస్తూ ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుందంటే అందులో బలమైన కంటెంట్ ఉంటుందని నా నమ్మకం. 'కన్యాకుమారి' టీజర్ చూడగానే సినిమా బాగుంటుందనే అభిప్రాయం కలిగింది" అన్నారు ప్రముఖ కథానాయకుడు సిద్ధు జొన్నలగడ్డ. ఆయన బుధవారం హైదరాబాద్‌లో జరిగిన 'కన్యాకుమారి' ట్రైలర్ ఆవిష్కరణ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. గీత్ సైని, శ్రీచరణ్ రాచకొండ జంటగా... సృజన్ అట్టాడ స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రమే 'కన్యాకుమారి'. ఈ చిత్రం ఈ నెల 27న రానుంది. దర్శకనిర్మాత సృజన్ మాట్లాడుతూ "ఇందులోని ప్రతి పాత్ర నిజ జీవితం నుంచి వచ్చిందే" అన్నారు. ఈ కార్యక్రమంలో దర్శకుడు శశికిరణ్ తిక్క, మధుశాలిని తదితరులు పాల్గొన్నారు.

తెరపై విఠాబాయిగా శ్రద్ధా కపూర్!



'స్త్రీ 2'తో భారీ విజయాన్ని సొంతం చేసుకొని విమర్శకుల ప్రశంసలు అందుకుంది బాలీవుడ్ అందాల తార శ్రద్ధా కపూర్. ఈ సినిమా విడుదలై ఏడాది కావొస్తున్నా.. ఇప్పటికీ ఆమె తన తదుపరి ప్రాజెక్టును ప్రకటించలేదు. మహారాష్ట్ర జానపద ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన విఠాబాయి భావు మంగ్ నారాయణ్ గావ్‌కర్ బయోపిక్‌లో శ్రద్ధ నటిస్తున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఇప్పుడీ ప్రాజెక్టు గురించి మరో విషయం నెట్టింట్లో చక్కర్లు కొడుతుంది. తాజాగా ఈ దీనికి 'విట్టా' అనే పేరును ఖరారు చేసినట్లు సమాచారం. దినేశ్ విజన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి 'ఛావా' ఫేమ్ లక్ష్మణ్ ఉటేకర్ దర్శకుడు. పుణెలో ఉన్న విఠాబాయి కుటుంబం నుంచి ఇప్పటికే ఈ సినిమాకు సంబంధించిన హక్కులను పొందినట్లు చిత్ర సన్నిహిత వర్గాలు తెలిపాయి.

70 థియేటర్లలో ఉచితంగా


సురేశ్

"కథానాయకుడు చిరంజీవి నాకు దేవుడితో సమానం. ఆయనపై నాకున్న అభిమానాన్ని చాటి చెప్పే చిత్రమే... 'వీరాభిమాని'. చిరంజీవి 70వ పుట్టినరోజు సందర్భంగా ఏపీ, తెలంగాణలోని 70 థియేటర్లలో ఈ సినిమాని ఉచితంగా ప్రదర్శిస్తున్నాం" అన్నారు సురేశ్ కొండేటి. ఆయన ప్రధాన పాత్రధారిగా... రాంబాబు దోమకొండ తెరకెక్కించిన చిత్రమే 'వీరాభిమాని'. ఎస్.కె.రెహ్మాన్, కంద సాంబశివరావు నిర్మాతలు. డ్రమ్స్ రాము పాటలు, మణిశర్మ నేపథ్య సంగీతం అందించారు. చిరంజీవి పుట్టినరోజు సందర్భంగా ఈ నెల 22న ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో ఇటీవల ప్రత్యేక ప్రదర్శనని నిర్వహించారు. అనంతరం చిత్రబృందం విలేకర్ల సమావేశం నిర్వహించింది. సురేశ్ కొండేటి మాట్లాడుతూ "ఈ నెల 22న మెగాభిమానులంతా ఈ సినిమాని చూసి ఆస్వాదించాల"ని కోరారు. ఒక అభిమాని తన హీరో కోసం ఎంతవరకు వెళ్లగలడనే అంశం ఇందులో ఆసక్తికరంగా ఉంటుందని చెప్పారు దర్శకుడు.

నిన్ను ఇలా చూసుకుంటానే!


రోషిణి, మొయిన్, యష్ణ

'30 రోజుల్లో ప్రేమించటం ఎలా' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైన దర్శకుడు మున్నా ధులిపూడి. ఇప్పుడాయన నుంచి వస్తున్న రెండో సినిమా 'బ్యాడ్ గర్ల్స్'. అంచల్ గౌడ్, పాయల్ చెంగప్ప, రోషిణి, యష్ణ, రోహన్ సూర్య, మొయిన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు. శశిధర్ నల్లా, ఎమ్మాడి సోమ నర్సయ్య, రామిశెట్టి రాంబాబు, రావుల రమేశ్ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలోని "ఇలా చూసుకుంటానే" అనే పాట ప్రీటీజర్‌ను ఇటీవల విడుదల చేశారు. అనూప్ రూబెన్స్ స్వరాలు సమకూర్చిన ఈ గీతానికి చంద్రబోస్ సాహిత్యమందించారు. సిద్ శ్రీరామ్ ఆలపించారు. ఈ సందర్భంగా దర్శకుడు మున్నా మాట్లాడుతూ.. "ఇది ఆద్యంతం వినోదాత్మకంగా సాగే సినిమా. 'జాతిరత్నాలు', 'మ్యాడ్' లాంటి కథల్లో అమ్మాయిలు చేస్తే ఎలా ఉంటుందో అలాంటి చిత్రమిది. 'ఇలా చూసుకుంటానే' పాట నా గత చిత్రంలోని 'నీలి నీలి ఆకాశం' కంటే గొప్పగా ఉంటుంది. త్వరలో దాన్ని విడుదల చేస్తాం" అన్నారు.

మండించే ఎండలు.. ముంచెత్తే వానలు!

జనరల్ స్టడీస్ ఇండియన్ జాగ్రఫీ



రుతుపవన ఆధారిత భారతదేశంలో ఎప్పుడూ ఒకే రకమైన వాతావరణం ఉండదు. వేసవిలో ఎండలు మండిస్తే, వర్షాకాలంలో విపరీతంగా వానలు ముంచెత్తుతాయి. ఏటా సమయానుసారం వాతావరణం మారుతూ ఉంటుంది. అందులోనూ ప్రాంతాల వారీగా ఉష్ణోగ్రతల్లో వ్యత్యాసం స్పష్టంగా కనిపిస్తుంది. వేడిగా, తడిగా, పొడిగా, చల్లగా, తేమగా రకరకాల శీతోష్ణస్థితులు ఉంటాయి. ప్రజల జీవనవిధానం, ప్రాంతాల వారీ వైవిధ్యం నుంచి దేశ ఆర్థిక వ్యవస్థ స్వభావం వరకు అన్నింటినీ ప్రభావితం చేస్తున్న ఈ ఉష్ణ మండల రుతుపవన శీతోష్ణస్థితి స్వరూపాన్ని పోటీ పరీక్షార్థులు సమగ్రంగా తెలుసుకోవాలి. సంప్రదాయ రుతువులు, ఆంగ్ల నెలల వారీగా నిర్ధారించుకున్న కాలాలు, పలు రకాల ఉష్ణోగ్రతలు, వర్షపాత భేదాలపై అవగాహన కలిగి ఉండాలి.

శీతోష్ణస్థితి

వ్యవసాయ ప్రధానమైన భారత్ లాంటి దేశాల అభివృద్ధి శీతోష్ణస్థితిపై ఆధారపడి ఉంటుంది. అది ఒక్క పంటల పైన మాత్రమే కాకుండా నివాసాలు, వస్త్రధారణ, రవాణా సౌకర్యాలు, పరిశ్రమలు మొదలైన వాటిపై కూడా ప్రభావం చూపుతుంది. దేశం మధ్యలో నుంచి వెళ్లే కర్కటరేఖను గమనిస్తే దక్షిణ భాగం ఉష్ణమండలంలో, ఉత్తర భాగం సమశీతోష్ణ మండలంలో ఉంటుంది. ఉష్ణోగ్రత, వర్షపాతం, వాతావరణ పీడనం, గాలుల దిశ, వేగం.. దేశ శీతోష్ణస్థితిని ప్రభావితం చేస్తాయి. ఎక్కువగా రుతుపవన వర్షంపై ఆధారపడటం వల్ల భారత్‌ను 'ఉష్ణమండల రుతుపవన దేశం'గా పిలుస్తారు.

దేశ వాతావరణాన్ని ప్రభావితం చేసే అంశాలు


అక్షాంశాలు: భారత్ ఉత్తరార్ధ గోళంలో భూమధ్య రేఖకు దగ్గరగా ఉంది. కర్కటరేఖ దేశం మధ్య నుంచి వెళ్లడం వల్ల దక్షిణ భాగంలో ఎక్కువ ఉష్ణోగ్రతలు ఉంటాయి. ఉత్తర భాగం తక్కువ ఉష్ణోగ్రతలతో, రోజువారీ అధిక హెచ్చుతగ్గులతో ఉంటుంది.

ఎత్తు: సముద్ర మట్టం నుంచి ఎత్తుకు వెళ్లే కొద్దీ ఉష్ణోగ్రతలు తగ్గుతాయి. గాలి తక్కువగా ఉంటుంది.

భౌగోళిక స్వరూపం: దేశ భౌగోళిక స్వరూపం కూడా ఉష్ణోగ్రత, గాలి పీడనం, గాలి వీచే దిశ, వేగం, వర్షపాతాలను ప్రభావితం చేస్తుంది.

సముద్రం నుంచి దూరం: సముద్రతీర ప్రాంతంలో పగటి, రాత్రి ఉష్ణోగ్రతల్లో రుతువుల వారీగా వ్యత్యాసం తక్కువగా ఉంటుంది. ఖండాంతర్గత/ సముద్రం నుంచి దూరంగా ఉండే ప్రాంతంలో పగటి, రాత్రి వేళ ఉష్ణోగ్రతల్లో రుతువుల వారీగా వ్యత్యాసం ఎక్కువగా ఉంటుంది. **ఉదా:** ముంబయి, కొంకణ్ తీర ప్రాంత ప్రజలకు రోజువారీ ఉష్ణోగ్రతల వ్యత్యాసం పెద్దగా తెలియదు. దిల్లీ, కాన్పూర్ లాంటి ప్రాంతాల్లో ఈ వ్యత్యాసాలు చాలా ఎక్కువగా ఉంటాయి.

హిమాలయ పర్వతాలు: ఇవి దేశానికి ఉత్తర దిక్కున పెట్టని గోడ మాదిరి ఉన్నాయి. ఎత్తుగా, వెడల్పుగా ఉండి, ఉత్తరం వైపు నుంచి వీచే



శీతల గాలులను నిరోధించి దేశాన్ని రక్షిస్తున్నాయి. రుతుపవన గాలులను అడ్డుకుని, వర్షాన్ని కురిపిస్తున్నాయి. నీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నాయి.

భూమి-జలభాగం: దేశ దక్షిణ భాగం మూడు వైపుల్లో (తూర్పు, పడమర, దక్షిణ) సముద్రం ఆవరించి ఉంటుంది. భూభాగంతో పోలిస్తే, నీరు నెమ్మదిగా వేడెక్కి, నెమ్మదిగా చల్లారుతుంది. ఈ భూ, జల ఉష్ణోగ్రతల వ్యత్యాసం గాలి పీడనం, వేగం, దిశలను ప్రభావితం చేస్తుంది.

సంప్రదాయ రుతువులు		
రుతువులు	భారతీయ నెలలు	ఆంగ్ల నెలలు
వసంత	చైత్రం - వైశాఖం	మార్చి - ఏప్రిల్
గ్రీష్మ	జ్యేష్ఠ - ఆషాఢ	మే - జూన్
వర్ష	శ్రావణ - భాద్రపద	జులై - ఆగస్టు
శరత్	ఆశ్వీజ - కార్తీక	సెప్టెంబరు - అక్టోబరు
హేమంత	మార్గశిర - పుష్య	నవంబరు - డిసెంబరు
శిశిర	మాఘ - ఫాల్గుణ	జనవరి - ఫిబ్రవరి

తద్వారా రుతుపవనాలు ఏర్పడతాయి.

దేశ సంప్రదాయ రుతువులు: వీటిని ఆరు భాగాలు (ఒక్కో రుతువు రెండు నెలలు)గా విభజించారు. ప్రజల ఆచరణాత్మక అనుభవం, వాతావరణ పరిస్థితుల ఆధారంగా వాటిని నిర్ణయించారు. అయితే ఈ రుతువులకు సంబంధించి భారతదేశంలో ఉత్తర, దక్షిణ భాగాల్లో కొంత వ్యత్యాసం ఉంటుంది.


నాలుగు రుతువులు

భారతదేశ శీతోష్ణస్థితి లక్షణాలను పరిశీలిస్తే విభిన్న కాలాలకు అనుకూలత కనిపిస్తుంది. ప్రతి రుతువు ప్రత్యేక లక్షణాలతో ఉంటుంది. దేశ శీతోష్ణస్థితిని ప్రధానంగా నాలుగు రుతువులుగా పేర్కొంటారు.

1) శీతాకాలం: నవంబరు మధ్యలో ప్రారంభమై డిసెంబరు, జనవరి నాటికి అత్యల్ప ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. ఈ కాలంలో దేశ వాయవ్య భాగంలో అధిక పీడనం ఏర్పడుతుంది. ఈ సమయంలో ఈశాన్య గాలులు దేశం మీదుగా వీచి ఈశాన్య రుతుపవనాల పేరుతో వర్షాన్ని ఇస్తాయి. ఉత్తర భారతంలో అతిశీతల పరిస్థితులు ఉంటాయి. దక్షిణ ద్వీపకల్ప ప్రాంతంలో సముద్ర తీర ప్రాంత ప్రభావం, భూమధ్య రేఖ ప్రాంతానికి దగ్గరగా ఉండటం వల్ల ఉష్ణోగ్రతలు కొంత ఎక్కువగా ఉంటాయి. వాయవ్య భారతదేశంలో మధ్యధరా సముద్రం మీదుగా వీచే కొన్ని బలహీన సమశీతోష్ణ తుపానులు, పశ్చిమ వాయుగుండాలు. . పంజాబ్, హరియాణా, దిల్లీ ఉత్తర్‌ప్రదేశ్ పశ్చిమ ప్రాంతంలో వర్షాన్ని ఇస్తాయి. ఇవి అక్కడి రబీ పంటలకు ప్రయోజనకరం. అరుణాచల్‌ప్రదేశ్, అస్సాం రాష్ట్రాల్లో 25 - 50 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుంది.

2) వేసవి కాలం: ఈ రుతువు మార్చిలో సూర్యుడు కర్కటరేఖ వైపు కదులుతున్నప్పుడు ప్రారంభమవుతుంది. ఏప్రిల్, మే, జూన్ నెలల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయి. దేశంలోని అనేక ప్రాంతాల సగటు ఉష్ణోగ్రతలు 30°C-32°C మధ్య ఉంటాయి. పగటి ఉష్ణోగ్రతలు 38°C-43°C నమోదవుతాయి. దేశ వాయవ్య ప్రాంతం, తెలంగాణలోని ఉత్తర, ఈశాన్య భాగాల్లో సుమారు 48°C వరకు ఉష్ణోగ్రతలు ఉంటున్నాయి. ఆంధ్రప్రదేశ్‌లోని కడప, కర్నూలు, కృష్ణా, పల్నాడు జిల్లాల్లోనూ 48°C వరకు నమోదవుతాయి.

వేసవిలో రాత్రి ఉష్ణోగ్రతలు కూడా సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయి. ఈ విధంగా అధిక వేడి, గాలి అల్పపీడనం వల్ల దేశంలో ఉత్తర భాగంలో, ఉపఖండం వేడెక్కడం వల్ల ఇంటర్ ట్రాపికల్ కన్వర్జెన్స్ జోన్ (ఐటీసీజడ్) జులైలో 25°C ఉత్తర అక్షాంశం వద్ద కేంద్రీకృతమై ఉత్తరం వైపు కదులుతుంది. దేశ వాయవ్య ప్రాంతంలో ఐటీసీజడ్ కారణంగా వేడి, పొడిగాలులు, 'లూ' పవనాలు వీస్తాయి. వేసవి చివరి నాటికి కేరళ, కర్ణాటక తీర ప్రాంతాల్లో వర్షాలు కురుస్తాయి. ఇవి మామిడికాయలు త్వరగా పక్వానికి రావడానికి సహకరిస్తాయి. అందుకే వీటిని మ్యాంగో షవర్స్/ ముంగూరు వర్షాలు అంటారు. కేరళ, దాని సమీప ప్రాంతాల్లో వీచే వర్షాలను 'బ్లాసమ్ షవర్స్' అంటారు. వీటి వల్ల కాఫీ పూలు వికసిస్తాయి. బెంగాల్, అస్సాం ప్రాంతాల్లో సాయంత్రం వేళ ఉరుములు, మెరుపులతో వచ్చే వర్షాలను కాలా బైసాఖీ (బెంగాల్), బార్డోలి చెర్హా (అస్సాం) అని అంటారు.





3) నైరుతి రుతుపవన కాలం/ వర్షాకాలం: మాన్‌సూన్ (రుతువు) అనే పదం 'మౌసిమ్' అనే అరబిక్ పదం నుంచి వచ్చింది. రుతువు అంటే గాలులు దిశాత్మకంగా ఒక కాలం నుంచి మరొక కాలానికి మారడం. భారతదేశంలో వర్షాకాలం నైరుతి రుతుపవనాలతో ప్రారంభమవుతుంది. అధిక వేడి, అధిక తేమ, అధిక వర్షపాతం ఈ కాలం లక్షణాలు. దేశంలో 80% - 90% వర్షపాతం ఈ రుతుపవన కాలంలోనే లభిస్తుంది. నైరుతి రుతుపవనాలు జూన్ మొదటి వారంలో ప్రవేశించి, జులై నాటికి దేశమంతా విస్తరిస్తాయి. ఈ రుతుపవనాలు కన్యాకుమారి అగ్రాన్ని తాకిన తర్వాత రెండుగా చీలి ఒక భాగం అరేబియా సముద్రం మీదుగా పశ్చిమ కనుమలు, సూరత్, కచ్, పశ్చిమ హిమాలయాల వైపు వీస్తుంది. మరొక శాఖ బంగాళాఖాతం మీదుగా గారో, ఖాసీ, జైంతియా కొండలు, బెంగాల్, హిమాలయాల మీదుగా వీస్తుంది.

4) ఈశాన్య రుతుపవన కాలం/ తిరోగమన రుతుపవన కాలం: అక్టోబరు, నవంబరు నాటికి రుతుపవనాలు తిరోగమిస్తాయి. సూర్యుడు ఉత్తరార్ధ గోళం నుంచి దక్షిణార్ధ గోళానికి ప్రయాణించడం వల్ల ఉత్తర భారతంలో ఉష్ణోగ్రతలు నెమ్మదిగా తగ్గుతాయి. క్రమంగా అధిక పీడనం ఏర్పడుతుంది. తూర్పు జెట్‌స్ట్రీమ్ అంతరించిపోతుంది. ఐటీసీజడ్ దక్షిణ ముఖంగా కదలడం వల్ల పవనాలు తిరోగమిస్తాయి. ఇవి ఈశాన్యం వైపు నుంచి నైరుతి వైపు కదలడంతో 'ఈశాన్య రుతుపవనాలు' అని కూడా అంటారు. వీటి ద్వారా దేశంలో సుమారు 10-15 సెం.మీ. వర్షపాతం కురుస్తుంది. ఏపీ, తమిళనాడు రాష్ట్రాల్లో కూడా ఈ తుపాన్లు అధిక వర్షాన్నిస్తాయి.




రచయిత: డాక్టర్ గోపగోని ఆనంద్

ఆశావహులుగా ఉంటే అంతా మంచే!

సాఫ్ట్ స్కిల్స్

జీవన విధానం, ప్రవర్తన, ఎదుగుదల అంతా ఆలోచన తీరులోనే ఉంటుంది. త్వరగా ఉద్యోగాలు సాధించేవారు, వివిధ రంగాల్లో చిన్న వయసులోనే విజయాలు పొందిన వారిలో ఈ లక్షణం స్పష్టంగా కనిపిస్తుంది. అందుకే ఆలోచనలు ఎప్పుడూ ఆరోగ్యకరంగా, సానుకూలంగా, ఆశావహ దృక్పథంతో ఉండాలి. ఆశావహుల లక్షణాలు ఎలా ఉంటాయి, సానుకూల ఆలోచనలు పెరగాలంటే ఏం చేయాలి, ఏం చేయకూడదో తెలుసుకోవాలంటే క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.



ప్రాక్టీస్ బిట్స్

పర్యావరణ అంశాలు

1. కింది వాటిలో ఏ వాయువులను గ్రీన్‌హౌజ్ వాయువుగా పరిగణిస్తారు?
ఎ) కార్బన్ డై ఆక్సైడ్ బి) మీథేన్
సి) నైట్రస్ ఆక్సైడ్ డి) సల్ఫర్ డై ఆక్సైడ్
1) ఎ, బి 2) ఎ, బి, సి
3) బి, సి, డి 4) ఎ, బి, సి

2. గ్లోబల్ వార్మింగ్ ప్రభావాలకు సంబంధించి కింది ప్రకటనలను పరిగణించండి.
ఎ) ఇది ప్రకృతి వైపరీత్యాల ఫ్రీక్వెన్సీ, తీవ్రత పెరుగుదలకు దారితీస్తుంది.
బి) గ్లోబల్ వార్మింగ్ కారణంగా హిమానీనదాలు కరిగిపోయి నీటికొరత ఏర్పడుతుంది.
సి) గ్లోబల్ వార్మింగ్ మానవ ఆరోగ్యంపై ప్రత్యక్ష ప్రభావం చూపదు.
పై ప్రకటనల్లో ఏవి సరైనవి?
1) ఎ, బి 2) బి, సి
3) ఎ, సి 4) ఎ, బి, సి

3. కింది వాటిలో ఏ చర్యలు గ్లోబల్ వార్మింగ్‌ను తగ్గించడంలో సహాయపడతాయి?
ఎ) పునరుత్పాదక ఇంధన వనరులకు మారడం.
బి) అడవుల పెంపకం ప్రయత్నాలను పెంపొందించడం.
సి) శిలాజ ఇంధనాలపై ఆధారపడడాన్ని తగ్గించడం.
డి) సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వినియోగాన్ని పెంచడం.
1) ఎ, బి 2) బి, సి, డి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి

సమాధానాలు: 1-2, 2-1, 3-3.

దరఖాస్తు చేశారా?



- ఐబీపీఎస్ క్లర్క్ ఉద్యోగాలు (10,277)
చివరి తేదీ: 21.08.2025
- స్టాఫ్ సెలక్షన్ కమిషన్‌లో పోస్టులు
చివరి తేదీ: 21.08.2025

'ఆధార్.. ఓటరు కార్డులతో భారత పౌరులు కాలేరు'!

కరెంట్ అఫైర్స్

వృత్తిపరమైన పురోగతి కోసం ప్రభుత్వ ఉద్యోగులకు ప్రత్యేక సెలవులు ఇవ్వాలని సిక్కిం ప్రభుత్వం నిర్ణయించింది. ఏఐ సాంకేతికతతో పంచాయతీ సమావేశాల నివేదికలను రూపొందించే కార్యక్రమానికి సంబంధిత మంత్రిత్వ శాఖ శ్రీకారం చుట్టింది. సేల్స్ నుంచి కస్టమర్ సర్వీస్ వరకు అంతా రోబోలతో నడిచే మాల్ చైనాలో ప్రారంభమైంది. ఆసక్తిగా, విజ్ఞానదాయకంగా ఉన్న ఇలాంటి జాతీయ, అంతర్జాతీయ అంశాలన్నింటినీ పోటీ పరీక్షార్థులు తెలుసుకోవాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నూతన కార్యక్రమాలు, విధాన నిర్ణయాలు, ముఖ్యమైన కోర్టు తీర్పులు, దేశ, విదేశీ వ్యవహారాలు, రక్షణ రంగ తాజా పరిణామాలతో పాటు ఇటీవల వార్తల్లో నిలిచిన వ్యక్తులు, ప్రాంతాలు, సంఘటనలు, ప్రధాన క్రీడల విశేషాలు, విజేతలు, ప్రాధాన్యం ఉన్న పుస్తకావిష్కరణలనూ గుర్తుంచుకోవాలి.

మాదిరి ప్రశ్నలు

1. మేధోవైకల్యం ఉన్న విద్యార్థులకు ఏకరీతి, నాణ్యమైన విద్య కోసం 'దిశ అభియాన్' ను ప్రారంభించిన రాష్ట్రం ఏది?
1) కేరళ 2) మహారాష్ట్ర
3) రాజస్థాన్ 4) అస్సాం
నోట్: సోషల్ మీడియా ద్వారా మోసపూరిత కార్యకలాపాలను గుర్తించడానికి మహారాష్ట్ర ప్రభుత్వం 'గరుడ దృష్టి'ని ఆవిష్కరించింది.


2. బిహార్‌లో జరిగిన ఆసియా రగ్బీ U-20 sevens పురుషుల విజేత, మహిళల విజేత దేశాలు వరుసగా..
1) చైనా, హాంకాంగ్ 2) హాంకాంగ్, చైనా
3) భారత్, శ్రీలంక 4) శ్రీలంక, భారత్

3. ఇండియాలో 2వ అతిపెద్ద క్రికెట్ స్టేడియం ఎక్కడ నిర్మించనున్నారు?
1) కేరళ 2) రాజస్థాన్
3) కర్ణాటక 4) ఒడిశా

4. కాకినాడలో జరిగిన 15వ జూనియర్ మహిళల హాకీ ఛాంపియన్‌షిప్-2025 విజేత?
1) ఆంధ్రప్రదేశ్ 2) కేరళ
3) ఝార్ఖండ్ 4) రాజస్థాన్

5. 9వ తరగతి నుంచి 12వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడేలా ఏ పేరుతో వివిధ సబ్జెక్టులకు సంబంధించిన ఆడియో కంటెంట్‌ను రేడియో పాఠాలుగా సీబీఎస్ఈ అందిస్తోంది?
1) విద్యార్థి గీత 2) శిక్షా వాణి
3) విద్యార్థి వాణి 4) రేడియో విద్య
నోట్: 9వ తరగతి విద్యార్థులకు ఓపెన్-బుక్ ఎగ్జామ్స్‌ను 2026-27 విద్యా సంవత్సరం నుంచి అమలుచేయాలని సీబీఎస్ఈ నిర్ణయించింది.

6. Why The Constitution Matters పుస్తక రచయిత?



1) డి.వై. చంద్రచూడ్
2) జస్టిస్ రమణ
3) సంజయ్ ఖన్నా
4) బి.వి. నాగరత్న

7. అంతర్జాతీయ సౌరకూటమిలో 107వ దేశంగా చేరిన దేశం ఏది?
1) మాల్దోవా 2) ఫిజీ
3) నమీబియా 4) అంగోలా

8. సబాటికల్ సెలవు (వ్యక్తిగత, వృత్తిపరమైన పురోగతి కోసం తీసుకునే సెలవు) ప్రభుత్వ ఉద్యోగులకు అనుమతించిన మొదటి రాష్ట్రం ఏది?
1) అస్సాం 2) మణిపుర్
3) గోవా 4) సిక్కిం

9. ప్రపంచంలో మొదటి రోబో మాల్ ఏ దేశంలో ప్రారంభమైంది?




1) రష్యా 2) అమెరికా
3) చైనా 4) ఇండియా
నోట్: ఇది మొదటి 4s స్టోర్. 4s అంటే సేల్స్, సర్వీస్, స్పేర్‌పార్ట్స్, సర్వీస్ కస్టమర్ ఫీడ్‌బ్యాక్.

10. ఇటీవల మరణించిన జిమ్ లోవెల్‌కి సంబంధించి సరైంది?
1) రాజకీయ నాయకుడు
2) ప్రముఖ న్యాయ నిపుణుడు
3) ప్రముఖ వైద్యుడు 4) ఆస్ట్రోనాట్
నోట్: నాలుగుసార్లు రోదసీ యాత్ర చేపట్టిన తొలి వ్యోమగామి.

11. ఇటీవల వార్తల్లో నిలిచిన రిషభ్ యాదవ్ ఏ క్రీడకు చెందినవారు?
1) బాక్సింగ్ 2) చెస్
3) హాకీ 4) ఆర్చరీ
నోట్: ప్రపంచ క్రీడల్లో వ్యక్తిగత కాంపౌండ్ విభాగంలో కాంస్య పతకం సాధించాడు.

12. భారత 89వ చెస్ గ్రాండ్ మాస్టర్ ఎవరు?
1) రోహిత్ కృష్ణ 2) హరికృష్ణ
3) అనిల్ చౌదరి 4) బాల చౌదరి

13. అత్యధిక కాలం కేంద్ర హోంమంత్రిగా పనిచేసిన వ్యక్తిగా అమిత్ షా రికార్డు సృష్టించారు. (ఆగస్టు 5, 2025 నాటికి 6 సంవత్సరాల 68 రోజులు పూర్తయ్యాయి.) అయితే ఈయన ఎవరి రికార్డును అధిగమించారు?


అమిత్ షా

1) సర్దార్ వల్లభాయ్ పటేల్
2) ఎల్.కె. అడ్వానీ
3) జి.బి. పంత్ 4) కైలాస్‌నాథ్ కట్జు

14. సరకు రవాణా సామర్థ్యాన్ని పెంచడమే లక్ష్యంగా తూర్పు మధ్య రైల్వే 4.5 కి.మీ. పొడవైన గూడ్స్ రైలును 2025, ఆగస్టు 7న నడిపింది. దాని పేరేమిటి?
1) శక్తి 2) రుద్రాక్ష 3) గరుడ 4) నమో

15. కింది వాటిలో సరైంది?
ఎ) భారతదేశంలో మొదటి డ్రోన్ ఆధారిత కృత్రిమ వర్ష పరీక్షను రాజస్థాన్ ప్రభుత్వం ప్రారంభించింది.
బి) మధ్యప్రదేశ్‌లో రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ 'బ్రహ్మ' పేరుతో రూ.1800 కోట్లతో రైలు కర్మాగారానికి శంకుస్థాపన చేశారు.
సి) బ్రిటన్‌లో చదువుకోవడానికి 'అటల్ చెవెనింగ్ స్కాలర్‌షిప్'ను ఇటీవల ఉత్తర్‌ప్రదేశ్ ప్రారంభించింది.
డి) ఇటీవల రాజస్థాన్‌లోని 'ఖైర్తల్-తిజారా' జిల్లా పేరును 'భర్తృహరి నగర్'గా మార్పు చేశారు.
1) ఎ, బి, డి 2) ఎ, బి, సి
3) ఎ, బి, సి, డి 4) ఎ, బి

16. ఆస్ట్రేలియన్ పర్యాటక ప్రచారానికి బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరు నియమితులయ్యారు?
1) సానియా మీర్జా 2) అలియా భట్
3) కత్రినా కైఫ్ 4) సారా తెందూల్కర్

17. జాయింట్ సీ - 2025 ఉమ్మడి నావికాదళ విన్యాసాలు ఏ దేశాల మధ్య జరిగాయి?
1) ఇండియా - జపాన్ 2) చైనా - రష్యా
3) రష్యా - ఇండియా 4) అమెరికా - జపాన్

18. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఎన్ని లక్షల మంది మాత్రమే ఉచిత న్యాయసలహా పొందినట్లు 'ఇండియా జస్టిస్ రిపోర్ట్-2025'లో వెల్లడైంది?
1) 18.5 2) 15.5
3) 12.3 4) 16.5

19. 2024-25లో ఏ రాష్ట్రంలో 12,213 కి.మీ. మేర జాతీయ రహదారుల విస్తరణ జరిగి దేశంలోనే మొదటి స్థానంలో నిలిచింది?
1) మహారాష్ట్ర 2) గుజరాత్
3) ఆంధ్రప్రదేశ్ 4) తెలంగాణ
నోట్:
- రెండో స్థానం ఆంధ్రప్రదేశ్ 4,493 కి.మీ.
- మూడో స్థానం మధ్యప్రదేశ్ 4,147 కి.మీ.
- నాలుగో స్థానం గుజరాత్ 3,417 కి.మీ.
- ఐదో స్థానం తెలంగాణ 2,526 కి.మీ.

20. ఆధార్, ఓటరు ఐడీకార్డులతో భారత పౌరులు



కాలేరని ఇటీవల ఏ హైకోర్టు స్పష్టం చేసింది?
1) అలహాబాద్ హైకోర్టు 2) బాంబే హైకోర్టు
3) కటక్ హైకోర్టు 4) కలకత్తా హైకోర్టు

21. మహదాయి జల వివాద ట్రిబ్యునల్ పదవీకాలాన్ని ఇటీవల పొడిగించారు. అయితే ఈ ట్రిబ్యునల్ ఏ రాష్ట్రాల మధ్య నదీ జలాల పంపకంపై ఉన్న వివాదాన్ని పరిష్కరించడానికి 2010, నవంబరులో ఏర్పాటు చేశారు?
1) తమిళనాడు, కేరళ, కర్ణాటక
2) తమిళనాడు, గోవా, కర్ణాటక
3) గోవా, మహారాష్ట్ర, కర్ణాటక
4) తమిళనాడు, మహారాష్ట్ర, కర్ణాటక

22. కింది వాటిలో సరైంది?
ఎ) ఐఎన్ఎస్ హిమగిరి యుద్ధ నౌకను గార్డెన్‌రీచ్ షిప్ బిల్డర్స్ అండ్ ఇంజినీర్స్ కంపెనీ నిర్మించింది.
బి) ఐఎన్ఎస్ ఉదయగిరి యుద్ధ నౌకను మజ్‌గావ్ డాక్ షిప్ బిల్డర్స్ నిర్మించింది.
సి) ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరిలను 'ప్రాజెక్టు-17'లో భాగంగా నిర్మించారు.
డి) ఇండియన్ నేవీ చరిత్రలో రెండు వేర్వేరు షిప్ యార్డుల్లో నిర్మించిన ఒకే క్లాసుకు చెందిన రెండు యుద్ధనౌకలు ఐఎన్ఎస్ హిమగిరి, ఐఎన్ఎస్ ఉదయగిరి.
1) ఎ, బి, సి 2) ఎ, బి
3) ఎ, బి, డి 4) ఎ, బి, సి, డి
నోట్:
- ఇవి రెండూ నీలగిరి క్లాస్ గైడెడ్ మిసైల్ ఫ్రిగేట్ తరగతికి చెందినవి.
- 6,670 టన్నుల బరువు, 149 మీటర్ల పొడవు ఉంటాయి.

23. ప్రధాని మోదీ వ్యక్తిగత భద్రతా విభాగం స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్‌పీజీ)లో తొలి మహిళా



అధికారిగా నియమితురాలైన 'అదాసో కపెసా' ఏ రాష్ట్రానికి చెందినవారు?
1) కేరళ 2) అరుణాచల్ ప్రదేశ్
3) మిజోరం 4) మణిపుర్

24. 3వ ఇండియా - సింగపూర్ మినిస్టీరియల్ రౌండ్ టేబుల్ సమావేశం 2025, ఆగస్టు 13న ఎక్కడ జరిగింది?
1) ముంబయి 2) చెన్నై
3) పనాజీ 4) న్యూ దిల్లీ

25. గ్రామసభ, ఇతర పంచాయతీ సమావేశాల ఆడియో, వీడియో రికార్డింగ్‌ల నుంచి ఆటోమేటిక్‌గా సమావేశ నివేదికలు తయారుచేసేందుకు పంచాయతీ మంత్రిత్వ శాఖ 2025, ఆగస్టు 14న ప్రారంభించిన ఏఐ టూల్ పేరు?
1) సభసార్ 2) నభిత
3) నందని 4) కిశోర్

26. ఒడిశా చేనేత పరిశ్రమ బ్రాండ్ అంబాసిడర్‌గా ఎవరు నియమితులయ్యారు?



1) సారా తెందూల్కర్ 2) సమంత
3) మాధురీ దీక్షిత్ 4) శ్రీలీల

27. అంతర్జాతీయ యువజన దినోత్సవాన్ని ఏ రోజున నిర్వహిస్తారు?
1) ఆగస్టు 15 2) ఆగస్టు 12
3) ఆగస్టు 13 4) ఆగస్టు 16
నోట్:
- 2025 ఇంటర్నేషనల్ యూత్ డే థీమ్ - 'లోకల్ యూత్ యాక్షన్స్ ఫర్ ది ఎస్‌డీజీఎస్ అండ్ బియాండ్'

28. ఇటీవల డబ్ల్యూహెచ్ఓ ఏ దేశాన్ని స్లీపింగ్ సిక్‌నెస్ వ్యాధిని నిర్మూలించిన దేశంగా గుర్తించింది?
1) జింబాబ్వే 2) కెన్యా
3) నమీబియా 4) జాంబియా



రచయిత: బి. ధన్‌మోహన్ రెడ్డి

సమాధానాలు

1-2, 2-2, 3-3, 4-3, 5-2, 6-1, 7-1, 8-4, 9-3, 10-4, 11-4, 12-1, 13-2, 14-2, 15-3, 16-4, 17-2, 18-2, 19-1, 20-2, 21-3, 22-4, 23-4, 24-4, 25-1, 26-3, 27-2, 28-2.

పర్యావరణాన్ని కాపాడుతూ.. సుస్థిరాభివృద్ధిని కాంక్షిస్తూ..!

సుస్థిరాభివృద్ధి - పర్యావరణం


నిపుణుల అభిప్రాయాలు

■ "నాణ్యమైన జీవనానికి ఆర్థికాభివృద్ధి అవసరం. అయితే పర్యావరణ కాలుష్యంలో బాహ్యవ్యయాలను పరిగణనలోకి తీసుకోరు. దీంతో వస్తు, సేవల ఉత్పత్తిపరంగా అభివృద్ధిని కొలవడం ఒక లోపం."

- జె.ఎం.కీన్స్, బ్రిటిష్ ఆర్థికవేత్త

■ "వాయు, నీటి కాలుష్యం; ఉత్పత్తి అయిన ఘన వ్యర్థాల పరిమాణాన్ని ఆర్థిక వృద్ధి వాస్తవ వ్యయంగా పరిగణించాలి. వీటి ద్వారా పర్యావరణానికి క్షీణత విలువను లెక్కించి.. దాన్ని నికర జాతీయోత్పత్తి నుంచి తీసేయాలి. తద్వారా మెరుగైన ఉత్పత్తి కొలతను పొందేందుకు వీలుంటుంది."

- ఎడ్వర్డ్ ఎఫ్ డెన్నిసన్, అమెరికన్ ఆర్థికవేత్త



మానవ సంక్షేమానికి సుస్థిరాభివృద్ధి చాలా ముఖ్యం. పర్యావరణంలో లభించే సహజవనరులను పరిమితంగా ఉపయోగించుకుని.. వాటిని భవిష్యత్తు తరాలకు అందించడమే సుస్థిరాభివృద్ధి. పర్యావరణం, ఆర్థిక వ్యవస్థ ఒకదానిపై ఒకటి ఆధారపడి ఉంటాయి. అందుకే పర్యావరణాన్ని కాపాడుకుంటూనే సుస్థిరాభివృద్ధి కోసం కృషిచేయాలి. ఆర్థికాభివృద్ధిపై పర్యావరణం ఏ విధంగా ప్రభావాన్ని చూపుతుంది, పర్యావరణ పరిరక్షణలో అంతర్జాతీయంగా భారత్ స్థానం లాంటి విషయాలపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం
ఇండియన్ ఎకానమీ

పర్యావరణం - విధులు

పర్యావరణం అనే భావనలో జీవ, నిర్జీవ అంశాలు ఉంటాయి. జీవ అంశాల్లో మొక్కలు, పక్షులు, జంతువులు మొదలైనవి ఉంటే; నిర్జీవ అంశాల్లో గాలి, నీరు, భూమి తదితరాలు ఉంటాయి. వీటి మధ్య ఉన్న పరస్పర సంబంధాన్ని అధ్యయనం చేయడమే పర్యావరణశాస్త్ర ముఖ్య ఉద్దేశం.

విధులు: ఇది పునరుత్పాదకం అయ్యే, కాని వనరులను సరఫరా చేస్తుంది. పునరుత్పాదక వనరులకు అడవుల్లోని చెట్లు, మహాసముద్రాల్లోని చేపలు మొదలైనవి ఉదాహరణలు. పునరుత్పాదకంకాని వనరులకు ఉదాహరణ శిలాజ ఇంధనాలు.

- ఇది వ్యర్థాలను తనలో కలుపుకుంటుంది.
- జెనెటిక్, జీవ వైవిధ్యాన్ని అందించడం ద్వారా జీవ మనుగడను కొనసాగిస్తుంది.

పర్యావరణాన్ని ప్రభావితం చేసే అంశాలు

పర్యావరణాన్ని ప్రధానంగా మూడు అంశాలు ప్రభావితం చేస్తాయి. అవి:

1. **జనాభా:** ఇది పరిమాణాన్ని సూచిస్తుంది.
2. **తలసరి వస్తువుల లభ్యత:** ఉత్పత్తి లేదా వినియోగాన్ని తెలుపుతుంది.
3. **కాలుష్యం:** ఒక యూనిట్ ఆర్థిక వస్తువుకు ఉత్పత్తి లేదా వినియోగం అయ్యే మొత్తం కాలుష్యాన్ని ఇందులో తీసుకుంటారు. ఇది సాంకేతిక స్వభావాన్ని కలిగి ఉంటుంది.

■ దీని ప్రకారం పర్యావరణ ప్రభావాన్ని కింది విధంగా పేర్కొంటారు.

పర్యావరణ ప్రభావం × జనాభా ఆర్థిక వ్యవస్థ × ఆర్థిక వస్తువు కాలుష్యం

■ పై సమీకరణంలో మూడు కారకాల మధ్య ఉండే సంబంధం మొత్తం పర్యావరణ ప్రభావాన్ని అంచనా వేయడానికి ఉపయోగపడుతుంది.

■ ఆర్థిక ప్రక్రియలో పర్యావరణ ప్రభావం అనేది పర్యావరణ వ్యయాన్ని సూచిస్తుంది. మానవులు.. ఉత్పత్తి, వినియోగ కార్యకలాపాల ద్వారా వస్తువులను సహజ వాతావరణంలోకి ప్రవేశపెడతారు. తద్వారా క్షీణత సంభవిస్తుంది. జనాభా పెరుగుదల కూడా పర్యావరణ క్షీణతకు ప్రధాన కారణం.

■ కెన్నెత్ బౌల్డింగ్ అనే అమెరికన్ ఆర్థికవేత్త అభిప్రాయం ప్రకారం, "పెరుగుతున్న జనాభా అవసరాలకు తగ్గట్లు సహజ వనరుల లభ్యత ఉండదు. అయినప్పటికీ వారు ఎలాంటి పరిమితి లేకుండా వాటిని ఉపయోగించుకుంటున్నారు. తిరిగి ఉత్పత్తి చేయలేని వనరులను భవిష్యత్తు అవసరాల దృష్ట్యా కాపాడుకోవాలనే ఉద్దేశంతో పర్యావరణ వనరులపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలి."



రచయిత
బండారి ధనుంజయ
విషయ నిపుణులు

ఆర్థికాభివృద్ధిపై పర్యావరణ ప్రభావం

ఆర్థికాభివృద్ధి అంటే వాస్తవ ఉత్పత్తిలో పెరుగుదల. పెరిగిన ఉత్పత్తి, వినియోగంతో పర్యావరణంపై చేసిన వ్యయాన్ని అంచనా వేయొచ్చు. ఆర్థికాభివృద్ధి వల్ల పర్యావరణంపై పడే ప్రభావాన్ని పునరుత్పాదకం కాని వనరుల వినియోగం, అధిక స్థాయి కాలుష్యం, భూమి ఉష్ణోగ్రతలు పెరగడం, పర్యావరణ ఆవాసాల నష్టం మొదలైన వాటి ద్వారా తెలుసుకోవచ్చు.

వాయుకాలుష్యం: మన దేశంలో వాయు కాలుష్యం పట్టణ ప్రాంతాల్లో; పరిశ్రమలు, థర్మల్ విద్యుత్ కేంద్రాలు ఉన్నచోట అధికంగా ఉంటోంది. నగరాల్లో నివసించే 80% మందికి వ్యక్తిగత వాహనాలు ఉన్నాయి. వీటి సంచారం ఎక్కువగా ఉండటంతో అక్కడ గాలి కలుషితం అవుతోంది.

- ప్రపంచవ్యాప్తంగా మొదటి 10 పారిశ్రామిక దేశాల్లో భారత్ ఒకటిగా నిలిచింది. దీంతోపాటు పర్యావరణ కాలుష్యం, ప్రణాళిక లేని పట్టణీకరణ, ప్రమాదాలకు అవకాశం లాంటివాటిలోనూ మనం ముందున్నాం.

గ్లోబల్ వార్మింగ్: భూవాతావరణంలో గ్రీన్ హౌస్ (హరిత గృహ) వాయువులు పెరిగిపోయి, భూమి సగటు ఉష్ణోగ్రతలు అధికం కావడాన్ని గ్లోబల్ వార్మింగ్ అంటారు.

- శిలాజ ఇంధనాల వాడకం, అడవులు నరకడం మొదలైన మానవ చర్యల వల్ల గాలిలో కార్బన్ డైఆక్సైడ్, మీథేన్ లాంటి గ్రీన్‌హౌస్ వాయువులు ఎక్కువయ్యాయి.
- వీటికి ఉష్ణాన్ని గ్రహించే సామర్థ్యం ఉంటుంది. దీంతో భూఉపరితలం వేడెక్కుతోంది. గత వందేళ్లలో భూఉపరితల ఉష్ణోగ్రతలు 1.1°F (0.6°C) పెరిగాయి. దీంతో ధ్రువప్రాంతాల్లో మంచు కరిగి, సముద్ర మట్టం పెరుగుతోంది.

ఓజోన్ పొర క్షీణత: స్ట్రాటో ఆవరణంలో ఉండే క్లోరిన్, బ్రోమిన్ సంబంధ పదార్థాల వల్ల ఓజోన్ పొర క్షీణిస్తోంది. రిఫ్రిజిరేటర్లు, ఎయిర్ కండిషనర్ల నుంచి వెలువడే క్లోరోఫ్లోరోకార్బన్లు (CFC), బ్రోమోఫ్లోరోకార్బన్లు (Halons) వాతావరణంలో చేరి క్లోరిన్, బ్రోమిన్ పదార్థాలుగా మారుతున్నాయి.

మృత్తికా క్రమక్షయం: అటవీ నిర్మూలన, వంటచెరకు, పశుగ్రాసం సేకరణ, పోడువ్యవసాయం, ఎరువులు, పురుగుమందుల అధిక వినియోగం, సాగునీటి వ్యవస్థల నిర్వహణలో సరైన ప్రణాళిక లోపించడం, భూగర్భ జలాలను అధికంగా తోడెయ్యడం, వ్యవసాయం - ఇళ్లు - పరిశ్రమల కోసం పరిమితంగా ఉన్న భూమిపై ఒత్తిడి కలిగించడం వల్ల మృత్తికా క్రమక్షయం ఏర్పడుతుంది.

పర్యావరణ పని తీరు సూచీ - 2024

ఎన్విరాన్‌మెంటల్ పెర్ఫార్మెన్స్ సూచిక (Environment Performance Index) అనేది దేశాల పర్యావరణ స్థితిగతులను అంచనా వేసే గ్లోబల్ ర్యాంకింగ్ సిస్టం. 2024 ఏడాదికి సంబంధించిన నివేదికను అమెరికాలోని యేల్ సెంటర్ ఫర్ ఎన్విరాన్మెంటల్ లా అండ్ పాలసీ, కొలంబియా సెంటర్ ఫర్ ఇంటర్నేషనల్ ఎర్త్ సైన్స్ ఇన్ఫర్మేషన్ నెట్‌వర్క్ సంయుక్తంగా తయారు చేశాయి. దీన్ని ప్రతి రెండేళ్లకోసారి విడుదల చేస్తారు.

- జీవవైవిధ్యం, వాయు కాలుష్యం, గాలి - నీటి నాణ్యత, వ్యర్థాల నిర్వహణ లాంటి 58 అంశాలను పరిగణనలోకి తీసుకుని ఈ సూచీని రూపొందించారు.
- 2024 సూచీలో మొత్తం 180 దేశాలకు ర్యాంకింగ్స్ ప్రకటించారు. ఎస్తోనియా (75.3 స్కోరు), లక్సెంబర్గ్ (75), జర్మనీ (74.6), ఫిన్లాండ్ (73.7), బ్రిటన్ (72.7) వరుసగా తొలి అయిదు స్థానాల్లో నిలిచాయి.
- భారత్ 27.6 స్కోరుతో సూచీలో 176వ ర్యాంకులో ఉంది. తర్వాతి స్థానాల్లో వరుసగా మయన్మార్ (26.9), లావోస్ (26.1), పాకిస్థాన్ (25.5), వియత్నాం (24.5) ఉన్నాయి.

748 Word of the Day

Illustrious

Telugu meaning: ప్రముఖ, చిరస్మరణీయ

English meaning: The word 'illustrious' (ఇల్లస్ట్రియస్) is an adjective that describes someone wellknown and respected for past achievements.

Synonyms: Renowned, Eminent

Antonyms: Unknown, Ordinary

Usage: **1.** He had an illustrious career in science, earning awards and recognition worldwide.

2. Many illustrious leaders have shaped the course of history with their vision and courage.

Current Affairs



Manika Vishwakarma from Rajasthan was crowned Miss Universe India 2025 in Jaipur on 19 August 2025. She received the title from the former Miss Universe India 2024, Rhea Singha.

✦ Manika Vishwakarma was chosen Miss Universe India out of 48 contestants. The first runner-up was Tanya Sharma from Uttar Pradesh, followed by Mehak Dhingra from Haryana as the second runner-up, and Amishi Kaushik was the third runner-up.



Prime Minister Narendra Modi met Chinese Foreign Minister Wang Yi in New Delhi on 19 August 2025. Modi stressed the need for peace and stability along the India-China border and reiterated India's commitment to a fair and mutually acceptable boundary resolution. During the meeting, PM Modi welcomed what he described as "steady and positive progress" in bilateral relations since his discussions with Xi in Kazan last year (2024).

Parliament passed the Mines and Minerals (Development and Regulation) Amendment Bill, with Rajya Sabha approving it on 19 August 2025. The bill aimed at promoting sustainable mining, zero-waste practices, and advancing the objectives of the National Critical Mineral Mission.

The total Assets Under Management (AUM) of Infrastructure Investment Trusts (InvITs) in India have reached $73 billion in FY 2025, driven by large-scale infrastructure investments, according to the Knight Frank report. This figure is projected to grow 3.5 times to $257.9 billion by 2030.

For more Current Affairs: Scan QR code

ప్రపంచ వ్యవస్థాపకుల దినోత్సవం

ఆగస్టు 21
చరిత్రలో ఈనాడు

ఆర్థిక ప్రగతి, స్వయం సమృద్ధిలో అంకురాలు (స్టార్టప్స్) ఎంతో కీలకం. వాటిని నెలకొల్పినవారిని గౌరవించాలనే లక్ష్యంతో ఏటా ఆగస్టు 21న 'ప్రపంచ వ్యవస్థాపకుల దినోత్సవం'గా (World Entrepreneurs Day) నిర్వహిస్తారు. కొత్తగా వ్యాపారాన్ని ప్రారంభించాలనే ఆలోచనను వాస్తవ రూపంలోకి తెచ్చి.. ఆర్థిక ఒడిదొడుకులను తట్టుకుని.. ఉద్యోగులకు మార్గదర్శనం చేస్తూ.. వ్యవస్థను ముందుండి నడిపే గొప్ప శక్తే 'ఎంట్రప్రెన్యూర్'. ఆవిష్కరణలను పెంపొందించడంలో, ఆర్థిక వృద్ధిని సాధించడంలో, స్థితిస్థాపక సమాజాన్ని నిర్మించడంలో వీరు ముఖ్య పాత్ర పోషిస్తారు. సాధారణంగా వీరు చిన్న స్థాయిలో వ్యాపారాన్ని ప్రారంభించి, అంచెలంచెలుగా దాన్ని అభివృద్ధి చేయడంపైనే ఎక్కువగా దృష్టి సారిస్తారు. సిద్ధాంతాలు, ఆదర్శాలతో సంస్థను తీర్చిదిద్దుతారు. దేశ ప్రజలకు ఉపాధి కల్పనలో ఆర్థికాభివృద్ధిలో వీరు కీలకంగా వ్యవహరిస్తారు. ఆర్థిక వ్యవస్థ బలోపేతానికి వీరు చేస్తోన్న కృషిని అభినందించడంతోపాటు సాధికారత కల్పించడం ఈ రోజు ముఖ్య ఉద్దేశం.

■ ప్రపంచంలో మూడో అతిపెద్ద స్టార్టప్ ఎకోసిస్టం కలిగిన దేశంగా భారత్ అవతరించినట్లు వరల్డ్ ఎకనామిక్ ఫోరం ఇటీవల పేర్కొంది.



■ కేంద్ర ప్రభుత్వ గణాంకాల ప్రకారం 2025, జూన్ 30 నాటికి దేశంలో ప్రభుత్వ గుర్తింపు పొందిన స్టార్టప్‌ల సంఖ్య 1,80,683. 2016లో వీటి సంఖ్య కేవలం 500 మాత్రమే. దేశంలో అంకుర సంస్థలను నెలకొల్పేలా ప్రోత్సహించే ఉద్దేశంతో ప్రభుత్వం 2016, జనవరి 16న స్టార్టప్ ఇండియా కార్యక్రమాన్ని తీసుకొచ్చింది. దీని ద్వారా వ్యాపారానికి కావాల్సిన అనుమతులను వేగవంతం చేయడంతోపాటు.. వ్యాపార ప్రారంభ దశ నుంచి విస్తరణ దశ వరకు నిధుల మద్దతు కల్పిస్తారు.


■ 2025, జులై నాటికి మన దేశ అంకురాల్లో 118 యూనికార్న్ హోదా (రూ.వంద కోట్లు లేదా అంతకంటే ఎక్కువ విలువ) పొందాయి. ప్రపంచంలో మొత్తం యూనికార్న్‌ల సృష్టిలో భారత్ మూడో స్థానంలో ఉంది. మొదటి స్థానంలో అమెరికా (1050), రెండో ర్యాంకులో చైనా (245) ఉన్నాయి.

చారిత్రక నేపథ్యం:

ప్రపంచ వ్యవస్థాపకుల దినోత్సవాన్ని మొదటిసారి 2010లో నిర్వహించారు. గ్రాస్‌హాపర్ కంపెనీ సహవ్యవస్థాపకులైన డేవిడ్ హౌసర్, సియామక్ తగ్దోస్ ఈ రోజును ప్రతిపాదించారు. స్థిరమైన ఆర్థిక వృద్ధిని పెంపొందించడంలో, పేదరికాన్ని తగ్గించడంలో వ్యవస్థాపకుల కృషిని తెలియజేయడంతోపాటు వారిని గౌరవించుకోవాలనే ఉద్దేశంతో దీన్ని నెలకొల్పారు. ప్రపంచవ్యాప్తంగా 170 దేశాల్లో ఈ దినోత్సవాన్ని అధికారికంగా జరుపుతున్నారు.

జనరల్ స్టడీస్ - భారతదేశ చరిత్ర

ప్రాంతీయ రాజ్యాలు



మొగలులు సువిశాల భారత దేశాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుని పాలించారు. ఔరంగజేబ్ మరణించాక మొగల్ సామ్రాజ్యం అనేక స్వతంత్ర రాజ్యాలుగా విడిపోయింది. మొగల్ చక్రవర్తుల కింద సుమారు 200 ఏళ్లుగా ఉన్న రాజకీయ ఐక్యత భగ్నమైంది. ఫలితంగా ఆర్థిక, సాంస్కృతిక రంగాల్లో అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. 18వ శతాబ్దం నాటికి ఆంగ్లేయులు భారతదేశ రాజకీయాలను శాసించే స్థాయికి ఎదిగారు. దేశం అనేక చిన్న రాజ్యాలుగా విడిపోయింది. ఆ కాలంలో భారత్‌లోని స్వతంత్ర రాజ్యాలు, వాటి పాత్ర మొదలైన వాటిపై పోటీపరీక్షార్థికి అవగాహన ఉండాలి.

1757లో జరిగిన ప్లాసీ యుద్ధంతో భారతదేశ చరిత్రలో బ్రిటిష్ యుగం మొదలైందని చరిత్రకారులు పేర్కొంటారు. అయితే కొందరు మాత్రం 1761లో మూడో పానిపట్ యుద్ధంతో ప్రారంభమైందని భావిస్తారు.

18వ శతాబ్దంపై అభిప్రాయాలు

భారతదేశ చరిత్రలో 18వ శతాబ్దాన్ని పతన, చీకటి యుగంగా పేర్కొంటారు. అయితే ఈ కాలాన్ని ఒక ముఖ్యమైన సంధి యుగంగా చరిత్రకారులు గుర్తించారు. "ఈ సమయంలోనే మొగల్ సామ్రాజ్యం పతనమై, అనేక చిన్న రాజ్యాల ఆవిర్భావానికి కారణమైంది. ఈస్టిండియా కంపెనీ ఒక రాజకీయ శక్తిగా ఆవిర్భవించింది" అని వారు అభిప్రాయపడ్డారు.

ప్రాంతీయ రాజ్యాలు

- బెంగాల్
- మైసూర్
- పంజాబ్
- అవధ్ (అయోధ్య)
- హైదరాబాద్
- కేరళ (మలబార్)

18వ శతాబ్దం నాటి పరిస్థితులు

- ఆర్థిక పరిస్థితులు
- సమాజం - సంస్కృతి

విద్య

18వ శతాబ్దంలో ప్రాథమిక విద్య విస్తృతంగా వ్యాపించింది. బ్రిటిష్ వారి కాలంలో కంటే ఆ కాలంలో సగటు అక్షరాస్యత ఎక్కువగా ఉంది. ఉన్నత వర్గాలకు చెందిన స్త్రీ, పురుషులు మాత్రమే ఉన్నత విద్యను అభ్యసించేవారు.

- సమాజంలో ఉపాధ్యాయులకు గౌరవం ఉండేది. స్త్రీ విద్య అభివృద్ధి చెందలేదు.

దక్షిణ భారతదేశ రాజ్యాలు/ నాయకులు మొదలైన అంశాలతో సహా పూర్తి సమాచారం ఈనాడు ఈప్రతిభ వెబ్‌సైట్‌లో 'జనరల్ స్టడీస్ ఈ-బుక్స్' కోర్సులో ఈ-బుక్ రూపంలో అందుబాటులో ఉంది. మరిన్ని వివరాలకు క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.

Latest Updates

Jobs in Ordnance Factory Medak

Ordnance Factory Medak (OFMK) is inviting applications for the Manager and Technician posts in various departments on a contractual basis. The total no. of posts is 37. Eligible candidates can apply online before 6 September 2025.

Technical Assistant Posts

National Institute of Animal Biotechnology (NIAB), Hyderabad, is inviting applications for the Technical Assistant posts on a contractual basis. The total no. of posts is 14. The last date for receipt of online applications is 23 August 2025.

Faculty Jobs

Employees' State Insurance Corporation (ESIC), Bengaluru, is conducting interviews for the Assistant Professor and Associate Professor posts in various departments on a contractual basis. There are 13 posts in total. Eligible candidates can appear for interviews on 29 August 2025.

Did You Apply..?

Today (August 21) is the last date for the following Jobs.

- IBPS - Customer Service Associate (CSA) - 10,277 posts. ***Eligibility:*** Degree.
- Young Professional Jobs in the Staff Selection Commission. ***Eligibility:*** Degree.
- Manager posts in THDC. ***Eligibility:*** CA/CMA.
- Officer Jobs at IIM Mumbai. ***Eligibility:*** PG, PhD.

For more information and other notifications - scan QR code

Double Lineup Puzzles

Directions (Qs. 1 - 3): *Six persons - A, B, C, D, E and F attend different number of lectures and are after the others but not in the same order as given. D attend more lectures than B but not the highest. Two persons attend the lectures between D and E. F attends more lectures than A. One person attends the lecture between C and A. C does not attend more number of lectures than B. C does not attend the least number of lectures.*

1. Who among the following attend 3rd highest number of lectures?
A) B B) A C) D D) F E) C

2. Who among the following attends just less number of lectures than B?
A) E B) A C) C D) F
E) Can not be determined

3. Which of the following pairs of persons attends the highest and second smallest number of lectures respectively?
A) E, A B) E, C C) F, B
D) F, A E) F, E

Directions (Qs. 4 - 8): *Study the following information carefully and answer the questions given below:*

Seven persons - P, Q, R, S, T, U and V have different designations i.e Vice Chancellor (VC), Director (DR),

Bank Exams

Reasoning

Director Of Nursing (DON), Head of the Department (HOD) Principal, and Professor and Assistant Professor in a company. The order of seniority is the same as given above i.e Vice Chancellor is the senior most designation and Assistant Professor is the junior's most designation. At most two persons are senior to R. Two designations gap between R and V who is not a professor. one designation gap between P and T and both of them are senior to V. There are as many Juniors to P as senior to U. S is Junior to Q.

4. How many persons are senior to Q?
A) Three B) One C) Four
D) Two E) None

5. Who among the following is designated as principal?
A) P B) Q C) T D) V E) S

6. The number of persons designated between R and U is same as the number of persons designated before ....
A) S B) V C) Q
D) T E) None of these

7. Who among the following is three post junior to the one who is just senior to R?
A) Q B) Director C) S
D) Director of Nursing
E) Both Q and Director of Nursing

8. If all the persons are arranged according to the alphabetical order from top to bottom, then how many persons remain unchanged except P?
A) One B) Two C) None
D) Three E) None of these

Directions (Qs. 9 - 13): *Study the following information carefully to answer the given questions.*

Seven persons - P, Q, R, S, T, U and V are designated at seven different designations - Senior Executive, Executive, SO, HR, Product Head, ST and Admin in a company. The designations are given in decreasing order such as Senior Executive is the senior most designation and Admin is the junior most designation.

More than two persons are senior to R only two persons are designated between R and V. V is designated as senior to SO. Q is designated two persons senior to S but junior to R. As many persons designated between Q and S as between Q and U. P is senior to T.

9. How many persons are designated between V and Q?
A) Three B) Four C) Five
D) One E) Two

10. Who among the following is designated as Executive?
A) R B) P C) V D) Q E) T

11. As many persons are senior to U as junior to ....
A) R B) S C) Q D) T E) P

12. If V is related to U, in the similar way P is related to R then who among the following is related to S?
A) P B) T C) U D) Q E) V

13. Which among the following statement is/ are true?
I. V is the senior most person among all.
II. More than three persons are junior to R.
III. Odd number of persons designated between P and T.
A) Only II B) Only I
C) All I, II and III
D) Both I and III.
E) None

Scan the QR code for Key

These model questions were prepared by
Rajesh Madhu
Asst. Prof. of Mathematics.

నేతల ఉద్వాసన బిల్లుపై మండిపడ్డ విపక్షాలు

• ప్రభుత్వాలను కూల్చడమే కేంద్రం ఉద్దేశమని విమర్శ

దిల్లీ: నేరారోపణలు ఎదుర్కొంటూ ప్రభుత్వాల్లో కొనసాగేవారికి ఉద్వాసన పలకడానికి కేంద్ర సర్కారు తీసుకువచ్చిన బిల్లుల్ని విపక్షాలు తీవ్రంగా తప్పుపట్టాయి. ఏదో ఒక మిషతో విపక్షపాలిత ప్రభుత్వాలను కూలదోయడమే దీని ఉద్దేశమని మండిపడ్డాయి. బిల్లుల్ని బుధవారం లోక్‌సభలో ప్రవేశపెట్టగానే పార్లమెంటు ఆవరణలో, ఇతర చోట్ల వివిధ పార్టీల గళాలు ఇలా స్పందించాయి.

ప్రధానికి నచ్చకపోతే కేసులు పెడతారు

కొత్త బిల్లుతో మనం మళ్లీ మధ్యయుగానికి వెళ్తున్నాం. అప్పట్లో రాజు ఇష్టాలో ఎవరినైనా తొలగించగలిగేవారు. ఇప్పుడూ అలానే చేస్తున్నారు. ప్రధానికి మన మొహం నచ్చకపోతే కేసు పెట్టమని ఈడీకి చెబుతారు. ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికైన వ్యక్తి ఆ వెంటనే పదవీచ్యుతుడవుతారు.
– రాహుల్ గాంధీ, లోక్‌సభ విపక్ష నేత

పార్లమెంటు ఈ స్థాయికి చేరింది

అధికారపార్టీ భావజాలాన్ని అమలుచేసే స్థాయికి పార్లమెంటు చేరింది. ఎలాంటి చర్చలేకుండానే ముఖ్యమైన బిల్లులను ఆదరాబాదరాగా ఆమోదింపజేసుకుంటున్నారు. ఇలాంటి చర్యలు పార్లమెంటును నిష్ఫలం చేస్తాయి, సమర్థవంతమైన చర్చా వేదిక గుణాన్ని తుడిచిపెడుతున్నాయి.
– మల్లికార్జున ఖర్గే, రాజ్యసభ విపక్ష నేత

సూపర్ ఎమర్జెన్సీ కంటే తీవ్రం

దేశంలో ప్రజాస్వామ్యాన్ని శాశ్వతంగా సమాధి చేయడానికే ప్రభుత్వం రాజ్యాంగ సవరణకు ప్రయత్నిస్తోంది. ఇది 'సూపర్ ఎమర్జెన్సీ' కంటే తీవ్రమైనది. దేశ న్యాయ వ్యవస్థ స్వతంత్రతను ఇది అంతం చేస్తుంది. 'ఒక మనిషి, ఒక పార్టీ, ఒక ప్రభుత్వం' అనేలా వ్యవస్థను మార్చడమే బిల్లు ప్రధానోద్దేశం. రాజ్యాంగ ప్రాథమిక స్వరూపాన్నే ప్రభుత్వం కాలరాయబోతోంది.
– మమతా బెనర్జీ, తృణమూల్ కాంగ్రెస్ అధ్యక్షురాలు, పశ్చిమబెంగాల్ సీఎం

ప్రజాస్వామ్యంపై దాడి

ప్రభుత్వ ప్రయత్నం ప్రజాస్వామ్యంపై నేరుగా దాడి. సమాఖ్య తత్వానికి మృత్యుగంట. ఇది నయా నియంతృత్వం. ఎన్నికైన ప్రభుత్వాలను కూల్చడమే సర్కారు ఉద్దేశం.
– ఎం.ఎ.బేబీ, సీపీఎం ప్రధాన కార్యదర్శి

ప్రతీకార రాజకీయాలకు గేటెత్తారు

ప్రతీకార రాజకీయాలకు ప్రభుత్వం గేట్లు తెరిచింది.
– రాజ్యసభ సభ్యుడు పి.సందోష్ కుమార్ (సీపీఐ)

భయభ్రాంతుల్ని చేసే ప్రయత్నం

విపక్ష పాలనలో ఉన్న ప్రభుత్వాలను భయభ్రాంతుల్ని చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తోంది. భాజపాలో చేరకపోతే అరెస్టు చేస్తామని భయాన్ని రేకెత్తించడమే బిల్లు ఉద్దేశం.
– శివసేన (యూబీటీ) నేత సంజయ్‌రౌత్

దురుద్దేశం ఉందేమో

చూడటానికి బిల్లు మంచిగానే ఉన్నా.. దీని వెనకాల ఏదైనా దురుద్దేశం ఉందేమో తెలియదు.
– కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్

అందుబాటులోకి అదనపు వైద్య సీట్లు

దిల్లీ: ప్రస్తుత విద్యా సంవత్సరంలో అదనంగా 8,000 అండర్ గ్రాడ్యుయేట్ (యూజీ), పోస్టు గ్రాడ్యుయేట్ (పీజీ) వైద్య సీట్లు అందుబాటులోకి రానున్నాయని జాతీయ వైద్య కమిషన్ (ఎన్‌ఎంసీ) అధిపతి డాక్టర్ అభిజాత్ సేథ్ ప్రకటించారు. వైద్య కళాశాలల్లో ప్రవేశాలకు సంబంధించి అవినీతి జరిగినట్లు ఆరోపణలు రావడంతో సీబీఐ దర్యాప్తు చేపట్టి, 34 మందిపై ఎఫ్ఐఆర్ దాఖలు చేసింది. ఈ దర్యాప్తు వల్ల మొత్తం మీద 8,000 అదనపు యూజీ, పీజీ సీట్లు అందుబాటులోకి వస్తాయని అభిజాత్ చెప్పారు. ఎంబీబీఎస్ చివర ఏడాది విద్యార్థులకు నేషనల్ ఎగ్జిట్ టెస్ట్ జరపాలని భావన ఉన్నా, రాష్ట్రస్థాయి విశ్వవిద్యాలయ పరీక్ష పద్ధతి నుంచి జాతీయ నమూనాకు మారడం మెల్లగా జరిగే పరిణామం అని వివరించారు.

భారీ వర్షంలోనూ విమానం సురక్షిత ల్యాండింగ్

ముంబయి: భారీ వర్షంలో కూడా ముంబయి విమానాశ్రయంలో విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేసిన ఎయిరిండియా పైలట్ ప్రశంసలు అందుకున్నారు. మంగళవారం ముంబయి ఎయిర్‌పోర్టులో ఊహించని స్థాయిలో వర్షం కురిసింది. వాతావరణ శాఖ బుధవారం ముంబయి నగరానికి ఆరెంజ్ అలర్ట్ జారీచేసింది. భారీ వర్షంతో కూడిన ప్రతికూల పరిస్థితుల మధ్య పైలట్ నేర్పుగా విమానాన్ని సురక్షితంగా ల్యాండ్ చేశారు. విమానంలోని ఓ ప్రయాణికుడు దీన్ని వీడియో తీసి సోషల్ మీడియా వేదికగా పైలట్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

వరద బాధిత కుటుంబాలకు నీతీశ్ కుమార్ సాయం

• రూ.456 కోట్లు నగదు బదిలీ

పట్నా: బిహార్‌లో వరదల వల్ల ప్రభావితమైన 12 జిల్లాల్లోని 6.51 లక్షలకుపైగా కుటుంబాలకు ముఖ్యమంత్రి నీతీశ్ కుమార్ రూ.456 కోట్ల సాయం అందించారు. పట్నాలోని ముఖ్యమంత్రి అధికారిక నివాసంలో జరిగిన కార్యక్రమంలో ఈ నగదును బదిలీచేశారు. ప్రతి కుటుంబానికి రూ.7 వేలు చొప్పున ఉచిత సహాయం అందిస్తున్నట్లు ముఖ్యమంత్రి కార్యాలయం ఓ ప్రకటనలో వెల్లడించింది.

దిల్లీలో భవనం కూలి ముగ్గురు కార్మికులు మృతి

దిల్లీ: సెంట్రల్ దిల్లీ దరియాగంజ్‌లోని సద్భావనా పార్కు సమీపంలో బుధవారం మూడంతస్తుల భవనం కూలడంతో ముగ్గురు కార్మికులు మృతిచెందారు. మృతులను జుబైర్, గులిసాగర్, తౌఫీక్‌లుగా గుర్తించామని పోలీసులు తెలిపారు. నిర్మాణ పనులు జరుగుతుండగా అకస్మాత్తుగా భవనం కూలిపోయిందని, శిథిలాల కింద చిక్కుకున్న మరో ముగ్గురిని రక్షించామని చెప్పారు.

ఘనంగా రాజీవ్ గాంధీ జయంతి

• ప్రధాని మోదీ, రాహుల్, కాంగ్రెస్ అగ్రనేతల నివాళి

దిల్లీ: భారత మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 81వ జయంతి వేడుకలను బుధవారం కాంగ్రెస్ ఘనంగా నిర్వహించింది. ఆ పార్టీ అగ్రనేతలతో పాటు, ప్రధానమంత్రి నరేంద్రమోదీ కూడా నివాళులర్పించారు. స్మృతి చిహ్నం వీర్ భూమి వద్ద స్మారక కార్యక్రమాన్ని మొదట ఏఐసీసీ నిర్వహించింది. ఆ తర్వాత సంవిధాన్ సదన్(పాత పార్లమెంట్ భవనం) వద్ద ఆయనకు నివాళులర్పించారు. కాంగ్రెస్ ఛైర్‌పర్సన్ సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకా వాద్రా, మల్లికార్జున ఖర్గే, స్పీకర్ ఓం బిర్లా సహా పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. "దేశంలో ప్రతి పౌరుడు గౌరవించేలా సద్భావనను కలిగి ఉండి రాజ్యాంగం సహా ప్రజాస్వామ్యంతో భారత దేశం బలంగా నిలబడాలి. నాన్నా.. మీరు కన్న ఈ కలను నెరవేర్చడమే నా జీవిత లక్ష్యం" అని రాహుల్ గాంధీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "మీ నుంచి దేశ భక్తి, ప్రేమ, కరుణ అనే మతాన్ని మేం వారసత్వంగా పుణికిపుచ్చుకున్నాం. నేను, రాహుల్ దీన్ని అనుసరిస్తాం. మమ్మల్ని ఎవరు విడదీయలేరు, ఎవరు ఆపలేరు. మా అడుగులు ఎప్పుడు తడబడవు" అని ప్రియాంక తెలిపారు. "మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా వందనాలు అర్పిస్తున్నాను" అని ప్రధాని మోదీ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "21వ శతాబ్దంలో ఎంతో మందికి స్ఫూర్తిగా నిలిచిన వ్యక్తి రాజీవ్ గాంధీ. 18 ఏళ్లకు ఓటు హక్కు, బలమైన పంచాయతీ రాజ్ వ్యవస్థ, ఐటీ విప్లవం, నూతన విద్యా వ్యవస్థను తీసుకువచ్చారు" అని ఆయన సేవలను కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే కొనియాడారు.


అమేఠీలో సైకిల్ రేస్: రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా ఉత్తర్‌ప్రదేశ్‌లోని అమేఠీ జిల్లా వ్యాప్తంగా వరుస కార్యక్రమాలను కాంగ్రెస్ నిర్వహించింది. 27వ వార్షిక ఎడిషన్‌లో భాగంగా సైతా నుంచి గౌరీగంజ్ వరకు ఏడు కిలోమీటర్ల సైకిల్ రైడ్‌ను నిర్వహించారు. అలానే షహగఢ్‌లోనూ ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఏర్పాటుచేశారు.



దిల్లీలోని సంవిధాన్ సదన్‌లో మాజీ ప్రధాని రాజీవ్‌గాంధీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి నివాళులర్పిస్తున్న లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ వైస్‌ఛైర్మన్ హరివంశ్ నారాయణ్ సింగ్, కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంకాగాంధీ, మల్లికార్జునఖర్గే, సోనియాగాంధీ, కేసీ వేణుగోపాల్


మాజీ ఉపరాష్ట్రపతి ధన్‌ఖడ్ ఎక్కడ?

• ఆయన మౌనంగా ఎందుకున్నారు! • ప్రశ్నించిన రాహుల్ గాంధీ



దిల్లీ: మాజీ ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామా అనంతరం ప్రజలకు కనిపించకపోవడంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ పలు ప్రశ్నలు సంధించారు. ఆయన ఎక్కడ దాక్కున్నారు? ఎందుకు పూర్తిగా మౌనంగా ఉన్నారంటూ ఆరా తీశారు. ప్రతిపక్షాల ఉమ్మడి ఉపరాష్ట్రపతి అభ్యర్థి జస్టిస్ బి.సుదర్శన్ రెడ్డిని బుధవారం సంవిధాన్ సదన్ సెంట్రల్ హాల్‌లో సత్కరించారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీ మాట్లాడుతూ.. 'ధన్‌ఖడ్ రాజీనామా వెనుక ఒక 'కథ' ఉంది. దాని గురించి ఒక్క మాట కూడా చెప్పలేని, దాక్కోవాల్సిన పరిస్థితుల్లో ఆయన ఎందుకున్నారో ఆశ్చర్యంగా ఉంది' అని పేర్కొన్నారు. 'ధన్‌ఖడ్ రాజీనామా చేయడానికి వెనుకున్న కథ ఏమిటో కొంత మందికి తెలిసి ఉండవచ్చు. మరికొందరికి తెలియకపోవచ్చు. కానీ బలమైన కథ మాత్రం ఉంది. మాజీ ఉపరాష్ట్రపతి ప్రస్తుతం అజ్ఞాతంలో ఉండటం వెనుక కూడా కథ ఉంది' అంటూ రాహుల్ గాంధీ నర్మగర్భంగా మాట్లాడారు. 'రాజ్యసభలో విరుచుకుపడే మనిషి, అకస్మాత్తుగా పూర్తిగా మౌనంగా మారిపోయారు. అంటే, మనం ఎలాంటి కాలంలో జీవిస్తున్నామో ఆలోచించండి' అని రాహుల్ గాంధీ ఎక్స్ వేదికగా ఓ పోస్ట్ పెట్టారు. జగదీప్ ధన్‌ఖడ్ గత నెలలో పార్లమెంటు వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన మొదటి రోజే అకస్మాత్తుగా ఉపరాష్ట్రపతి పదవికి రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

సల్మాన్ ఖుర్షీద్‌కు కొత్త బాధ్యతలు



కాంగ్రెస్‌పార్టీ విదేశీ వ్యవహారాల విభాగం ఛైర్‌పర్సన్‌గా సల్మాన్ ఖుర్షీద్, వైస్ ఛైర్‌పర్సన్లుగా బ్రిజేంద్ర సింగ్, ఆరతి క్రిషన్ బుధవారం నియమితులయ్యారు. కొద్ది రోజుల క్రితం ఛైర్‌పర్సన్ పదవికి ఆనంద్ శర్మ రాజీనామా చేయడంతో తాజా నియామకాలను చేపట్టినట్లు పార్టీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత వ్యవహారాలు) కె.సి.వేణుగోపాల్ ఓ ప్రకటనలో వెల్లడించారు.

రష్యా యుద్ధాన్ని విరమించాలనే

భారత్‌పై సుంకాల మోత: అమెరికా

న్యూయార్క్: ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధ విరమణను ప్రకటించేలా చేయటానికే అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై భారీ సుంకాలు విధించారంటూ శ్వేతసౌధం ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ కీలక వ్యాఖ్యలు చేశారు. ఆ యుద్ధాన్ని సాధ్యమైనంత త్వరగా ఆపాలన్న పట్టుదలతో ట్రంప్ ఉన్నారని, అందుకోసమే అన్ని వైపుల నుంచి రష్యాపై ఒత్తిడి తెస్తున్నారని విలేకరుల సమావేశంలో లీవిట్ పేర్కొన్నారు. అది ట్రంప్ పరిపాలన వ్యూహమని అభివర్ణించారు. నాటో సెక్రటరీ జనరల్, యూరోపియన్ నేతలు, ఉక్రెయిన్ అధ్యక్షుడితో జరిపిన చర్చలను యుద్ధం ముగింపునకు తొలి అడుగుగా పేర్కొన్నారు. ట్రంప్ అధికారంలో ఉండి ఉంటే అసలు రష్యా-ఉక్రెయిన్‌ల మధ్య యుద్ధం ప్రారంభమయ్యేది కాదని ఉద్ఘాటించారు.

మళ్లీ అదే పాట

భారత్- పాకిస్థాన్‌ల మధ్య ఇటీవలి యుద్ధాన్ని ట్రంప్ వాణిజ్య వ్యూహంతో ముగించారని లీవిట్ మరోసారి పేర్కొన్నారు. ఆయన జోక్యం చేసుకోకుంటే అణుయుద్ధానికి దారితీసేదన్నారు. కాల్పుల విరమణలో మూడో దేశం జోక్యం లేదని భారత్ పలుమార్లు స్పష్టం చేసినప్పటికీ అమెరికా ఇదే విషయాన్ని పునరుద్ఘాటిస్తోంది.

భారత్‌పై అమెరికా ఒత్తిళ్లు అన్యాయం

• పరిష్కార వ్యూహం మా వద్ద ఉంది
• దిల్లీ ఎగుమతులను మేం స్వాగతిస్తాం
• రష్యా దౌత్యాధికారి రోమన్ బబుష్కిన్ వెల్లడి

దిల్లీ: మాస్కో నుంచి చమురు కొనుగోలు చేస్తోందనే సాకుతో భారత్‌పై అధిక సుంకాల భారం మోపుతూ అమెరికా విసురుతున్న సవాళ్లను దీటుగా ఎదుర్కొనే ప్రత్యేక వ్యూహం తమ వద్ద ఉందని రష్యా దౌత్యాధికారి రోమన్ బబుష్కిన్ పేర్కొన్నారు. ప్రస్తుతం సవాళ్లతో కూడిన పరిస్థితిని దిల్లీ ఎదుర్కొంటోందని, అమెరికా ఒత్తిళ్లు అన్యాయమని తెలిపారు. భారత్‌కు ఎటువంటి ఇబ్బందిలేకుండా చమురు సరఫరా చేసేందుకు మాస్కోకు ప్రత్యేక వ్యవస్థ ఉందని రోమన్ బబుష్కిన్ బుధవారం దిల్లీలో వెల్లడించారు. రక్షణ, సైనిక ఉత్పత్తుల విషయంలో ఇరుదేశాల మధ్య సహకారం మరింత బలోపేతం అవుతుందని స్పష్టం చేశారు. ఆర్థిక వ్యవస్థలను ఆయుధంలా అమెరికా వాడుతోందని విమర్శించారు. అమెరికా మార్కెట్లకు సరకులను ఎగుమతి చేయడంలో భారత్ ఇబ్బంది పడుతుంటే.. రష్యా మార్కెట్లు స్వాగతం పలుకుతాయని భరోసానిచ్చారు. చిన్న, మాడ్యులర్ అణు రియాక్టర్లపై చర్చలు పురోగతిలో ఉన్నట్లు వెల్లడించారు. భారత్‌లో వివిధ రక్షణ ఉత్పత్తుల తయారీకి సరైన భాగస్వామి రష్యానేనని పేర్కొన్నారు. భారత్ తమకు చాలా ముఖ్యమైన దేశమని తెలిపారు.

భారత్‌కు ఇంధన సరఫరా కొనసాగుతుంది

• రష్యా ప్రథమ ఉప ప్రధాని డెనిస్ మంతురో వెల్లడి

మాస్కో: భారత్‌కు తమ దేశం నుంచి సహజవాయువు, చమురు, చమురు ఉత్పత్తుల సరఫరా కొనసాగుతుందని రష్యా ప్రథమ ఉప ప్రధాని డెనిస్ మంతురో వెల్లడించారు. విద్యుదుత్పత్తి, ఉక్కు తయారీకి అవసరమైన బొగ్గును కూడా రవాణా చేస్తామన్నారు. వాణిజ్య, ఆర్థిక, శాస్త్రసాంకేతికత, సాంస్కృతిక సహకారంపై ఏర్పాటైన భారత్-రష్యా అంతర్‌ప్రభుత్వ కమిషన్ 26వ సదస్సులో బుధవారం ఆయన మాట్లాడారు. భారత విదేశీ వ్యవహారాల మంత్రి ఎస్.జైశంకర్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అణువిద్యుత్ రంగంలోనూ ఇరు దేశాలు కలిపి పనిచేస్తాయన్నారు. వాణిజ్య లావాదేవీల్లో 90శాతం చెల్లింపులు రెండు దేశాల జాతీయ కరెన్సీల్లోనే జరుగుతున్నాయని తెలిపారు. వ్యవసాయం, పరిశ్రమలు, విద్య, వాణిజ్యం, ఆర్థిక రంగాల్లో సహకారాన్ని విస్తరించుకోవడంపై విపులంగా చర్చించినట్లు సదస్సు అనంతరం సామాజిక మాధ్యమం ద్వారా జైశంకర్ వెల్లడించారు.



పంజాబ్‌లోని జలంధర్‌లో భారీ వర్షాల కారణంగా నీరు చేరడంతో చెరువును తలపిస్తున్న ఓ ప్రధాన రహదారి

బెంగళూరు ఓటర్ల జాబితాలో అవకతవకలు...

రాహుల్ ఆరోపణలపై సిట్ దర్యాప్తు కోరుతూ వ్యాజ్యం

దిల్లీ: బెంగళూరు సెంట్రల్ తదితర నియోజకవర్గాల ఓటరు జాబితా తయారీలో జరిగిన అవకతవకలపై విచారణ జరిపేందుకు మాజీ న్యాయమూర్తి నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందం (సిట్) ఏర్పాటుచేయాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఈనెల 7న నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో బెంగళూరులో జరిగిన ఓటరు జాబితా అవకతవకల్ని ప్రస్తావించిన విషయాన్ని పిటిషనర్ ప్రస్తావించారు. కోర్టు ఆదేశాలు అమలయ్యే వరకూ ఓటరు జాబితా సవరణ, నిర్ధరణ చేపట్టరాదని, ఓటరు జాబితాల స్వతంత్ర ఆడిట్ జరగాలని పిటిషనర్ కోరారు. భాజపా, ఎన్నికల కమిషన్‌లు కుమ్మక్కై నియోజకవర్గంలో భారీ మోసానికి పాల్పడ్డాయంటూ లోక్‌సభలో ప్రతిపక్షనేత రాహుల్ గాంధీ సంచలనాత్మక వివరాలు ప్రకటించిన విషయాన్ని పిటిషనర్ ఉదహరించారు. ఓటరు జాబితాల తయారీ, నిర్వహణ, ప్రచురణలో పారదర్శకత, జవాబుదారీతనం పాటించేలా ఎన్నికల కమిషన్‌కు ఆదేశాలు జారీ చేయాలని న్యాయవాది కూడా అయిన పిటిషనర్ రోహిత్ పాండే పేర్కొన్నారు.

ప్రధాని డిగ్రీ వివరాలపై దిల్లీ హైకోర్టు తీర్పు వాయిదా

దిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తమ వద్ద పొందిన డిగ్రీ వివరాలను వెల్లడించాలన్న ప్రధాన సమాచార కమిషనర్ (సీఐసీ) ఆదేశాన్ని దిల్లీ విశ్వవిద్యాలయం సవాలు చేయగా దానిపై దిల్లీ హైకోర్టు తీర్పును వాయిదా వేసింది. రూలింగ్ ఇవ్వాల్సిన న్యాయమూర్తి జస్టిస్ సచిన్ దత్తా బుధవారం రాకపోవడంతో తీర్పు ఈ నెల 25వ తేదీకి వాయిదా పడింది. తెలుసుకునే హక్కు కన్నా వ్యక్తిగత గోప్యతా పరిరక్షణ హక్కు మిన్న కాబట్టి సీఐసీ ఉత్తర్వును కొట్టివేయాలని దిల్లీ విశ్వవిద్యాలయం తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. ప్రధాని మోదీ డిగ్రీ వివరాలను కోర్టుకు అందించడానికి విశ్వవిద్యాలయం సిద్ధంగానే ఉన్నా, సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) కింద ఈ వివరాలను అపరిచితులతో పంచుకోవడానికి సుముఖంగా లేదని తెలిపారు. నీరజ్ అనే వ్యక్తి ప్రధాని డిగ్రీ వివరాల కోసం సీఐసీకి దరఖాస్తు పెట్టారు. ప్రధాని 1978లో బీఏ పూర్తిచేశారు. ఆ సంవత్సరం బీఏ పరీక్షలో ఉత్తీర్ణులైనవారందరి రికార్డుల తనిఖీకి 2016లో సీఐసీ అనుమతించారు. దీనిపై దిల్లీ హైకోర్టు 2017లో స్టే ఇచ్చింది. విద్యార్థుల రికార్డులకు తాము సంరక్షణదారులమనీ, ఇతరుల కుతూహలాన్ని తృప్తిపరచడానికి ఆ రికార్డులను స.హ.చట్టం కింద బయటపెట్టాల్సిన అవసరం లేదని దిల్లీ విశ్వవిద్యాలయ వాదన.

ప్రైవేటు ఉన్నత విద్యా సంస్థల్లోనూ రిజర్వేషన్లు

• పార్లమెంటు స్థాయీ సంఘం సిఫార్సు

ఈనాడు, దిల్లీ: ప్రైవేటు విద్యా సంస్థల్లో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులకు తగిన ప్రాతినిధ్యం లేనందున వాటిల్లోనూ రిజర్వేషన్ల విధానాన్ని ప్రవేశపెట్టాలని కాంగ్రెస్ పార్టీ ఎంపీ దిగ్విజయ్ సింగ్ నేతృత్వంలోని పార్లమెంటు స్థాయీ సంఘం(విద్య, మహిళ, శిశు, యువత, క్రీడలు) బుధవారం సమర్పించిన నివేదికలో పేర్కొంది. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన భాజపా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి కూడా సభ్యురాలిగా ఉన్నారు.

✦ విద్యాహక్కు చట్టంలోని సెక్షన్ 12(1)సి కింద ప్రైవేటు స్కూళ్లలో పేద పిల్లలకు 25% రిజర్వేషన్లు కల్పించి వారి రుసుములను ప్రభుత్వం చెల్లిస్తున్న విధానాన్నే ఉన్నత విద్యాసంస్థల్లోనూ ప్రవేశపెట్టాలని స్థాయీ సంఘం సూచించింది.

✦ ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ జనాభాకు తగిన విధంగా ప్రైవేటు యూనివర్సిటీల్లోనూ రిజర్వేషన్లను అమలుచేయాలి. దీని అమలును యూజీసీ, జాతీయ ఎస్సీ, ఎస్టీ, బీసీ కమిషన్ల ద్వారా పర్యవేక్షించాలి.

✦ రాజ్యాంగ అధికరణ 15(5) ప్రకారం రిజర్వేషన్లు అమలుచేసి సంబంధిత నివేదికను ప్రతి ఏడాదీ సమర్పించేలా చర్యలు తీసుకోవాలని స్థాయీ సంఘం కేంద్ర ప్రభుత్వానికి సిఫార్సు చేసింది.

అలాస్కా వ్యక్తికి

పుతిన్ అదిరే గిఫ్ట్



ఇంటర్నెట్ డెస్క్: రష్యా అధ్యక్షుడు పుతిన్, అమెరికా అధ్యక్షుడు ట్రంప్ గతవారం జరిపిన శిఖరాగ్ర సమావేశం సమయంలో ఓ ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. అలాస్కాకు చెందిన ఓ వ్యక్తికి రూ.19 లక్షల విలువైన బైక్‌ను పుతిన్ బహుమతిగా ఇచ్చారు. రష్యాలో తయారైన ఉరల్ బైక్‌ను అతడు వాడుతుండటమే అందుకు కారణం. ఈ ఊహించని పరిణామానికి ఆ వ్యక్తి ఆనందంలో మునిగిపోయాడు. ట్రంప్, పుతిన్‌ల భేటీకి వారం ముందే యాంకరేజ్‌కు చేరుకున్న రష్యన్ మీడియా ప్రతినిధులు స్థానికులతో ముచ్చటించే ప్రయత్నం చేశారు. ఈ సమయంలో ఉరల్ కంపెనీకి చెందిన ఓ పాత బైక్ వాడుతున్న మార్క్ వారెన్ అనే విశ్రాంత అగ్నిమాపక ఇన్‌స్పెక్టర్ వారెన్.. రష్యా జర్నలిస్టుల కంటపడ్డాడు. ఈ బైక్ అంటే తనకు చాలా ఇష్టమని, యుద్ధం నేపథ్యంలో ఆ బైక్ విడిభాగాలు దొరకట్లేదని, దీంతో నిర్వహణ కష్టంగా మారిందని వాపోయాడు. ఇందుకు సంబంధించిన వార్త రష్యాలో వైరల్‌గా మారింది. క్రెమ్లిన్ దృష్టికీ వెళ్లింది. దీంతో స్పందించిన రష్యా అధికారులు... వారెన్‌కు ఫోన్ చేసి బైక్ గురించి ఆందోళన చెందవద్దని భరోసా ఇచ్చారు. పుతిన్ వచ్చిన విమానంలోనే కొత్త బైక్‌ను తీసుకొచ్చి.. అమెరికా అధికారుల సాయంతో స్థానిక ఎంబసీకి తరలించారు. భేటీ ముగిసిన మరుసటి రోజు దీనిని వారెన్‌కు అప్పగించారు. "పాత బైక్ అంటే ఇష్టం. అయినప్పటికీ కొత్తది చాలా అద్భుతంగా ఉంది. మాటలు రావడం లేదు" అని వారెన్ పేర్కొన్నాడు. ధన్యవాదాలు తెలుపుతూ పుతిన్‌కు త్వరలోనే లేఖ రాస్తానన్నాడు.

దిల్లీలో బడులకు బాంబు బెదిరింపులు

• ఒకే రోజు 50 పాఠశాలలకు హెచ్చరికలు

దిల్లీ: దేశరాజధాని దిల్లీలో ఒకే రోజు దాదాపు 50 పాఠశాలలకు బాంబు బెదిరింపులు వచ్చాయి. బుధవారం ఉదయం నుంచి ఈ-మెయిల్ ద్వారా వరుసగా ఈ హెచ్చరికలు వెల్లడంతో అప్రమత్తమైన పోలీసులు బాంబ్‌స్క్వాడ్ బృందాలతో తనిఖీలు నిర్వహించారు. ద్వారకలోని రాహుల్ మోడల్ స్కూల్, మాక్స్‌ఫోర్ట్ స్కూల్, మాలవీయ నగర్‌లోని ఎస్‌కేవీ, ప్రసాద్‌నగర్‌లోని ఆంధ్రా స్కూల్ తదితర పాఠశాలలకు ఈ బెదిరింపులు వచ్చాయి.

కేరళ కోర్టుకు...

కొచ్చిన్: కేరళలోని ఉత్తర పరవూర్‌లోని సబ్ కోర్టులో బాంబు ఉన్నట్లు ఈ-మెయిల్ వచ్చింది. అప్రమత్తమైన పోలీసులు కోర్టు సిబ్బందిని ఖాళీ చేయించి గాలింపు చర్యలు చేపట్టి నకిలీ బెదిరింపు అని నిర్ధారించారు.

పాక్‌లో మహిళలపై ఎడతెగని హింస

• దాయాది దురాగతాలను ఎండగట్టిన భారత్

ఐక్యరాజ్యసమితి: పాకిస్థాన్‌లో మహిళలపై లైంగిక హింస నేటికీ కొనసాగుతోందని భారత్ ఆందోళన వ్యక్తంచేసింది. 1971లో పూర్వపు తూర్పు పాకిస్థాన్ (నేటి బంగ్లాదేశ్)లో వేల మంది మహిళలపై దారుణమైన నేరాలకు పాల్పడిన చరిత్ర పాక్ సైన్యానిదని, అయినప్పటికీ వారికి శిక్షలు విధించకపోవడం సిగ్గుచేటని దుయ్యబట్టింది. అదే తరహా దురాగతాలు నేటికీ పాకిస్థాన్‌లో కొనసాగుతున్నాయని ఐరాస వేదికగా మండిపడింది. 'మహిళల అపహరణ, అక్రమ రవాణా, బాల్య వివాహాలు, లైంగిక హింస, బలహీన వర్గాల మహిళల బలవంతపు మతమార్పిళ్లు, బాలికలపై వేధింపుల తీరును ఐరాస మానవ హక్కుల కమిషన్‌తో పాటు ఎన్నో అంతర్జాతీయ సంస్థలు వాటి నివేదికల్లో వివరించాయి" అని ఐరాసలో భారత రాయబారి ఎల్డోస్ మాథ్యూ పున్నూస్ వెల్లడించారు. ఐరాస భద్రతా మండలిలో 'లైంగిక హింస' అనే అంశంపై పున్నూస్ ప్రసంగిస్తూ పాక్ తీరును ఎండగట్టారు.

భారత విమానాలపై పాక్ నిషేధం పొడిగింపు

లాహోర్: తమ దేశ గగనతలంలో భారతీయ విమానాల ప్రవేశంపై విధించిన నిషేధాన్ని పాకిస్థాన్ సెప్టెంబరు 23 వరకూ పొడిగించింది. పాకిస్థాన్ ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఈ మేరకు తాజా నోటీసులు జారీచేసింది. "భారతీయ వైమానిక సంస్థలు నడిపే విమానాలన్నింటికీ ఈ నిషేధం వర్తిస్తుంది. భారతీయుల యాజమాన్యంలోని విమానాలకూ, భారతీయులు లీజుపై ఇచ్చిన వాటికి కూడా ఇది వర్తిస్తుంది. పహల్గాం ఉగ్రదాడి నేపథ్యంలో ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు పెచ్చరిల్లడంతో తొలుత ఈ నిషేధాన్ని ఏప్రిల్ 23న నెల రోజులపాటు విధించారు. ఇందుకు ప్రతిగా భారత్ కూడా పాకిస్థాన్ విమానాలపై అదే విధమైన నిషేధాజ్ఞలు విధించింది.

బిహార్ శాసనసభ ఎన్నికలకు ఎన్డీయే సమాయత్తం

దిల్లీ: బిహార్‌లో ఒకవైపు కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ నేతృత్వంలో విపక్షాల ప్రచారం జోరందుకోగా.. మరోవైపు అధికార నేషనల్ డెమాక్రటిక్ అలయెన్స్(ఎన్డీయే) ఈనెల 23 నుంచి సంస్థాగత సమన్వయ కార్యకలాపాలను ముమ్మరం చేయబోతోంది. రాష్ట్రంలో రానున్న అక్టోబరు లేదా నవంబరులో శాసనసభ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో ఎన్డీయే 14 కమిటీలను నియమించింది. భాగస్వామ్య పక్షాలైన భాజపా, జేడీయూలు చెరి ఏడు కమిటీలకు నాయకత్వం వహిస్తాయి. ఈ కమిటీలు రాష్ట్ర వ్యాప్తంగా భాగస్వామ్య పక్షాల కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తాయి. మొదటి దశ సమావేశాలు ఈనెల 23 నుంచి 25 వరకూ, రెండో దశ సమావేశాలు ఈనెల 28 నుంచి 30 వరకూ జరుగుతాయి. ఈ కమిటీల్లో ఎన్డీయే ఇతర భాగస్వామ్య పక్షాలైన లోక్‌జన్‌శక్తి పార్టీ (రామ్ విలాస్), హిందుస్థానీ ఆవామ్ మోర్చా (సెక్యులర్), రాష్ట్రీయ లోక్ మోర్చాల నాయకులూ సభ్యులుగా ఉంటారు. భాజపా తరఫున ఉపముఖ్యమంత్రులు సమ్రాట్ చౌధరి, విజయ్ కుమార్ సిన్హాలు, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు దిలీప్ కుమార్ జైస్వాల్, కేంద్ర మంత్రులు గిరిరాజ్ సింగ్, నిత్యానంద్ రాయ్ తదితరులు ఈ కమిటీలకు నాయకత్వం వహిస్తారు. జేడీయూ తరఫున సంజయ్ ఝా, కేంద్ర మంత్రి రామ్‌నాథ్ ఠాకూర్ తదితరులు నేతృత్వం వహిస్తారు. ఈ 14 కమిటీల్లో ఒక్కొక్కదానిలో ఏడుగురు సభ్యులుంటారు. ఎంపీలు, రాష్ట్ర మంత్రులు సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలు 83 స్థానాల్లో కార్యకర్తల సమావేశాలు నిర్వహిస్తాయి.

యువకుడి రీల్స్.. నెటిజన్ల విరాళాలు

• సిక్కింలో ఓ కుగ్రామ విద్యార్థులకు సమకూరిన సౌకర్యాలు

ఇంటర్నెట్ డెస్క్: బిహార్‌కు చెందిన ఓ యువకుడు చేసిన రీల్స్ ఓ మారుమూల గ్రామంలోని చిన్నారులకు భవిష్యత్తునిచ్చాయి. అదెలా జరిగిందంటే... అశ్వనీ థాప అనే యువకుడు ఇన్‌స్టాలో గ్రేస్ అకాడమీ పేరుతో గల ఓ పాఠశాలను చూశాడు. అది సిక్కింలోని సార్డాంగ్ అనే కుగ్రామంలో ఉంది. దాన్ని లక్పా దావ షెర్పా అనే మౌంటెన్ గైడ్ నిర్వహిస్తున్నాడు. దీని కోసం అతను తన పర్వతారోహణ కెరీర్‌ను వదిలేశాడు. ఆ గ్రామంలోని రైతులు, కూలీల పిల్లలకు చదువు చెప్పడం కోసం తన ఇంటినే గురుకుల పాఠశాలగా మార్చాడు. ప్రస్తుతం అందులో 21 మంది విద్యార్థులున్నారు. లక్పా దావాను చూసి స్ఫూర్తి పొందిన అశ్వనీ వాలంటీర్‌గా అక్కడి విద్యార్థులకు పాఠాలు చెప్పేందుకు వెళ్లాడు. కానీ, పాఠశాల దుర్భర పరిస్థితికి చలించిపోయాడు. తాగడానికి మంచి నీరు లేదు, సరైన సౌకర్యాలు లేవు. దీంతో ఓ ఉపాయం ఆలోచించాడు. ఆ పాఠశాలలో తన దినచర్యను..చిన్నారుల దీనస్థితిని రీల్స్‌గా మార్చి సోషల్ మీడియాలో పోస్టు చేయడం మొదలుపెట్టాడు. అతడి ప్రయత్నాన్ని మెచ్చుకున్న నెటిజన్లు పాఠశాల అభివృద్ధికి రూ.లక్షల్లో విరాళాలు ఇచ్చారు. ఆ సొమ్ముతో పాఠశాలకు కొత్త భవనం, కంప్యూటర్ ల్యాబ్, మైదానం ఏర్పాటు చేశారు. వసతులు మెరుగుపడటంతో విద్యార్థుల అభ్యసన నైపుణ్యాలూ మెరుగుపడ్డాయి.





అంతర్జాతీయ దోమల దినోత్సవం సందర్భంగా బుధవారం త్రిపుర రాజధాని అగర్తలాలో ఓ పాఠశాలలో దోమతెరలు ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

ఉపరాష్ట్రపతి అభ్యర్థికి మంత్రి సత్యకుమార్ శుభాకాంక్షలు



రాధాకృష్ణన్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న మంత్రి సత్యకుమార్ యాదవ్

ఈనాడు, అమరావతి: ఎన్డీయే ఉపరాష్ట్రపతి అభ్యర్థి సీపీ రాధాకృష్ణన్‌ను రాష్ట్ర వైద్యారోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ దిల్లీలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపారు. ఎన్డీయే తరఫున నామినేషన్ వేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు. 'తమిళనాడులో రాధాకృష్ణన్ సేవా కార్యక్రమాలు విశేషమైనవి. ప్రజాజీవితంలో తన దైన ముద్ర వేసి, ప్రత్యేక గుర్తింపు పొందారు. అణగారిన వర్గాల సాధికారత కోసం ఎల్లప్పుడూ తపన పడేవారు' అని మంత్రి పేర్కొన్నారు.

మహిళా సాధికారిక కమిటీల జాతీయ సదస్సుకు గవర్నర్‌కు ఆహ్వానం

ఈనాడు, అమరావతి: తిరుపతిలో సెప్టెంబరు 14, 15 తేదీల్లో నిర్వహించనున్న చట్టసభల మహిళా సాధికారిక కమిటీల జాతీయ సదస్సుకు గవర్నర్ అబ్దుల్ నజీర్‌ను అసెంబ్లీ సెక్రటరీ జనరల్(ఎస్‌జీ) సూర్యదేవర ప్రసన్నకుమార్ ఆహ్వానించారు. శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు తరఫున బుధవారం ఆయన రాజ్‌భవన్‌కు వెళ్లి సదస్సు గురించి వివరించారు. ముగింపు సందేశం ఇచ్చేందుకు రావాలని గవర్నర్‌ను ఆహ్వానించారు. పార్లమెంట్, ఏపీ అసెంబ్లీ సంయుక్త ఆధ్వర్యంలో ఈ సదస్సు నిర్వహించనున్నారు.

మంత్రి నారాయణను కలిసిన అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి

ఈనాడు, అమరావతి: రాజధాని అమరావతి బ్రాండ్ అంబాసిడర్ వైష్ణవి బుధవారం పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణను సచివాలయంలో కలిశారు. రాజధాని పేరు, ప్రతిష్ఠలను జాతీయ స్థాయిలో తీసుకెళ్తున్న విధానాన్ని మంత్రికి వివరించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తనను అమరావతి బ్రాండ్ అంబాసిడర్‌గా నియమించిన విషయం తెలిపింది. మంత్రిని కలిసిన వారిలో ఆమె తండ్రి మనోజ్ కూడా ఉన్నారు.

నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయండి: వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అజీజ్

ఈనాడు, అమరావతి: ముస్లిం మహిళలకు ఉపాధి కల్పించేలా రాష్ట్రవ్యాప్తంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలను ఏర్పాటు చేయాలని వక్ఫ్ బోర్డ్ ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ మైనార్టీ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్‌ను కోరారు. బుధవారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసిన ఆయన వక్ఫ్ బోర్డ్ అభివృద్ధి, ఆస్తుల పరిరక్షణ, ముస్లింల సంక్షేమం తదితర అంశాలపై చర్చించారు. వక్ఫ్ ఆస్తులు ముస్లిం ప్రయోజనాలకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

తీర ప్రాంత శుభ్రత దినోత్సవానికి నోడల్ అధికారులు

ఈనాడు, అమరావతి: ప్రపంచ వ్యాప్తంగా సెప్టెంబర్ 20న నిర్వహించే అంతర్జాతీయ తీర ప్రాంత శుభ్రత దినోత్సవం సందర్భంగా.. విశాఖపట్నం, కాకినాడ నగరపాలక సంస్థల కమిషనర్లు కేతన్ గార్గ్, భావనలను రాష్ట్ర స్థాయి నోడల్ అధికారులుగా ప్రభుత్వం నియమించింది. అన్ని రాష్ట్రాల్లో ఈ దినోత్సవాన్ని నిర్వహించాలని కేంద్ర ప్రభుత్వం ఆదేశించిన నేపథ్యంలో ప్రభుత్వం ఈ చర్యలు చేపట్టింది.

పశుసంవర్ధక శాఖలో విశిష్ట సేవ పురస్కారాలు

- స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా 67 మందికి బహుకరణ

ఈనాడు, అమరావతి: పశుసంవర్ధక శాఖలో రాష్ట్ర స్థాయిలో విశిష్ట సేవలందించిన పశుమిత్రల నుంచి జేడీ స్థాయి అధికారుల వరకు మొత్తం 67 మందికి ఆ శాఖ డైరెక్టర్ డాక్టర్ టి.దామోదర నాయుడు స్వాతంత్ర్య దినోత్సవం పురస్కారాలను అందజేశారు. బుధవారం విజయవాడలోని వెట్ హోమ్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా దామోదర నాయుడు మాట్లాడుతూ.. 'పశుపోషకుల ఉన్నతి కోసం రాష్ట్రం అందిస్తున్న పథకాలు మారుమూల ప్రాంతాలకు కూడా అందాలి. పాలు, గుడ్లు, మాంసం ఉత్పత్తిలో దేశంలోనే రాష్ట్రం మొదటి స్థానంలో నిలిచేలా చర్యలు చేపట్టాలి' అని అధికారులు, ఉద్యోగులను కోరారు.

ఎన్‌సీఎస్‌కే రాష్ట్ర నోడల్ అధికారిగా పురపాలకశాఖ కమిషనర్

ఈనాడు, అమరావతి: జాతీయ సఫాయి కర్మచారి కమిషన్ (ఎన్‌సీఎస్‌కే) ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు కార్యక్రమాల అమలు, కమిషన్‌తో సమన్వయం కోసం రాష్ట్ర నోడల్ అధికారిగా రాష్ట్ర పురపాలకశాఖ కమిషనర్ సంపత్‌కుమార్‌ను నియమించారు. ఈ మేరకు పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి సురేశ్‌కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

25 నుంచి ఆయుష్ లైసెన్సుల నవీకరణ మేళాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్రంలో తొలిసారిగా ఆయుర్వేద, హోమియో, యునాని మందుల తయారీ యూనిట్లు, దుకాణాల నిర్వహణ రెన్యువల్ కోసం ఈ నెల 25 నుంచి మేళాలు నిర్వహిస్తున్నట్లు ఆయుష్ శాఖ సంచాలకుడు కె.దినేష్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి తూర్పుగోదావరి, పశ్చిమ గోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన తయారీదారులు, దుకాణాల యజమానులు, వ్యాపారుల కోసం ఈ నెల 25, 26 తేదీల్లో ఏలూరులోని ఆయుష్ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ కార్యాలయంలో మేళా నిర్వహిస్తామని తెలిపారు. సెప్టెంబర్ 1, 2 తేదీల్లో ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలకు ఒంగోలులోని ఆర్‌డీడీ కార్యాలయంలో...సెప్టెంబర్ 8, 9 తేదీల్లో ఉమ్మడి కర్నూలు, కడప, అనంతపురం, చిత్తూరు జిల్లాలవారికి కడపలోని పాత రిమ్స్‌లోని ఆయుష్ ఆర్‌డీడీ కార్యాలయంలో కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

రూ.2,047 కోట్లతో అమరావతి రైల్వేలైన్

- ఈ ఏడాది బడ్జెట్‌లో రూ.171 కోట్ల కేటాయింపు
- లోక్‌సభలో రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడి

పార్లమెంటులో ఆంధ్రప్రదేశ్

ఈనాడు, దిల్లీ: ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతికి రైల్వేలైన్ అనుసంధానం చేయడం కోసం రూ.2047 కోట్లతో ఎర్రుపాలెం-అమరావతి-నంబూరు మధ్య 57 కి.మీ. కొత్త లైన్ నిర్మిస్తున్నట్లు రైల్వేమంత్రి అశ్వినీవైష్ణవ్ వెల్లడించారు. దీన్ని ప్రత్యేక రైల్వే ప్రాజెక్టుగా ప్రకటించి భూసేకరణ పనులు ప్రారంభించినట్లు స్పష్టం చేశారు. దీనికోసం 2025-26 బడ్జెట్‌లో రూ.171 కోట్లు కేటాయించినట్లు చెప్పారు. 'కొత్త లైన్ల నిర్మాణం ద్వారా రాష్ట్ర రాజధాని అమరావతికి రైల్వే అనుసంధానం కల్పించాలని రైల్వే శాఖ నిర్ణయించింది' అని వైకాపా ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి బుధవారం లోక్‌సభలో అడిగిన ప్రశ్నకు ఆయన ఈ మేరకు సమాధానమిచ్చారు. 'అమరావతి, విజయవాడ ప్రాంతాలకు రైలు అనుసంధానం పెంచడానికి ఇటీవల విజయవాడ-గుడివాడ-నరసాపురం, గుడివాడ-మచిలీపట్నం, భీమవరం-నిడదవోలు డబ్లింగ్ (221 కి.మీ.) ప్రాజెక్టులు ప్రారంభించాం. అమరావతి, విజయవాడలకు అనుసంధానాన్ని మెరుగుపరచడానికి మరికొన్ని ప్రాజెక్టులు కూడా చేపట్టాం. అందులో విజయవాడ-గూడూరు 3వ లైన్ మొదలుపెట్టాం. 287 కిలోమీటర్ల ఈ ప్రాజెక్టులో ఇప్పటికే 248 కి.మీ.మేర పనులు పూర్తయ్యాయి. కాజీపేట-విజయవాడ మధ్య తలపెట్టిన 3వ లైన్ 220 కి.మీ.నిర్మాణంలో ఇప్పటికే 149 కి.మీ.పూర్తయింది. 2025-26లో ఆంధ్రప్రదేశ్‌కు మొత్తం రూ.9,417 కోట్ల బడ్జెట్ కేటాయించాం. ఈ ఏడాది ఏప్రిల్ 1 నాటి గణాంకాల ప్రకారం 27 డబ్లింగ్, 12 కొత్త లైన్ల పనులు ఏపీ పరిధిలో జరుగుతున్నాయి' అని అశ్వినీవైష్ణవ్ వివరించారు.

ఏపీ తీరప్రాంతంలో రైల్వేలైన్ల అనుసంధానం పెంపు

ఆంధ్రప్రదేశ్ తీర ప్రాంతంలో రైల్వే అనుసంధానాన్ని పెంచడానికి కోటిపల్లి-నరసాపురం మధ్య 57 కి.మీ. పొడవైన కొత్త లైన్ నిర్మాణాన్ని రూ.2,120 కోట్లతో చేపట్టినట్లు అశ్వినీవైష్ణవ్ తెలిపారు. కాకినాడ జనసేన ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, రాజమండ్రి భాజపా ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి అడిగిన ప్రశ్నలకు ఆయన ఈ మేరకు బదులిచ్చారు. కోటిపల్లి-నరసాపురం మార్గంలో ముఖ్యమైన వంతెనలు, భూసేకరణ పనులు మొదలుపెట్టినట్లు చెప్పారు. తీరప్రాంతం, అక్కడి పోర్టులకు రైల్వే అనుసంధానాన్ని పెంచడానికి 6 లైన్ల సర్వే, డీపీఆర్ తయారీకి అనుమతులు మంజూరు చేసినట్లు పేర్కొన్నారు. అందులో హరిదాస్‌పుర్-విజయనగరం 4వ లైన్ (450 కి.మీ.), బాపట్ల-రేపల్లె కొత్తలైన్ (46 కి.మీ.), మచిలీపట్నం-రేపల్లె కొత్తలైన్ (45 కి.మీ.), నరసాపురం-మచిలీపట్నం కొత్త లైన్ (74 కి.మీ.), కొత్తవలస-అనకాపల్లి బైపాస్ (35 కి.మీ.), నిడదవోలు-దువ్వాడ 3, 4వ లైన్ (198 కి.మీ.) ఉన్నట్లు వెల్లడించారు.

విశాఖపట్నం డేటా సిటీ నిర్మాణానికి కేంద్రం మద్దతు

విశాఖపట్నంలో డేటా సిటీ నిర్మించాలనుకుంటున్నట్లు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చెప్పిందని కేంద్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాద తెలిపారు. కేంద్ర ప్రభుత్వం దీనికి క్రియాశీలకంగా మద్దతు పలుకుతున్నట్లు చెప్పారు. ఈ అంశంపై కేంద్రం, ఏపీ ప్రభుత్వాల మధ్య అనేక సమావేశాలు జరిగినట్లు వెల్లడించారు.

◆ ఆంధ్రప్రదేశ్‌లో 2018-22 మధ్యకాలంలో వడగాలులతో 344 మంది చనిపోయినట్లు కేంద్ర శాస్త్ర, సాంకేతిక వ్యవహారాల మంత్రి జితేంద్రసింగ్ తెలిపారు.

అనర్హులను ఏరివేసేందుకే సదరం పునఃపరిశీలన

- అర్హులైన దివ్యాంగులు ఉంటే పింఛను ఇస్తాం..
- సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి

ఈనాడు, అమరావతి: అనర్హులను ఏరివేయడానికే రాష్ట్రంలో సదరం ధ్రువపత్రాల పునఃపరిశీలన కార్యక్రమం ప్రభుత్వం నిర్వహిస్తోందని రాష్ట్ర సమాచార పౌర సంబంధాలు, గృహ నిర్మాణశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. బోగస్ ధ్రువపత్రాలతో పింఛన్లు పొందే వారిని ఏరివేస్తున్నామే తప్ప.. అర్హులైన వారి పింఛను తొలగించడంలేదని స్పష్టం చేశారు. రాష్ట్ర సచివాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో 7.86 లక్షల మంది దివ్యాంగ పింఛన్లు పొందుతుంటే.. వారిలో 5.10 లక్షల మంది సదరం ధ్రువపత్రాలను మరోమారు పరిశీలించడానికి నోటీసులు ఇచ్చామన్నారు. ఇప్పటివరకు 4.50 లక్షల మంది తమ ధ్రువపత్రాలు తనిఖీ చేయించుకోగా, వారిలో లక్ష మంది వరకు అనర్హులను గుర్తించినట్లు వెల్లడించారు. 50వేల మంది పునఃపరిశీలనకు ముందుకు రాలేదని తెలిపారు. వీరందరికీ మరోసారి నోటీసు ఇస్తామని చెప్పారు. అప్పటికీ సహకరించకపోతే పింఛన్లు నిలిపివేస్తామన్నారు. వైద్యులు అనర్హులుగా గుర్తించినవారు తాము అర్హులమని భావిస్తే మళ్లీ ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్‌ను సంప్రదించి అర్జీ అందజేస్తే పునఃపరిశీలిస్తారని తెలిపారు. వైకాపా ప్రభుత్వంలో డబ్బులు వసూలుచేసి, తప్పుడు పత్రాలతో పింఛన్లు మంజూరుచేశారని మంత్రి ఆరోపించారు. పులివెందులలో 1,708 మంది, మచిలీపట్నంలో 1,539 మంది, చంద్రగిరిలో 1,604 మంది బోగస్ పింఛనుదారులను గుర్తించామన్నారు. అత్యల్పంగా కాకినాడలో 19, విశాఖ దక్షిణ నియోజకవర్గంలో 39, తాడికొండలో 55 మంది బోగస్ పింఛన్లు గుర్తించినట్లు వివరించారు. రాష్ట్ర ప్రతిష్ఠ దెబ్బతీసేలా వైకాపా, సాక్షి దినపత్రిక తప్పుడు ప్రచారంతో విషయం చిమ్ముతున్నాయని మంత్రి పార్థసారథి ధ్వజమెత్తారు.

బీఎన్ఎస్ సెక్షన్ 104ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించండి

- హైకోర్టులో పిల్ దాఖలు
- ప్రతివాదులకు నోటీసుల జారీ

ఈనాడు, అమరావతి: జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి హత్యకు పాల్పడితే మరణశిక్ష లేదా మిగిలిన జీవితాంతం జైలుశిక్ష అనుభవించాలనే భారతీయ న్యాయ సంహిత(బీఎన్ఎస్) సెక్షన్ 104ని రాజ్యాంగ విరుద్ధమైనదిగా ప్రకటించి రద్దు చేయాలని కోరుతూ హైకోర్టులో పిల్ దాఖలైంది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకుర్, జస్టిస్ చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం బుధవారం దీనిపై విచారణ చేపట్టింది. పూర్తి వివరాలతో కౌంటర్ వేయాలని కేంద్ర న్యాయ, హోంశాఖ కార్యదర్శులు, రాష్ట్ర న్యాయశాఖ, హోంశాఖ ముఖ్య కార్యదర్శులను ఆదేశిస్తూ ఉత్తర్వులిచ్చింది.

● సెక్షన్ 104ని సవాల్ చేస్తూ ఉమ్మడి విశాఖ జిల్లాకు చెందిన బి.సత్యచంద్రశేఖర్ హైకోర్టులో పిల్ వేశారు. 'జీవిత ఖైదు అనుభవిస్తున్న వ్యక్తి హత్యకు పాల్పడితే తప్పనిసరిగా మరణశిక్ష విధించాలని ఐపీసీ సెక్షన్ 303 చెబుతోంది. సుప్రీంకోర్టు ఈ సెక్షన్‌ను తప్పుపట్టింది. శిక్ష విధించే విషయంలో న్యాయమూర్తులకు ఉన్న విచక్షణాధికారాన్ని 303 హరిస్తోందని తెలిపింది. ఐపీసీ 303 సెక్షన్‌ను సుప్రీంకోర్టు రద్దు చేసినప్పటికీ బీఎన్ఎస్ సెక్షన్ 104ని తీసుకొచ్చారు' అని పేర్కొన్నారు. బుధవారం జరిగిన విచారణలో పిటిషనర్ తరఫున న్యాయవాది శ్రీకృష్ణ సాయి భార్గవ్ వాదనలు వినిపించారు.

రాజ్ కెసిరెడ్డి బెయిల్ పిటిషన్‌పై విచారణ వాయిదా

ఈనాడు, అమరావతి: కేసుకు సంబంధించి ఇప్పటికే పోలీసులు రెండు ఛార్జిషీట్లు దాఖలు చేశారని, సరైన ఆధారాలు సమర్పించడంలో విఫలమయ్యారని నిందితుడు రాజ్ కెసిరెడ్డికి బెయిల్ ఇవ్వాలని ఆయన తరఫు న్యాయవాది పొన్నవోలు సుధాకర్‌రెడ్డి వాదించారు. అరెస్టై 120 రోజులు అయిందన్నారు. నిందితులు సజ్జల శ్రీధర్‌రెడ్డి, పైలా దిలీప్ తరఫు న్యాయవాదులు కూడా వాదనలు వినిపించారు. వీటిని ప్రాసిక్యూషన్ వాదనల కోసం గురువారానికి వాయిదా వేశారు.

◆ నిందితులు బాలాజీకుమార్ యాదవ్, నవీన్ కృష్ణల బెయిల్ పిటిషన్లను వాదనల నిమిత్తం గురువారానికి వాయిదా వేశారు.

◆ తనకు రెండో పూట కూడా ఇంటి నుంచి ఆహారం తెప్పించుకునేందుకు అనుమతించాలని వైకాపా ఎంపీ మిథున్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. జైలు అధికారులకు నోటీసులు జారీ చేయాలని సూచిస్తూ విచారణను ఈ నెల 26కి వాయిదా వేసింది.

◆ సోమ, బుధ, శుక్రవారాల్లో ఇంటి నుంచి భోజనం తెప్పించుకునేందుకు ఏసీబీ కోర్టు గతంలో అనుమతిచ్చిందని, ఆ వారాలను మార్చాలంటూ చెవిరెడ్డి వేసిన పిటిషన్‌ను కోర్టు స్వీకరించింది. అభ్యంతరాలు ఉంటే చెప్పాలని జైలు అధికారులను కోరుతూ విచారణను 21కి వాయిదా వేసింది.

◆ హైదరాబాద్‌లోని ఫాంహౌస్‌లో సిట్ అధికారులు సీజ్ చేసిన రూ.11 కోట్ల నగదు జమపై నిందితుడు రాజ్ కెసిరెడ్డి వేసిన పిటిషన్‌పై కోర్టు విచారణ జరిపింది. తదుపరి విచారణను ఈ నెల 21కి వాయిదా వేసింది.

◆ తనను అరెస్ట్ చేసినప్పుడు సిట్ అధికారులు స్వాధీనం చేసుకున్న రూ.3 లక్షల నగదుకు, మద్యం కేసుకు సంబంధం లేదని బాలాజీ కుమార్ యాదవ్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ గురువారానికి వాయిదా పడింది.

ఆప్త ఆధ్వర్యంలో అమెరికాలో రక్తదాన శిబిరాలు

ఈనాడు, అమరావతి: అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్త) ఆధ్వర్యంలో ఈనెల 17 నుంచి 23 వరకు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నట్లు సంస్థ ప్రతినిధులు తెలిపారు. మిషిగన్, న్యూజెర్సీ, ఆస్టిన్, డాలస్, మిన్నెసోటా, సియాటెల్- వాషింగ్టన్, కొలంబస్, షికాగో, కాలిఫోర్నియాలలో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ఈ నెల 17న డెట్రాయిట్‌లో ఆప్త, అమెరికన్ రెడ్‌క్రాస్ సంయుక్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఆప్త అధ్యక్షుడు మధు ఉల్లి హాజరయ్యారు. ఆప్త మెగా బ్లడ్ కమిటీ ఉపాధ్యక్షుడు సునీల్ నల్లాల, సంయుక్త కార్యదర్శి సప్తగిరీష్ ఇండుగుల, టాలెంట్ సెర్చ్ ఛైర్ పి.కల్యాణ్, స్టేట్ కోఆర్డినేటర్ జి.కిషోర్, మెంబర్‌షిప్ ఛైర్ శ్రీనివాస్ మత్తి తదితరులు పాల్గొన్నారు. చిరంజీవి ఛారిటబుల్ ట్రస్ట్ స్ఫూర్తితో ఈ రక్తదాన శిబిరం ఏర్పాటుచేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆప్త ఆధ్వర్యంలో 2008 నుంచి ఇప్పటివరకు ఎన్నో సామాజిక కార్యక్రమాలు, ఉచిత వైద్యశిబిరాలు, రక్తదాన శిబిరాలు నిర్వహించామని, రూ.20 కోట్ల ఉపకార వేతనాలు ఇచ్చి నిరుపేదలను ఆదుకున్నామని వెల్లడించారు. భారతదేశం, అమెరికాల్లో రక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ గైడ్ స్టార్ సంస్థ నుంచి ప్లాటినం సీల్ ఆఫ్ ట్రాన్స్‌పరెన్సీ గుర్తింపు దక్కించుకున్నట్లు ఆప్త ప్రతినిధులు వెల్లడించారు.



డెట్రాయిట్‌లో ఆప్త ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ★ ఆప్త ప్రతినిధులు

65 లక్షల మంది మహిళల ఉచిత ప్రయాణం

- లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులిచ్చేందుకు యోచిస్తున్నాం
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



స్త్రీశక్తి పథకం సమీక్షలో మాట్లాడుతున్న మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి

ఈనాడు, అమరావతి: స్త్రీశక్తి పథకాన్ని ప్రారంభించిన ఆరు రోజుల్లోనే రాష్ట్రంలో 65 లక్షల మందికిపైగా మహిళలు ఉచిత బస్సు సేవలను సద్వినియోగం చేసుకున్నారని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి తెలిపారు. లబ్ధిదారులకు స్మార్ట్ కార్డులు ఇచ్చేందుకు యోచిస్తున్నామని పేర్కొన్నారు. సూపర్-6లో భాగంగా తీసుకువచ్చిన స్త్రీశక్తి పథకం విజయవంతమైందన్నారు. ఈ సందర్భంగా బుధవారం ఆయన ఆర్టీసీ ప్రధాన కార్యాలయంలో ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. తర్వాత మంత్రి విలేకరులతో మాట్లాడారు. స్త్రీశక్తి పథకం అమలు ప్రభుత్వానికి భారం కాదని, బాధ్యత అని అన్నారు. కొండ (ఘాట్ రోడ్) ప్రాంతాల్లోనూ ఉచిత బస్సు సేవలందిస్తున్నామని చెప్పారు. తిరుమలకు కూడా ఉచిత బస్సు ప్రయాణం అమలుపై సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని, సాంకేతిక సమస్యలను పరిష్కరించి అతి త్వరలోనే సానుకూల ప్రకటన వెలువరించనున్నామన్నారు. రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో కొన్ని సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, వారం రోజుల్లో ఆ సమస్యలను పరిష్కరిస్తామని తెలిపారు. త్వరలో ఆర్టీసీ కండక్టర్ పోస్టులనూ భర్తీ చేస్తామన్నారు. ఆర్టీసీని బలోపేతం చేస్తున్నామని, సంస్థ స్థలాలను లీజుకు ఇచ్చి ఆదాయం సమకూర్చుకుంటామని, కార్గో సేవలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నామని చెప్పారు. సమావేశంలో ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ల నారాయణ, ఆర్టీసీ ఎండీ ద్వారకా తిరుమలరావు, రవాణాశాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండే పాల్గొన్నారు.

హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులతో సమానంగా మాజీ ఎన్నికల కమిషనర్లకు ప్రయోజనాలు

ఈనాడు, అమరావతి: రాష్ట్ర మాజీ ఎన్నికల కమిషనర్లు, వారి జీవిత భాగస్వాములకు ఏపీ హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తులతో సమానంగా గృహ సహాయం, ఇతర కనీస పదవీ విరమణ ప్రయోజనాలు అందించేందుకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేసింది. పదవీ విరమణ చేసిన రాష్ట్ర ఎన్నికల కమిషనర్ల గృహ సహాయం, ఇతర ప్రయోజనాల నియమాలు-2025 పేరుతో రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్‌కుమార్ ఈ నోటిఫికేషన్ ఇచ్చారు. 2021 సెప్టెంబరు 1 నుంచి ఇది అమల్లోకి వస్తుందని పేర్కొన్నారు. గృహ సహాయకులు, కార్యాలయ సిబ్బంది, భద్రత, టెలిఫోన్ సౌకర్యం వంటివి వర్తిస్తాయని ఉత్తర్వుల్లో వివరించారు. గృహ సహాయకులను నియమించుకునేందుకు నెలకు రూ.45 వేలు ఏకీకృత మొత్తాన్ని అందించనున్నారు. ఇతర సదుపాయాలకు నెలకు రూ.15 వేలు చొప్పున చెల్లిస్తారు. వీటిని ఏటా 5% చొప్పున పెంచి చెల్లిస్తారు.

ఎస్ఐపీబీలో అనుమతించిన ప్రాజెక్టులు గ్రౌండింగ్ చేయించాలి: మంత్రి భరత్

ఈనాడు, అమరావతి: రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి(ఎస్ఐపీబీ)లో ఆమోదించిన ప్రాజెక్టులు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలని మంత్రి టీజీ భరత్ అధికారులను ఆదేశించారు. మంగళగిరి ఏపీఐఐసీ కార్యాలయంలో బాపట్ల, ఉభయ గోదావరి, ఏలూరు, గుంటూరు, కాకినాడ, కృష్ణా, ఎన్టీఆర్, పల్నాడు, నెల్లూరు, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాల పరిశ్రమల శాఖ అధికారులతో ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా భరత్ మాట్లాడుతూ.. "పరిశ్రమలు పెట్టేందుకు వచ్చిన సంస్థలకు అవసరమైన అనుమతులు వేగంగా ఇవ్వాలి. అనుమతులు ఇచ్చే విషయంలో ఏవైనా సమస్యలు ఉంటే నా దృష్టికి తీసుకురండి." అని స్పష్టంచేశారు.

డిగ్రీ ఆన్‌లైన్ కౌన్సెలింగ్‌లో వెబ్ ఐచ్ఛికాలపై సందిగ్ధత

ఈనాడు, అమరావతి: డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల నిర్వహణపై సందిగ్ధత ఏర్పడింది. గతంలో విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో కోర్సులు, కళాశాలల ఎంపికకు వెబ్ ఐచ్ఛికాలు ఇచ్చుకునేవారు. ఈసారి కళాశాలల నుంచి సైతం విద్యార్థులు దరఖాస్తులు సమర్పించేలా అవకాశం కల్పించారు. దీంతో ఈ ప్రక్రియ నిర్వహణపై అస్పష్టత నెలకొంది. ఉన్నత విద్యాశాఖ, ఉన్నత విద్యామండలి మధ్య సమన్వయం లేకపోవడంతో కౌన్సెలింగ్‌కు షెడ్యూల్ ఇచ్చినా వెబ్‌ఐచ్ఛికాలకు నమోదుకు మార్గదర్శకాలు విడుదల చేయలేదు. ఉన్నత విద్యాశాఖ ఇచ్చిన ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ఉత్తర్వులపై కొన్ని ప్రశ్నలు లేవనెత్తుతూ ఉన్నత విద్యామండలి లేఖ రాసింది. విద్యార్థి బహుళ కళాశాలలను సంప్రదించడానికి అనుమతి ఉందా? ఒక కళాశాలను సంప్రదించి, ఆ కళాశాలకు ఎంపికలను వినియోగించుకున్న తర్వాత మరో కళాశాలకు మారవచ్చా? బహుళ కళాశాలలను సంప్రదించినప్పుడు మొదటి కళాశాల కోసం పెట్టుకున్న ఐచ్ఛికాలు అలాగే ఉంటాయా? కళాశాలల నుంచి ఇచ్చుకున్న వెబ్ ఐచ్ఛికాలలో వేటిని పరిగణనలోకి తీసుకోవాలి? కళాశాల ద్వారా, విద్యార్థి నేరుగా వెబ్ ఐచ్ఛికాలు నమోదుచేసుకుంటే సీట్ల కేటాయింపులో ప్రాధాన్యం ఏంటి? ఇలాంటి అనేక సందేహాలను లేవనెత్తుతూ లేఖ రాసింది.

'జాతీయ మహిళా కమిషన్' సభ్యులుగా పీవీ సింధు, మహేశ్‌భగవత్‌ల నియామకం



ఈనాడు, దిల్లీ: జాతీయ మహిళా కమిషన్ సలహా కమిటీ-2025 సభ్యులుగా ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు, తెలంగాణ అదనపు డైరెక్టర్ జనరల్ మహేశ్ భగవత్‌లు నియమితులయ్యారు. ఈ మేరకు జాతీయ మహిళా సంఘం బుధవారం ఒక ప్రకటనలో తెలిపింది. మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్ విజయా కిశోర్ రహాట్కర్ ఆధ్వర్యంలో నడిచే ఈ కమిటీలో మొత్తం 21 మందిని సభ్యులుగా నియమించారు. ఇందులో ఐఐటీ మద్రాస్ డైరెక్టర్ వి.కామకోటి, ఫిక్కి ప్రెసిడెంట్ హర్షవర్ధన్ అగర్వాల్‌కూ ఇందులో స్థానం కల్పించారు.

విడదల రజినీ మామ బలవంతంగా 'పవర్ ఆఫ్ అటార్నీ' రాయించారు

తెదేపా కేంద్ర కార్యాలయంలో బాధితుడి ఫిర్యాదు

ఈనాడు, అమరావతి: మాజీ మంత్రి విడదల రజినీ మామ విడదల లక్ష్మీనారాయణ తన ఆస్తిని బలవంతంగా వేరొకరి పేరు మీద జనరల్ పవర్ ఆఫ్ అటార్నీ రాయించారని పల్నాడు జిల్లా చిలకలూరిపేటకు చెందిన బి.రామకృష్ణ వాపోయారు. దీనికి సంబంధించి ఎలాంటి చెల్లింపులు చేయలేదని ఆరోపించారు. వారిపై చర్యలు తీసుకొని తన ఆస్తిపై హక్కులు కల్పించాలని కోరుతూ మంగళగిరిలోని తెదేపా కేంద్ర కార్యాలయంలో బుధవారం ఫిర్యాదు చేశారు. వివిధ సమస్యలతో తరలివచ్చిన బాధితుల నుంచి ఏపీ గిరిజన కోఆపరేటివ్ కార్పొరేషన్ ఛైర్మన్ కిడారి శ్రావణ్, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు వినతులు, ఫిర్యాదులు స్వీకరించారు. తనకు చెందిన 34 సెంట్ల భూమిని తప్పుడు రికార్డులతో వేరొకరికి రిజిస్ట్రేషన్ చేయించిన వారిపై, సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని కృష్ణా జిల్లా గూడూరు మండలం లేళ్లగరువుకు చెందిన పుప్పాల వెంకటేశ్వరరావు కోరారు. రీ సర్వేలో తగ్గిన భూమిని వైకాపా నాయకుడు ఎం.నాగరాజు కబ్జా చేశాడని.అతడిపై చర్యలు తీసుకోవాలని చిత్తూరు జిల్లా సదుం మండలానికి చెందిన ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు.

తిరుమల పవిత్రను నాశనం చేయడానికే వైకాపా కుట్రలు: ఎంపీ కలిశెట్టి

ఈనాడు, దిల్లీ: భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా స్వామి వారిని దర్శించుకుంటున్న తరుణంలో తిరుమల పవిత్రతను నాశనంచేయడానికే వైకాపా కుట్రలు చేస్తోందని ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు విమర్శించారు. ఆయన బుధవారం విలేకర్లతో మాట్లాడారు. 'వైకాపా హయాంలో తితిదే ప్రతిష్ఠ దిగజారడం జగమెరిగిన సత్యం. అధికారంలో ఉన్నప్పుడు కల్తీ నెయ్యితో తిరుమల ప్రతిష్ఠను దెబ్బతీసిన వైకాపా అధికారం పోయిన తర్వాత కూడా అదే విధంగా వ్యవహరిస్తోంది. తిరుపతిలో శాంతి భద్రతలకు విఘాతం కల్పించడానికి నక్కజిత్తుల వేషాలు వేస్తోంది' అని ధ్వజమెత్తారు.

స్పెషలిస్టుల పదోన్నతులకు ఆమోదం

ఈనాడు, అమరావతి: వైద్యారోగ్య శాఖలోని సెకండరీ హెల్త్ సంచాలకుల పరిధిలో సివిల్ అసిస్టెంట్ సర్జన్/ డిప్యూటీ సివిల్ సర్జన్ స్పెషలిస్టులకు సివిల్ సర్జన్ స్పెషలిస్టులుగా పదోన్నతులు కల్పించడానికి ప్యానల్ జాబితాను ప్రభుత్వం ఆమోదించింది. సెలక్షన్ కమిటీ సిఫార్సు మేరకు పీడియాట్రిక్స్‌లో 14, జనరల్ సర్జరీలో 12, ఎనస్థీషియాలో 11 మంది, గైనకాలజీ, జనరల్ మెడిసిన్‌లో 9 మంది చొప్పున, డెర్మటాలజీలో ఐదుగురికి చోటు దక్కింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది.

కనీస వేతనాల సలహా బోర్డు ఛైర్మన్‌గా శ్రీనివాసులురెడ్డి

ఈనాడు, అమరావతి: రాష్ట్ర కనీస వేతనాల సలహా బోర్డు ఛైర్మన్‌గా పెళ్లకూరు శ్రీనివాసులురెడ్డిని నియమించారు. కార్మిక శాఖ కార్యదర్శి శేషగిరిబాబు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ పదవిలో ఆయన రెండేళ్లు కొనసాగుతారు.

క్రిమినల్ లా అమలులో ఏపీని రోల్ మోడల్‌గా నిలపాలి

కేంద్ర హోంశాఖ కార్యదర్శి గోవింద్ మోహన్

ఈనాడు, అమరావతి: నూతన నేర న్యాయ చట్టాల (క్రిమినల్ లా) అమలులో ఆంధ్రప్రదేశ్‌ను దేశానికే రోల్ మోడల్‌గా నిలిపేలా చర్యలు తీసుకోవాలని కేంద్ర హోంమంత్రిత్వ శాఖ కార్యదర్శి గోవింద్ మోహన్ సూచించారు. భారతీయ న్యాయ సంహిత, భారతీయ నాగరిక్ సురక్ష సంహిత, భారతీయ సాక్ష్య అధినియమ్‌ల అమలుపై బుధవారం దిల్లీ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్ష నిర్వహించారు. సచివాలయం నుంచి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా, ఇతర అధికారులు సమావేశంలో పాల్గొన్నారు. గోవింద్ మోహన్ మాట్లాడుతూ ఫోరెన్సిక్ వ్యవస్థను మరింత బలోపేతం చేసుకోవాలని, ఖాళీలుంటే కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేసుకోవాలన్నారు. ఏపీ పోలీసులు తీసుకొచ్చిన పోలీసు సేవా, సిటిజన్ పోర్టల్, శక్తి యాప్‌ను అభినందించారు. డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా మాట్లాడుతూ.. కొత్త చట్టాల ప్రకారం నేర ఘటనా స్థలంలో ఆడియో, వీడియో చిత్రీకరణకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామన్నారు. శాంతిభద్రతల విభాగం అదనపు డీజీపీ మధుసూదన్ రెడ్డి, జైళ్ల శాఖ డీఐజీ వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓఎంసీకి తెలంగాణ హైకోర్టు నోటీసులు

ఈనాడు, హైదరాబాద్: ఓబుళాపురం అక్రమ మైనింగ్ కేసులో నిందితుల జాబితాలో ఉన్న ఓబుళాపురం మైనింగ్ కంపెనీ(ఓఎంసీ)కి తెలంగాణ హైకోర్టు బుధవారం నోటీసులు జారీ చేసింది. కంపెనీకి శిక్ష కింద రూ.లక్ష జరిమానా విధిస్తూ సీబీఐ కోర్టు ఇచ్చిన తీర్పును సవాల్ చేస్తూ హైకోర్టులో సీబీఐ పిటిషన్ దాఖలు చేసింది. దీనిపై జస్టిస్ కె.లక్ష్మణ్ విచారణ చేపట్టారు. సీబీఐ తరఫు ప్రత్యేక న్యాయవాది శ్రీనివాస్ కపాటియా వాదనలు వినిపిస్తూ... ఓఎంసీ అక్రమాలకు సంబంధించి స్పష్టమైన ఆధారాలు ఉన్నాయన్నారు. ఓఎంసీతో ఐఏఎస్ అధికారిణి శ్రీలక్ష్మి కుమ్మక్కై లీజుల మంజూరు సమయంలో క్యాప్టివ్ అన్న పదాన్ని చేర్చకపోవడంతో ఆ సంస్థ ఖనిజాన్ని విక్రయించడం ద్వారా రూ.4,310 కోట్లు పొందిందని తెలిపారు. 2007-10 మధ్య నికరంగా రూ.884.13 కోట్లు లబ్ధి పొందిందని పేర్కొన్నారు. దీంతో నిందితులు కూడా విభేదించలేదన్నారు. రికార్డులు, ఆధారాలను పరిగణనలోకి తీసుకుంటే ఓఎంసీకి తగిన శిక్ష విధించడంలో సీబీఐ కోర్టు విఫలమైందన్నారు. ఓఎంసీ ద్వారా డైరెక్టర్లు అక్రమార్జన పొందారని, దీనికి రూ.లక్ష శిక్ష చాలా తక్కువని, సీబీఐ కోర్టు విధించిన శిక్షను పెంచాలని కోరారు. వాదనలను విన్న న్యాయమూర్తి... పిటిషన్‌ను విచారణకు స్వీకరిస్తూ ఓఎంసీకి నోటీసులు జారీ చేశారు. తదుపరి విచారణను సెప్టెంబరు 17కు వాయిదా వేశారు.

ఇద్దరు పిల్లలతో సంపులోకి దూకిన తల్లి

మృతి చెందిన చిన్నారులు

నిజాంపేట, న్యూస్‌టుడే: భర్తతో తలెత్తిన వివాదం కారణంగా ఇద్దరు కుమారులను నీటి సంపులో పడేసి ఆపై తానూ దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది ఓ మాతృమూర్తి. ఈ ఘటన హైదరాబాద్ బాచుపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. సీఐ సతీశ్ కుమార్ వివరణ ప్రకారం..కామారెడ్డి జిల్లా పిట్లం మండలం ధర్మారం గ్రామానికి చెందిన లక్ష్మణ్, రత్నమ్మ(30) దంపతులు ఉపాధి కోసం నగరానికి వచ్చారు. బాచుపల్లి హనుమాన్ ఆలయం వద్ద అద్దె ఇంట్లో నివాసం ఉంటున్నారు. వీరికి జగన్, పవన్, అరుణ్(3), సుభాష్(8 నెలలు) కుమారులు ఉన్నారు. జగన్, పవన్‌లు లక్ష్మణ్ సొంతూరులోని తల్లిదండ్రుల దగ్గర ఉంటున్నారు. నలుగురు కుమారులు ఉన్నందున తన ఆరోగ్యం సహకరించడం లేదని, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్స చేయించాలని రత్నమ్మ భర్తతో పలుమార్లు చెప్పింది. ఈ అంశంపై ఇద్దరి మధ్య పలుమార్లు గొడవలు జరిగాయి. ఈ క్రమంలో మంగళవారం అర్ధరాత్రి మరోసారి వాగ్వాదం జరగడంతో లక్ష్మణ్ ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ సమయంలో రత్నమ్మ ఇంటి ఆవరణలోని సంపులో పిల్లలను పడేసి తానూ అందులో దూకింది. చుట్టుపక్కలవారు గమనించి ముగ్గురినీ నీటిలో నుంచి బయటకు తీశారు. అప్పటికే అరుణ్, సుభాష్‌లు మృతి చెందగా..రత్నమ్మను ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆమె చికిత్స పొందుతోంది.